ప్రత్యేక సంచిక

ISSN : 0971-8729

# యోజన

సంపుటి : 42 సంచిక : 12 అభివృద్ధి మాసపత్రిక అక్టోబరు 2014 ₹ 20

# అసంఘటిత రంగం


అసంఘటిత ఆర్థిక వ్యవస్థ - స్వరూపం

బార్బరా హారీస్ - వైట్

సమాచార ఆర్థిక వ్యవస్థలో అసంఘటిత కార్మికవర్గం

బాబు పి. రమేష్

అసంఘటిత రంగం - జ్ఞాన దృక్కోణం

అమిత్ బసోల్

ప్రత్యేక వ్యాసం

ఆర్థిక సమ్మిళితకు రాజమార్గం - ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన

ప్రవాకర్ సాహూ





విశేష వ్యాసం

గాంధీజీ - పారిశుధ్యం

సుదర్శన్ అయ్యంగార్

# అభివృద్ధికి మార్గసూచి

## "డిజిటల్ ఇండియా"

దేశంలోని అన్ని గ్రామ పంచాయతీలను బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ ద్వారా అనుసంధానించడానికి ఉద్దేశించిన "డిజిటల్ ఇండియా" కార్యక్రమానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ పంచాయతీలను ఇంటర్నెట్ ద్వారా కలిపి ఈ -పాలనను ప్రోత్సహించడం ద్వారా భారతదేశాన్ని విజ్ఞాన వ్యవస్థగా తీర్చిదిద్దుతారు. సుమారు రూ. 1,13,000 కోట్ల అంచనాలతో 2019 వరకూ దీన్ని అమలు చేస్తారు. ప్రతి పౌరుడికి సంఖ్యాక గుర్తింపు (డిజిటల్ ఐడెంటిటీ) ద్వారా సంఖ్యాక మౌలిక సదుపాయాల కల్పన, మొబైల్ ఫోన్స్, బ్యాంకు ఖాతాలు మరియు సురక్షితమైన, భద్రమైన సైబర్ స్థానం (సైబర్ స్పేస్) కల్పించడం, ఇంటర్నెట్, మొబైల్ వ్యవస్థల ద్వారా కోరిన వెంటనే తక్షణం పరిపాలన, సేవల అందజేత, మరియు ఆర్థిక కార్యకలాపాలు ఎలక్ట్రానిక్ వ్యవస్థ ద్వారా నిర్వహించి నగదు రహిత వ్యవస్థ ఏర్పాటు అన్ని ధ్రువపత్రాలను ఎలక్ట్రానిక్ మాధ్యమంలో అనుసంధానించి పౌరులకు సంఖ్యాక సాధికరత (డిజిటల్ ఎంపవర్‌మెంట్) కల్పించడం లాంటి మూడు కీలక అంశాలు ఈ కార్యక్రమంలో ఉన్నాయి. డిజిటల్ ఇండియా ద్వారా 2.5లక్షల గ్రామాలను బ్రాడ్ బ్యాండ్, మొబైల్ వ్యవస్థద్వారా అనుసంధానించి టెలికాం వస్తువుల దిగుమతిని శూన్యం చేయడానికి సంకల్పించారు. 2.5 లక్షల స్కూళ్లల్లో వైఫై ఏర్పాటు, అన్ని యూనివర్సిటీల్లో మరియు సార్వజనీన వైఫై ప్రసార కేంద్రాల ద్వారా 1.7కోట్ల ప్రత్యక్ష మరియు 8.5 కోట్ల పరోక్ష ఉద్యోగాల కల్పన. ఈ-పాలన, ఈ-సేవలకు మరియు ఐటి, టెలికాం, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఉద్యోగాల కల్పనకు 1.7కోట్ల మందికి శిక్షణ ఇందులో ఉన్నాయి. పోస్టు ఆఫీసులను బహుళ సేవా కేంద్రాలుగా మార్పు, వైద్య వ్యవస్థలో ఇంటర్నెట్ వినియోగం, ఆన్‌లైన్ ద్వారా వైద్య సేవలు, వైద్య రికార్డులు, మందుల పంపిణీ మరియు దేశీయ ప్రాతిపదికన రోగుల సమాచార మార్పిడి ఇందులో ఉన్నాయి. దీని పైలెట్ ప్రాజెక్టులను 2015లో ప్రారంభించి 2018 వరకూ దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తారు. ఈ కార్యక్రమ అమలు తీరును ప్రధానమంత్రి స్వయంగా పర్యవేక్షిస్తారు.

## గణిత, భాషా నైపుణ్యాలకు మెరుగు

దేశవ్యాప్తంగా విద్యార్థుల గణిత, భాష నైపుణ్యాలను మెరుగుపర్చడానికి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఒక నూతన పథకం ప్రారంభించింది. 'పడేభారత్, బఢే భారత్ (భారత్ చదవాలి , భారత్ పెరగాలి), పేరిట ప్రారంభించిన ఈ పథకం తొలి నుంచి స్కూలు విద్యార్థుల్లో రాసే, చదివే అలవాటుతోపాటు గణిత శాస్త్ర పరిజ్ఞానానికి, 300 గంటలు గణిత నైపుణ్యానికి వెచ్చిస్తారు. నైపుణ్యవృద్ధి కార్యక్రమాల కోసం 2014-15 ఆర్థిక సంవత్సరంలో రూ. 2352.57కోట్లు రాష్ట్రాలకు కేంద్రపాలిత ప్రాంతాలకు కేటాయించారు.

## మందులకు లొంగని క్షయపై సర్వే ప్రారంభం

మందులకు లొంగని క్షయపై ఇదివరకు ఎన్నడూలేని అతిపెద్ద సర్వేను భారత ప్రభుత్వం ప్రారంభించింది. 'ప్రథమ జాతీయ మందులకు లొంగని క్షయపై సర్వే' ద్వారా అధికారులు మొండి క్షయను ఎదుర్కొనడానికి వ్యూహాలు తయారు చేయడమే కాకుండా, క్షయ వ్యాధిగ్రస్తులు, వ్యాధినుంచి కోలుకున్న వారిలో మందులకు లొంగని క్షయ వ్యాధి గణాంకాలు జాతీయ స్థాయిలో నమోదు చేస్తారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, యుఎస్ ఎయిడ్ సహకారంతో చేపడుతున్న ఈ సర్వేలో ప్రప్రథమంగా 5,214 పరిమాణంలో నమూనాలు ఏర్పాటు చేశారు.ఇందులో 24 రాష్ట్రాలకు చెందిన 120 క్షయ కేంద్రాలు ఉన్నాయి. మొదటిసారిగా క్షయ బారినపడినవారిని, మలివిడత క్షయ బారిన పడినవారిని సర్వేలో గుర్తిస్తారు. వారిలో 13 క్షయ మందుల్లో మొదటిదశలో ఐదు మందులు రెండవ దశలో ఎనిమిది మందుల నిరోధకతను పరిశీలిస్తారు. క్షయ వ్యాధి తీవ్రతను తగ్గించడానికి దేశంలోని ప్రభుత్వ మరియు ఇతర వైద్యుల మధ్య పరస్పర సంప్రదింపులు జరపడానికి ఒక ఈమెయిల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తోంది. క్షయ వ్యాధి తీవ్రతను తగ్గించడానికి దేశంలోని ప్రభుత్వ వైద్యులతో పాటు ప్రైవేటు వైద్యులు కూడా ఇందులో భాగస్వాములుగా ఉంటారు. ఐసిఎంఆర్, ఇతర సంస్థల మరియు ఇతర వైద్యుల నూతన వైద్య పరిజ్ఞానాన్ని అందరికి అందుబాటులో ఉంచుతోంది. వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు మరింత మెరుగైన పరిజ్ఞానం కలిగి క్షయ రోగులకు మరింత ప్రయోజనం కలుగుతుందని ఆరోగ్య శాఖ మంత్రి తెలిపారు. ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 3,90,000 మందులకు లొంగని (మల్టీడ్రగ్ రెసిస్టెంట్ (ఎండిఆర్) క్షయ కేసులు నమోదవుతుండగా భారతదేశంలో 99,000కేసులు నమోదవుతున్నాయి. ఇది ప్రపంచ వ్యాధి భారంలో 25శాతం ఉంది. క్షయవ్యాధి మరణాలకంటే మందులకు లొంగని క్షయవల్లే మరణించే వారి శాతమే ఎక్కువగా ఉంది. ఎప్పుడు విస్తృత మందులకు లొంగని క్షయ (ఎక్స్‌టెన్సివ్లీ డ్రగ్ రెసిస్టెంట్ - టిబి) (ఎక్స్‌డిఆర్-టిబి) అనే మరో ఉప ద్రవం సవాలు విసురుతోంది. భారతదేశం అత్యధికంగా ఏటా పెరుగుతున్న 64వేల మందులకు లొంగని కేసులతో సతమతమవుతోంది.

ISSN : 0971-8729

సంపుటి : 42 సంచిక : 12

అక్టోబరు 2014

# యోజన

చీఫ్ ఎడిటర్ : రాజేష్ కె.ఝా
సీనియర్ ఎడిటర్ : విజయకుమార్ వేదగిరి
ఎడిటర్ : షఫి మహమ్మద్

జాయింట్ డైరెక్టర్ (ప్రొడక్షన్): వి.కె. మీనా
కవర్ డిజైన్ : గజానన్ పి. థోపే
e-mail : yojana_telugu@yahoo.co.in

*ఆనోభద్రాః క్రతవోయన్తు విశ్వతః (ఉత్తమ భావాలు అన్నివైపుల నుండి రావాలి)*

## ఈ సంచికలో...


| | | |
|---|---|---|
| 1. | అసంఘటిత ఆర్థిక వ్యవస్థ – స్వరూపం<br>బార్బరా హారీస్ – వైట్ | 5 |
| 2. | అసంఘటితకు ఆసక్తికర నిర్వచనము –<br>విధాన రూపకర్తలకోసం – సుప్రియా రౌత్ | 9 |
| 3. | సమాచార ఆర్థిక వ్యవస్థలో అసంఘటిత కార్మికవర్గం :<br>భారతదేశంలోని కాల్‌సెంటర్లలో ఉద్యోగ అభద్రత<br>బాబు పి. రమేష్ | 12 |
| 4. | అసంఘటిత రంగం – అవగాహన<br>అమిత్ బసోలె | 16 |
| 5. | గాంధీజీ – పారిశుధ్యం<br>సుదర్శన్ అయ్యంగార్ | 19 |
| 6. | అనియత రంగం పట్టణ ప్రజల పాత్ర<br>రాజేష్ భట్టాచార్య | 22 |
| 7. | భారత్‌లో పట్టణ అసంఘటిత రంగం<br>అరూప్ మిత్రా | 24 |
| 8. | విదేశాల్లో అసంఘటిత కార్మికుల అగచాట్లు<br>డాక్టర్ ఫజులుల్లాఖాన్ | 28 |
| 9. | ఇంటి పని మహిళా సామ్రాజ్యం ఇదోక అంతులేని కథ<br>ప్రొ. శ్రీమతి సరస్వతి రాజు | 31 |
| 10. | దర్పణం – యోజన సంపాదకవర్గం | 34 |
| 11. | విజ్ఞాన విపంచి – ప్రాతూరి పోతయ్య శర్మ | 36 |
| 12. | ఆర్థిక సమ్మిళతకు రాజమార్గం ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన<br>ప్రవాకర్ సాహూ | 40 |
| 13. | అసంఘటిత రంగం-ఆలోచన, స్వభావం : సార్వజనీన పరిశీలన<br>అశీమా మజుందార్ | 42 |
| 14. | అసంఘటిత రంగం – సంక్షేమం నుండి సంక్షోభానికి<br>ఎన్.నాగేశ్వరరావు | 45 |
| 15. | ప్రగతి పథానికి మొదటి మెట్లు – ఐ.వి. సుబ్రమణ్యం | 47 |
| 16. | ప్రపంచ ఆహార దినోత్సవం – మన బాధ్యత<br>సుసర్ల మాధవి | 49 |
| 17. | శిలీంద్రాలు – వర్షాలు – సమ్మెట గోవర్ధన్ | 50 |
| 18. | భారతదేశంలో మానవ హక్కులు – గడ్డం ఆదాము, | 51 |
| 19. | నల్లధనం : దేశ భవిష్య(సొ)త్తు – పి. సరిత | 54 |
| 20. | నూతన సాంకేతిక నీటిపారుదల పద్ధతులు<br>డా. కె. కమల్‌దాస్ | 58 |
| 21. | ఇంధన పొదుపు – ఆవశ్యకత –కారంపూడి రామకృష్ణ | 62 |
| 22. | పంచశీలకు అరవై ఏళ్ళు – కె. ప్రతాప్ రెడ్డి | 64 |
| 23. | వాతావరణానికి మరమ్మత్తులు–విజయకుమార్ వేదగిరి | 67 |
| 24. | ఎరువుల వినియోగం – ఆహార ధాన్యాల ఉత్పత్తి<br>డా. జె. సనత్ కుమార్, ఎం. కోటయ్య | 69 |
| 25. | అభివృద్ధికి ఆలంబన – యోజన సంపాదకవర్గం | 71 |
| 26. | చరిత్రకందని వీరనారి దుర్గావతి, గుమ్మడి లక్ష్మీనారాయణ | 73 |
| 27. | మనకు సింగపూరు ఎందుకు ఆదర్శం – వెంగళనారాయణరావు | 74 |
| 28. | తెలుగుతనానికి మూర్తిమత్వం బాపు – బి. హరివెంకటరమణ | 75 |


**ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాల గురించిన సమాచారాన్ని అందజేసేందుకు తెలుగు, హిందీ, ఇంగ్లీషు, అస్సామి, బెంగాలి, తమిళం, ఉర్దూ, మరాఠీ, గుజరాతీ, మళయాళం, పంజాబీ, కన్నడ, ఒడియా భాషలలో వెలువడుతున్న మాసపత్రిక.**

**యోజన (తెలుగు) చందా వివరాలు**

**1 సంవత్సరానికి - రూ. 100/- 2 సంవత్సరాలకు - రూ. 180/- 3 సంవత్సరాలకు - రూ. 250/-**

**మరిన్ని వివరాలకోసం : 040-23310162**

**చందాను మనియార్డర్/డి.డి. ద్వారా పంపవలసిన చిరునామా :** ఎడిటర్, యోజన (తెలుగు),10–2–1, ఎఫ్‌డిసి కాంప్లెక్స్,

మహావీర్ హాస్పిటల్ ఎదురుగా, ఏ.సి. గార్డ్స్, హైదరాబాద్ – 500 028 ఫోన్ : 23315288, 23314823

యోజనలో ప్రచురించిన వ్యాసాలలో వ్యక్తపరచిన భావాలు ఆయా రచయితలవే. వారు పనిచేస్తున్న సంస్థలు, ప్రభుత్వ అభిప్రాయాలను అవి ప్రతిబింబించవు.
యోజనలో ప్రచురించే ప్రకటనలలోని అంశాలు ఆయా సంస్థలు వారి ప్రతినిధులకు చెందినవి. ప్రకటన పాఠం/సారాంశం మూలంగా ఎదురయ్యే ఎటువంటి పర్యవసానాలకు యోజన బాధ్యత వహించదు


# యోజన

చీఫ్ ఎడిటర్ డెస్క్

## జాతి నిర్మాతలు

పొద్దున్నే కాలింగ్ బెల్ మొగుతుంది. పేపర్ బోయ్ నేటి పేపరును చుట్టగా లోపలికి విసిరేసి వేగంగా సైకల్ బెల్ మోగించుకుంటూ వెళ్ళిపోతాడు. కొద్దిసేపటి తర్వాత మనం కూడా తయారై ఏ రిక్షా మీదనో, ఆటో మీదనో లేదా బస్సుమీదనో ఆఫీసుకు వెళ్తాము. ఆఫీసుకు చేరుతూనే వాచ్ మన్ లేదా ప్యూన్ మనకు నమస్కారం పెడుతుంటే హడావిడిగా మన సీట్ దగ్గరకు చేరుకోగానే అక్కడ మనతోపాటు లేదా మనక్రింద పనిచేసేవారి పలకరింపులు ఇవన్నీ మనందరకూ రోజూ మామూలే. కానీ, వీరందరిలో కామన్‌గా ఉండే ఒక లక్షణమేమంటే వారందరూ అసంఘటిత రంగ కార్మికులు. అంటే వారిని తక్కువ చేయడం కాదు, మన సమాజం సక్రమంగా నడవటానికి వీరే కారకులు. మన వృత్తి గత జీవితమైనా, లేదా వ్యక్తిగత జీవితమైనా వీరు లేనిదే ఒక్క క్షణం కూడా జరగదు. నిజానికి మన సమాజం మూడొంతులు అసంఘటితమే! కానీ, వారి కృషికి, ప్రతిభకుమాత్రం సమాజంలో తగిన గుర్తింపు ఉండదు. ఇలా గుర్తింపు లేని ఒక శ్రామిక వర్గానికి అసంఘటిత రంగమని ఒక పేరు పెట్టి వారికి ఒకరకమైన గుర్తింపును తెచ్చిన వ్యక్తి బ్రిటన్ కు చెందిన మానవ పరిణామ శాస్త్ర నిపుణుడు కీత్ హార్ట్. క్రమంగా 1970 లలో అంతర్జాతీయ కార్మిక సంస్థ వీరు చేసే పనిని 'మర్యాదపూర్వక' పనిగా గుర్తించి, పని సమయంలో వారి హక్కులు, అలాంటి పనిచేసే హక్కు, సామాజిక భద్రతకోసం చర్చలు మొదలైన అంశాలను తెరపైకి తెచ్చింది. అయితే ఆర్థిక, సామాజిక పండితులు మాత్రం ఈ భావాన్ని కేవలం ఆర్థిక రంగానికి మాత్రమే పరిమితం చేస్తే దానిని చిన్న చూపు చూసినట్లేనని వాదిస్తున్నారు. ఈ భావం సామాజిక, సాంస్కృతిక రంగాలలో సైతం విస్తృతంగా వ్యాపించింది.అసంఘటితమంటేనే ఆధిపత్యం చెలాయించే రంగమనే ఒక వాదన కూడా ఉన్నది. ఎంత ప్రాధాన్యమున్న పనిని చేసినా, అది నియంత్రణకు అందని స్థాయిలో ఉంటే దానిని అసంఘటిత రంగమన్నారు. ఉదాహరణకు ప్రతిఫలం లేని ఇళ్ళలో చేసే పని. ఇది ఏ ఆర్థిక వర్గంలోకీ రాకపోయినా దానిని అసంఘటిత రంగంగా గుర్తించి, అవసరమైన విధాన నిర్ణయాలను రూపొందించారు. అవి ఆర్థికం కావుగానీ, అత్యంత ప్రధానమైనవి అనడంలో సందేహం లేదు.

అయినప్పటికీ, ఇలాంటి పనీపాటలలోని ఆర్థిక కోణాన్ని నిష్ణాతులు అంచనా వేసి, ఎక్కువమంది ప్రజలు ఈ కార్యకలాపాలలో నిమగ్నమై ఉండటం వల్ల గుర్తింపును ఇవ్వవలసి ఉంటుంది. జాతీయ ప్రతిచయన సంస్థ (National Sample Survey Organization-NSSO) వారి 2009-10 వ సంవత్సరపు వివరాల ప్రకారం వ్యవసాయ రంగంలోని 90 శాతానికి పైగాను, దాదాపుగాను ఈ అసంఘటిత కార్మికులు ఉన్నారు. కొంతమంది భావించినట్లు అసంఘటిత రంగమంటే ఆర్థిక రంగంలో ఏ వర్గానికీ చెందని వదిలివేసిన రంగం మాత్రం కాదు. నిజానికి ఇదే ఆధిపత్య రంగం. ఇటీవలి కాలంలో ఈ రంగంలో ఉపాధి కల్పనా అంతా ప్రోత్సాహకరంగా లేనప్పటికీ, మొత్తం ఆర్థిక రంగంలో ఇది చాలా చైతన్యశీలమైన రంగం. సంఘటిత రంగం కొంత వెనుకబడి పోయినప్పటికీ, అసంఘటిత రంగం మాత్రం ఉత్పాదకతలోను, మూలధన కూడికలోను, వేతనాలలోనూ కూడా కొంత మెరుగుదలను రికార్డు చేసింది. దీనిని చలనం లేని రంగంగానో లేదా ఎక్కువ ప్రతిభ చూపని రంగంగానో పరిగణిస్తే అది తప్పు. యథార్థ గణాంకాలు చూస్తే, పెట్టుబడి, స్థిర ఆస్తులను ఏర్పరచుకోవడం వంటి అంశాలలో సంఘటిత రంగం కన్నా మెరుగైన ఫలితాలనే చూపింది. అన్నిటికన్నా ముఖ్యంగా, లోకవిద్యను, అనగా సంప్రదాయంగా చేస్తున్న వృత్తుల ద్వారా తమ పరిజ్ఞానాన్ని మెరుగు పరుచుకోవడం లేదా, తర్వాతి తరం వారికి జీవనోపాధికి అందచేయడం, అది కూడా సంప్రదాయ విలువలతో ఈ అసంఘటిత ఆర్థిక వ్యవస్థనే, మనం అసలు ఆర్థిక ఆధారంగా తీసుకున్నా తప్పులేదు. అయితే దీనికి సమగ్రమైన నియంత్రణ వ్యవస్థ ఉండాలి. దానితో ఈ రంగంలోని ప్రధానమైన వారికి తమ ప్రతిభను చూపేందుకు సరైన అవకాశం అందుతుంది. ఇంత ప్రాధాన్యమున్న ఈ అసంఘటిత రంగం దేశ ప్రాధామ్యాలలో లేక పోవటం ఒక లోటే! ఈ రంగంలో పనిచేస్తున్నవారి ఉపాధికి రక్షణ, తగిన హక్కులు లేవు. వారి ఆదాయాలు కూడా అనేక ఆటుపోట్లకు గురవుతుంటాయి. తరచుగా, స్వయం ఉపాధి, ఈ రంగంలోని అతి ప్రధాన మైన అంశం. ఒక వ్యక్తికి తన శ్రమను అమ్ముకోడానికి విసిగిపోయిన లేదా వేరే ప్రత్యామ్నాయం లేని మార్గమైపోయింది. మన ప్రధాన మంత్రి మోడి ఇటీవల ఇచ్చిన 'భారత దేశంలో ఉత్పత్తి చేయండి'అనే పిలుపును స్ఫూర్తి గా తీసుకుని మన దేశాన్ని నిజమైన భారీ ఉత్పాదక శక్తిగా మార్చలంటే, ఈ అసంఘటిత రంగాన్ని విస్మరించి మాత్రం అసలు చేయలేము. ■



# అసంఘటిత ఆర్థిక వ్యవస్థ - స్వరూపం

అసంఘటిత ఆర్థిక రంగం భారత్‌లో పెద్ద ఎత్తున విస్తరించి ఉన్న ఒక వ్యవస్థ. అసంఘటిత ఆర్థిక రంగాన్ని ఆర్థిక వేత్తలు విమర్శించి నప్పటికీ, ఇది దేశంలోని ఒక పద్రాన స్రవంతిలో భాగస్వామ్యమై ఉంది. అసంఘటిత అంటే ఇది ఎలాంటి గుర్తింపు లేని వ్యవస్థ. ఇది అటు ప్రభుత్వాలు కానీ ఇటు చట్టాలు కానీ గుర్తించని వ్యవస్థ. అసంఘటిత వ్యవస్థ అనేది కేవలం ప్రజల భాగస్వామ్యంతో, జన బాహుళ్యానికి అనుగుణంగా నడిచే వ్యవస్థ. ప్రస్తుత వ్యాసంలో అనధీకృత ఆర్థిక రంగం స్వరూపం, అలాగే దాని ప్రభావం గురించి సంగ్రహంగా పేర్కొనబడింది.

**భారతదేశంలో అసంఘటిత ఆర్థిక వ్యవస్థ స్వరూపం, దాని సంబంధాలు**

అసంఘటిత ఆర్థిక రంగం అనేది స్వల్పకాలికం కాదు. 70వ దశకంలో అసంఘటిత ఆర్థిక వ్యవస్థ త్వరలోనే సంఘటిత వ్యవస్థలోకి చేర్చబడి జాతి నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న పారిశ్రామికీకరణ, వ్యవసాయం, పట్టణీకరణ, బ్యాంకింగ్ రంగాల వలే రూపాంతరం చెందుతుందని భావించారు. అయితే దశాబ్దాలు గడిచే కొద్ది అసంఘటిత ఆర్థిక వ్యవస్థ మరింత బలపడింది. ఏకంగా సంఘటిత ఆర్థిక వ్యవస్థలోని రంగాలే అసంఘటిత వ్యవస్థ నుంచి తక్కువ ధరలో వస్తుసేవలను పొందాయి. అసంఘటిత ఆర్థిక వ్యవస్థ ఫలితంగా దినసరి కూలీలు, అలాగే అసంఘటిత కార్మిక వ్యవస్థ రూపుదిద్దుకుంది. వీరంతా అసంఘటిత ఆర్థిక వ్యవస్థ ఆధారంగానే ఆదాయం పొందుతున్నారు. అయినప్పటికీ అసంఘటిత ఆర్థిక వ్యవస్థ ఎన్నో వ్యతిరేకతలను ఎదుర్కొంటోంది. ఈ వ్యవస్థ వల్ల లబ్దిదారులు ఉన్నప్పటికీ....సదరు వ్యవస్థే అసంఘటిత అయినందున దీనికి అంత మద్దతు లభించట్లేదు. చివరకు ఎన్నికల వేళ ఖర్చు పెట్టే నిధులు సైతం అసంఘటిత ఆర్థిక వ్యవస్థలో భాగమే. ఫలితంగా ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంపై ఈ వ్యవస్థ చూపిస్తున్న ప్రభావాన్ని అర్థం చేసుకోవచ్చు.

ఇక భారత్‌లో మాత్రమే అసంఘటిత ఆర్థిక వ్యవస్థ అదుపు తప్పలేదు. బ్రిక్స్, ఈయూ దేశాల ఆర్థిక వ్యవస్థల్లోనూ ఇది పాకింది. అసంఘటిత ఆర్థిక వ్యవస్థ లోతుగా విస్తరించింది. ఒక అంచనా ప్రకారం 92.5 శాతం మందికి జీవన భృతి కల్పిస్తున్న వృత్తులన్నీ అనధీకృతమైనవే. అలాగే అవన్నీ జీడీపీలో మూడింట రెండొంతుల ఉత్పత్తిని సాధిస్తున్నాయి. అయితే ఈ గణాంకాలన్నీ ఆర్థిక ఒత్తిళ్ల కారణంగా మరింత నాణ్యమైన సమాచార సేకరణలో భాగంగా సేకరించారు. మరో ప్రత్యామ్నాయ పద్ధతిలో అసంఘటిత వ్యవస్థను అంచనా వేయాలంటే చిన్న స్థాయిలో జరిపే సర్వేలపై దృష్టి సారిస్తూ వాటిలో ఎదురయ్యే అడ్డంకులను తొలగించుకోవాలి. అయితే అసంఘటిత ఆర్థిక వ్యవస్థ విస్తృతంగా విస్తరించడం మాత్రమే కాదు వృద్ధి సాధిస్తూ ఉపాధి రంగానికి సైతం ఊతం అందిస్తోంది.

ఇక అసంఘటిత రంగం అనేది దారిద్ర్య పెరుగుదలకు సూచిక లాంటిది . ఇంటర్ నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ప్రకారం అసంఘటిత రంగంలో పనులకు ఎలాంటి హక్కులు ఉండవు. అసంఘటిత రంగానికి చెందిన కార్మికులకు గుర్తింపు లేని కారణంగా వారికి అందుతున్న సంక్షమ పథకాలు కేవలం సామాన్య ప్రజలకు అందుతున్నట్లే . అయితే కార్మికులకు అందే ప్రత్యేక సంక్షేమ పథకాలేవి వీరికి అందట్లేదు. అసంఘటిత ఆర్థిక రంగంలో ఒక విస్తృతమైన ఆర్థిక సంబంధాలు ఉన్నాయి. కానీ ఆ రంగం విస్తృతి పెరిగే కొలది దారిద్ర్యం పెరుగుతున్నట్లుగా నిపుణులు సూచిస్తున్నారు.

అసంఘటిత రంగం కొంత మేర నిర్మాణాత్మకంగా

**బార్బరా హారిస్ - వైట్,** అతిథి అధ్యాపకులు, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ
e-mail : barbara.harriss-white@gmail.com

కనిపిస్తుంది. అలాగే తన ఉత్పాదకతను పెంచుకునే యంత్రాంగం సైతం కలిగి ఉండడం ఈ రంగం ప్రత్యేకత. అసంఘటిత రంగం సాధారణంగా ప్రభుత్వ నియంత్రణలో ఉండదు. కానీ సమాజిక నియంత్రణ కనిపిస్తుంది. వేలాది వాణిజ్య మండళ్లు అలాగే వ్యాపార అసోసియేషన్లు ఏర్పాటు చేసుకొని ఈ రంగాన్ని నియంత్రిస్తున్నాయి. ముఖ్యంగా సామాజిక కార్పొరేట్ నియంత్రణ కనిపిస్తుంది. ఉపాధి కల్పనకు వారి నైపుణ్యమే కొలమానంగా ఉంటుంది. తగదాలను అక్కడికక్కడే పరిష్కరించు కోవడంతో పాటు ధరల నియంత్రణ సైతం క్రమ బద్ధంగానే ఉంటుంది. అసంఘటిత రంగం ఒక తరహా సామాజిక నియంత్రణ ఉన్న బీమా వ్యవస్థను సైతం ఏర్పాటు చేసుకుంది. ఉదాహరణకు నిర్మాణ రంగంలో కూలి పనుల్లో ఏదైనా ప్రమాదాలు సంభవిస్తే వారికి కాంట్రాక్టర్లే చెల్లించేలా ఒక ఒడంబడిక ద్వారా బీమా సౌకర్యం కనిపిస్తుంది. అలాగే ప్రభుత్వం నుంచి ఎదురయ్యే ఇబ్బందులను ఎదుర్కొనే యంత్రాంగం సైతం మనకు ఈ రంగంలో కనిపిస్తుంది. వనరులను పంచుకోవడంతో పాటు కావాల్సిన సాంకేతికతను సైతం సంతరించుకుంటోంది. ఒక గుర్తింపు కోసం జాతి, కుల, మత, లింగ, ప్రాంతం ఆధారంగా అసంఘటిత రంగం ఒక నియంత్రణను కలిగి ఉంది. అయితే ఈ అంశాలు అసంఘటిత రంగాన్ని కార్యకలాపాల్లోని ఉత్పాదకత విషయంలో పెద్దగా ప్రభావం చూపవు. కానీ ఉపాధి కల్పన, శిక్షణ తదితర అంశాల్లో ఇత్యాది అంశాలు ప్రభావితం చేస్తాయి.

ఇక మరో ప్రధాన అంశం అసంఘటిత రంగం దాదాపు 95 శాతం పైగా చిన్న చిన్న సమూహాలుగా ఉంటుంది. వీటిలో సుమారు ఐదు మంది దినసరి కూలీలు కన్నా తక్కువగా ఉంటారు. అయితే ఈ సగటు 1990 నాటి 2.9 గా ఉంటే 2005 నాటికి 2.4 కు పడిపోయింది. ఇందుకు ప్రధాన కారణంగా సరళీకృత ఆర్థిక విధానాలనే చెప్పుకోవచ్చు. ఈ సంస్కరణ ఫలితంగా మరింతగా అసంఘటిత రంగం విస్తరించింది. వ్యాపార సమూహాలు మరింతగా వ్యాప్తిచెందాయి. ఉపాధి పొందుతున్న వారికి కొంత మేర సమగ్ర విధానాలు సైతం లభించాయి. ఇక 95 శాతం ఈ సమూహాలు టోకు, చిల్లర వ్యాపారాల్లోనే స్వయం ఉపాధి పొందుతూ చిన్న చిన్న వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేసుకున్నాయి. వీరినే చిన్న వస్తు ఉత్పత్తిదారులుగా అభివర్ణించవచ్చు. వీరి ద్వారానే భారత ఆర్థిక వ్యవస్థలో చాలా మందికి ఉపాధి లభిస్తోంది. ఇది ఒక్కో సారి అధీకృతం అయితే మరెన్నో సార్లు అనధీకృతంగా ఉపాధి కల్పనలో భాగస్వామ్యం అయ్యింది. అయితే ఈ చిన్న వ్యాపార సముదాయాలు సాధ్యమైనంత వరకూ స్వీయ నియంత్రణలోనే ఉంటూ ఉపాధి కల్పిస్తుంటుంది.

ముఖ్యంగా ఉత్పత్తిదారుడి పెట్టుబడితో పాటు శ్రామికుల శ్రమ ఈ రంగంలో పరస్పర అనుబంధం కలిగి ఉంటుంది. ముఖ్యంగా ఈ చిన్న తరహా వ్యాపార సముదాయాలకు సంబంధించి ఎలాంటి ప్రత్యేకమైన గణాంకాలు అందుబాటులో లేవు. ఈ చిన్న సముదాయాలే కొంత మేర పెట్టుబడితో పాటు శ్రామిక శక్తిని కలిగి ఉంది. వీరి ఉత్పాదక విధానాలు వేరు వేరుగా ఉంటాయి. వీటి లక్ష్యాలు మారి పోతుంటాయి. ఒక్కోసారి ఈ సముదాయాలు వాటి లాభాల్ని మించి ఉత్పాదకతను సాధిస్తాయి. ఒక్కోసారి వారి సొంత కుటుంబానికి చెందిన శ్రామికులను పరిగణలోకి తీసుకోరు. మార్కెట్ రేట్ల కంటే తక్కువగా చెల్లింపులు ఉంటాయి. ఏది ఏమైనప్పటికీ వీరు మూల పెట్టుబడిదారులు మాత్రం కారు. వీరంతా మార్కెట్ విస్తృతిలో భాగస్వామ్యం కలిగి ఉంటారు. వీరి రంగాలకు మాత్రమే పరిమితం అయి ఉంటారు. అరుదైన సందర్భాల్లో మాత్రమే పెట్టుబడిని విస్తరించే ప్రయత్నాలు చేస్తాయి. అసంఘటిత రంగంలో చిన్న మొత్తంలో మిగులు, అప్పులు, అలాగే ఇవి వారసత్వం ఆధారంగానే ముందుకు కొనసాగుతాయి. వ్యాపార విస్తృతి కోసం మరో యూనిట్ ను స్థాపిస్తాయి. అంతేకానీ వ్యాపార సామ్రాజ్య విస్తృతిలో భాగంగా భాగస్వామ్యాలు, చిన్న సంస్థలను టేకోవర్‌లు చేయడం లాంటివి కనిపించవు.

అయితే అసంఘటిత ఆర్థిక వ్యవస్థ అనేది కేవలం చిన్న తరహా వ్యాపార సముదాయాలకు మాత్రమే పరిమితం కాలేదు. అసంఘటిత రంగం పెద్ద సంస్థలకు అలాగే ప్రభుత్వ నిర్వహణలో సైతం ఉంది. సుమారు 40 నుంచి 80 శాతం మంది కార్పొరేట్ రంగానికి చెందిన శ్రామికులు ఎలాంటి నమోదు కానీ గుర్తింపు కానీ లేకుండా పనిచేస్తున్నారు. కొంత మేర వీరిలో సంఘటితమై ఉన్నప్పటికీ, ఉద్యోగ భద్రత లేకపోవడంతో వారి హక్కులను కోల్పోతున్నారు. అయితే ఇటీవలే వెలువడిన ఒక పరిశోధనలో బొగ్గును వెలికితీసే రంగంలో పెద్ద ఎత్తున అనధీకృత ఉద్యోగులు ఉన్నారు. ప్రభుత్వ ప్రాయోజిత కార్పొరేషన్‌లలో కొంత మేర అధీకృత పెద్ద ఎత్తున అనధీకృత రంగం రాజ్యమేలుతోంది. దిన సరి కూలీలు, సబ్ కాంట్రక్టర్లు, ప్రయివేటు సెక్యురిటీ ఏర్పాటు లాంటివి అనధీకృతంగా సాగుతున్నాయి. వీటన్నింటినీ ఏ ప్రభుత్వ డాక్యుమెంట్లు కాదనలేని పరిస్థితి ఉంది.

దేశంలో సంఘటిత కార్పొరేట్ రంగం విస్తరిస్తున్నప్పటికీ అసంఘటిత రంగమే ఆర్థిక వ్యవస్థలో తన భాగస్వామ్యాన్ని పెంచుకుంటూ పోతోంది. అయినప్పటికీ ప్రభుత్వ నియంత్రణలోకి ఈ రంగాన్ని తెచ్చేందుకు కొన్ని విధానాలు, పద్ధతులు ఉన్నాయి. అయితే ఇవి ఏ మరకు ఫలితాన్ని ఇస్తాయనేదే అసలు ప్రశ్న.

**విధానం, వ్యూహాత్మక పద్ధతులు మరియు అడ్డంకులు, ప్రశ్నలు**

భారత ప్రభుత్వం అసంఘటిత రంగానికి చెందిన చిన్నసముదాయాలను ఉద్దేశించి ఏదైనా ప్రాజెక్టు చేపట్టనుందా ? అనే అంశం ఎక్కువగా చర్చలోకి వచ్చింది. అయితే కొందరు దీన్ని అసాధ్యం అని పేర్కొంటే, ఈ రంగం యొక్క విస్తృతి అలాగే నిరుద్యోగ సమస్యను దృష్టిలో ఉంచుకొని అసంఘటిత రంగం నియంత్రణ జోలికి ప్రభుత్వం వెళ్లే అవకాశం లేదని అంతా భావించారు. అలాగే వాస్తవానికి ఈ రంగంలో తక్కువ ఉత్పాదకత కలిగి ఉండడంతో అంతగా గుర్తింపురాలేదు. దీంతో విధానాల రూపకల్పనలో ప్రధాన అడ్డంకిగా మారింది. అలాగే అసంఘటిత రంగాన్ని పెట్టుబడి లేని రంగంగా పరిగణిస్తే మాత్రం ఈ రంగానికి పెద్ద ఎత్తున నిధుల కేటాయించి దారిద్ర్య నిర్మూలన, బాధితుల పునరావాసం లాంటి కార్యక్రమాలను సూచిస్తున్నారు. అయితే సరిగ్గా అలాంటి ప్రాజెక్టునే ప్రభుత్వం చేపట్టనుంది.

అయితే ప్రభుత్వం ముంగిట అసంఘటిత రంగానికి సంబంధించి స్పష్టత కొరవడింది. ప్రభుత్వం అసంఘటిత రంగాన్ని ఎలా నియంత్రించాలో అనే విషయం పై ప్రధానంగా మూడు మార్గాలున్నాయి. అవి ఒకటి ఈ రంగానికి రక్షణ కల్పించడం, రెండోది అసంఘటిత రంగాన్ని నిర్మూలించడం, ఈ వ్యవస్థను సహిస్తూ తగిన తోడ్పాటు కల్పించడం లాంటి పరస్పర విరుద్ధ మార్గాలు ముందున్నాయి. నైతికంగా ప్రభుత్వం అనధీకృత రంగాన్ని ప్రోత్సహించరాదు. ఇది చట్టరీత్యా అంత అభిలషణీయం కాదు. కానీ వాస్తవ పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. ఉదాహరణకు ఒక నగర సుందరీకరణ ప్రాజెక్టు ఫలితంగా అసంఘటిత రంగానికి చెందిన వ్యాపార సముదాయాలను తొలగించాల్సి వస్తే ప్రభుత్వం ముందు సరిగ్గా పైన పేర్కొన్న సవాళ్లే ఎదురవుతాయి. అందుకే ప్రభుత్వం విధానాల రూపకల్పనలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

ప్రస్తుత 21 శతాబ్దంలో ప్రభుత్వం అసంఘటిత రంగాన్ని నియంత్రించేందుకు కొంత మేర సఫలీకృతమైంది. ఉదాహరణకు వ్యవసాయ మార్కెట్‌లలో వ్యాపారులకు, రైతులకు మధ్య రేట్లను నియంత్రించేందుకు మార్కెట్ రెగ్యులేటరీ చట్టాలను అమలు చేసి కొంత మేర సఫలమైంది. అయితే ప్రభుత్వ జోక్యాన్ని కార్పొరేట్ వర్గం అసహనం వ్యక్తం చేసినప్పటికీ, ఈ పద్ధతి ద్వారా సదరు మార్కెట్‌లో వ్యాపారం చేసే సంస్థ ప్రభుత్వపరంగా నమోదు అవుతుంది. అయినప్పటికీ అసంఘటిత రంగానికి చెందిన వ్యాపార సముదాయాలు ఇప్పటికే ఎలాంటి నిబంధనలు పాటించకుండా, చిన్నపాటి ప్రభుత్వ పన్నులు కడుతూ, అనుమతులు లేకుండా వనరులను వినియోగించుకుంటూ తమ ఉనికిని కాపాడుకుంటున్నాయి.

ఇక మరో ప్రధాన అంశం విధాన ఎంపిక. దేశంలోని ప్రధాన పెట్టుబడి దారి వ్యవస్థకు ప్రభుత్వం ఎలాగైతే నియంత్రణ వ్యవస్థను అమలు పరుస్తుందో సరిగ్గా అలాంటి వ్యవస్థనే అసంఘటిత వ్యవస్థ విషయంలో అమలు చేయాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు, మినహాయింపులు అనధీకృత రంగం పొందుతోంది. అయితే అసంఘటిత రంగం సమాజంలోని ఒక ప్రధాన స్రవంతికి ఉపాధి కల్పిస్తోంది. అందుకే ప్రభుత్వం నియంత్రణలోకి తేవాల్సిన అవసరం ఉంది. అయినప్పటికీ ఈ విధాన ఎంపికలో అడ్డంకులు ఉన్నాయి. ముఖ్యంగా చట్ట విరుద్ధమైన అద్దె మార్కెట్లు లాంటివి కొనసాగడంతో ప్రభుత్వ విధానాలు దెబ్బతినే ప్రమాదం లేకపోలేదు. అసంఘటిత రంగంపై నియంత్రణ జరగాలంటే సమాంతర వ్యవస్థ ద్వారా ఆర్థిక వ్యవస్థలో కృత్రిమ ఫలితాలు సాధించవచ్చు. కానీ అధీకృత వ్యవస్థపై దీని ప్రభావం పడే అవకాశం లేకపోలేదు.

ముఖ్యంగా సంస్థాగత లోపాల కారణంగా అనధీకృత వ్యవస్థ విషయంలో ఈ అచేతనా స్థితి ఏర్పడింది. అంతేకానీ ప్రభుత్వ సామర్థ్య లోపం వల్ల కాదు. ఒక వేళ సంస్థాగత లోపాలను సవరించుకుంటే అభివృద్ధితో పాటు నియంత్రణ సాధించవచ్చు. అయితే నియంత్రణ పేరిట బలవంతంగా విధానాలు అమలు చేయరాదు. చిన్న పెట్టుబడులను ప్రోత్సహిస్తూ నియంత్రణా వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. అప్పుడే అభివృద్ధికి ఆస్కారం కలుగుతుంది.

**అధీకృతం వైపు అడుగులు**

అనధీకృత వ్యవస్థ కట్టడి లేదా నిర్మూలనకు ప్రస్తుత విధానాల అమలులో ఎన్నో అడ్డంకులు ఉన్నాయి. ముఖ్యంగా విధానాలను అమలు పరిచినప్పటికీ అవి లక్ష్యాలను చేరుకోలేక పోవచ్చు అదే అతి పెద్ద సవాలుగా పరిణమించింది. విధానాల అమలులో రాజకీయాలు జోక్యం చేసుకోవడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. రాజకీయాలు విధానాల అమలుకు ఎలా అడ్డంకిగా మారాయో ఇప్పుడు కొన్ని ఉదాహరణల్లో చూద్దాం. కర్ణాటకలో భూముల వినియోగం అతిక్రమణలపై బెంగుళూరులో ప్రభుత్వం ప్రయివేటు సంస్థల ప్రయోజనాల మేరకు నిర్ణయాలు తీసుకుంది. దీంతో ఒక్కసారిగా నిరసనలు పెల్లుబికాయి. దీంతో ప్రభుత్వం వెనక్కు తగ్గక తప్పలేదు. ఇక రెండో ఉదాహరణలోకి వెళితే దారిద్ర్య నిర్మూలనపై మధ్యప్రదేశ్, మహారాష్ట్ర తీసుకున్న నిర్ణయాలు లబ్దిదారులనే బాధితులుగా మార్చాయి. దీంతో ప్రజా వ్యతిరేకత తప్పలేదు.

ఇక హర్యానా విషయంలో అక్కడి వ్యవసాయం భూసంబంధాలు ఇప్పటికీ కులాధిపత్యం చేతుల్లోనే ఉంది. మార్కెట్ నియంత్రణ చట్టం

అమలు చేసినప్పటికీ మరెన్నోసార్లు ఈ చట్టం ద్వారా జరిమానా విధించినప్పటికీ యజమానులు ఎలాంటి చర్యలు లేకుండా తప్పించుకుంటున్నారు. ఇక్కడ సామాజిక కట్టుబాట్లే చట్టం కన్నా బలమైనవిగా కనిపిస్తాయి.

ఇక వ్యవసాయ రంగంలో లైసెన్సుల కోసం అధిక సేవ రుసుముల పేరిట లంచాలు తీసుకుంటున్నారు. పొల్యూషన్ కంట్రోల్, అలాగే నాణ్యత ప్రమాణాల విషయంలోనూ అనధీకృతంగా వసూళ్లకు పాల్పడుతూ ఒక సమాంతర వ్యవస్థగా ఏర్పడ్డారు. అలాగే ట్రాన్స్‌పోర్ట్ రంగంలో అయితే ఏకంగా అనధీకృతంగా సింగిల్ విండో పథకం అమలు జరుగుతోంది. ఇక్కడ బ్రోకర్లు, ఏజెంట్లు చట్ట పరిధిలో లేని శక్తులదే హవా. ప్రభుత్వ రంగంలో అనధీకృత వ్యవస్థ మధ్య దళారులు, ఏజెంట్ల వ్యవస్థగా రూపుదిద్దుకొని వ్యవస్థలోని లోపాలను బయటపెడుతోంది. ఈ విషయంలో కట్టడి చేసేందుకు రాజకీయాలు సైతం అడ్డంకిగా నిలుస్తున్నాయి.

ప్రభుత్వ విధానాల పరిధిలో సైతం లోపాలు ఉన్నాయి. పరిశోధకుల అంచనా ప్రకారం ప్రభుత్వ విధానాల అమలుకు రాజకీయ పరిధి అడ్డంకిగా మారింది. అయితే ఈ కోణంలో మరింత పరిశోధన జరగాల్సిన అవసరం ఉంది. అయినప్పటికీ శాసనకర్తలను తయారు చేసే రాజకీయ రంగమే అనధీకృత వ్యవస్థను ప్రభావితం చేస్తుంటే ప్రభుత్వం ఎలా స్వతంత్ర నియంత్రణ గల విధానాలను అమలు చేస్తుంది.

అసంఘటిత వ్యవస్థను అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వానికి రెండు దశల్లో అడ్డంకులు ఎదురవుతాయి. ప్రధానంగా విధాన తయారీలోనూ, అలాగే అమలు దశలోనే అడ్డంకులు ఏర్పడతాయి. ఓవైపు కటువులేని నియంత్రణ వ్యవస్థ, మరోవైపు ఖచ్చితమైన విధానాల అమలు ఉన్నాయి. అయితే అసంఘటిత ఆర్థిక వ్యవస్థను నియంత్రించేందుకు ప్రత్యామ్నాయ విధానాలు అమలు చేయాల్సి ఉంది. అయితే విధానాల అమలులో ఎదురవుతున్న ఈ అడ్డంకులకు పైన పేర్కొన్న రెండు దశలే కారణం. ప్రభుత్వ విధానాలను బలహీన పరిచేందుకు దేశంలో పాక్షిక దృక్పథం గల సంస్థలు, సమూహాలు, రాజకీయ వర్గాల ఆసక్తులే కీలకంగా మారాయి. ఏ విధాన ప్రకటన అయినా పైన పేర్కొన్న వ్యవస్థల్లో చిక్కి బయటపడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

**అధీకృతం**

అసంఘటిత రంగాన్ని సంఘటితం చేసేందుకు అమలవుతున్న పద్ధతుల్లోనే క్రమబద్ధత లేదు. అయితే సంఘటితం రంగాన్ని విస్తరింపజేసేందుకు ఆస్తుల గుర్తింపు అవసరం. రకరకాల వ్యాపారాలకు లైసెన్సులను అమలు చేయడం ద్వారా గుర్తింపునిస్తే పాక్షికంగానైనా అధీకృత వ్యవస్థలోకి వచ్చే అవకాశం ఉంది. బ్యాంక్ రుణాలు అందజేయడం, ఉపాధి కల్పన చర్యలు చేపట్టడం ద్వారా కూడా అనధీకృత రంగాన్ని క్రమబద్ధీకరించవచ్చు. ఆధార్ ప్రాజెక్టు అమలుతో గ్రామీణ ఉపాధి హామీ పథకాల్లో చెల్లింపులన్నీ అధీకృతంగానే జరుగుతున్నాయి. సూక్ష్మ రుణాల సదుపాయం వల్ల సైతం ఒక రకమైన గుర్తింపు లభిస్తోంది. బ్యాంకు ఖాతాల ద్వారా సైతం అధీకృత రంగాన్ని ప్రోత్సహించే అవకాశం ఉంది.

అయితే వాస్తవ పరిస్థితుల్లో ప్రభుత్వం అసంఘటిత రంగంలో సర్దుకుపోయే పరిస్థితులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా అసంఘటిత రంగాన్ని కట్టడిచేసే విధానాల అమలులో అడ్డంకులు ఎదురవు తున్నాయి. పబ్లిక్ సెక్టార్‌కు చెందిన పనుల్లోనే అసంఘటిత రంగం విస్తరించింది. అయితే మరో కోణంలో ప్రభుత్వ రంగానికి చెందిన సంస్థల్లో పెద్ద ఎత్తున అవినీతి అమలవుతోంది. అధీకృత వ్యవస్థకు సమాంతరంగా చట్ట వ్యతిరేకంగా అసంఘటిత వ్యవస్థ రూపుదిద్దుకుంటోంది. నేరపూరిత చరిత్ర గల వారు రాజకీయ ప్రవేశంతో విధానాల తయారీలో తీవ్ర అడ్డంకులు ఎదురవుతున్నాయి. రాజకీయ పార్టీల నిధుల సేకరణలో నల్లధనం ఏరులై పారుతోంది. ఏది ఏమైనప్పటికీ ప్రభుత్వం సంఘటనల పరంగానే బలోపేతం అవుతూ అనధీకృత, నల్లధనం ఆర్థిక వ్యవస్థలను కట్టడి చేస్తోంది.

అయితే అనధీకృత వ్యవస్థ మార్పునకు లొంగని వ్యవస్థ కాదు. అధీకృత వ్యవస్థ విస్తరణకు వినూత్నమైన, విప్లవాత్మకమైన విధానాలు, అలాగే సాంకేతికత, సంస్థాగత నిర్మాణం అమలైతేనే ఆర్థిక వ్యవస్థలో బలీయమైన మార్పులు సంభవిస్తాయి. ■


**గమనిక**

**వ్యాసకర్తలకు సూచన :** యోజన మాసపత్రికకు వ్యాసాలు రాసేవారు తమ వ్యాసాల సాఫ్ట్‌కాపీని పేజీమేకర్ 6.5, అను 6.0 ఫాంట్‌లలో టైప్ చేసి పంపుతూ, వ్రాత ప్రతిని కూడా తప్పనిసరిగా హామీపత్రంతో జతచేసి పంపాలి. హామీ పత్రంలో ఇది తమ స్వంత రచన అనీ, దేనికీ అనువాదము /అనుసరణ కాదని మాత్రమే కాక, ఈ వ్యాసాన్ని మరే పత్రికకు పంపలేదు / పుస్తకంగా ముద్రించలేదు అని కూడా పేర్కొనాలి. వ్యాసాలను పేజీమేకర్,మరియు పిడిఎఫ్ ఫార్మెట్‌లోనూ, అలాగే యూనికోడ్‌లో టైప్‌చేసి వర్డ్ ఫార్మెట్‌లోనూ అందచేయవచ్చును. రచనలు 15వ తేదీలోపు హామీ పత్రంతో పంపాలి.

ప్రచురణను నోచుకోని వ్యాసాలు తిరిగి పంపబడవు. ఈ విషయంలో ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు. వ్యాసకర్తలు గమనించగలరు. – *సీనియర్ ఎడిటర్*

# అసంఘటితకు ఆసక్తికర నిర్వచనము - విధాన రూపకర్తలకోసం

**ఉపోద్ఘాతం**

గత దశాబ్ది నుంచి విధానకర్తలకు, విద్యావేత్తలకు అసంఘటిత ఆర్థిక విధానంపై విపరీతమైన ఆసక్తి ఏర్పడింది. నిజానికి ఈ విషయంపై 1970 నుంచే జిజ్ఞాస ఇనుమడించడం మొదలైంది. అసంఘటిత రంగంపై మన దేశంతోపాటు ప్రపంచ కార్మిక సంస్థకు కూడా ఆసక్తి మొదలైంది. అనాటికే ప్రపంచ కార్మిక సంస్థ అసంఘటిత ఆర్థిక కార్యకలాపాలపట్ల ఉత్సాహాన్ని ప్రదర్శించడం మొదలెట్టింది. అది రెండు వేల సంవత్సరం ప్రారంభం నాటికి జాగరూకతతో కూడిన దృక్పథాన్ని తీసుకొంది. అయితే ఇందులోకి భారత ప్రభుత్వం ఆలస్యంగా ప్రవేశించినా, 2004 నాటికి అసంఘటిత రంగం కోసం నేషనల్ కమిషన్ ఫర్ ఎంటర్‌ప్రైజెస్‌ను ఏర్పాటు చేసింది.

ఆలస్యంగా ప్రారంభమైనా, దేశంలో అసంఖ్యాకంగా ఉన్న అసంఘటిత కార్మికుల కోసం భారత పార్లమెంటు సామాజిక భద్రతా చట్టాన్ని చేసింది. అసంఘటిత కార్మిక సామాజిక భద్రతా చట్టం, 2008 లక్ష్యం... దేశంలోని అసంఘటిత కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగు పరచడమే! ఈమధ్యలో అంతర్జాతీయ కార్మిక సంస్థ అసంఘటిత ఆర్థిక వ్యవస్థను సంఘటిత వ్యవస్థగా మార్చడానికి సాధ్యమయ్యే విధాన రూపకల్పనలో (కనీసంగా ఒక పత్రాన్ని సమర్పించే దిశగా) నిమగ్నమైంది. ఈ విధాన రూపకల్పనలో ముఖ్యంగా అంతర్జాతీయంగా ఉన్న మరీ ముఖ్యంగా భూగోళంలో దక్షిణ భాగంలో ఉన్న అత్యధికులైన అసంఘటిత కార్మికులు ఎక్కువగా భారత దేశంలోనే ఉన్నారని గుర్తించారు. దేశంలో 90 శాతం పైగా కార్మికశక్తి అసంఘటిత రంగంలో ఉన్న నేపథ్యంలో వారిని సంఘటిత రంగంలోకి తీసుకొని రావడానికి చేసే ప్రయత్నంలో సాధించాల్సిన లక్ష్యాల గురించి అత్యంత జాగురూకత వహించాలి.

ఈ దిశగా, ఓ మంచి ప్రారంభానికి అదే అసంఘటిత్వం పరిష్కారం చూపుతుంది. ఈ చిన్ని వ్యాసంలో, అసంఘటిత్వం గురించి సైద్ధాంతిక, విధానపరమైన అంశాలను విశ్లేషిద్దాం. అసంఘటిత్వపు హద్దులను గుర్తిస్తూనే లెక్కకట్టడానికి సాధ్యం కాని కార్మికశక్తిని అసంఘటిత రంగంగా గుర్తించాలనేది ఒక సూచన. ఏదేమైనా, విధానకల్పన ప్రయోజనం కోసం ప్రతి అసంఘటిత కార్యక్రమాన్ని భాగాలుగా విభజించడంపై దృష్టి పెడుతూ విధాన నిర్ణయ ప్రక్రియలో కార్మికులకు పెద్దపీట వేయాలి.

**సంఘటిత, అసంఘటిత భావన!**

1973లో ఘనాలో బ్రిటీష్ ఆంత్రోపాలజిస్టు కీత్ హార్ట్ సాగించిన అధ్యయనం నుంచి అసంఘటిత్వ భావనను గ్రహించడానికి అంతర్జాతీయ కార్మిక సంస్థ అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తే దాన్ని ఎవరైనా ప్రజా ప్రాచుర్యం కల్పించడంగా భావించవచ్చు. ఎక్కడైతే అధికారికంగా పరిశ్రమలపై నియంత్రణ, పర్యవేక్షణ ఉంటుందో, చట్టపరంగా, సంస్థగతంగా అభివృద్ధి చెందిందో అలాంటి యునైటెడ్ కింగడమ్ నుంచి వచ్చిన కీత్‌కి ఘనాలో చేపట్టిన ఆర్థిక కార్యకలాపాలు ఆసక్తికరంగా అనిపించాయి. ఘనాలోని పట్టణాల్లో వీధి వర్తకులు, శారీరక శ్రమ చేసేవారు, ఇతర కార్మికులను ఇంగ్లాండ్ తదితర అభివృద్ధి చెందిన దేశాల్లో పరిశ్రమల వ్యవస్థతో కీత్ సహజంగానే సరిపోల్చారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని పరిశ్రమల తరహాలో ఘనా ఆర్థిక కార్యకలాపాలు లేకపోవడాన్ని కీత్ గుర్తించడమే కాకుండా అన్ని కార్యకలాపాలు అసంఘటితంగా ఉండడాన్ని కూడా గమనించాడు.

ఆవిధంగా, సంఘటిత భావన నుంచి అసంఘటిత్వం ఒక ప్రత్యేక రూపంగా ఉద్భవించింది. ఏ భావన అయితే అసంఘటిత్వ రూపానికి ఆధారమైందో అది కేవలం ఒక రూపం లేదా నమూనా

**సుప్రియా రౌత్,** పరిశోధకురాలు, లవల్ యూనివర్సిటీ, కెనడా. e-mail : supriyanujss@gmail.com

మాత్రమే! ఒక ప్రత్యేక సామాజిక నేపథ్యంలో, ఒక ప్రత్యేక కాలంలో అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థకి యజమాని, కార్మిక సంబంధం ఆధారంగా ఉన్న కార్యక్షేత్రం క్రమబద్ధీకరణకు నిర్ధారితమైన హక్కులు, బాధ్యతలను ప్రభుత్వం పర్యవేక్షించేదిగా ఉండేది. అప్పుడు, ఇప్పుడు గణనీయమైన ఆర్థిక కార్యకలాపాలు ఈ కార్యక్షేత్రానికి అనుసంధానమై ఉండేవి కావు. ఆ కార్యక్షేత్రం అంతర్జాతీయంగా ఉన్న అత్యధిక కార్మికుల అనుభవాలకు అనుగుణమైంది కాదని తేలింది. అంతమాత్రాన అసంఘటిత్వ భావన భావనాత్మక, పరిణామాత్మక విధాన ప్రయోజనాలను నేరవేర్చలేదని మనం తీర్మానించగలమా?

ముందుగా ఏర్పరుచుకున్న భావనల స్థానే, సంఘటిత్వం కాదనే విరుద్ధ వాదనతో నిండిన అసంఘటిత్వాన్ని అకడమిక్ లేదా విధాన నిర్ణాయక వ్యవస్థలకు దూరం చేయడం సబబు కాదు. అసంఘటిత్వ భావన ఉపయోగకర ప్రయోజనాలను నెరవేరుస్తుంది. వీటిలో అతి ముఖ్యమైన ప్రయోజనం ఏమంటే దాని విరుద్ధభావనను దూరం చేయడమే! భారతదేశంలో 90 శాతానికి పైగా కార్మిక జనాభా అసంఘటితంగా ఉందన్న ప్రకటన తీవ్రమైన ఆందోళనకు గురి చేస్తుంది. దీనికి తక్షణమే పరిష్కారం కనుగొనాల్సి ఉంటుంది. ఈ సందర్భంలో అసంఘటిత భావన అత్యంత ఉపయుక్తంగా ఉంటుంది. రెండోది, అసంఘటిత్వ భావన సౌకర్యాలున్న కార్మికులకు, అభద్రతతో జీవిస్తున్న పనివారికి మధ్య దూరాన్ని గుర్తిస్తుంది. మూడోది, ఈ భావన ఒక ఆదర్శాన్ని, నిర్ధారిత లక్ష్యాన్ని తెరపైకి (ఈ భావనపై పునరాలోచించాల్సిన అవసరం ఉందని అనుకున్నా) తెస్తోంది. నాలుగవది, ఒక ఉద్యమానికి ఒక భాషని ఇస్తుంది, అది అకడమిక్‌గానూ, కార్యచరణ రూపంలోనూ ఉంటుంది. చివరగా, అసంఘటిత భావన అన్నది విస్తృతస్థాయి విధాన నిర్ణయాలు తీసుకోవడానికి దోహదపడుతుంది.

ఏది ఏమైనా, విధాన నిర్ణాయకమైందిగా అసంఘటిత భావనను అంగీకరించినా అది ప్రతిపాదించే అంశాల కన్నా కనపడని కాని విషయాలూ ఎక్కువేనని గుర్తించాలి. అసంఘటిత కార్యకలాపాలు, ఆలోచనల కన్నా మరింత వైవిధ్యభరితంగా ఉంటాయి. ప్రత్యేకించి భారత్ వంటి భిన్నత్వం నిలువునా మూర్తీభవించిన దేశంలో అసంఘటిత కార్యకలాపాలు అనంతంగా ఉంటాయి. సంఘటిత కార్యకలాపాలు కూడా అనేకమైన అసంఘటిత లావాదేవీలకు నిలయంగా ఉన్న దేశంలో అసంఘటిత్వ భావన నుంచి అసంఘటిత కార్యకలాపాల రూపాలను గుర్తించడం సంక్లిష్టమైందే! అయితే విధాన రూపకల్పన కోసం అసంఘటిత్వాన్ని సూత్రీకరించాల్సిందే, తద్వారా అసంఖ్యాక అసంఘటిత కార్యకలాపాలను గుర్తించాలి. ఇక అసంఘటిత్వ భావన అన్నది ఈ భిన్నమైన కార్యకలాపాలున్న కార్యక్షేత్రానికి సరిగ్గా సరిపోదని కూడా తెలుసుకోవాలి.

ఇక రెండో సమస్యను చూస్తే, అసంఘటిత్వం అనే భావన స్వభావాన్ని అర్థం చేసుకోవడం కష్టతరమైంది. అసంఘటిత్వం అనే పదాన్ని వాడినప్పుడు అది ఒక రంగమా, ఆర్థికవ్యవస్థనా లేదా ఉపాధా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. చాలా కాలంగా అంతర్జాతీయ కార్మిక సంస్థ అసంఘటిత్వం అనే దాన్ని ఒక సంఘటితం కాని వ్యాపార వ్యవహార రంగానికి అపాదిస్తూ వచ్చింది. సంఘటిత ఆర్థికవ్యవస్థతో అసంఘటిత ఆర్థిక వ్యవస్థను తులనాత్మకంగా పోలుస్తూ ఆర్థిక వ్యవస్థలోని అసంఘటిత రంగం దేశాభివృద్ధికి తన వంతుగా అందించే భాగాన్ని లెక్కలేస్తూ ఆర్థిక రంగంలోని సంఘటిత, అసంఘటిత రంగాల్లో అనియత ఉద్యోగ కల్పన చేస్తూ వచ్చింది.

అసంఘటిత లేదా, సంఘటిత రంగమో, లేదా ఆర్థిక వ్యవస్థలోకి విస్తారమైన కార్యకలాపాలు చేపట్టగలిగిన అసంఘటిత కార్మికుల సేవలను వినియోగించడం ద్వారా అసంఘటిత ఉద్యోగ కల్పన భావన తెరపైకి వచ్చింది. మన దేశంలో విధాన రూపకల్పన కోణంలో చూస్తే అసంఘటిత కార్మికుల జీవన స్థితిగతులు మన రాజ్యాంగంలోని నిబంధనలకు, సూత్రాలకు లోబడి ఉన్నాయా అన్న అంశాన్ని అధ్యయనం చేయాల్సి ఉంది. కార్మికుల సమగ్ర అభివృద్ధి, వారి పని పరిస్థితులు, భద్రత, ఆరోగ్యం, విద్య, పౌష్టికాహారం, ఇతరులతో పోలిస్తే ఆదాయం వంటి వాటిని విధాన రూపకల్పనలో పొందుపరచాలి. ఈ కోణం నుంచి చూస్తే, అసంఘటిత ఉపాధి భావనకున్న ప్రాముఖ్యత అర్థం అవుతుంది. ఏదేమైనా, అదే సమయంలో అసంఘటిత ఉద్యోగ, ఉపాధిని నియంత్రించాల్సి ఉంటుంది. సంఘటితం కాని ఆర్థిక కార్యకలాపాలు భిన్నంగా ఉంటాయని, అదీ ఆర్థికపరమైనవనీ గుర్తించాలి. ఇందులో దాగి ఉన్న వాస్తవం ఏమంటే అసంఘటిత్వం ఆర్థికరంగ సమస్యే కాకుండా అతి పెద్ద సామాజిక సమస్యగ్గా కూడా!

**అసంఘటిత్వం: ఆర్థికం కన్నా సామాజిక సమస్య!**

ఒక ప్రత్యేకమైన రూప వైరుధ్యం ఆధారంగా అసంఘటిత్వ భావన ఏర్పడింది. లాభార్జనే పరమావధిగా ఉన్న ఆర్థిక కార్యకలాపాలకు ఆలవాలమై, అధికారుల నియంత్రణలో ఉండే పరిశ్రమలు, పారిశ్రామిక విప్లవం ఫలితంగా ఈ అసంఘటిత్వ భావన ఉద్భవించింది. లాభార్జన లేదా ఉత్పాదక సంబంధమైన అర్థిక రంగంతో అసంఘటిత్వం అనే భావన ముడిపడి ఉండడంలో పెద్దగా ఆశ్చర్యపోనక్కరలేదు. ఏదేమైనా, అసంఘటిత కార్మికుల కార్యకలాపాలు మన చర్చకు కేంద్రమైతే, ప్రతిసారీ అసంఘటిత కార్మికుల సమస్యలు ఆర్థికపరమైనవి కావని గుర్తించాలి. ఇక ఆర్థికేతర కీలక కార్యకలాపాల్లోకి వేతనం లేని ఇంటి పనులు, మరికొన్ని వ్యవసాయ సంబంధ పనులు, మొదలైనవి వస్తాయి. ఈ కార్యకలాపాలన్నీ అసంఘటిత నిర్వచనంలోకి వస్తాయా అన్నది పెద్ద చర్చగా ఉన్నప్పటికీ, ముందుగా నిర్ధారితమైన విధానపరమైన నిర్ణయాలు వీటిని అసంఘటిత ఉపాధిగా పరిగణించడం లేదు.

మరింత ప్రతిభావంతమైన పదజాలం లభ్యం కాని స్థితిలో తేలిగా అర్థం చేసుకోవడానికి అసంఘటిత ఆర్థిక కార్యకలాపాలు అన్న పదబంధాన్ని వాడడం ద్వారా అసంఘటిత కార్మికులు నిమగ్నమైన వైవిధ్యపూరిత కార్యకలాపాలను కేవలం ఆర్థిక రంగానికి మాత్రమే పరిమితం చేయడం లేదని గుర్తించాలి. ఇది సమాజంలోని విస్తారమైన అంశంగా భావిస్తూ, ఇందులో ఆర్థిక రంగం కూడా ఇమిడి ఉందని గ్రహించాలి. ఆర్థికవ్యవస్థలో సామాజిక భావన ఇమిడి పోతుందనే అపోహ పట్ల మనం జాగురూకత వహించాలి. మార్కెట్, ఆర్థిక రంగం కన్నా సమాజం అత్యంత విస్తారమైన అంశంగా ఉంటుంది. ఆర్థిక వ్యవస్థ లేదా మార్కెట్ మాత్రమే మన అన్ని సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక, పర్యావరణ సమస్యలకు కారణమని భావిస్తే మన దృక్పథం సంకుచితం అవుతుంది. సమాజంలోని అన్ని రంగాల్లానే ఆర్థిక రంగం కూడా ఒక రంగంగా మనం గుర్తిస్తే మనం వాస్తవాన్ని మరింతగా విశ్లేషించడానికి, ఎంతో విధానపరమైన అవకాశం లభ్యం అవుతుంది.

మనం అలాంటి విశ్లేషణాత్మక దృక్పథాన్ని అవలంభిస్తే శ్రద్ధ వహించే పనులు, వేతనం లేని గృహ శ్రమ ఇత్యాది కార్యకలాపాలను అత్యంత ప్రాముఖ్యం ఉన్న అసంఘటిత కార్యకలాపాలుగా గుర్తించడం చాలా తేలిక అవుతుంది. ఈ సందర్భంలో ఉత్పన్నమయ్యే రెండు అంశాలకు సమాధానాలు చెప్పాల్సి ఉంటుంది. మొదటిది, ఈ వేతనం లేని కార్యకలాపాలను అసంఘటితం అని ఎందుకు పిలవాలి? రెండోది, ఈ కార్యకలాపాలను శ్రమగా ఎందుకు గుర్తించాలి? అసంఘటిత రంగం అనే పదబంధాన్ని సృష్టించిన హర్ట్ ఈ కేటగిరీ కార్మికులను కూడా ఎందుకు గుర్తించాడో ఊహించడం కాస్త కష్ట సాధ్యమైందే! ఏది ఏమైనా, ఆయన అసంఘటిత్వం అనే భావన ఒక ప్రత్యేకమైన రూపం గలది. ఆ ప్రత్యేక రూపం లేకపోతే కార్యకలాపాన్ని అసంఘటితంగా చెప్పాల్సి వస్తుంది. ఈ అర్థంలో, ప్రస్తుతం గుర్తించని వేతనం లేని పనులను అసంఘటిత కార్యకలాపాల్లోకి చేర్చాలని ఎవరైనా వాదించవచ్చు.

వేతనం లేని ఈ పనులను అసంఘటిత భావనలో చేర్చడం అంత అవసరం కానప్పటికీ, వాటిని కూడా ఒక పనిగా గుర్తించడం ద్వారా నియమిత పనులపై పెట్టే విధానపరమైన దృష్టిలా కాకపోయినా ఒక ప్రత్యేకమైన విధాన రూప కల్పన మాత్రం అవసరమవుతుంది. వేతనం లేని పనిని అసంఘటిత కార్యకలాపంగా గుర్తించినా దాని సంక్లిష్ట స్వభావాన్ని విధాన కల్పనానుసరంగా చూడాల్సి ఉంటుంది. అసంఘటిత కార్యకలాపం అన్నది సామాజిక విలువ ఉన్నదిగా ఉంటూ నియత పర్యవేక్షణ, క్రమబద్ధీకరణ చట్రం వెలుపల ఉంటుంది.

ఇది మనల్ని మరో ప్రశ్న వద్దకు తీసుకెళుతుంది. వేతనం లేని శ్రమని మనమెందుకు ఒక పనిగా గుర్తించరాదు? శ్రద్ధ వహించే పని, గృహ సంబంధ పనులు కూడా సమాజాభివృద్ధికి దోహద పడుతుంటే అలాంటి వేతనం లేని పనులను నేరుగా ఆర్థిక కార్యకలాపాలుగా గుర్తించలేము, గుర్తించాల్సిన అవసరమూ లేదు. ఇలాంటి వేతనం లేని శ్రమ సామాజిక సుస్థిరతకు, పురోగతికి తోడ్పడుతుంది. కలిసి మెలిసి ఐక్యంగా ఉండే సమాజాన్ని మొత్తంగా చూస్తే వేతనం ఆశించని, లేని శ్రమ చేసేవారిని గుర్తించే బాధ్యత సమాజానిదే అని భావించాలి. వేతనం చెల్లించని ఈ శ్రమని సమాజం, సామాజిక సేవకుల పరస్పర సంబంధ వేదికగా గుర్తించాలి.

వేతనం లేని శ్రామికుల విలువైన సామాజిక కృషిని గుర్తించడానికి మన రాజకీయ నాయకులు ఓ మార్గాన్ని అన్వేషించాలి. అలాంటి గుర్తింపుకి ఒక ఆధారంగా, 'అలైన్ సూపియట్', ఆయన సహచరులు ప్రతిపాదించినట్లుగా, కార్మికులు నిర్వహించే వేతనం లేని శ్రమను ఉపకార స్వభావంగా పరిగణించాలి. ఒక కార్యకలాపాన్ని ఉపకారంగా నిర్వహిస్తే దాన్ని కూడా ఒక పనిగా గుర్తించాలని సూపియట్ సూత్రీకరించారు. ఇలాంటి భావయుక్తమైన దృక్పథం భారతీయ పరిస్థితులకు ఎంతో అనువైంది. ఏది ఏమైనా, అలాంటి కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించడానికి వారికి ఎలా గుర్తించాలన్నది ఒక విధానపరమైన సవాలుగా ఉంటుంది.

**అసంఘటిత శ్రమ మరియు వేతనం చెల్లింపు సమస్య!**

అసంఘటిత ఆర్థిక కార్యాకలాపాల్ని, ఆర్థికేతర కార్యకలాపాలను ఒక పనిగా మనం గుర్తించినా, గుర్తించకపోయినా సైద్ధాంతికంగా అది ఒక అనివార్యమైన శ్రమగానే ఉన్నందున అది ఒక రాజకీయ సవాలుగా ఉంటుంది. భావనాత్మకంగా ఈ రెండు రకాల శ్రమలు సాంఘికంగా విలువైనవే! ఏది ఏమైనా, సామాజికంగా విలువైన పనిని, సామాజిక ఉత్పత్తి లేదా ఆర్థికోత్పత్తిని ఒకే గాటన కట్టకుండా మనం జాగ్రత్త వహించాలి. వేతనం లేని అసంఘటిత శ్రమ రకాలను గుర్తించే సైద్ధాంతిక సవాలును పరిష్కరించిన పిదప, ఆచరణలో ఈ పనులను గుర్తించడానికి అనేక ప్రతిపాదనలు మనముందుకు వస్తాయి. శ్రద్ధ వహించే పనులు, గృహ సంబంధమైన పనులు మొదలు కొని అనేకానేక కుటుంబాలకు వాటి ఆర్థిక లేదా ఉపాధి హోదాతో నిమిత్తం లేకుండా వర్గీకరణకు పలు ప్రతిపాదనలు తెరపైకి వస్తాయి.

ఏది ఏమైనా, వేతనం లేని అసంఘటిత శ్రమను గుర్తించడానికి ధన రూపేణా లేకపోతే ఆర్థిక తోడ్పాటు ఆధారంగా ఉండాల్సిన పని లేదని వాదించడానికి కారణముంది. వేతనం లేని అసంఘటిత శ్రమను గుర్తించడానికి ఆచరణాత్మకమైన ధనానికి సంబంధం లేని దారులున్నాయి. వివిధ రకాలైన అసంఘటిత పనులను గుర్తించడానికి కార్మికుల అనుభవాలను, ఆశలను పరిగణనలోకి తీసుకోవడం ద్వారా విధానపరంగా పనిచేసే యంత్రాంగాలను రూపొందించడం సాధ్యం అవుతుంది. కార్మికుల స్వీయానుభవాల ఆధారంగా వారు చేపట్టే పని యొక్క స్వభావం సవాళ్లను గుర్తించడం సాధ్యం అవుతుంది. మరోవైపు

*తరువాయి 27వ పేజీలో...*

# సమాచార ఆర్థిక వ్యవస్థలో అసంఘటిత కార్మికవర్గం : భారతదేశంలోని కాల్‌సెంటర్లలో ఉద్యోగ అభద్రత

అసంఘటిత (ఇన్‌ఫార్మల్) రంగంలో ఉపాధిని అవకాశాలను కార్మికుల అభద్రతలు చిన్నవిగా, దుర్బలతతో కూడినవిగా వర్గీకరించారు. ఈ వృత్తులలోని అస్థిరమైన పరిస్థితులు ఇలా ఉన్నాయి. తక్కువ వ్యవస్థీకృతమైన పనిప్రదేశాలు, అనియత పని కాంట్రాక్టుల ఉనికి, ఖచ్చితమైన యజమాని – ఉద్యోగి సంబంధాలు లేకపోవడం, తక్కువ వేతనాలు, పొడిగించిన పనివేళలు, ప్రమాదకరమైన పని పరిస్థితులు, పని తీవ్రత శ్రమదోపిడీ సాంఘిక భద్రత, సంరక్షణ / సంక్షేమ చర్యలు లేకపోవడం కార్మికుల సమిష్టికృషి దాదాపు లేకపోవడం, కనీస కార్మిక హక్కులు కల్పించకపోవడం. వీటిలో కొన్ని (లేదా అన్ని) వృత్తులను అసంఘటిత రంగంలో భాగంగా పరిగణిస్తారు. అట్టి పరిస్థితులు లేని (లేదా దాదాపుగా లేని) వృత్తులను సంఘటిత రంగంలోని భాగాలుగా భావిస్తారు. అయితే, అసంఘటిత (ఫార్మల్) రంగాలలోగల వృత్తులను వర్గీకరించడం కష్టమని చెప్పాలి. ఎందుకంటే, వేర్వేరు ఉద్యోగ పరిస్థితులలో గణనీయమైన వ్యత్యాసాలున్నాయి.

అసంఘటిత రంగంలోని సంస్థల జాతీయ కమిషను (ఎన్.సి.ఇ.యు.ఎస్) వివరించిన విధంగా 'క్రమబద్ధ రంగంలో అసంఘటిత ఉపాధి' అలాగే 'అసంఘటిత రంగంలో క్రమబద్ధమైన ఉపాధి ఉండేఅవకాశాముంది. సంఘటిత రంగంలో కొన్ని వృత్తులకు అసంఘటితమైన నిర్దిష్ట లక్షణాలు ఉండవచ్చు. అందుకు విపర్యయంగా కూడా ఉండవచ్చు. కాబట్టి, సంఘటిత అసంఘటిత స్థాయి స్థితిని అర్థం చేసుకోవడం ముఖ్యం. వివిధ వృత్తుల వర్గీకరణపై తుది అభిప్రాయం ఏర్పరచుకోవడానికి ఇది అవసరం. ఈ నేపథ్యంలో, దేశంలో సంఘటితంగా కనిపించే వ్యవస్థీకృత వృత్తిలో అంటే కాల్ సెంటరు పనిలో అసంఘటిత గుణాలను ఈ వ్యాసం చూపుతుంది.

ఆధునిక సేవారంగం ఉపాధిలో కాల్ సెంటరు పని ఒక వినూత్న భాగం. ప్రాధామ్యం దృష్ట్యా కాల్ సెంటర్లలోని ఉద్యోగాలు ఆర్థిక వ్యవస్థలోని సంఘటిత రంగం క్రిందికి వస్తాయి. ఎందుకంటే, వాటి పని ప్రదేశాలు వ్యవస్థీకృతమై ఉంటాయి. (తరచుగా అత్యాధునిక సౌకర్యాలు, సాంకేతిక విజ్ఞానంతో కూడిన మిరుమిట్లు గొలిపే భవనాలలో ఉంటాయి) ఈ సంస్థలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్థిష్టపరచిన కొన్ని నిబంధనల పరిధి క్రింద పనిచేస్తాయి. అంతేకాక, ఈ ఉద్యోగాలు సాధారణంగా మెరుగైన వేతనం, ఇతర భత్యాలు, పరిహార ప్యాకేజీలు అందచేస్తాయి. కాగా, వీటి పని ప్రదేశాలు సరళంగాను, అనువైనవిగాను, సాధికారతతోను కూడినవిగాను ఉంటాయి. అయితే, అనుభవ పూర్వక అధ్యయనాల ఆధారంగా మరింత లోతుగా విశ్లేషించినపుడు, పనిలో దాగివున్న అభద్రతాభావం, ఉద్యోగుల అనియత స్థితి వ్యక్తమవుతుంది. దేశంలోని పొరుగు సేవల (అవుట్‌సోర్సింగు) రంగం, కాల్‌సెంటరు పని వ్యాప్తి, పరిణామం, మార్పుల వివరాలను, స్థితిగతులను ఈ వ్యాసం తదుపరి భాగంలో మరింత విస్తృతంగా వివరిస్తుంది.

### దేశంలో పొరుగు సేవలు (అవుట్ సోర్సింగు) ఆవిర్భావం, దాని అభివృద్ధి క్రమ పరిణామం

బిజినెస్ ప్రాసెస్ అవుట్ సోర్సింగు (బిపిఓ) అనేదే కాల్ సెంటరు ముఖ్య ఉద్దేశ్యం. ఈ తరహా కార్యవ్యవస్థలో, ప్రధాన సంస్థకు చెందిన కీలకమైనవికాని కొన్నిపనులను, ముఖ్యంగా శ్రామిక వ్యయం తగ్గించడానికి గాను ముందుగానే గుర్తించిన కొన్ని అనుబంధ సంస్థలకు

**బాబు పి. రమేష్,** అసోసియేట్ ప్రొఫెసర్, ఇగ్నో, న్యూఢిల్లీ .

అప్పగిస్తారు వాస్తవానికి, ఈ పొరుగుసేవల పద్ధతి కొత్తదేమీకాదు. చాలా కాలంగా ప్రపంచ మంతటా ఈ విధానం అమలులో ఉన్నది. అయినప్పటికీ అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలలో తీవ్రమైన వ్యాపార పోటీ దృష్ట్యా, 1980 దశకం చివరి నుంచి ఈ మాదిరి కార్య వ్యవస్థపై అధికంగా ఆధారపడే ఆవశ్యకత ఏర్పడింది.

ఖర్చు తగ్గించుకోవాలనే సంకల్పంతో అనేక సంస్థలు కీలకంకాని పనులను చౌకగా కార్మికులు లభ్యమయ్యే ప్రదేశాలలో ముందే గుర్తించిన అనుబంధ సంస్థలకు అప్పగించసాగారు. (ప్రధాన సంస్థ అవసరాల ప్రకారం) పొరుగుసేవల పనిని తుర్గీతిగా ఏకీకృతం చేయడంలో తక్కువ పోటీ ఉండి, సమర్థమైన సాంకేతిక సదుపాయం లభ్యంకావడం దోహదకారి అవుతుంది. సుదూర ప్రాంతాలకు కార్యప్రక్రియలను ఆవిధంగా తరలించడానికి అది హేతువైంది. ఆ ప్రకారంగా అభివృద్ధి చెందిన దేశాలలోని చిన్న పట్టణాలు గ్రామీణ ప్రాంతాలలో బిపిఓ సంస్థల మొదట ఏర్పాటయ్యాయి. నగరాలలోని వేతనాలను గ్రామీణ ప్రాంతాల వాటితో పోలిస్తే అధికంగా ఉంటున్నాయి. తక్కువ మంది పనివారి ఖర్చుతో ఎక్కువ మంది పనివారిని నియమించుకోవడానికి ప్రధాన సంస్థలు పొరుగుసేవల మార్గాలను అనుసరించసాగాయి. ప్రాశ్చాత్య దేశాలలో ఈ పొరుగు సేవల దశను దేశీయ రంగం పొరుగు సేవల దశగా పరిగణించవచ్చు. ఎందుకంటే, కార్యప్రక్రియలను / ఉద్యోగాలను ఆదేశ సరిహద్దుల లోపలే తరలించేవారు.

అలాగే 1990 దశకం మధ్యకాలం నాటికి, పాశ్చాత్య దేశాలలో పొరుగు సేవల విధానం రెండవ దశకు చేరింది భారతదేశం, ఫిలిపీన్స్ వంటి మరింత చౌకగా శ్రామికవర్గం లభించే దేశాలకు కార్యప్రక్రియలను తరలించసాగారు. ఉద్యోగాలను స్వీకరించే దేశాలలోని పెక్కు పరిస్థితులు ఉత్పత్తి విధానాలను విదేశాలకు తరలించేందుకు వీలు కల్పించాయి. అవేవంటే – సమాచార, కమ్యూనికేషను సాంకేతిక విజ్ఞానంలో సాధించిన పురోగతి ద్వారా చేకూరే నూతన అవకాశాలు, ప్రయోజనకరమైన పని సమయాలు, చౌకైన, నైపుణ్యంగల పనివారు అధిక సంఖ్యలో లభ్యంకావడం మొదలైనవి.

ఆ విధంగా 1990 దశకం మధ్యకాలం నుంచి, భారతదేశంలో ముఖ్యంగా, సమాచార సాంకేతికతా రంగంలోను, ఇంకా దీని ఆధారిత సేవలు, బిపిఓ రంగంలోను నూతన ఉపాధి మార్గాలకు రూపకల్పన జరిగింది. మన దేశం ప్రపంచస్థాయిలో పొరుగుసేవల పరిశ్రమలో ప్రధాన పాత్ర వహిస్తున్నది. మన దేశ ఆర్థిక వ్యవస్థలో సత్వరాభివృద్ధి చెందుతున్న రంగాలలో ఐటి, ఐటి ఇఎస్ / బిపిఓ ఒకటి. మన దేశంలో జాతీయ సాఫ్ట్‌వేర్ & సర్వీసెస్ కంపెనీస్ అసోసియేషన్ (నాస్‌కామ్) అనేది ఐటి పొరుగు సేవల పరిశ్రమలో ప్రముఖ సంఘం. ఈ నాస్‌కామ్ అంచనాల ప్రకారం, బిపిఓలో ఈ రంగం వాటా 1998లో 1.2శాతం నుండి 2012 నాటికి సుమారు 7.5శాతానికి పెరిగింది. 2013-14 ఎకనామిక్ సర్వే నివేదిక ప్రకారం, మొత్తం ప్రపంచ పొరుగు సేవల మార్కెట్ (ఇంజనీరింగు సేవలు, పరిశోధన,అభివృద్ధి మినహా) భారతదేశం వాటా 2012లో 52శాతంతో పోలిస్తే, 2013లో 55శాతానికి చేరింది.

ఈ సర్వే ప్రకారం 2013-14లో, ఐటి బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ (బిపిఎం) రంగం (హార్డ్‌వేర్ మినహా) 10.3 శాతం మేర 105 బిలియన్ అమెరికా డాలర్లకు పెరిగిందని అంచనా. ఐటి ఐటిఇఎస్ రంగం రాబడులు 2011-12లో 100 బిలియన్ అమెరికా డాలర్ల నుంచి 2020 నాటికి 300 బిలియన్ అమెరికన్ డాలర్లకు , అలాగే, ఎగుమతులు 2011-12లో 69 బిలియన్ అమెరికా డాలర్ల నుంచి 2020 నాటికి 200 బిలియన్ అమెరికా డాలర్లకు పెరుగుతాయని జాతీయ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విధానం భావిస్తున్నది. ఉపాధి విషయంలో కూడా ఈ రంగం నిర్వహణ ఎంతో మెరుగుగా ఉన్నది. 2013 -14లో సుమారు 3.1 మిలియన్ కార్మికులకు నేరుగా ఉపాధిని కల్పిస్తున్నది. అంతేకాక మరో 10 మిలియన్ల మందికి పరోక్షంగా ఉపాధినిస్తున్నది.

మన దేశంలో ఐటి, ఐటిఇఎస్ / బిపిఓ రంగం వికాసాన్ని రెండు దశలుగా విభజించవచ్చు. మొదటి దశ 1990 దశకం మధ్యకాలం నుంచి దాదాపు 2005 వరకు ఉంటుంది. ఆ దశలో ప్రధానంగా ఈ రంగంలోని అంతర్జాతీయ కంపెనీలలో ఉపాధి అవకాశాలు లభించాయి. ఈ దశలో, ఉద్యోగులను అంతర్జాతీయంగా అవుట్‌సోర్సింగ్ చేసుకున్న బిజినెస్ ప్రాసెస్‌లలో నియమించుకున్నారు. ఈ దశ అనంతరం, ఇటీవలి కాలంలో (2005 లగాయతు) దేశీయ ఆర్థిక వ్యవస్థ లోనే వీటి ఉపాధి క్రమేపీ విస్తరించింది.

2009 నాటికి, దేశీయ రంగంలో సుమారు 4 లక్షల 50 వేల మందికి ఉపాధి లభించింది. ఈ దేశీయ రంగంలో ఉపాధి అవకాశాలు క్రమేపి పెరుగుతున్నాయని మొత్తంమీద వృద్ధి ధోరణులు సూచిస్తున్నాయి. నాస్‌కామ్ అంచనాల ప్రకారం, దేశీయ ఐటి, బిపిఓ మార్కెట్ 2012లో 20.7శాతం గణనీయమైన రేటు చొప్పున పెరుగుతున్నది.

**కాల్ సెంటరు పని భావన**

మన దేశంలోని ఐటి, ఐటిఇఎస్ /బిపిఓ రంగానికి చెందిన అతిముఖ్యమైన విభాగం కాల్ సెంటర్లు. అయితే, ఈ రంగంలో ఇతర పనులు, వృత్తులు కూడా చాలా చేరివున్నాయి. అవేవంటే – హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ రూపకల్పన మెడికల్ ట్రాన్స్‌క్రిప్షన్లు, వర్డ్ ప్రాసెసింగు, డెస్క్‌టాప్ ప్రింటింగు, న్యాయ, ఆర్థిక వ్యవహారాల ప్రాసెసు

అవుట్‌సోర్సింగు, బ్యాక్ ఆఫీసు ఆపరేషన్లు, డిజైన్లు, గ్రాఫిక్స్ తయారీ మొదలైనవి. కాల్ సెంటర్ల ప్రాముఖ్యత జిడిపిలో భాగంగా ఉండడమే కాకుండా, ఈ సంస్థలు సమకూర్చిన అధిక ఉపాధి అవకాశాల రూపంలో కూడా వ్యక్తమవుతున్నది.

కాల్ సెంటర్ల ముఖ్యమైన పనిలో టెలీ సేల్స్ / మార్కెటింగ్ వినియోగదారుల సేవా / సంప్రదింపుల కార్యకలాపాలలో భాగంగా దేశం వెలుపలికి వెళ్లే, దేశంలోకి వచ్చే ఫోన్‌కాల్స్‌ను నిర్వహించే ప్రక్రియ చేరి ఉంటుంది. ఇవేకాకుండా, కొన్ని కాల్‌సెంటర్లు బ్యాక్ ఆఫీసు సేవలు (బిల్లింగు, వేతనాల పని వగైరా), ఇతర క్లయింటు మద్దతు సేవలు (ఉదాహరణకు, డాటా సంకలనం) వంటి వాటిని కూడా నిర్వహిస్తుంటాయి. ప్రపంచ వ్యాప్తంగాను, భారతదేశంలోను కూడా కాల్ సెంటర్లు చాలా వరకు వాయిస్ ఆధారిత పనిలో నిమగ్నమై ఉంటాయి. నాన్ వాయిస్ ఆధారిత కాల్ సెంటర్లుకూడా ఉన్నాయి. అవి ఇంటర్‌నెట్ ఆధారిత పనులు (ఇంకా ఈ మెయిల్ కమ్యూనికేషన్లు) నిర్వహిస్తుంటాయి.

కక్షిదార్ల స్థావరం ఆధారంగా మన దేశంలోని కాల్ సెంటర్లను రెండు రకాలుగా విభజించవచ్చు. ఒకటి స్వంత కాల్ సెంటర్లు, రెండవది స్వంతంకాని (లేదా మూడవ కక్షిదారు) కాల్ సెంటర్లు. స్వంత కాల్ సెంటర్లు కేవలం ఏకైక కక్షిదారు పని అవసరాలనే తీరుస్తుంటాయి. మన దేశంలో అన్ని ప్రముఖ కాల్ సెంటర్లు స్వంతకాల్ సెంటర్లుగానే ఉన్నాయి. కాగా, వీటిలోని చాలా సంస్థలు వేర్వేరు కక్షిదార్ల కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి. పనిని, పని బృందాలను ప్రక్రియల వారీగా ఏర్పాటు చేస్తారు. ఆ ప్రకారంగా, బహుళ ప్రక్రియలు (వివిధ బృందాలు), ఒకే కాల్ సెంటర్లలో కలిసి పనిచేయగలుగుతాయి. (ఇది మూడవ కక్షిదారు సెంటర్ల విషయంలో ప్రత్యేకంగా వర్తిస్తుంది.)

కాల్ సెంటర్లు ఒకే రీతిగా ఉంటాయని భావించకూడదు. ఎందుచేతనంటే, కాల్‌సెంటర్లలో సంస్థ పరిమాణం, స్వభావం, ప్రమేయమున్న ప్రక్రియలు, పనిచేసే సమయం, పరిహార ప్యాకేజీలు, పని పరిస్థితులు, కార్మిక సాంఘిక, ఆర్థిక స్థితిగతులు వంటి అంశాలలో గణనీయమైన వ్యత్యాసాలు ఉన్నాయి.

**అంతర్జాతీయ, దేశీయ కాల్ సెంటర్లు**

ఐటి, ఐటిఇఎస్ /బిపిఓ రంగం మాదిరే మన దేశంలో కాల్‌సెంటర్ల స్థాపన, విస్తరణ కూడా రెండు దశలలోజరిగింది. మొదటి దశ 1990 దశకం మధ్యకాలంలో ప్రారంభించి శీఘ్రగతిని వ్యాప్తి చెందింది. ఆదశలో, తాత్కాలిక కాల్ సెంటర్లు ఆవిర్భవించి, విస్తరించాయి. ఈదశలో మన దేశంలోని దాదాపు అన్ని కాల్ సెంటర్లు అంతర్జాతీయ పొరుగుసేవల సేవారంగం పనినే నిర్వహించాయి. వీటిలో వాయిస్ ఆధారిత, నాన్ వాయిస్ ఆధారిత కమ్యూనికేషను మాధ్యమం ప్రధానంగా ఇంగ్లాషుగా ఉండేది. కాని, ప్రస్తుత దశ దాదాపు 21వ శతాబ్దం మొదటి దశకం మధ్యకాలంలో ప్రారంభమైంది. ఈ దశలో దేశీయ కాల్ సెంటర్లు బాగా వృద్ధిచెంది, విస్తరించాయి. ఈ కాల్ సెంటర్ల లోని ఉద్యోగులు ప్రాథమికంగా దేశంలోపలగల వినియోగదారుల అవసరాలు తీరుస్తున్నారు. స్థానిక వినియోగదార్ల ఆవశ్యకతల ప్రకారం ఈ సెంటర్లలో కమ్యూనికేషన్ మాధ్యమం మారుతూ వచ్చింది. వేర్వేరు స్థాయిలలో విభిన్న రీతులలో ఇంగ్లీషు, హిందీ లేదా ప్రాంతీయ భాషలను ఉపయోగించారు.

అంతర్జాతీయ, దేశీయ కాల్ సెంటర్ల మధ్య వ్యత్యాసం, ఆయా సంస్థల భాషాపరమైన అంశాలలోనే కాక, అనేక ఇతర విషయాలలో కూడా కానవస్తుంది. ఉదాహరణకు, అంతర్జాతీతయ కాల్‌సెంటర్లలోని సిబ్బంది దేశీయ కాల్‌సెంటర్లలోని ఉద్యోగులలతో పోలిస్తే ఎంతో విద్యావంతులై, ఆర్థికంగా స్థోమతగల వారై ఉంటారు. మొదటి వర్గంలోని ఉద్యోగులు పట్టణాలలోని సంపన్న వర్గానికి (సాంఘికంగా ధనిక వర్గాలుకు) చెందినవారై ఉంటారు. కాగా, దేశీయ కాల్ సెంటర్లలోని అధిక భాగం సిబ్బంది గ్రామీణ ప్రాంతాలకు చెందినవారై ఉంటారు. వీరు ఆర్థికంగా, సామాజికపరంగా వెనుకబడిన స్థితిలో ఉన్నారు. వీరి విద్యాపరమైన, నైపుణ్యపరమైన స్థాయిలు కూడా సాపేక్షంగా తక్కువగా ఉన్నాయి. అంతర్జాతీయ, దేశీయ కాల్‌సెంటర్లలోని పని స్వభావం, సిబ్బంది వ్యక్తిత్వం మధ్య అట్టి ప్రబలమైన అసమానతలు ఉన్నాయి. కాబట్టి, ఈ రంగాలలో పనితీరు, ఉద్యోగ అభద్రతల గురించి చర్చించడం ఎంతయినా సముచితం.

**అంతర్జాతీయ కాల్‌సెంటర్లలో అభద్రతా ఉపాధి, ఉద్యోగవర్గం**

మనదేశంలో కాల్‌సెంటర్లు విస్తరించే తొలి దశలో పెక్కు మార్గదర్శక అధ్యయనాలను చేపట్టారు. ఈ రంగంలో ఉపాధి భద్రత మెరుగైన స్థితిలో లేదని వాటిలో వెల్లడైంది. (దేశీయ వ్యవస్థలో ఇతర రంగాలతోపోలిస్తే) అధిక వేతనాలు, ఆకర్షణీయమైన పని పరిసరాలు అధికంగా ఉండేవి. అయినప్పటికీ, ఈ రంగంలో ఉద్యోగ భద్రత క్కువ. ఉపాధి విధానాల ప్రతికూల ప్రభావాలు, తగినంతగాలేని సాంఘిక భద్రతాచర్యలు, కఠినమైన నియంత్రణ యంత్రాంగం గల ధృడమైన పని వ్యవస్థ, భవిష్యత్తు / నైపుణ్యం మెరుగుదలకు నామమాత్రపు అవకాశాలు, కార్మికుల సమిష్టికృషి లేకపోవడం, సామాజిక సంప్రదింపుల యంత్రాంగాల కొరత మొదలైనవి చోటు చేసుకున్నాయని ఈ అధ్యయనాలు సమకూర్చిన సవివరమైన విశ్లేషణ నిర్ధారించింది.

ఈ రంగంలో ఉద్యోగ అభద్రత చాలా తీవ్రంగా ఉంది. అంతర్జాతీయంగా బిపిఓ ద్వారా ఒనగూరిన ఒప్పందం / ప్రాజెక్ట ఆధారిత నియమిత కార్యాలపైనే అవి అధజకంగా ఆధారపడడమే ఇందుకు కారణం. ఈ వ్యవస్థలో ఉపాధిని ఒనగూర్చుకున్నారే తప్ప,

వాస్తవంగా దానిని కల్పించలేకపోయారు. ఉద్యోగంలో స్థిరత్వం, తత్సంబంధిత భద్రతలు అనేవి ఈ రంగంలో లోపించినవిగా పరిగణించారు.

విశ్వవ్యాప్త ఉత్పత్తి సంస్థల డిమాండునుబట్టి ఖర్చు తగ్గించుకునేందుకు వాటి విధానాలకు ఈ రంగంలోని సంస్థలు కట్టుబడి ఉన్నాయి. తత్ఫలితంగా అవి పనిని, సిబ్బందిని హేతుబద్ధీకరించే నిమిత్తం కట్టుదిట్టమైన చర్యలను పాటించాయి. ఇందుకోసం కఠినమైన మిత వ్యయం విధానాలను పర్యవేక్షణ, నియంత్రణను ఇవి అనుసరించాయి. ఈ మిత వ్యవయం కోసం ఖచ్చితమైన సూత్రాలను అధికంగా అమలు పరచడంవల్ల పనిభారం అత్యధికంగా పెరిగి, ఉద్యోగుల ఒక విధంగా సైబర్ కూలీలుగా మారేందుకు దారితీసింది. అంతేకాక, సులభంగా పాటించే వీలులేని సమయాలు. అసాధారణ నిబంధనలు (ఉదా: ప్రదేశాలను బహిరంగంగా చెప్పకపోవడం, ఉద్యోగులు మారుపేర్లు పెట్టుకోవాల్సి రావడం) కక్షిదారు లక్ష్యంగా గల ఈ రంగంలో ఎక్కువగా అనుసరించారు. అందువల్ల, ఉద్యోగులు సామాజికంగా వెలివేయబడి, అర్థరహిత పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చింది.

సంఘంగా ఏర్పడేందుకు నిర్బంధాలు, ప్రాతినిధ్యం / భావ వ్యక్తీకరణ లేకపోవడం వంటి రూపంలో ఉద్యోగులు ప్రాథమిక హక్కులను కోల్పోతున్నారు. జాగ్రత్తగా రూపొందించిన యాజమాన్య వ్యూహాల ద్వారా ఉద్యోగులు వ్యక్తులుగా వ్యవహరించవలసిన పరిస్థితి ఏర్పడింది. వారి సామాజికీకరణను యాజమాన్యం నిర్దిష్టపరచిన నిర్ణీత పరిమితులు ప్రకారం రూపొందించింది. యాజమాన్యం కట్టుదిట్టమైన పర్యవేక్షణ చర్యలు చేపట్టింది. మానవ వనరుల నిర్వహణ పరిస్థితులు భిన్నంగా రూపొందాయి. తత్ఫలితంగా ఉద్యోగులు కార్మిక సంఘాలు /బృందాలుగా ఏర్పడటానికి వీలుకలుగలేదు.

మొత్తం మీద, మనదేశంలో కాల్‌సెంటర్లు ఆవిర్భవించిన మొదటి దశలో (అంటే 1990 దశకం మధ్యకాలం నుంచి 2005 వరకు), విశ్వవ్యాప్తంగా పొరుగుసేవలు వినియోగించుకుంటున్నపుడు ఎలాంటి చిక్కులు ఎదుర్కోవాలో తెలుసుకోవడంపై పరిశోధనలు దృష్టి సారించాయి. ఆ ప్రకారం ఆధునిక ఉద్యోగాలు అంతర్గత అభద్రతలకు, చిక్కులు ఏర్పడే పరిస్థితికి, సరైన ఉద్యోగ స్థితి రాహిత్యానికి గురి అవుతున్నట్లు వెల్లడైంది.

**దేశీయ కాల్ సెంటర్లలో ప్రబలమైన అభద్రత**

మన దేశంలో పొరుగుసేవల విప్లవంలో రెండవ / ప్రస్తుత దశలో ఉద్యోగ నాణ్యత మరింత దిగజారింది. ఈదశలో దేశీయ రంగం లోని సంస్థలకు ఉపాధి అవకాశాలు గణనీయంగా మెరుగుపడ్డాయి.

దేశీయ కాల్‌సెంటర్లపై మార్గసూచిగా ఉపకరించే అధ్యయనం జరిపారు. ఆ అధ్యయనం, దేశీయ కాల్‌సెంటర్లు, ఉద్యోగులు, పని నిర్వహణ, పని నిబంధనలు, ఉద్యోగుల సంబంధాలు మొదలైన వాటి విషయంలో అంతర్జాతీయ కాల్‌సెంటర్లతో పోలిస్తే గణనీయమైన వ్యత్యాసం ఉంటుందని తేలింది. పని సమయం, వినియోగదార్ల అవసరాలలో ఎన్నో తేడాలు చోటు చేసుకున్నాయి. దేశీయ రంగంలో పనితీరు వల్ల తీవ్ర ఉద్యోగ అభద్రత, నచ్చని పని పరిస్థితులు కనబడుతున్నాయి. తక్కువ వేతన ప్యాకేజీలు, అననుకూల నిబంధనలు, తక్కువ స్థాయి నైపుణ్య ఆవశ్యకతలు, కఠినమైన నియంత్రణా విధానాలు దేశీయ రంగంలో కానవస్తాయి.

అంతర్జాతీయ కాల్‌సెంటర్లకు భిన్నంగా దేశీయ రంగంలోని పెక్కు సంస్థలు నామమాత్రపు మౌలిక సదుపాయాలు, స్వల్ప సాంకేతిక పరిజ్ఞానం, పని ప్రదేశాలలో తక్కువ సౌకర్యాలతో పనిచేస్తున్నాయి. ఇరుకైన పనిప్రదేశాలు, పని తీరును పర్యవేక్షించడానికి సంప్రదాయక పర్యవేక్షక సిబ్బందితో అట్టికేంద్రాలు అసంఘటిత రంగంలో మామూలు కర్మాగారాలుగా గోచరిస్తున్నాయి. ఇక్కడ ఉద్యోగులు కట్టుదిట్టమైన నియంత్రణలు, సుదీర్ఘమైన పనివేళలు, నిరంకుశ యాజమాన్య పద్ధతులకు గురవుతున్నారు. ఈ కేంద్రాలలో శ్రమదోపిడీకి అంతు లేకుండా పోయింది. ఎందుకంటే, ప్రత్యేకించి ఈ సంస్థలలో ఉద్యోగుల సమిష్టిభావన కొరవడడమే ఇందుకు కారణం. నైపుణ్య పెంపుదలకు అవకాశాలు తక్కువ. పనుల నాణ్యత లోనూ స్థాయి తక్కువే. ఉద్యోగ అభద్రత అధికంగా ఉంటోంది. అంతేకాక, సాంఘిక భద్రత, కార్మిక సంక్షేమ చర్యలు చాలా తక్కువ స్థాయిలోనే ఉండడమే మరో అంశం.

మరో అధ్యయనంలో కనుగొన్న విషయాలు కూడా వీటినే పునరుద్ఘాటిస్తున్నాయి. దీనిని బట్టి, ఐటి, ఐటిఇఎస్, బిపిఓ రంగంలోని దేశీయ సంస్థలలో ఉపాధి నాణ్యతను అంతర్జాతీయ సంస్థలతో పోలిస్తే సంతృప్తి కరంగా లేదని విశదమవుతున్నది.

**ముగింపు**

కాల్‌సెంటర్లలో (వ్యవస్థీకృత పని ప్రదేశాలు, క్రమబద్ధ పరిమితులు, పనిలో సాపేక్షంగా ఖచ్చితమైన నియమ నిబంధనలు మున్నగు వాటి దృష్ట్యా) ఉపాధి నియత పద్ధతిలో ఉన్నట్టు పైకి కనబడుతున్నది. అయితే, ఈ కేంద్రాలలో పనిని అనియత రంగంలోని పనిమాదిరిగా పరిగణించవలసిన అనేక ఇతర అంశాలు ఉన్నాయి. ఉద్యోగ అభద్రతల స్థితిని పరిష్కరించి నివారించడం ఎంతో కీలకం. ఈ కాల్ సెంటర్‌లో ఉపాధి అనుకూల పరిస్థితిని, ఉద్యోగుల సంక్షేమాన్ని పటిష్ఠపరచే కార్యక్రమాలు, విధానాలు, న్యాయ / క్రమబద్ధ చర్యలను రూపొందించి, అమలు పరచడం ఎంతో అవసరం. సమాచార ఆర్థిక వ్యవస్థలో ఎన్నో ఇతర ప్రమాణాలు లేని / ప్రత్యేక వృత్తులలో చోటు చేసుకున్న అభద్రలను సరైన రీతిలో విశ్లేషించి, అర్థంచేసుకునే అవసరముందని కూడా ఈ వ్యాసంలోని చర్య సూచిస్తున్నది. ■

# అసంఘటిత రంగం - అవగాహన

అసంఘటిత రంగమనగానే నైపుణ్యంలేనివారు, లేదా పరిమిత నైపుణ్యంగల వారి రంగమనే సాధారణ:గా భావిస్తారు. అసంఘటిత కార్మిక రంగంలో అధికభాగం నైపుణ్యరహితులేనని ది నేషనల్ కమిషన్ ఆన్ ఎంటర్‌ప్రైజెస్ ఇన్ ది అనార్గనైజేడ్ సెక్టార్ (ఎన్‌సిఇయుఎస్) పేర్కొంది. ఈ అభిప్రాయానికి రావడానికి రెండు వాస్తవ కారణాలు, ఒకటి, అసంఘటిత రంగంలోని కార్మికుల అతిస్వల్పస్థాయి విద్య, శిక్షణలు, రెండు : తక్కువ వేతనాలు తక్కువ ఉత్పాదకత. ఈ వ్యాసంలో ఈ రెండింటిన్ని ప్రధానంగా చర్చిద్దాం!

ప్రపంచ బ్యాంకు, వరల్డ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్ వంటి ప్రముఖ సంస్థలు ఇటీవల, స్వాభావిక విజ్ఞానం, సంప్రదాయ విజ్ఞానాలపై లోతైన అధ్యయనాలు జరిపి విజ్ఞాన మూలాలు, విజ్ఞాన ఉత్పత్తి వ్యాప్తి అనేవి, ఆధునిక విజ్ఞానంకంటే భిన్నమైనవని తేల్చాయి.

జీవ వైవిధ్య విజ్ఞానం వ్యవసాయ నవీకరణ, పర్యావరణం ఔషధాలు, కళాకృతులు వగైరాలను విశ్లేషిస్తూ అనేకమైన గ్రంథాలు వచ్చాయి. అయితే, సంప్రదాయ విజ్ఞానం స్వాభావిక విజ్ఞానం (టికె / ఐకె)ల సమాహారం పూర్తిగా వ్యవస్థీకరింపబడలేదు. బహుశ ఈ అసంఘటిత కార్మికవర్గం, వ్యవసాయం, చేతివృత్తులలోనే కాక వివిధ రకాలైన ఆహారోత్పత్తులు, వస్త్ర పరిశ్రమ, గార్మెంట్స్, ప్లాస్టిక్స్ లోహాలు, యంత్ర పరికరాలు, నిర్మాణరంగం, సేవారంగం, ఇత్యాదులలో వ్యాపించి ఉండడంచేత, తరచు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించడం వలన సంప్రదాయ పరిశ్రమ అనే వ్యవహారం మరుగునపడి పోతూండవచ్చు. నేషనల్ నాలెడ్జి కమిషన్ పేర్కొన్నట్లుగా మన దేశాన్ని విజ్ఞాన సమాజంగా మార్చాలనుకుంటే దేశంలోని అధిక సంఖ్యాకుల చేత ఉపయోగించబడుతున్న ఈ సాధారణ పరిజ్ఞానాన్ని గుర్తించి అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

**వేతనాలు, ఉత్పాదకత, నైపుణ్యాల మధ్య సంబంధాలు తీరుతెన్నులు**

అసంఘటిత రంగంలో విస్తృతంగా ఉన్న అత్యల్ప వేతనాలు, తక్కువస్థాయి ఉత్పాదకత, నైపుణ్యాల కొరతను ప్రతిబింబిస్తాయి. నిజానికి ఈ మూడింటి మధ్య ఉన్న సంబంధం సంక్లిష్టమైనది. ఇది ఆయా వ్యవస్థల, నిర్మాణతలనెనుసరించి నిర్ధారింపబడుతుంది. సంఘటిత రంగాల నుంచి అశేష కార్మిక వర్గాన్ని తొలగించడం వలన, వారు స్వంత వ్యాపారాలు పెట్టుకోవడం, దరిమిలా చిన్న వాణిజ్య రంగంలో అవాంఛితమైన పోటీ ఏర్పడడం జరుగుతుంది. నియత – అనియత ఆదాయాల మధ్య వ్యత్యాసం, నిర్మాణ స్థాయి, ఉత్పత్తుల మధ్య పోటీ, పెట్టుబడి కార్మికుల నిష్పత్తి ఇత్యాదులపై పరిశోధనలను కేంద్రీకరించవలసి ఉంది.

అంతేకాక, కార్మికుని శ్రమ విలువ అనేది ఆయా ఉత్పత్తికి మార్కెట్‌లో ఉన్న విలువ మీద ఆధారపడి ఉంటుంది. ఆయా ఉత్పత్తులకు మార్కెట్‌లో ఉండే విపరీతమైన పోటీ వలన మార్కెట్ విలువ తగ్గిపోతోంది. అనగా మార్కెట్‌లో పోటీని ఎదుర్కొంటున్న కంపెనీలు, మార్కెట్‌లో శక్తివంతమైన కంపెనీలకంటే తక్కువ ఉత్పాదకత ఉన్నవిగా నిలుస్తున్నాయి.

ఇక్కడ మరొక అత్యావశ్యక హేతువు ఏమిటంటే, ఎక్కడైతే అవసరాన్ని మించిన శ్రామికులున్నారో అక్కడ అధిక వేతనాలు రాబట్టే అవకాశం ఉండదు. ఉత్పాదకతలో వృద్ధి ఆయా పారిశ్రామిక వేత్తలకు అధిక లాభాలు తెచ్చిపెడుతుంది లేదా పోటీని ఎదుర్కోవలసి వస్తే ధరలను తగ్గించి వినియోగదారులకు చేరువ అవుతారు అంతేటాని కార్మికులకు కాదు. ఉదాహరణకు, వారణాసిలోని, చేనేత మగ్గాలకంటే మరమగ్గాలు పదిరెట్లు అధికంగా ఉత్పత్తి చేస్తాయి. కాని రెండింటిలోనూ కార్మికుల వేతనాలు ఇంచుమించు సమానమే.

**ఏది సరైన పరిజ్ఞానంగా పరిగణింపబడుతుంది**

పైన పేర్కొన్నట్లుగా అసంఘటిత రంగ కార్మికులను నైపుణ్యరహిత కార్మికులుగా పరిగణించడం ఆర్థిక స్థితులను అనుసరించి కాదు. ఉదాహరణకు, అవసరాన్ని మించి, అనియతరంగాలలో పనిచేస్తున్న మహిళలు, నిమ్నజాతి కార్మికులు సంప్రదాయ పరంగా వేతనాలు తక్కువ పొందుతారు. ఎన్‌సిఇయుఎస్ పేర్కొన్నట్లు, సంవత్సరాల కొలది అనియత శిక్షణ ప్రత్యేకమైన పాటవాలు కలిగిన మహిళలు అల్పనైపుణ్యం గలిగినవారుగానే నిర్ణయింపబడతారు. టెక్స్‌టైల్,

**అమిత్ బసోలె,** అసిస్టెంట్ ప్రొఫెసర్, యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్, బోస్టన్. e-mail : abasole@gmail.com

సిరామిక్ రంగాలలోని మహిళా కార్మికులు నైపుణ్యం కలిగిన విధులు (ఎంబ్రాయిడరీ, బంకమట్టిని తయారు చేయటం) నిర్వహిస్తున్నప్పటికీ, వారు అత్యల్ప వేతనాలే పొందుతున్నారు. వారణాసిలోని మహిళా ఎంబ్రాయిడరీ కార్మికులు రోజంతా పనిచేసి అత్యల్పంగా రూ. 25–30లు మాత్రమే వేతనంగా పొందుతున్నారని ఒక అధ్యయనం . ఈ వేతనాలు సమంజసమైనవేనని ఆయా వ్యాపారస్తులు సమర్థించుకుంటున్నారు. ఆయా మహిళా కార్మికులు తమకు సహజంగా ఉండే నైపుణ్యం ఆ పనికి చాలని, తమ విరామసమయంలో మాత్రమే చేస్తున్న ఆ పనికి ఆ వేతనం సరిపోతుందని సరిపెట్టుకొంటున్నారు.

అసంఘటిత ఆర్థిక వ్యవస్థకు పరిజ్ఞాన సంబంధ ఆధారాలను గుర్తించే అధికారిక సర్వేలు అసమగ్రాలు, ఎందుకంటే ఆ సర్వేలు సాధారణ పరిజ్ఞానాన్ని గ్రహించేవిగా రూపొందించబడలేదు. 3వ మరియు 4వ అఖిల భారత చిన్న పరిశ్రమల జనాభా గణనాల సందర్భంగా ఆయా చిన్న పరిశ్రమలను తమకున్న సాంకేతిక పరిజ్ఞాన వనరులను తెలుపని కోరగా రిజిస్టరు కాని చిన్న పరిశ్రమలు అనగా అనియత లేదా అసంఘటితరంగ పరిశ్రమలు) 90 శాతం తమకు సదరు వనరులు లేవని పేర్కొన్నారు. (క్రింది టేబుల్–1). పరిశ్రమలు చిన్నవైనా, పెద్దవైనా, స్వల్పమాత్ర సాంకేతిక పరిజ్ఞానంతో నడుపబడుతూ మార్కెట్ పోకడలకనుగుణంగా, డిమాండ్‌నుబట్టి నూతన ఆవిష్కరణలు చేస్తున్నాయి. ఈ ఆవిష్కరణలకు సంప్రదాయ జ్ఞానం ఏ మేరకు ఉపయోగపడిందన్నది ఆ సర్వేలకు అందదు. అందుకు కారణం సర్వేలు అందుబాటులో ఉన్న పాతం పరిజ్ఞానాన్ని మాత్రమే పెంచేదిగా లేదు. అంతేగాక వారి ఏర్పాట్లు, సామర్థ్యం వారి అవసరాలనుబట్టి నూతన పోకడలను స్వీకరించబడంలోగల ఆసక్తి వగైరాలను మెరుగుపరిచేవిగా కూడా ఈ సర్వేలు లేవు.

**టేబుల్ –1 రిజిస్టర్డు కాని చిన్న పరిశ్రమలలో సాంకేతిక వనరుల మార్గాలు :**

| వనరు | 2001 | 2007 |
|---|---|---|
| విదేశాలు | 0.67 | 0.80 |
| స్థానిక భాగస్వామ్యం | 5.58 | 2.11 |
| స్థానిక పరిశోధన అభివృద్ధి | 4.84 | 3.22 |
| ఏదీ లేదు | 88.91 | 92.83 |

**ఆధారం :** చిన్న పరిశ్రమల మూడవ జనగణన 2000–2001, సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరగతి వాణిజ్య సంస్థల నాల్గవ జనగణన 2006–07.

ఇటీవల (2011–12) జాతీయ నమూనా సర్వే (ఎన్ఎస్.ఎస్) చేపట్టిన ఉద్యోగ – నిరుద్యోగ సర్వే ప్రకారం 15 సంవత్సరాలు దాటిన గ్రామీణ పురుషులలో 70శాతం, పట్టణ పురుషులలో 43శాతం సెకండరీ స్థాయికంటే తక్కువ విద్యార్హత ఉన్నవారే (స్త్రీలలో ఈ శాతం క్రమంగా 83శాతం, 55శాతం). వృత్తికి సంబంధించిన ఇతర నైపుణ్యాలుగాని శిక్షణగాని వీరిలో అంతంత మాత్రమే. ఉద్యోగ నిరుద్యోగ సర్వే గణాంకాల ప్రకారం కూడా 89శాతం కార్మిక గణం, ఏ విధమైన నియత లేదా అనియత సాంకేతిక శిక్షణగాని, వృత్తిపరమైన శిక్షణగాని పొందని వారే. దీని ప్రకారం మరియు ఎన్ఎస్ఎస్ గణాంకాల ప్రకారం 15 సంవత్సరాలు దాటిన వారిలో 90శాతం మందికి ఏ విధమైన నైపుణ్యాలు లేవు' అన్న నిర్ధారణకు ఎన్‌సిఈయుఎస్ వచ్చింది.

ఈ సిద్ధాంతాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఇక్కడ అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే అనియత రంగాలలోని నైపుణ్య గ్రహణ విధానాలను పరిజ్ఞానోత్పత్తినీ, సంవత్సరాల కొలది పాఠశాలల్లో చదివి, శిక్షణలు పొంది, యోగ్యతాపత్రాలు సంపాదించడంతో సమానమని అనలేము. ఇవేవీ అనియత రంగాలలో కనపడవు. జ్ఞానసముపార్జన అనేది బ్రతుకుదెరువులో అంతర్భాగం. చారిత్రకంగా, విధి విధానాలు విద్యా విషయాంకాలపై మొగ్గు ఉంటోంది. అంతేగాక కొందరు శ్రామికులు తమ పనికాలంలోనే నియత విద్యా శిక్షణలకు ధీటైన నైపుణ్యాన్ని సంతరించుకొంటారు. (అధికారిక సర్వేలకు తమ అయిష్టతను వ్యక్తం చేస్తారు.) పరిశ్రమలలోని కార్మికుడు ఎలా నైపుణ్యాన్ని సంపాదించుకొంటాడని వారణాసిలోని ఒక మిఠాయి దుకాణం యజమానిని అడగగా, అది అంత ప్రధానంశంకాదు అని జవాబుచ్చాడు. అదే సమయంలో అలాంటి పారంపర్యాలు అనావశ్యకాలు అనే వాదన కూడా ఉంది. వారణాసిలోని నేతకార్మికులు తరచు ఈ వ్యత్యాసాన్ని గుర్తించి నియత నైపుణ్యాలను ఆదరిస్తారు. తద్వారా లేబర్ మార్కెట్‌లోని డిమాండ్లకు తగినట్లుగా తమను తాము తీర్చిదిద్దుకుంటారు.

విజ్ఞాన శాస్త్ర చరిత్రలో డబ్బును ఆర్జించి పెడుతున్న వివిధ రంగాలలో పనిచేస్తున్న చోట వచ్చే వాస్తవిక పరిజ్ఞానం ఏమాత్రం తీసిపోదు. తత్త్వశాస్త్రం, విజ్ఞాన శాస్త్రం, గణితశాస్త్రం వంటి వాటి పుట్టుక చేతివృత్తుల వారి సమాజం నుండేనని విజ్ఞాన శాస్త్రం చరిత్రకారులు అంగీకరించిన విషయం, వారికి అతీతంగా అవేవీ అస్థిత్వాన్ని పొందినది లేదు. ఏ ప్రత్యేక చేతవృత్తివాడైనా తమ సమకాలీన సాంకేతిక పరిజ్ఞానంతో సంబంధం కలిగి ఉంటూ తన రంగాన్ని ముందుకు తీసుకొని వెళతాడు. పని అనేది పరిజ్ఞానికి మాతృక, పరిజ్ఞానాన్ని పనిలో ఉపయోగించినపుడే అది అర్థవంతమవుతుంది. ఆ పరిజ్ఞానానికి పనే గీటురాయి. పనిమాత్రమేకాదు, క్రీడ కూడా అధ్యయనికి పుట్టినిల్లే. ఉదాహరణకు చేనేత కుటుంబాలకు చెందిన చిన్నారులు, ఆ పనిముట్లతోనే ఆడుకుంటారు. ఆ ఆటలతో వారి పెద్దలు తమ పనిలో నిత్యం వాడే శబ్దాలనే పిల్లలుకూడా ప్రయోగిస్తారు. ఈ సిద్ధాంతం ప్రకారం అనియత లేదా అసంఘటిత రంగంలో పరిజ్ఞానోత్పత్తి బహుముఖంగా ఉంటుందని అర్థంచేసుకోవచ్చు.

**లోకవిద్యా సంస్థలు**

నియత విద్యావ్యవస్థలకంటే ఎన్రోలెట్లు అధికంగా అనియత రంగం ప్రజలకు ఆశ్రయమిచ్చి, జ్ఞానాన్ని శిక్షణను అందిస్తోంది. అయినప్పటికీ దీనికి సంబంధించిన వాఙ్మయం అతి స్వల్పం.

సంప్రదాయ వృత్తులను ఆపరిజ్ఞానాన్ని వెలికితీసి పరిరక్షించుకోవలసిన ఆవశ్యకతను ఆయా సర్వేలు ముక్తకంఠంతో ఘోషిస్తున్నప్పటికీ ఏదో కొన్ని సందర్భాలు మినహాయించితే, వర్థమాన ఆర్థిక శాస్త్రజ్ఞులు ఆరంగాన్ని స్పృశించటంలేదు. ఆనైపుణ్యాలను వెలుగులోకి తెచ్చే పని చేపట్టలేదు. అందుకు కారణం, ఆయా నైపుణ్యాలు చిందర వందర గా ఉండడం గాని, అవ్యవస్థీకృతమై ఉండడంకాని కాదు. మనసర్వే పద్ధతులు వాస్తవ పరిస్థితికి అనుగుణంగా లేవు. అనియత శిక్షణారంగాన్ని అధ్యయనం చేయడానికి ప్రధాన అవరోధం ఏమిటంటే అది సామాన్య జీవనంలో లోతుగా ఇమిడిపోయి ఉంది. ఫలానాచోట, ఫలానా సమయంలో అని ఆ శిక్షణ లేదా పరిజ్ఞానం ఉనికిని గుర్తించడానికి వీలుకాదు. ఆ శిక్షణ లేదా నేర్పు, అధ్యయనాలు సులువుగా కొలమానాలకు అందవు, లిఖిత పూర్వక ఆధారాలు లభించవు. ఫీజులుండవు, శిక్షణకు నిర్థిష్ఠ సమయాలుండవు. శిక్షకులుండరు, శిక్షకులకు పారితోషికాలుండవు. ఈ విధాన మంతా బంధుత్వం, కుటుంబ, కులం, లింగభేదం, వర్గం, వంటి ఆర్థికేతర అంశాలపైనే మనుగడ సాగిస్తుంది. సాధారణంగా ఆర్థిక వేత్తలు నిర్లక్ష్యంచేసే మానవ జాతి శాస్త్రం తో కూడిన అధ్యయనం అవసరం. అందుకే ఆ విధమైన జ్ఞానం మనకు ఆర్థిక మానవజాతి శాస్త్రం తో కూడిన అధ్యయనం అవసరం. అందుకే, మనకు మానవజాతి శాస్త్రజ్ఞుల నుంచే లభ్యమవుతుంది.

అసంఘటిత రంగానికి చెందిన విజ్ఞాన వ్యవస్థలు (నైపుణ్య సంపాదన, నూతన ఆవిష్కరణలు, సంస్థల మధ్య పరస్పరం జ్ఞానం ఇచ్చిపుచ్చుకోవడం) గుర్చి పరిశీలించినపుడు అవి అడుగంటుతున్నా యనిపిస్తే అది పొరపాటు. మొత్తంమీద తేలిన దేమిటంటే నియతరంగాలలోని శిక్షణా డిగ్రీలకు పట్టే వ్యవధి కంటే, అనియతరంగ కార్మికులు ఎక్కువ కాలం శిక్షణ పొందుతారు. ఈ రంగంలో కుటుంబ గత, కుటుంబేతర వ్యవస్థలలో ఈ శిక్షణ నెలలు నుంచి సంవత్సరాల తరబడి ఉంటుంది. ఇందుకు ఆర్థిక అడ్డంకులు తక్కువ (కులం, లింగవివక్ష వంటి ప్రతిబంధకాలు మాత్రం అధికమే). నేర్చుకోవాలనే ఆకాంక్ష, క్రమశిక్షణ, ఉండాలేగాని, నేర్చుకోవడం అసాధ్యంకాదని ఈ రంగంలో శిక్షకులు పేర్కొంటున్నారు. ఆయా యజమానులు తమ కార్మికులలోని నైపుణ్యం గల వారిని జాగ్రత్తగా చూసుకుంటారు. ఎందుకంటే ఈ పరిజ్ఞానం విధివిధానాలు కార్యసరణిలో కంటే కార్మికులలోనే ఎక్కువగా ఉంటుంది. ఎక్కడైతే నూతన నైపుణ్యాలు నేర్చుకోవచ్చునో, అక్కడ చేరడానికే కార్మికులు ఇష్టపడతారు. ఉత్పత్తి సంబంధిత నైపుణ్యాలు మాత్రమేకాక, సంభాషణ నైపుణ్యాలు, ఇతర జీవన నైపుణ్యాలు కూడా సంపాదించుకుంటారు. ముంబాయిలోని వీధి వ్యాపారులను టాక్సీ డ్రైవర్లను ట్రావెల్ గైడ్‌లను, బిర్లా మరియు బసోలె (2013)లు ఆయా కార్మికుల ఆంగ్ల భాషానైపుణ్యాలు సంపాదించడం గుర్చి ఇంటర్వ్యూ చేశారు. వీరు తమ సీనియర్ల నుంచేకాక వీధులలో ఉండే సైన్‌బోర్డులను చూసి, కష్టమర్లతో సంభాషిస్తూ, కొత్త మొబైల్‌ద్వారా ఇంకా నూతన సాధనాల ద్వారా తమ నైపుణ్యాలను పెంచుకుంటున్నారు. ముంబాయిలో ప్రసిద్ధ లింకిగ్ రోడ్డులోని ఒక షాపు యజమాని ఏమంటున్నాడో చూడండి. లింకింగ్ రోడ్డు మాకు పాఠశాల అయిపోయింది. ఆవిధమైన నేర్చుకోవడం అనే దానికి గాని నూతన ఆవిష్కరణలకు గాని, వనరులు తక్కువగా ఉన్న పరిస్థితులకు అలవాటుపడడానికి గాని, అంతంమాత్రంగా ఉన్న పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి గాని అవరోధాలు అంతగా ఉండవు. సిద్ధాంతపరమైన అవగాహన దానిని ప్రతిబింబించడంలో అసమగ్రత, నూతన సాంకేతిక పద్ధతులను స్వంతం చేసుకోవడానికి గాని, భద్రతా పద్ధతులు పాటించడంలోగాని, అతని అధ్యయనం అసమగ్రంగా ఉంది.

చివరగా, సమగ్ర చర్చ సాధ్యం కాకపోయినప్పటికీ, అనియతరంగంలోని కంపెనీ స్థాయి ఆవిష్కరణకు చెందిన పరిశోధనను ప్రస్తావిస్తాను. రోడ్డు ప్రక్కన ఉన్న మిఠాయి వర్తకులు వంటి చిన్న వ్యాపారస్తులు తమ వృత్తిపట్లగాని తమ ఉత్పత్తిపట్లగాని వారికున్న ఖ్యాతిపట్లగాని వారు గర్వపడతారు. వారి మెనూలో తరచు క్రొత్త పదార్థాలు చేరుతుంటాయి. చేతివృత్తుల పరిశ్రమలలో వలె, వీటిలో నూతనావిష్కరణలు ఎప్పటికప్పుడు ఉంటాయి. పరిరక్షింపబడతాయి. ఆస్తుల పరిరక్షణ చట్టాలు ఇక్కడ ఉండవు కాబట్టి వారి వ్యాపార రహస్యాలను కాపాడుకుంటారు. వాస్తవిక పరిజ్ఞానం నిరంతర ప్రగతిశీలంగా ఉండి మార్పులను తనలో చేర్చుకుంటూ వృద్ధి చెందుతుంది. మరమగ్గాల వంటి, చేతివృత్తుల పరిశ్రమలు పరిణామం చెందడంలో సాంకేతికత యొక్క ప్రాధాన్యతను విస్మరించలేదు. భారతదేశంలో నూతన ఆవిష్కరణ (భారత ప్రభుత్వం – 2007) తన నివేదికలో జాతీయ నాలెడ్జ్ కమిషన్ కొద్దిమంది ఎస్‌ఎంఈ లను ఇంటర్వ్యూచేసి ఈ అంశాలను చర్చించింది. అయితే అదేపంథాలో మరింత కార్యాచరణ జరగాల్సి ఉంది.

**ముగింపు :** ఇప్పుడున్న పరిజ్ఞాన సంస్థలు సరిపోతాయని నియత పాఠశాల విద్య ప్రధానం కాదనే, కాలం చెల్లిన వాదనలను త్రోసిపుచ్చుకోవచ్చు అనియత రంగాలలో పనిచేస్తూ నైపుణ్యాలను ఆర్జించుకోనే ప్రస్తుత విధానం సరిపోతుందా? అన్న ఎన్‌సిఈయుఎస్ ప్రశ్నకు సమాధానం చాలదు అని! సరిగా రూపుదిద్దిన సమగ్ర విధానాలు, నైపుణ్యాలను పెంచడంలో ఇతోధికంగా తోడ్పడతాయి. ఆధునిక యాంత్రిక సూత్రాలను అనుసరిస్తూ ఆదాయాలను పెంపొందిస్తాయి. అయితే ఎన్ఎస్ఇ యుఎస్ పేర్కొన్నట్లుగా ప్రభుత్వం నడుపుతున్న వృత్తి శిక్షణా సంస్థ గాని ఇతర శిక్షణ సంస్థలుగాని అనియత రంగాలలో ఉద్యోగావకాశాల్ని మెరుగుపరచడంలో విజయవంతం కాలేక పోతున్నాయి. ఈ సంస్థలు, అనియత రంగానికి గాని, ఆయా పారిశ్రామిక వర్గానికి గాని దూరంగానే మనుగడసాగిస్తున్నాయి. ఇప్పుడు శిక్షణా సంస్థలనే ఆయా పరిశ్రమలతో ప్రత్యక్ష సంబంధాలను నెలకొల్పేలా చేయాలి. ఇందుకు సంబంధించి, నైజీరియా నేషనల్ ఓపెన్ ఎప్రంటీస్ షిప్ స్కీం (ఎన్ఓఎఎస్) వంటి వర్థమాన దేశాల సంస్థలను ఆదర్శంగా తీసుకోవడం వలన ప్రయోజనం ఉంటుంది. ఈదిశగా పరిజ్ఞాన ఉత్పత్తి, ఆవిష్కరణలు, పరస్పర పరిజ్ఞాన మార్పిడి, వంటి అంశాలపై మరింత పరిశోధన జరగాలి. అందుకు అనియత రంగానికి తగిన సాధానాలనే ఉపయోగించాలి. ఆఖరుగా, విధానాలకతీతంగా చెప్పాలంటే, నియత విద్యకు సమాంతరమైన సమానమైన గుర్తింపు ప్రోత్సాహం ఇచ్చేందుకు ఒక రాజకీయ ఉద్యమమే నేడు అవసరం. ■

విశేష వ్యాసం

# గాంధీజీ - పారిశుధ్యం

గాంధీజీ పారిశుధ్యానికి అత్యధిక ప్రాధాన్యాన్ని ఇచ్చారు. ఇటీవలి కాలంలో అనగా, ఆయన ప్రబోధించి వెళ్ళిపోయిన 68 సంవత్సరాల తర్వాత మనలో కొంత చైతన్యం కలిగింది. ప్రభుత్వాలే కాదు, వ్యాపార సంస్థలు, స్వచ్ఛంధ సంస్థలు కూడా మరుగుదొడ్లను నిర్మించడానికి ముందుకు వస్తున్నాయి. దీనిలో భాగంగానే, గుజరాత్ విద్యాపీఠ్ వారు కూడా తమ స్వంత బాధ్యతగా 1300 లకు పైగా మరుగుదొడ్లను గుజరాత్ రాజధాని అహ్మదాబాద్‌కు సమీపంలోని 'సద్ర' పరిసర గ్రామాలలో నిర్మించడానికి ముందుకు వచ్చారు. గాంధీజీ తన తరంలోనే ప్రజలలో పారిశుధ్యం పట్ల కనీస అవగాహన లేకపోవడం గురించి, వారి వారి నివాసాలు, పరిసరాలు పరిశుభ్రంగా పెట్టుకోకపోవడం గురించి బాధపడేవారు. అసలు దక్షిణ ఆఫ్రికాలో ఆయన ఉద్యమం ఈ పారిశుధ్యం నుండే మొదలైంది అంటే సత్యదూరం కాదు. ఆ దేశాన్ని ఆనాడు పాలిస్తున్న తెల్లదొరలు భారతీయులను వివక్షతతో చూడడానికి ప్రధాన కారణం వారికి శుభ్రత తక్కువనే! ఈ వివక్షతను గాంధీజీ సహించలేక పోయారు. ఆయనకు పారిశుధ్యం అంటే అత్యంత ప్రధానం మరి! ఆయన మొదటిసారిగా ఒక ఉద్యమాన్ని దీనికోసం ప్రారంభించారు. అటు తెల్లవారితో పోరాడుతూనే, మన సోదర భారతీయులలో పారిశుధ్యం పట్ల అవగాహన పెంచి వారికి అనారోగ్యాలను దూరం చేయాలని సంకల్పించారు. చివరకు తాను మరణించే ముందు రోజువరకు ఆయన తన ప్రసంగాలలో పారిశుధ్యాన్ని గూర్చి నొక్కి చెపుతూనే ఉన్నారు. అంతేకాదు, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీని రద్దు చేసి దాని స్థానంలో ప్రజలకు నాణ్యమైన జీవితం పట్ల అవగాహన పెంచడానికి 'లోక్ సేవ సంఘం' అనే ఒక స్వచ్ఛంధ సేవ సంస్థను ప్రారంభించాలని ఆశించారు.

దక్షిణ ఆఫ్రికాలో తన పోరాట పర్యంతము ఆయన అక్కడి అధికారులతో ఆరోగ్యకరమైన పరిస్థితులను ప్రజలకు అందించాలనీ, అతి చిన్న ప్రదేశాలలో ఎక్కువమంది ప్రజలు/కార్మికులు కిక్కిరిసి నివసించడం వల్ల రోగాలువస్తున్నాయని వాదించే వారు. ఒకసారి లార్డ్ రిప్పన్‌కు రాసిన లేఖలో 'కొంతమంది స్వార్థపరుల ప్రభావంతో ప్రభుత్వం ట్రాన్స్ వాల్ లో స్థానికులు కానీ వారందరికీ సమాన సౌకర్యాలు కల్పించాలనే 1881 వ సంవత్సరపు ఒడంబడిక లోని 14 వ నిబంధనను అతిక్రమిస్తూ, ప్రభుత్వం భారతీయులకు కనీస వసతులను, సౌకర్యాలనూ కూడా విస్మరిస్తున్నది ఇది చాలా దురదృష్టకరం' అని రాశారు. భారతీయ వ్యాపారులు బ్రిటిష్ వారికి పోటీ వస్తున్నందునే వారికి ఈ నెపంతో వ్యాపార అనుమతులు ఇవ్వడంలేదని ఆరోపించారు. భారతీయులు అపరిశుభ్రంగా ఉంటున్నారనే అపప్రధను ఖండించారు. అయితే తన అంతరాంతరాలలో ఆయనకు మానవారి పారిశుధ్య అలవాట్లు ఉండవలసిన స్థాయిలో లేవనే విషయం తెలుసు. కనుకనే 1914 వరకు అంటే తాను దక్షిణ ఆఫ్రికా కు వెళ్ళిన మొదటి20 సంవత్సరాలు పూర్తిగా పరిశుధ్య అలవాట్లు/అవగాహన పైననే తన దృష్టి కేంద్రీకరించారు. ఒకసారి ఆ ప్రాంతంలో నల్ల ప్లేగు వ్యాధి ప్రబలితే, గాంధీజీ తన ప్రాణాలను సైతం లెక్కించక, తనవారితో కలిసి జోహాన్నెస్ బర్గ్ బంగారు గనుల ప్రాంతంలో రోగులకు సేవలందించారు. దీనిని గుర్తించిన ఆనాటి ప్రభుత్వం ఆయనను విశేషంగా ప్రశంసించింది. ఆయన తన ఆత్మ కథలో అక్కడి వివక్షపూరిత చట్టాలను ప్రస్తావిస్తూ, అలాంటి చట్టాలు అన్యాయమే అయినప్పటికీ, మనం మన అలవాట్లతో అలాంటివాటికి అవకాశం ఇవ్వరాదు అని రాసుకున్నారు. అయితే ఆయన మనకు ఈ బోధ చేసిన 100 సంవత్సరాల తర్వాత కూడా మనం ఇంకా సంస్కరించబడవలసిన స్థాయిలోనే ఉన్నాము. అందుకే చికున్‌గున్యా, మలేరియా, డెంగ్యూ వంటి అనేక వ్యాధులబారిన పడుతున్నాము. అపరిశుభ్రమైన పరిసరాలు, అలవాట్లే ఈ దుస్థితికి కారణం. ఒకసారి అహ్మదాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో డెంగ్యూ వ్యాధికి గురై డాక్టర్లు, నర్సులే మరణించడానికి దారితీసిన పరిస్థితుల పై ప్రభుత్వం నియమించిన ఒక విచారణ సంఘంలో ఈ వ్యాస రచయితను

**సుదర్శన్ అయ్యంగార్,** వైస్‌ఛాన్సలర్, గుజరాత్ విద్యాపీఠ్, అహ్మదాబాద్
e-mail : sudarshan54@gmail.com

కూడా నియమించడం జరిగింది. పరిస్థితిని మెరుగు పర్చడానికి వారి నివేదికను తగిన సిఫారసులతో ప్రభుత్వానికి సమర్పించి ఇప్పటికీ రెండు సంవత్సరాలు పూర్తయినా ఏమీ చర్యలు చేపట్టలేదు.

**మనదేశంలో పారిశుధ్యంకోసం గాంధీజీ కృషి**

మన దేశంలో ఆయన మొదటిసారి పరిశుధ్యం గూర్చి చెన్నై లో జరిగిన స్వదేశీ మిషనరీ సమావేశంలో 14 ఫిబ్రవరి, 1916న ప్రస్తావించారు. 'అన్ని ప్రాంతీయ భాషలు/యాసలలో తగిన సమాచారాన్ని అందిస్తే మన ప్రజలు తప్పక ఆరోగ్యం, పారిశుధ్యం పై అవగాహనను పెంచుకుని తమ జీవితాలను మెరుగు పర్చుకుంటారు' అని అన్నారు. (శరీరము, మనస్సు పరిశుద్ధంగా ఉండటం విద్యార్జనకు కావలసిన మొదటి ఆవశ్యకం. ప్రార్థన అంతఃశుద్ధి చేస్తే, బకెట్ నీళ్ళు, చీపురు బాహ్య శుద్ధి చేస్తాయి. అందుకే నేను నా రోజును ప్రార్థనతో మొదలుపెడతాను, అది హిందూ ప్రార్థనకావచ్చు, లేదా ముస్లిం, క్రిస్టియన్ ఏదైనా- శుద్ధి చేయడం ముఖ్యం-గాంధీజీ) పాఠశాల స్థాయిలో పారిశుధ్య ప్రాధాన్యతను పిల్లలకు పాఠాలలో చేర్చడానికి ఆయన సుముఖత వ్యక్తంచేయడమే కాదు, నొక్కి చెప్పారు కూడా! అంటారా –బాహ్య శుద్ధి ఉన్ననాడు, అదే దైవాన్ని చేరడానికి మొదటి అడుగు. 20 మార్చి, 1916 నా గురుకుల్ కంగ్రి వార్షికోత్సవంలో మాట్లాడుతూ ఆయన 'ఆరోగ్యము, పారిశుధ్యాలను గూర్చిన చట్టాలను, నిబంధనలను ఈ అవగాహనతో పిల్లలను పెంచడాన్ని గూర్చి తగిన పాఠ్య ప్రాణాళికలను చేర్చాలి' అన్నారు.

బీహార్లోని చంపారణ్‌లో జరుగుతున్న నీలిమందు రైతుల ఆందోళన పై విచారణ సంఘ సభ్యునిగా ఆయన తన రహస్య నివేదికలో అక్కడి పరిశుధ్యాన్ని గూర్చి కూడా ప్రస్తావించారు. గాంధీజీ 1920 లో గుజరాత్ విద్యాపీఠాన్ని ప్రారంభించారు. అక్కడి జీవితం ఆశ్రమ జీవితాన్ని పోలి ఉండటంతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, ఇతర కార్యకర్తలకు కూడా పరిసరాల పారిశుధ్యం అనేది రోజువారీ దినచర్యలో ఒక అవిచ్ఛిన్న భాగం అయింది. తాము నివశిస్తున్న ఇల్లు, వీధులు, పని ప్రదేశాలు,మరుగుదొడ్లు మొత్తం ప్రాంగణాన్ని శుభ్రం చేయడం రోజువారీ దినచర్య అయింది. ఈ అలవాటు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నది. రైళ్లలో మూడవ తరగతి బోగీలో ఆయన దేశం మొత్తం చుట్టబెట్టారు. తన ఈ ప్రయాణాలలో మూడవ తరగతి బోగీలలోని అపారిశుధ్యనికి అమితంగా చింతించారు. వార్తా పత్రికలలో తన లేఖల ద్వారా ఈ అంశంపైకి ప్రభుత్వ దృష్టిని తెగలిగారు. ఒక సారి 25 సెప్టెంబర్, 1917 న తన లేఖలో 'అసలు ఇలాంటి అపారిశుధ్య దుస్థితిలో మొత్తం రవాణాను ఆపివేయాలి. ప్రయాణీకులను అనుమతించకూడదు. ఇది ప్రజల ఆరోగ్య, నైతిక జీవితాలపై ప్రభావం చూపుతుంది' అని రాశారు.

అదే విధంగా మరోసారి ప్రార్థనాలయాల్లోని అపరిశుభ్రతను నిరసిస్తూ 3 నవంబర్, 1917న గుజరాత్ రాజకీయ సమావేశంలో మాట్లాడుతూ 'మనకు అతి సమీపంలోనే దాకోర్ పుణ్యక్షేత్రం ఉన్నది నేను ఒక వైష్ణవ భక్తుణ్ణి అయివుండి కూడా, అక్కడి అపరిశుభ్రతను చూస్తే, దర్శనానికి వెళ్లిన వాళ్ళకు రోగాలు చుట్టుకుంటాయని భయపడుతున్నానని చెప్పడానికి సందేహించను అన్నారు. అదే విధంగా మరో పుణ్య క్షేత్రం గయలో నెలకొన్న అపరిశుభ్ర పరిస్థితులను గూర్చి తన యంగ్ ఇండియా 03.02.1927వ సంచికలో తూర్పారబట్టారు. దురదృష్టవశాత్తూ మన రైల్వే విభాగ సేవలలో అపారిశుధ్య దుస్థితి నేటికీ ఇలానే ఉన్నది. రైల్వే వారు రోజువారీ భత్యంపై పనివాళ్లను పెట్టి మరీ బోగీలను, మరుగుదొడ్లను శుభ్రం చేయిస్తుంటే, మన సోదర భారతీయులు మాత్రం శాయశక్తులా వాటిని పాడుచేయడానికే ప్రయత్నిస్తున్నారు. ఒకరిననేదేముంది, ఈనాడు చదువుకున్నవారు సైతం వారి పిల్లలు మరుగుదొడ్డి బేసిన్ బయట మల విసర్జన చేస్తుంటే ఏమీ అనడంలేదు. ఉమ్ములు, చెత్త వేయడం గురించి చెప్పనవసరమేలేదు. సామాజిక స్పృహ ఉన్నవారు ఎవరైనా ఈ పరిస్థిని చూస్తే గాంధీజీ దాకోర్జీ దేవాలయం గురించి అన్న మాటలనే అంటారు.

**ప్రజా జీవితంలో పారిశుధ్యం గురించి గాంధీజీ**

డిసెంబర్ 29, 1919న సి.ఎఫ్. ఆండ్ర్యూస్ ను ప్రస్తావిస్తూ గాంధీజీ భారతీయులు కేవలం వారి అపరిశుభ్రమైన అలవాట్ల వల్ల ఆదర్శవంతులు కాలేకపోతున్నారు అన్నారు. కాంగ్రెసు వారి ప్రతి సమావేశంలోనూ ఆయన తన ప్రసంగంలో పారిశుధ్యనికి ఉన్న ప్రాధాన్యతను గూర్చి చెప్పేవారు. గ్రామాలు, పట్టణాలలోని స్థానిక ప్రభుత్వాలకు పారిశుధ్య నిర్వహణ అతి ప్రధాన విధి అని నమ్మే వారు. కాంగ్రెసు కార్యకర్తలనందరినీ కౌన్సిలర్లుగా ఎన్నిక అయిన తర్వాత పారిశుధ్య కార్యకర్తలుగా మారమని పిలిపునిచ్చారు. అపారిశుధ్యము, పేదరికం, సోమరిగా ఉండటము అనేవి మానవుల పాలిట మూడు దుష్ట శక్తులు, వాటితో మనం అనునిత్యం పోరాడాలి అనేవారు. అపరిశుభ్రమైన పరిస్థితులు నన్ను నా సంపూర్ణ భారత యాత్ర పొడుగునా కలిచివేశాయి, దీనిపై ప్రత్యేకంగా పోరాడాలన్న నా నిశ్చయాన్ని మరింత సుదృఢం చేశాయి అని తన యంగ్ ఇండియా 19.11.1925 వ సంచికలో రాసుకున్నారు.

**కార్మికులకు పారిశుధ్య విద్య- విద్యలో పారిశుధ్యం పై పాఠాలు**

అనేకమంది ప్రజలు తాము కూడా ఆశ్రమంలో చేరుతామని గాంధీజీకి లేఖలురాస్తుండేవారు. ఆయన వారందరికీ ముందుగా పారిశుధ్య కార్యక్రమాలలో పాల్గొంటేనే ప్రవేశం కల్పిస్తాననే వారు పారిశుధ్య శాస్త్రంపై మనం పశ్చిమ దేశాలవారినుండి ఎంతో నేర్చుకోవాలని ఆయన అంటుండేవారు. బాహ్య శుభ్రత ఎంత అవసరమో, అన్తఃకరణ శుభ్రత కూడా అంటే ముఖ్యం. మన పక్కింటి వాడు చిత్తశుద్ధితో లేకపోతే అది మనకు ఎన్నో సమస్యలను తెచ్చిపెడుతుంది. ప్రాదేశిక కాంగ్రెస్ కమిటీ నియమావళిని రూపొందిస్తూ ఆయన పంచాయతీల విధులలో ఈ విధంగా నిర్దేశించారు. 'ప్రతి పంచాయతీ తన పరిధిలోగల ప్రతి పిల్లవాని విద్యాభ్యాసానికీ (ఆడ, మగ తేడా లేకుండా), ప్రతి ఇంట్లోనూ రాట్నాన్ని ఏర్పాటు చేయడానికీ,ప్రజారోగ్య, పారిశుధ్యాల సక్రమ నిర్వహణకూ కృతనిశ్చయమై ఉండాలి'.

**గాంధీజీ, పారిశుధ్యం, పారిశుధ్య పనివారు**

అంటరానితనాన్ని గాంధీజీ అసహ్యించుకునేవారు. తన చిన్నతనంలో తన తల్లి అంటే ఎంతో ప్రేమాభిమానాలతో ఉండేవారు కానీ ఆమె తన ఇంటికి వచ్చే పారిశుధ్య పనివాళ్లను గాంధీజీ తాకితే ఒప్పుకునేదికాదు. కానీ గాంధీజీ దీనికి అంగీకరించేవారుకాదు. పారిశుధ్యము, ఆరోగ్యము అనేవి ప్రతి ఒక్కరికీ సంబంధించినవి అని ఆయన బలంగా నమ్మేవారు. అలా సాటి మనిషి విసర్జించిన మలమూత్రాలను ఎత్తివేసే పనే ఉపాధిగా ఉండటాన్ని ఆయన ఒప్పుకోలేదు. ఈ వృత్తిని సంపూర్ణంగా నిర్మూలించాలని కోరుకునేవారు. తాము చేసే అతి నీచమైన వృత్తి వల్ల గ్రామానికి దూరంగా అపరిశుభ్రమైన పరిసరాల్లో వారు జీవించడాన్ని కూడా ఆయన ఒప్పుకోలేదు. ఈ పని చేయడం ఒక కులంలో పుట్టినవారి ధర్మం అనే వాదనను ఆయన ఖండించేవారు. కేవలం పేదరికం,అవిద్య వారిని ఈ స్థితిలో వుంచాయని నమ్మి ఆయన, కరుణతో వారి మధ్యకు వెళ్ళి,వారి జీవితాలను మెరుగు పరచడానికి కృషి చేశారు. తన కార్యకర్తలను సైతం ఈ పనికి పురికొల్పారు. 'హరిజన వర్గాలలో బంగీ కులం వారిని సమాజంలో చిట్ట చివరి వర్గంగా పరిగణిస్తారు, కానీ నా దృష్టిలో పిల్లలకు అమ్మ ఎంత ముఖ్యమో, సమాజానికి వీరు అంతా ముఖ్యమని నమ్ముతాను' అనేవారు.

**పారిశుధ్యము - నేటి స్థితి**

ఆయన ఎంత కృషి చేసినప్పటికీ, గాంధీజీ గతించిన 75 సంవత్సరాల తర్వాత కూడా ఈ వృత్తి ఇంకా ఉన్నది. ప్రభుత్వం ఈ వృత్తిని నిషేధిస్తూ 1993లో చట్టాన్ని చేసినప్పటికీ, ఒక్కరినికూడా శిక్షించలేదు. కనుకనే 2013లో మరో నూతన చట్టం అమలులోకి వచ్చింది. ఈ చట్టం అమలుకు దేశంలోని రాష్ట్రాలు ఇంకా తమ వంతు నియమావళిని రూపొందించలేదు. సహస్రాబ్ది లక్ష్యాలను మనం ఒక్కొక్కటిగా సాధించుకుంటూ వస్తున్నాము. అయినా పారిశుధ్యం విషయంలో పరిస్థితి ఇంకా విచారకరంగానే ఉన్నది. ఒక అంతర్జాతీయ సంస్థ అంచనాల ప్రకారం 1970 లో మనదేశంలో కేవలం 19శాతం ప్రజలకు మాత్రమే శుభ్రమైన తాగు నీరు అందుబాటులో ఉండేది. వీరిలోనూ 85 శాతం పట్టణ ప్రజలు, కేవలం 15 శాతం మంది మాత్రమే గ్రామీణులు. 2008 వ సంవత్సరం నాటికి 30 శాతం మందికి శుభ్రమైన తాగు నీరు అందుబాటులోకి వచ్చింది. UNICEF వారి అంచనాల ప్రకారం, 2012 నాటికి కూడా మన దేశ ప్రజలలో సగానికి పైగా, అంటే 626 మిలియన్ల మంది బహిరంగ మలవిసర్జన చేస్తూనే ఉన్నారు. పారిశుధ్యం అంటే కేవలం మరుగుదొడ్లు నిర్మించుకోవడం మాత్రమే కాదు. 2012 నాటికి దేశ ప్రజలందరికీ సంపూర్ణ పారిశుధ్య సేవలను అందించడం మన లక్ష్యంగా ఉండేది. కానీ అది నెరవేరలేదు. భారత గ్రామీణ జనాభాలో 1981 నాటికి కేవలం ఒక్క శాతం మందికి మాత్రమే సంపూర్ణ పారిశుధ్య సౌకర్యాలు అందుబాటులో ఉండేవి. 1991 నాటికి ఇది 11 శాతానికి పెరిగింది. 2011 నాటికి 22 శాతానికి చేరింది. అంటే సగానికి అన్నమాట! సంపూర్ణ పారిశుధ్య పథకంలో ఇళ్ళలో మరుగుదొడ్లు నిర్మించడం, గ్రామీణ పాఠశాలలు కూడా కలిపి ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ ఇంకా అందని ఫలాలుగానే ఉన్నాయి.

ఆరోగ్య, పారిశుధ్య రంగాలలో విప్లవాత్మక మార్పులకు మన సాంస్కృతిక వారసత్వం అడ్డువస్తున్నది. వీటిలో రెండు ప్రధానమైనవి. పరిశుభ్రంగా ఉండటంకంటే, పవిత్రంగా ఉండటం ప్రధానమనేభావన, దీనివల్లనే ప్రార్థనాలయాల చుట్టుపక్కల పారిశుధ్యం దయనీయ స్థితిలో ఉంటున్నది. ఎక్కడపడితే అక్కడ ఉమ్ములు వేయడం, చెత్త, చెదారం పారవేయడం, బహిరంగ మలవిసర్జన, కాలుష్యాన్ని పెంచే అలవాట్లు, నీటిని అధికంగా కలుషితం చేసే అలవాట్లు సమాజంలో బలంగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలలోనూ, చిన్న చిన్న పట్టణ ప్రాంతాలలోనూ కులాల తేడాలు ఇంకా ఉన్నాయి. నగర జీవితంలోనూ ఇది అంతర్లీనంగా ఉన్నది. ఉమ్మడిగా ప్రజలు అలవాట్లను సమర్థించడం వల్ల ఈ లక్ష్య సాధనలో మనం ఇంకా వెనుకబడే ఉన్నాము.

బాక్టీరియా, వైరస్‌ల వంటి సూక్ష్మ జీవుల ఉనికి పట్ల అవగాహన రెండవది. జనాభాలో అధికశాతం, ప్రాథమిక ఆరోగ్య విషయాలను సైన్స్ పాఠ్యాంశంలో చదువుకున్న వారు కూడా ఈ సూక్ష్మ క్రిములు కలిగించే హాని పట్ల నిర్లక్ష్యంగానే ఉంటున్నారు. ముఖ్యంగా పట్టణ చదువుకున్న వర్గం వారు తాగునీటిని వాడుతున్న తీరు అత్యంత గర్హనీయం. పుంపులకు బిగించే నీటి శుద్ధి పరికరాలు వాడకంలోకి వచ్చేంత వరకూ, మట్టి కుండలను, వాటిలో చేతులు ముంచకుండా నీరు తీసుకునే విధానాలను నిర్లక్ష్యం చేశారు. పారిశుధ్యం విషయంలోనైతే పరిస్థితి మరింత బాధాకరంగా ఉన్నది. గాంధీ బోధనలను మనం పెడచెవిన పెట్టాము. మన సమాజాన్ని గురించి బాగా తెలిసినవాడు కనుక ఆయన పారిశుధ్యాన్ని ఒక జీవన విధానంగా చేయడానికి ప్రయత్నించారు. పారిశుధ్య కార్మికులకు సమాజంలో ఒక గౌరవనీయమైన స్థానాన్ని ఇవ్వడానికి కృషి చేశారు. ఈ ఉద్యమాన్ని మనం స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పథకాలుగా అమలు చేసుకుంటున్నాము. ఈ పథకాలు చివరికి లక్ష్యాలుగానూ, అంకెలు గానే మిగిలాయి. తంత్రాన్ని ఆదరించి, తత్వాన్ని మరిచాము. అంటే, భౌతిక అభివృద్ధి, నిర్మాణాలకు ప్రాధాన్యమిచ్చాము కానీ, స్వభావాన్ని ఆదర్శంగా మలచుకోవడాన్ని నిర్లక్ష్యం చేశాము. పారిశుధ్యానికి పరికరాలు కావాల్సిందే, కానీ, దానికన్న ముందు మనకు ఈ విషయంలో తగిన అవగాహన, పట్టుదల ఉండాలి. ఇవి కేవలం అక్షరాస్యతా వలననే వస్తాయి. మనలో చాలామందికి ముఖ్యంగా కావలసిందేమిటంటే,'మరుగుదొడ్ల శిక్షణ',ఆరోగ్య-పారిశుధ్యాలపై జ్ఞానమూనూ. గాంధీజీ ప్రభవించుగాక!

*(మన దేశంలో బహిరంగ మలవిసర్జనను సంపూర్ణంగా నిరోధించిన రాష్ట్రం సిక్కిం)*

# అనియత రంగం పట్టణ ప్రజల పాత్ర

దేశంలోని అత్యధిక శాతం ప్రజల జీవనోపాధికి అసంఘటిత రంగమే ఆధారము. పన్నెండవ పంచవర్షా ప్రణాళికా కాలంలో ప్రణాళికా సంఘంవారి అంచనాల ప్రకారం దేశ శ్రామిక జనాభాలో 84 శాతం మంది అసంఘటిత రంగంలోనే ఉన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి దేశం ఆర్థిక విధానాలతో ప్రయోగాలు చేస్తూనే ఉన్నది. 1980ల వరకు లైసెన్స్ రాజ్ విధానము, తర్వాత ఆర్థిక సరళీకరణ. ఈ రెండువిధానాలలోనూ అసంఘటిత రంగం మింగుడుపడనిదిగానే ఉన్నప్పటికీ దీని విధాన నిర్ణయాలలో ఆవిధంగా గుర్తించలేదు. మహలనోబిస్గరు రెండవ పంచవర్ష ప్రణాళిక రూపకల్పనలో అసంఘటిత రంగం చిన్న మరియు, గృహ స్థాయి కార్యకలాపాలకే పరిమితమైనదని గుర్తించారు. దానితో 1960లు, 1970 లలో కొన్ని ఉత్పాదనలను కేవలం చిన్న తరహా రంగానికే కేటాయించారు. తర్వాత గత దశాబ్ద కాలంగా ఆర్థిక సమ్మిళిత చర్యలలో ఉత్పత్తి, ఉత్పాదకత అధికమైనప్పటికీ, చిన్న తరహా రంగానికి కేటాయించిన ఉత్పత్తులను కదిలించలేదు.

ఈ రెండు రకాల ఆర్థిక అభివృద్ధిలోనూ, అసంఘటిత రంగం తన ప్రాధాన్యతను నిలుపుకుంటూ, పట్టణీకరణ పెరగడంతో మరింత వృద్ధిచెందింది. వచ్చే మూడు దశాబ్దాలలో మన దేశ జనాభాలో దాదాపు సగం మంది పట్టణాలలో నివసిస్తారు. యావత్ ప్రపంచంలోనే మన దేశంలో పట్టణీకరణ అతివేగంగా ఉంటుంది. ఈ మూడు దశాబ్దాలలోనూ మనదేశం పనిచేయగలిగిన స్థితిలో ఉన్న యువ శక్తిని అధికంగా కలిగి ఉంటుంది. అంటే 15-64 సంవత్సరాల మధ్య వయసులోనున్న ప్రజలు ప్రపంచంలోనే అధికంగా మనదేశంలో ఉంటారు. వీరి జనాభా 2035 నాటికి దేశ జనాభాలో 64 శాతానికి చేరుతుందని అంచనా! ఫలితంగా పట్టణ అసంఘటిత రంగానికి మరిన్ని అవకాశాలు ఉన్నాయని అధ్యయనాలు చెపుతున్నాయి. ప్రస్తుతం ఉన్న అసంఘటిత రంగా వ్యాప్తి ఇదే విధంగా కొనసాగితే, భవిష్యత్తులో పట్టణ పేదరికం విపరీతంగా పెరిగే ప్రమాదమున్నది. మొత్తంమీద దేశ పేదరిక శాతం తగ్గినా, ఈ పరిస్థితి ఇలాగే కొనసాగే ప్రమాదమున్నది. దీనితో పట్టణాలలో సంఘటిత, అసంఘటిత రంగాల మధ్య పోటీ తీవ్రమై పట్టణ ఆస్తులపై హక్కు ఒక ప్రధానమైన వివాదాంశమవటానికి అవకాశమున్నది. ఈ వ్యాసంలో మనం పట్టణ అసంఘటిత రంగాన్ని ప్రోత్సహిస్తున్న పరిస్థితులను పరిశీలిద్దాం. దీనిలో పట్టణ సాధారణ ప్రజల ఉపాధి ప్రధానాంశమవుతుంది. పట్టణ మురికివాడలలో ఖాళీ ప్రదేశాలలో రకరకాలైన పెట్టుబడులు తెరమీదకు వస్తాయి. దీనిని మనం ముంబైలోని ధారవి మురికివాడలో వివిధ వర్గాల ప్రజలు వివిధ రకాల ఉపాధి కార్యకలాపాలను ప్రారంభించడం ఇప్పటికే చూసాము. అంటే పట్టణ అసంఘటిత వర్గమంటే సామాజికంగా వనరులను సమీకరించిన వర్గం కాదు.

చట్టపరంగా స్వంత ఆస్తులు లేకపోవడంతో ఈ అసంఘటిత రంగానికి ప్రభుత్వ ఆస్తులను స్వంతంచేసుకునే పరిస్థితులు ఉన్నాయి. అయితే ఇలా పోగుచేసిన ఉమ్మడి ఆస్తులను సక్రమంగా నిర్వహించుకోవడానికి ఒక విస్తృతమైన, స్పష్టమైన విధానం కావాలి. అంటే వారి పేరున ఆస్తులు ఉండాలని కాదు కానీ, నిర్వహిస్తున్న ఆస్తులపై వారికి అవిచ్ఛిన్న హక్కు ఉండాలి. పట్టణ అసంఘటిత రంగ సమస్యల పరిష్కారానికి రెండు రకాల మార్గాలు సూచించబడ్డాయి. సంప్రదాయ పట్టణ నవీకరణ విధానాలలో పేదల నివాస సమస్యలను పరిష్కరిస్తూ మురికివాడల అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరిస్తారు కానీ వారి

**రాజేష్ భట్టాచార్య,** పబ్లిక్ పాలసీ & మేనేజ్‌మెంట్ గ్రూపు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, కలకత్తా.
e-mail.rb@iimcal.ac.in

ఉపాధిని గూర్చి ఆలోచించరు దీనితో ప్రజలు తమ నివాసాలనే ఉత్పాదక కేంద్రాలుగా మార్చుకొని కొనసాగిస్తుంటారు. అంటే వారి వ్యక్తిగత వస్తువులే ఉత్పాదక వస్తువులు కూడా అన్నమాట! అయితే పట్టణాలలో ఖాళీ జాగా పరిమితం కనుక, మురికివాడల అభివృద్ధి అంటే, అక్కడి ప్రజలను అపార్ట్మెంట్ల వంటి నివాసాలలో మరిన్ని సౌకర్యాలను కూర్చి, (అది కూడా ఉచితంగానో, లేదా నామమాత్రపు ధరకో) అందుబాటులోకి వచ్చిన మిగులు స్థలంలో ఉత్పాదక కార్యక్రమాలను మొదలుపెడతారు. దీనితో ఇళ్లలోనే పని అనే విధానాన్ని కొంత మార్చవచ్చు. వీరికి వడ్డీ లేని ఋణ సౌకర్యాలు, మార్కెట్ వసతులు అందుబాటులో ఉంటాయి. జనాభా పెరుగుతున్నకొద్దీ, పట్టణ ప్రాంతాలలో జీవనానికి స్వంత ఆస్తుల స్థానంలోఉమ్మడి ఆస్తులు ప్రధాన పాత్ర పోషిస్తాయి. దీనితో చట్టవ్యతిరేక మరియు అసంఘటిత కార్యకలాపాలను నియంత్రించడం ప్రభుత్వానికి ఒక సవాలుగా మారుతుంది. కొన్ని కొన్ని సార్లు ఈ చట్ట వ్యతిరేక అనేది కూడా (ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడం వంటి విషయాలలో) ప్రజల అంగీకారయోగ్యమవుతుంది.

**పేదలకు ఆస్తి హక్కు**

సమాజంలోని వివిధ వర్గాలు తమ జీవనోపాధికి అందుబాటులోనున్న వనరులపై యాజమాన్య హక్కు ఒక వివాదం/ సమస్యగా పరిణమించవచ్చు. ఇక్కడ యజమాన్యపు హక్కు అంటే ఆ ఆస్తిని అనుభవించే లేదా జీవనోపాధికి వినియోగించుకునే ఎటువంటి హక్కు అని మనం తీసుకోవాలి. ఉదాహరణకు చాలా ప్రధాన నగరాలలో ఆటొ రిక్షాలను నడిపే చాలామంది అక్రమంగా నడుపుతుండోచ్చు, కానీ వారి సంక్షేమ, నిర్వహణకు సంఘటిత రంగాలు, వీలైతే గుర్తించబడిన రాజకీయ పార్టీలకు చెందిన అసోసియేషన్లు ఉండటం చూస్తున్నాము. అసంఘటిత రంగం ఎక్కువమందికి ఉపాధి కల్పిస్తున్నంతకాలం ఈ 21వ శతాబ్దపు పట్టణ విధానాలలో అస్థిహక్కును కూడా సంఘటితంగానే తీసుకోవాల్సి ఉంటుంది.

**ఇంటికీ-పనికీ మధ్య హద్దులు లేకపోవడం**

ప్రస్తుతమున్న ధోరణి ఇలాగే కొనసాగితే, ఇప్పుడున్నట్లుగానే, పట్టణ అసంఘటిత రంగానికి మురికివాడలే ప్రధాన కేంద్రాలు అవుతాయి. అసంఘటిత రంగంలో మునిసిపల్ చట్టాలు, పర్యావరణ చట్టాలను అతిక్రమించి జరుగుతున్నా ఉత్పత్తులన్నీ మురికివాడలనుండే జరుగుతున్నై. NCEUS 2007 నివేదిక ప్రకారం, అసంఘటిత రంగమో జరుగుతున్నా ఉత్పాదనలో మెజారిటీ సతాం ఇళ్ళలో కుటుంబ సభ్యులతోనే జరిగుతున్నై కానీ, దీనికి ప్రత్యేకంగా కార్మికులు, పనిముట్లు ఉండటంలేదు. కనుకనే ఇలాంటి అసంఘటిత రంగ ఉత్పత్తి యూనిట్లు అధికభాగం చిన్న స్థాయిలోనే ఉంటున్నై. ఇలాంటి స్వంత ఉత్పత్తి సంస్థలలో 1999-2000 సంవత్సరంలో గ్రామాలలో 76 శాతం ఉంటే, పట్టణాలలో 63 శాతం ఉన్నాయి. సాధారణంగా ఇలాంటి ఇంటి ఉత్పత్తులు అధికభాగం ఇళ్లకు అవసరమైన వాటిగానే ఉన్నాయి.

**పట్టణ ప్రజలు**

సగటు పట్టణ జీవి, అదికూడా అసంఘటిత రంగంలో ఉపాధి పొందినవారు అంటే మురికివాడలలో ఉండే వారినే చూస్తాము. అసంఘటిత రంగంలో ఒక కుటుంబానికి సరిపడా నెలవారి ఆదాయం అంటే వారి ఉత్పత్తికి తగిన వనరుల లభ్యత అన్నమాటే! వీరికి సంఘటితమైన మద్దతు అంటే బ్యాంకుల ద్వారా ఋణ సౌకర్యం వంటివి లేకపోవడంతో, వారు అధికశాతం ప్రైవేటు మార్గాలనే ఆశ్రయిస్తున్నారు. చాలా సంధార్భాలలో ఒక అసంఘటిత రంగంలోని ఒక ఉత్పాదక సంస్థకు నెలకు కావలసిన పెట్టుబడి నామమాత్రమే. అయినప్పటికీ, దానికికూడా వారికి శక్తి ఉండదు. దీనితో వారు ప్రైవేటు ఆస్తులను, ఉత్పాదక వనరులను ఆక్రమించుకోవడం జరుగుతుంది. అట్టి వారి ఆస్తులు dead capital గా ఘనీభవించి వుండటంతో వారికి ఆర్థిక వెసులుబాటు ఉండదు. చిన్న ఉత్పత్తిదారులు-చిన్న పెట్టుబడిదారులు స్వయం ఉపాధి పొందినవారు-ఉపాధిని కల్పించగలిగేవారు రోజువారీ జీవనానికి కావలసిన ఉత్పాదనలు-ఎగుమతికోసం చేసే ఉత్పత్తులు ఇలాంటి వైరుధ్యాన్ని మనం అసంఘటిత రంగంలోని చిన్న మరియు స్వంత సంస్థలు-అసంఘటిత రంగంలోనే తాత్కాలిక ఉద్యోగులతో చేసే ఉత్పత్తి సంస్థల మధ్య మనకు కనబడతాయి. ఇలా వలసిన సౌకర్యాలను లేదా అవశ్యకాలను సంఘటితంగా అందచేస్తే, అసంఘటిత రంగంవారికి మార్కెట్ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి కానీ, మార్కెట్లో ప్రతిఫలం అందరికీ ఒకే విధంగా ఉండదు. వినియోగ ప్రమాణాల రీత్యా, పేదవారు చిన్న ఉద్యోగాల కంటే స్వయం ఉపాధినే ఎక్కువ అదరిస్తారు.

**ముగింపు**

అసంఘటిత రంగం అంటే బహుముఖమైనది. అభివృద్ధి సాధించడం, లేదా, జీవనోపాధి పొందటం రెండూ ఈ రంగంలో సాధ్యమే! శ్రామిక శక్తి లో మిగులును, సంఘటిత రంగా విస్తరణకు మనం గుర్తిస్తే, ఈ బహుముఖత్వాన్ని వివరించవచ్చు. ఇప్పటికే వ్యవసాయరంగంలో మిగులు శ్రామిక శక్తి ని గుర్తించామ్. పెరుగుతున్న శ్రామిక శక్తి మొత్తానికీ వ్యవసాయ రంగం ఒక్కటే ఉపాధి కల్పించలేదు కనుక, నగరాలలో అసంఘటిత శ్రామికులు, మిగులు శ్రామికులు వెలుగులోకి వస్తున్నారు. అసంఘటిత రంగం మనగలిగినంత కాలం, పట్టణ రాజకీయ-ఆర్థిక ముఖచిత్రంలో పట్టణ సామాన్యుడు ప్రముఖ పాత్ర వహిస్తూనే ఉంటాడు. ■

# భారత్‌లో పట్టణ అసంఘటిత రంగం

పట్టణ ప్రాంతాల్లో వలస కార్మికులకు, మురికివాడల్లో నివసిస్తున్న పేదలకు ఉపాధి వంటి సౌకర్యాల కల్పనలో అసంఘటిత రంగం కీలకపాత్ర వహిస్తోంది. ఈ అసంఘటిత రంగం విస్తృతి, నిర్మాణంపై పరిశీలన జరిపి, ఈ రంగంలో కాంట్రాక్టు, సంబంధిత అనుబంధ విధానాలతో కార్మికుల పనితీరు, సామర్థ్యం అంశాల్లో చోటు చేసుకున్న మార్పులను ప్రస్తావించడం ఈ వ్యాసం ఉద్దేశ్యం.

వ్యవసాయ రంగం దెబ్బతిని జీవనోపాధి కోల్పోయిన గ్రామీణ కూలీలను అదే సమయంలో వ్యవసాయేతర రంగాలు, ముఖ్యంగా అధికోత్పత్తి గల పారిశ్రామిక రంగం పూర్తిగా విలీనం చేసుకోలేకపోవడంతో వారంతా పట్టణ ప్రాంతాల్లో అసంఘటిత రంగంలో క్రమంగా కుదురుకున్నారు. పట్టణంలో విస్తృత జనాభా పెరుగుదలకు ఈ వలస కార్మికుల సంఖ్యతోడైంది. ఇంత విస్తృత రీతిలో శ్రామికులున్నా వారిలో నైపుణ్యం లేని, లేదా స్వల్పనైపుణ్యం గల కార్మికులే అధికం. మరోవైపు వృద్ధి ప్రక్రియ మరింత నైపుణ్యం, పెట్టుబడుల ఆధారంగా బలపడుతోంది. దీంతో నైపుణ్యంలేని కార్మికులు అంతగా ఆదాయం లేని చిన్నాచితకా పనులను వెదుక్కోవాల్సి వస్తోంది. దీంతో ఈ రంగంలో ఉపాధి అవకాశాలకుతోడు వివిధ రకాల పేదరికాలు ( ఉదాహరణ వినియోగలేమి, వసతి లేమి, అనారోగ్యం, అవిద్య) పడుగుపేకల్లా కలిసిపోయాయి.

**అసంఘటిత రంగం పరిమాణం**

దేశంలోని శ్రామికశక్తిలో అసంఘటిత రంగం గణనీయమైన భాగం కలిగి ఉంది. వ్యవసాయ రంగం నుంచే కాకుండా, వ్యవసాయేతర కార్యకలాపాలలో కూడా అసంఘటిత రంగం చోటు చేసుకుంది. కనీస ఉత్పాదన, చిన్నస్థాయి కార్యకలాపాలు, స్వల్ప ఆదాయం, స్వల్ప సాంకేతిక వినిమయం, స్వల్ప పెట్టుబడి-శ్రామిక నిష్పత్తి, సరైన ఉత్పత్తి కారకాలు, మార్కెట్ సదుపాయాల లోపం వంటి లక్షణాల ఆధారంగా ఈ అసంఘటిత రంగాన్ని నిర్వచిస్తారు. ఏదైనా సంస్థ ప్రధాన/ సంఘటిత లేదా ఇతర రంగాలను ఎంచుకోవడం అనేది ఆ రంగంలో పెట్టుబడులు, శ్రామికుల నైపుణ్యం ఆధారంగా ఉంటుంది. మానవ వనరులు, పెట్టుబడి వనరులు పెద్దగా లేని వ్యక్తులు స్వయంకార్మికులుగా చిన్నచిన్న యూనిట్లలో లేదా స్వయం ఉపాధికి పరిమితమవుతున్నారు. వీరిలో చాలా మంది కాలక్రమంలో ఆర్థికంగా ఎటువంటి ఎదుగుదల లేక అసంఘటిత రంగంలోనే కొనసాగుతారు. వీరికి సరైన విద్య, వనరులు, రుణ, మార్కెట్ సదుపాయాలు, సాంకేతిక సహకారం అందించి, స్థూల ఆర్థిక విధానాల్లో చోటు చేసుకుంటున్న మార్పులపై అవగాహన కల్పిస్తే ఈ రంగంలో కార్యకలాపాలు మరింత విస్తృతమవుతాయి. తద్వారా చిన్న యూనిట్లు నిర్వహించే వారు అసంఘటిత రంగం నుంచి ప్రధాన/ సంఘటిత రంగం వైపు ఎదుగుదల సాధిస్తారు. అయితే దీనికి అవసరమైన మూల్యాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి సుమా! ఉదాహరణకు ఉత్పత్తి యూనిట్ల స్థాపనకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ, కార్మిక చట్టాలు సరళతరం కాకుంటే ఆయా చిన్నయూనిట్లు అసంఘటిత రంగంలోనే స్వల్ప పెట్టుబడులతోనే కొనసాగడానికి మొగ్గుచూపుతాయి. అంతేకాకుండా ఓ చిన్న సంస్థ చౌక కార్మికశక్తి వల్ల కలిగే ప్రయోజనాల వల్ల కూడా అదే రంగంలోనే కొనసాగడానికి మొగ్గుచూపవచ్చు. అటువంటి సమయంలో ఆ చిన్న యూనిట్లను అనుత్పాదకంగా చూడనక్కర్లేదు. అవి సాంకేతికంగా, మార్కెట్ పరంగానూ పోటీపడే సామర్థ్యం కలిగి ఉండవచ్చు.

అసంఘటిత రంగంలో ఉపాధి కల్పన అనేది మొత్తంగా ఉపాధి కల్పనతో పోలిస్తే ఇటు పట్టణాల్లోనూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ కూడా అధిక వాటా కలిగి ఉంది. వ్యవసాయ రంగంపై దీని ప్రభావంపై పెద్దగా ఆశ్చర్యం కలిగించదు. కానీ వ్యవసాయేతర కార్యకలాపాలనూ ఇది పెద్దగా ప్రభావితం చేయడం గమనించదగ్గ విషయం.

**అరూప్ మిత్రా,** ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్, ఢిల్లీ యూనివర్సిటీ ఎన్‌క్లేవ్, ఢిల్లీ
e-mail : arup@iegindia.org

వ్యవసాయేతర కార్యకలాపాల్లో కూడా పెద్ద ఎత్తున అసంఘటిత రంగం ఏర్పడుతోంది. అయితే గ్రామీణ, పట్టణ ప్రాంతాల నడుమ దీని వ్యత్యాసం ఎంతనేది స్పష్టం కాలేదు. ఇందులో లింగబేధాలు కూడా మరో ఆశ్చర్యకరమైన విషయం. అందరూ ఊహించినట్టుగా కాకుండా మొత్తం మహిళా కార్మికులతో పోల్చి చూస్తే అసంఘటిత రంగంలో పురుషుల కంటే మహిళల సంఖ్య తక్కువగా ఉంది.

అయితే ఈ లెక్కలు వాస్తవాన్ని ప్రతిబింబించకపోవచ్చు. ఎందుకంటే నేషనల్ శాంపిల్ సర్వే (ఎన్ఎస్ఎస్ 2009–10) ప్రకారం అసంఘటిత రంగాన్ని యాజమాన్య, భాగస్వామ్య యూనిట్లుగా) నిర్వచించింది. ఇందులో స్వయంకార్మికులను (సొంత శ్రమతో వస్తుత్పత్తి చేసి ఉపాధి పొందేవారు), కుటీర పరిశ్రమలను విస్మరించింది. వీరు వాస్తవంగా అసంఘటిత రంగంలో గుర్తింపబడాలి. కుటీర రంగంలో ఉపాధి కల్పన భారీస్థాయిలో ఉంది. అందువల్ల వీరిని విస్మరిస్తే అసంఘటిత రంగం విస్తృతిని వాస్తవంగా నిర్ధారించడం సాధ్యం కాదు..(టేబుల్ 1 చూడండి). దీనికితోడు కుటీర రంగంలో స్వభావికంగా అత్యధికంగా మహిళలే కీలకంగా ఉన్నారు. అందువల్ల వీరిని విస్మరించడం అంటే అసంఘటిత రంగంలో మహిళల పాత్రను తక్కువ చేసి చూపడమే.

ఇక్కడ మరో విషయాన్ని గుర్తుంచు కోవాలి. సంఘటిత రంగంలోని తాత్కాలిక, ఒప్పంద కార్మికులను కలుపుకొని అసంఘటిత రంగంలో, కుటీర రంగంలో ఉపాధి పొందుతున్న వారి శాతం, మొత్తం ఉపాధి కల్పనతో పోలిస్తే చాలా ఎక్కువ. ఈ పరిమితులను బేరీజువేసి చూసినా మొత్తంగా భారత్‌లో అసంఘటిత రంగంలో శ్రామికశక్తి ముఖ్యంగా వ్యవసాయేతర పనుల్లో కూడా అధికంగా ఉంది. చూడండి **టేబుల్1.**

అసంఘటిత రంగం పరిమాణం శాతాల్లో : దేశవ్యాప్తంగా (2009–10)

| | రంగం | | | వ్యవసాయం / వ్యవసాయేతర | | |
|---|---|---|---|---|---|---|
| | పురుష | మహిళ | మొత్తం | పురుష | మహిళ | మొత్తం |
| గ్రామీణ | 90.6 | 95.0 | 93.4 | 73.0 | 64.1 | 71.3 |
| పట్టణ | 88.3 | 97.7 | 92.5 | 68.3 | 60.1 | 66.9 |

ఆధారం : ఎన్ఎస్ఎస్ ఉపాధి, నిరుద్యోగం గణాంకాలు, 2009–10.

**ప్రస్తుత పరిణామాలు**

ఉపాధి కల్పన, ఉత్పాదకతలో వృద్ధి అనేది పనితీరుకు నిస్సందేహంగా రెండు ముఖ్యమైన సూచికలు. ఉపాధి కల్పనలో వృద్ధి రేటు పలు అసంఘటిత ఉత్పత్తి కార్యకలాపాల్లో సగటున రుణాత్మకంగా ఉంది. అయినప్పటికీ వస్త్ర , తోలు, లోహరహిత ఖనిజ పరిశ్రమలు, సాధారణ లోహాలు, లోహ ఉత్పత్తుల పరిశ్రమల్లో ఉపాధి కల్పన రేటు ఆశాజనకంగా ఉంది.

**టేబుల్ 2 : ఉద్యోగ కల్పనలో వృద్ధి మరియు అసంఘటిత ఉత్పత్తి రంగంలో జీవీఏ : 2005-06 మరియు 2010-11**

| పరిశ్రమ | కుటీర పరిశ్రమలు కార్మికులు | జీవీఏ | పరిశ్రమ (2004-05 ధరలు) కార్మికులు | జీవీఏ | మొత్తం కార్మికులు | జీవీఏ (రూ.కోట్లలో) |
|---|---|---|---|---|---|---|
| ఆహారోత్పత్తులు, బేవరేజ్, పొగాకు | -6.77 | 2.12 | -3.39 | -1.29 | -5.94 | 0.35 |
| వస్త్ర, తోలు | 2.48 | 15.14 | 0.46 | 9.84 | 1.79 | 12.07 |
| కాగితం,ఉత్పత్తులు | -13.35 | -4.04 | 15.53 | 23.45 | -0.64 | 17.29 |
| రసాయనాలు, రసాయన ఉత్పత్తులు | -17.36 | -4.70 | -2.04 | 4.59 | -10.99 | 2.95 |
| లోహరహిత ఖనిజ ఉత్పత్తులు | -4.91 | 2.01 | 11.27 | 9.03 | 3.97 | 7.67 |
| సాధారణ లోహాలు | 13.34 | 19.06 | -2.30 | -12.92 | 2.52 | -9.10 |
| లోహ ఉత్పత్తులు | -3.69 | 9.65 | 4.77 | 1.47 | 1.82 | 2.54 |
| యంత్రాలు, యంత్ర ఉపకరణాలు | -26.19 | -14.44 | -8.65 | -5.70 | -12.64 | -6.60 |
| రవాణా ఉపకరణాలు | - 5.64 | 15.63 | -7.70 | 4.20 | -7.52 | 4.70 |
| కలప,ఇతర ఉత్పత్తులు | -1.32 | 12.79 | 4.43 | 7.77 | 0.89 | 9.47 |
| అన్నిరకాల పరిశ్రమలు | -2.45 | 9.58 | 1.85 | 5.25 | -0.86 | 6.72 |

**ఆధారం :** ఎన్ఎస్ఎస్ గణాంకాలు (ఉత్పత్తి సంస్థలు 2005–06 మరియు 2010–11)

ఈ నేపథ్యంలో 2009–10లో ఢిల్లీలో నిర్వహించిన కొన్ని సర్వే వివరాలను ఇక్కడ ప్రస్తావించాల్సి ఉంది. వస్త్ర పరిశ్రమ రంగం పనితీరు బాగుందన్న వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకుని, ఈ రంగంలో పనివారు పొందిన ఫలితాలను అంచనా వేశారు. ఢిల్లీలోని సుందర్‌నగర్‌లో జరిపిన క్షేత్రస్థాయి సర్వేలో ముఖ్యంగా మూడు రకాలైన ఉపాధి కార్యకలాపాలను గుర్తించారు. అవి దర్జీపని మరియు కుట్లు అల్లికలు, స్వర్ణకారులు, ప్యాకేజింగ్. పెద్ద దుకాణాలకు తోడు చిన్నవర్తకులకు ఉత్పత్తులను అందించే కాంట్రాక్టర్ల నుంచి ఇందులో చాలా మందికి వర్క్ ఆర్డర్లు అందుతాయి. వీరు తయారు చేసే వాటిలో కొన్ని ఉత్పత్తులకు ఆయా కంపెనీల పేర్లు ఉంటాయి. మిగిలినవి అటువంటిదేమీ లేకుండానే విక్రయమవుతాయి. కాంట్రాక్టర్లు వీరికి ముడిసరుకులు సరఫరా చేసి, నిర్ణీత సమయానికి తయారైన ఉత్పత్తులను తీసుకువెళతారు. తద్వారా వీరికి పని కొరత ఉండదు. అయితే ఇందులో పీస్ రేటు చొప్పున చెల్లింపులు కొనసాగడంతో శ్రమకు తగ్గ ప్రతిఫలం ఉండదు. నిజానికి క్రమేణా వాస్తవ వేతనాలు సన్నగిల్లినట్టు ఈ సర్వేలో తేలింది. నిరాటంకంగా పనిదొరుకుతుండడంతో వారి జీవనానికేమీ ఆటంకం కలగదు. కానీ ఆదాయం తగ్గకుండా చూసుకోవడానికి వారు

మరిన్ని పనిగంటలు వెచ్చించాల్సిఉంటుంది. వీరు తయారు చేసిన ఉత్పత్తులను నేరుగా దుకాణాలకు విక్రయించే వీలు లేకపోవడంతో మధ్య దళారులు వీరి శ్రమతో లాభపడుతున్నారు. ఈ చిరు ఉత్పత్తుదారులకు ప్రభుత్వాలు, పౌర సమాజం పూనుకుని సరైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పిస్తే వారు దళారులను అతిక్రమించి సొంతంగా అభివృద్ధి చెందే వీలు కలుగుతుంది. పేరున్న కొన్ని ఉత్పత్తులకు సంబంధించి నాణ్యత ప్రధానాంశం కావడంతో నైపుణ్యం గల వృత్తి పనివారలకు ఆయా కంపెనీల నుంచి నిరాటంకంగా పనిదొరుకుతుంది.

నైపుణ్యం గల వృత్తి పనివారలు అధికంగానే ఉండడంతో డిమాండ్ పెరిగే అవకాశం లేక వారి నిజవేతనాలు కూడా పెరగడం లేదు. మరోవైపు ఈ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు సంబంధించి కొనుగోలు దారులదే తుది నిర్ణయం. వర్క్ ఆర్డర్లు ఇచ్చే కాంట్రాక్టర్లే రేటు నిర్ణయిస్తారు. దానిని సవరించడానికి ఎటువంటి బేరసారాలకు ఆస్కారం ఉండదు. పనితీసుకో లేదా వదిలెయ్...అన్నదే వీరి సిద్ధాంతం. ఈ పరిస్థితిని చక్కదిద్దాలంటే పౌరసమాజం బాధ్యత తీసుకోవాల్సి ఉంది. కొన్ని సంస్థలు కాంట్రాక్టర్లు ఇచ్చే రేటు కన్నా అధిక రేటును అందిస్తున్నా వాటి సంఖ్య స్వల్పం కావడంతో మొత్తంగా వృత్తి పనివారలకు ఎటువంటి లాభం చేకూరడం లేదు. వీరికి సంఘటితమైన యూనియన్ లేకపోవడం కూడా వారి ఎదుగుదలకు అవరోధంగా మారింది. పీస్‌రేటు తగ్గి వీరు మరింత శ్రమదోపిడీకి గురయ్యే అవకాశం లేకపోయినా, కార్మికులు తమవైపు నుంచి రేటు పెంచే పరిస్థితి దాదాపు లేదు. ఈ కార్మికుల మధ్య సమన్వయం లేకపోవడం దీనికి కారణం. మరోవైపు కాంట్రాక్టర్ల నడుమ బలమైన అవినాభావ సంబంధం ఉండడంతో వారు కలసికట్టుగా పనిచేసి రేటు పెరగనీయరు. ముడిసరుకులకు కూడా వృత్తిపనివారు కాంట్రాక్టర్లపై ఆధారపడాల్సి రావడం, రుణ, మార్కెటింగ్ సదుపాయాలు లేకపోవడం వంటి కారణంగా నైపుణ్యం గల కార్మికులై ఉండీ సొంత ఉత్పత్తి సంస్థలను ఏర్పాటు చేసుకోలేక పోతున్నారు. మార్కెట్లో మంచి పేరున్న కంపెనీలు తమ ఉత్పత్తులను సబ్ కాంట్రాక్టు ఇస్తున్నాయి. ఇందులో చాలా వరకూ పనులు ఈ వృత్తి పనివారికి దక్కుతాయి. అయితే ఇటువంటి కార్మికులు అధికంగాఉండడం, మధ్య దళారుల ప్రభావం ఉండడంతో వారికి సరైన లాభాలు దక్కడం లేదు. నాణ్యతను దృష్టిలో పెట్టుకుని ఆయా కంపెనీలు ప్రతిసారి అదే కార్మికులకు దీర్ఘకాలిక ఒప్పందం మేరకు పని అప్పగించడం జరుగుతుంది. ఈ పరిస్థితిలో నిజానికి డిమాండ్ పెరిగి నిజవేతనాలు పెరగాలని ఆర్థిక సూత్రాలు చెబుతాయి. కానీ ఇక్కడ అటువంటిదేమీ కనిపించడం లేదు. పీస్ రేట్లలో కనీస పెరుగుదల కూడా లేదు. వారికి నిరంతరం పనిదొరికి జీవనోపాధికి ఆటంకం లేకపోవడమే వారికి అతిపెద్ద ప్రతిఫలం.

ఇంతవరకూ ఉపాధి కొరత ఉందనుకున్న అసంఘటిత రంగం కొన్ని సందర్భాల్లో నిరంతరం ఉపాధి అవకాశాలు కల్పించడం మేలైన పరిణామమే. ఈ నిరంతర ఉపాధి కల్పన అనేది భవిష్యత్తులో మరిన్ని ఫలితాలు అందించే అవకాశం లేకపోలేదు. స్థిరమైన ఉపాధితో కార్మికులు భవిష్యత్తులో మార్కెట్‌తో సత్సంబంధాలు ఏర్పర్చుకుని, మరింత నైపుణ్యం అలవర్చుకుంటే, దీర్ఘకాలంలో స్వీయ అభివృద్ధితో పాటు అసంఘటిత రంగంలో ఉత్పాదకత పెంపునకూ దోహద పడగలరు. అయితే దీని ప్రభావం పరోక్షంగా ప్రధాన రంగాలపై కూడా పడుతుంది. ప్రధాన రంగాల్లో ఇప్పటికే పలు చోట్ల అసంఘటిత రంగ విధానాలను అవలంభిస్తున్నారు..(ఉదాహరణకు పరిశ్రమల్లో కార్మికులు, ప్రభుత్వ కార్యాలయాలు, విశ్వవిద్యాలయాలు వంటి చోట్ల నాలుగోతరగతి ఉద్యోగుల విషయంలో జరిగినట్టుగా...)

అసంఘటిత రంగంలోని ఉత్పత్తి సంస్థల పనితీరులో వచ్చిన మార్పులను గమనిస్తే ముఖ్యంగా వస్త్ర పరిశ్రమ, తోలు, రత్నాలు, స్వర్ణ పరిశ్రమ వంటి కుటీర పరిశ్రమలు ఇపుడు ప్రధాన రంగంలోని పెద్ద సంస్థలతో అనుసంధానమై ఉన్నాయి. ఈ పెద్ద సంస్థలు వారికి ముడి సరుకులు, పని కల్పిస్తున్నందున అసంఘటిత రంగంలో అస్థిరత తొలగిపోయిందని కొందరు వాదించవచ్చు. వారి రుణం కోసమో, పనికోసమో వెదుకులాడాల్సిన పనిలేదు. వారి ఇంటిముంగిటకే ముడి సరుకులు, వర్క్ ఆర్డర్లు వచ్చి వాలుతున్నాయి. ఇదంతా ఆయా యూనిట్లు సమర్థంగా, సాఫీగా సాగడానికి పనికివస్తోంది. పెద్ద సంస్థలు పొందుతున్న వృద్ధి కాస్త సబ్ కాంట్రాక్టు వ్యవస్థ ద్వారా కిందికి బదిలీ అయి సూక్ష్మస్థాయిలో కార్మికులకు మేలు చేస్తుందని, తద్వారా ప్రపంచీకరణ పేదల ఉపాధికి భరోసా ఇస్తుందని బయటకు కనిపిస్తున్న దృశ్యం. అయితే సుందర్‌నగరిలో జరిగిన క్షేత్ర పరిశీలన ఫలితాలు ఈ దృశ్యాన్ని ప్రతిఫలించడం లేదు.

**ఉపసంహారం**

పట్టణ ప్రాంతాలకు తోడు గ్రామీణ ప్రాంతాల్లోనూ అసంఘటిత రంగంలో పెద్ద ఎత్తున కార్మికులు ఉన్నారు. పట్టణాల విస్తీర్ణం పెరిగి, ఆర్థిక కార్యకలాపాలు పెరిగిన కొద్దీ ఈ అసంఘటిత రంగంలో కూడా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వృద్ధి అవకాశాలున్న పట్టణాల్లో అసంఘటిత రంగంలో క్రమేణా స్తబ్దత తొలగి, చలనం వస్తోంది. వృద్ధికి ఛోదకశక్తిగా పనిచేసే విభాగాల్లో కార్మికుల నైపుణ్యం అక్కరకు వచ్చి వారి నిజ ఆదాయంలోనూ, ఇతరత్రా క్రమేణా మెరుగుదలకు అవకాశాలు ఏర్పడుతున్నాయి. అందువల్ల అసంఘటిత రంగం అన్ని చోట్లా ఒకే విధంగా స్తబ్దంగా లేదు. స్థూలంగా చెప్పుకోవాలంటే ఆర్థిక వృద్ధి సాధనలో భాగంగా అసంఘటిత రంగంలో జీవనోపాధి కల్పనకు ఎన్నో అవకాశాలు గోచరిస్తాయి.

అసంఘటిత రంగంలో ఇటీవల చోటుచేసుకున్న మార్పులను తెలియజేయడానికే ఈ సర్వే ఫలితాలను ఆవిష్కరించడం జరిగింది. ఇందులో ముఖ్యంగా కాంట్రాక్టీకరణ, అనుసంధాన పద్ధతులు కార్మికుల పనితీరుపై, జీవనంపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది ప్రధానాంశం. ఇందులో కొన్ని అనుకూలాంశాలు, సంక్షేమ పరంగా ప్రతికూలత ఉన్నాయి. 2005-06 మరియు 2010-11 కాలంలో అసంఘటిత ఉత్పత్తి రంగంలో ఉపాధి కల్పనలో వృద్ధి సన్నగిల్లింది. ఉత్పత్తి యూనిట్లు పోటీపడలేక ఉత్పత్తి ఖర్చు తగ్గించడానికి, కార్మికులను తగ్గించివేయడం దీనికి కారణం. ఉత్పత్తుల నాణ్యత సరిగా లేకపోవడం, ప్రపంచీకరణతో చైనా పొందుతున్న ప్రయోజనాలను ఇక్కడి యూనిట్లు అందిపుచ్చుకోలేకపోవడం వంటి కారణంగా భారత్ నుంచి ముఖ్యంగా అసంఘటిత రంగ ఉత్పత్తుల ఎగుమతులు పెరగడం లేదు. ఆధునికీ కరణ లోపించడం, పెట్టుబడులు, రుణసదుపాయాలు, సాంకేతికత అందిపుచ్చుకోలేకపోవడం కారణంగా ఉత్పత్తుల్లో ఎటువంటి వైవిధ్యం చూపడం కానీ, విలువైన ఉత్పత్తుల తాయారీని చేపట్టడం కానీ ఇక్కడి సంస్థలు చేయలేకపోతున్నాయి. ఇటీవల ఆర్థిక వృద్ధి సాధనకు చోదకశక్తిగా పరిశ్రమలను పునరుద్ధరించడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలు కూడా అసంఘటిత రంగంలోని ఉత్పత్తి సంస్థలకు సంబంధించి అంత లాభదాయకంగా కనిపించడం లేదు. అసంఘటిత రంగ ఆర్థిక కలాపాలకు ముఖ్యమైన అవరోధం నిధులు, ఇతర భౌతిక వనరుల కొరత. ఫలితమే శ్రామిక ఉత్పాదకత, ఆదాయ వృద్ధిలో ఈ మందగమనం. కార్మికులు తాము తయారు చేసిన ఉత్పత్తులను మార్కెట్ చేసుకోవడానికి కూడా కాంట్రాక్టర్లపై ఆధారపపడడం వల్ల వారు శ్రమదోపిడీకి గురై లాభాలు ఆర్జించలేకపోతున్నారు. ముడిసరుకులు, వర్క్ ఆర్డర్లు పెరిగినా దాని ఫలితం మాత్రం దళారుల ప్రభావం, పీస్ రేటు ఆధారంగా చెల్లింపుల కారణంగా కనీస స్థాయిలోనే ఉంటుంది. ఈ రంగంలో కార్మికుల సంక్షేమం, నిజవేతనాల పెరుగుదల కోసం తగిన చర్యలు, సమర్థమైన అసంఘటిత రంగ విధానం తీసుకురావాల్సిన అవసరం ఉందనడానికి ఈ క్షేత్ర పరిశీలన ఒక బలమైన దృష్టాంతంగా నిలుస్తుంది. ■


**సామాజిక అనుసంధాన వేదిక**
**ఫేస్‌బుక్‌లో యోజన మాసపత్రిక లభ్యమవుతోంది.**
ఈ పత్రిక విశేషాలు, వ్యాసాలు, వ్యాసకర్తల వివరాలు
**https://www.facebook.com/pages/Yojana-Journal/181785378644304?ref=hl**
ఫేస్‌బుక్ అడ్రస్‌లో చూడవచ్చును.


*11వ పేజీ తరువాయి...*

## అసంఘటితకు ఆసక్తికర నిర్వచనము - విధాన రూపకర్తలకోసం

వారి కోరికలు కూడా కీలకమైన విధాన రూపకల్పనకు సహాయ పడుతుంది. అసంఘటిత కార్మికుల ఆశలు, ఆశయాలను సరిగ్గా అర్థం చేసుకోవడం ద్వారా ఆర్థికేతర మార్గాలతో కలిపి, ఛిన్నాభిన్న అసంఘటిత కార్మిక తరగతులను గుర్తిస్తూ వారి సంక్షేమానికి పాటుపడడం సాధ్యం అవుతుంది. సమాజంలో అసంఘటితంగా ఉన్న విలువైన పనులను వర్గీకరించడానికి కింద పేర్కొన్న దృక్పథం చక్కని ప్రారంభం కాగలదు.

**అసంఘటిత్వం మరియు ప్రజలు- విధానం!**

సైద్ధాంతిక సవాళ్లు, రాజకీయ సంకుచితత్వాన్ని అధిగమిస్తే, ఒక ప్రధాన లక్ష్యంగా మన విధానకర్తలు, విధానాల తయారీలో అసంఘటిత కార్మికులకు పెద్దపీట వేయడం సాధ్యం అవుతుంది. వారి స్వంత విధాన సృష్టి ప్రక్రియలో అసంఘటిత కార్మికులు కూడా భాగస్వాములవుతారు. కార్మికులను సామాజిక చర్చా ప్రక్రియలో భాగస్వాములను చేయాలి. శ్రమ తరగతులను బట్టి, ఏ తరహా శ్రమలో నిమగ్నమయ్యారో ఆ శ్రామికుల స్వభావాన్ని బట్టి అదే తీరులోనే సామాజిక చర్చ ప్రక్రియ కొనసాగాలి. తద్వారా శ్రామికుల అత్యధిక భాగస్వామాన్ని సాధించడం సాధ్యం అవుతుంది.

సాంఘిక చర్చా ప్రక్రియలో అసంఘటిత కార్మికులను భాగస్వాములను చేయడంలో తదుపరి సవాలును ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇది వరకే చర్చించిన విధంగా, అసంఘటిత శ్రమ భావన అన్నది కేవలం స్థూల భావనగా ఉంటుంది. వాస్తవంలో నియత శ్రమ భావనకు లోబడని అనేక రకాలైన కార్యకలాపాల్లో కార్మికులు నిమగ్నమై ఉన్నందున దానికి తద్భిన్నంగా అసంఘటిత్వ భావనను వృద్ధి చేయడం జరిగింది. కొన్ని రకాల పనులు, శ్రామికుల గందరగోళాన్ని అర్థం చేసుకొనే క్రమంలో వాటిలో ప్రతి దాన్ని విపులంగా పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అసంఘటిత శ్రమలో వైవిధ్య కారణంగా విధాన నిర్ణయాలను కూడా వికేంద్రీకరించాల్సి రావడం తప్పనిసరి అవుతుంది. ఇక మన రాజ్యాంగంలో చట్టం చేసే సాధ్యాసాధ్యాల సమతుల్యతను మనం గనక పరిశీలనలోకి తీసుకుంటే, వికేంద్రీకరణ విధానాన్ని, అది చట్టపరమైనా, కార్యనిర్వాహకపరమైనా, పాలనా వ్యవస్థకు పూర్తిగా విరుద్ధమైందిగా చెప్పజాలం.

అసంఘటిత కార్మికులను సాంఘిక చర్చా కార్యకలాపాల్లో నిమగ్నం చేస్తూ తద్వారా ఆ కార్మికులనే పాలనా యంత్రాంగంలో భాగస్వాములు అయ్యే వెసులుబాటు కల్పించడం ద్వారా వారి ప్రయోజనాల పరిరక్షణ బాధ్యత వారికే అప్పగించడం సాధ్యం అవుతుంది. మన అత్యున్నత రాజ్యాంగ నిర్మాతలు అలాంటి పాలననే కోరుకున్నారన్నదాన్ని మనం విస్మరించజాలం. ■

# విదేశాల్లో అసంఘటిత కార్మికుల అగచాట్లు

స్వాతంత్ర్యం వచ్చి 67 ఏళ్లయినా ఇంకా సమాజంలో పేదరికం ఉంది. ప్రభుత్వాలు మారినా బడుగుల జీవితాల్లో కన్నీళ్ళే మిగులుతున్నాయి. సాంకేతిక విప్లవంతో ఆధునిక పరికరాలు అందుబాటులోకి రావడంతో వృత్తులపై ఆధారపడిన వారు ఉపాధి కోల్పోయారు. 85 శాతానికి పైగా గ్రామీణులపై దీని ప్రభావం పడింది. రోజు వారి కూలి చేసుకొని కుటుంబాలను పోషిస్తున్న పేద ప్రజలు ఇప్పుడు చేయడానికి పనులు లేక కుటుంబ బాధ్యతలు మోయలేక ఆత్మహత్యలు, ఆకలి చావులకు గురవుతున్నారు. అయితే ఉపాధి అవకాశాలు దొరకని అనేక మంది యువకులు తమ కుటుంబాలను వదిలి సంవత్సరాల తరబడిగా వివిధ దేశాలకు వలసలు పోతున్నారు.

విదేశాల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడ కూడా చేసిన కష్టానికి ఫలితం చేతికందకుండా పోతున్నది. ప్రపంచీకరణ నేపథ్యంలో రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల ఆధీనంలో ఉన్న భూములపై కన్నేసిన బడా పారిశ్రామిక వేత్తలు గ్రామాలను ధ్వంసం చేయడానికి శ్రీకారం చుట్టారు. భూమినే నమ్ముకుని బతుకుతున్న బలహీనవర్గాల భూముల్ని ప్రభుత్వం బలవంతంగా అతి తక్కువ ధరకు పారిశ్రామిక వేత్తలకు అప్పగిస్తున్నది. ఫలితంగా ఉన్న భూమిని కోల్పోయి ఏ ఆధారం లేక గల్ఫ్ దేశాలకు వెళ్ళి కూలి నాలి చేసి కుటుంబ సభ్యులకు పైకం పంపించవలసి వస్తున్నది.

రాష్ట్రం నుంచి ముఖ్యంగా నిజామాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, అనంతపూర్ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలి వెళ్ళి గల్ఫ్ దేశాలలో పనిచేస్తున్నారు. బహ్రైన్‌లో 7శాతం, కువైట్‌లో 15 శాతం, ఓమన్‌లో 16 శాతం కతర్‌లో 7 శాతం సౌదీఅరేబియాలో 8 శాతం, యు.ఎ.ఇ.లో అత్యధికంగా 48 శాతం మన రాష్ట్రానికి చెందిన వారు ఉన్నారు. అయితే వివిధ గల్ఫ్ దేశాలకు వీరు వలస వెళ్ళడానికి అనేక కారణాలున్నాయి. గ్రామాల్లో ప్రైవేట్ సంస్థలు అణగారిన వర్గాల భూములను ధారాదత్తం చేసుకోవడంతో ఆర్థికంగా చితికిపోయి బతుకు భారమైన వారు 79 శాతం, ఉపాధి లభించక 19 శాతం, నిలువ నీడ లేక ఇబ్బందులు పడుతున్న రెండు శాతం మంది గల్ఫ్ దేశాలకు వెళుతున్నారు.

ముఖ్యంగా 1975 నుంచి గల్ఫ్ దేశాలకు వలసలు పోవడం ఆరంభమైంది. 1975 నుంచి 1979 కాలంలో 0.97 శాతం, 1980 నుంచి 90 మధ్యకాలంలో 3.88 శాతం, 1991 నుంచి 2000 కాలంలో 9.70 శాతం 2001 నుంచి 2005 కాలంలో 26.21 శాతం, 2006-10 మధ్య కాలంలో 60 శాతం మంది ప్రజలు వలస వెళ్ళారు. వీరిలో ముఖ్యంగా 38 శాతం యువకులు. అదే విధంగా 31-40 సంవత్సరాల లోపు ఉన్న వారు 35 శాతం, 41-50 మధ్య వయస్సుగలవారు 16 శాతం, అదే విధంగా 51-61 మధ్య వయస్సు గలవారు 11 శాతం తమ కుటుంబాలను వదిలి వలస వెళ్లారు. వెళ్ళిన వారిలో అత్యధికులు 85 శాతం వివాహితులు. 14 శాతం మంది అవివాహితులు. వీరిలో 57 శాతం మంది బిసి సామాజిక వర్గానికి చెందిన వారు కాగా 25 శాతం ఎస్సీ వర్గానికి చెందిన వారు వున్నారు. ఇతర సామాజిక వర్గాలకు చెందిన వారు 18 శాతం వున్నారు.

వివిధ గల్ఫ్ దేశాల్లో మోసపోతున్న వారి వివరాలను బట్టి, వారిలో 37 శాతం నిరాక్షరాస్యులు కాగా 32 శాతం మందికి ప్రాథమిక విద్య, 26 శాతం మందికి పదవ తరగతి లోపు, 4 శాతం మంది ఇంటర్ లోపు 1 శాతం మంది డిగ్రీ లోపు చదువుకున్నవారు వున్నట్లు సెంటర్ ఫర్ మైనార్టీ స్టడీస్ నిర్వహించిన సర్వేలో తేలింది.

**డాక్టర్ ఫజులుల్లాఖాన్,** సీనియర్ జర్నలిస్ట్

మరింత మెరుగ్గా బతకాలన్న ఆశ.... విదేశాలకు వలస వెళ్లేలా చేస్తోంది. నిరక్షరాస్యులే ఎక్కువగా వెళుతున్నారు. ఇమిగ్రేషన్ అక్రమాలు తెలియని వాళ్ళు ఏజెంట్లు, బ్రోకర్ల వలలో పడి అష్టకష్టాలు పడుతున్నారు. ఇది ఏళ్ల తరబడి జరుగుతున్న తంతే! ప్రభుత్వానికి ఈ విషయం సుస్పష్టంగా తెలుసు. అయినా ప్రభుత్వ రక్షణ చర్యలు అరకొరగానే ఉన్నాయి. దీంతో అసంఘటిత రంగంలో పనిచేసే కూలీల ప్రాణాలకు భద్రత లేకుండా పోతోంది.

2009లో 6.4 లక్షల మంది గల్ఫ్ దేశాలకు వెళ్ళారు. వారిలో 5.32 లక్షల మంది విజిట్ వీసాపై వెళ్ళిన వారే. రాష్ట్రం నుంచి ఇప్పటికీ ఎక్కువ మంది కూలీలు విజిట్ వీసాపైనే వెళుతున్నారు. గడువు ముగిసినా అక్రమంగా అక్కడే నివాసముంటున్నారు. ఒక్క యూ.ఏ.ఇ.లోనే రాష్ట్రం నుంచి వెళ్లిన వారు 45 వేల మంది ఉన్నట్లు బయటపడింది.

ఆయా గల్ఫ్ దేశాలకు వలసలు వెళ్ళినవారిలో రోజువారీ కూలీలుగా 20 శాతం మంది వివిధ కంపెనీలల్లో, ఆరు శాతం మంది నిర్మాణ పనుల్లో ఉన్నారు. ఉపాధిఅవకాశాలు లేక, దుర్భర పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న వివిధ వర్గాలవారు, సాగు భూములు అనుకూలంగా లేనివారు, కులవృత్తులు అంతరించడం వల్ల కొందరు గల్ఫ్ దేశాలకు బతుకు తెరువు కోసం బాటలు వేస్తున్నారు. గల్ఫ్ దేశాల్లో సంపాదించిన సంపదను ఇంటికి చేరవేయడంలో దళారులు అనేక ఇబ్బందులు పెడుతున్నారని బాధిత కుటుంబ సభ్యుల ఆరోపణ. అయితే గల్ఫ్ దేశాల్లో కూడా వీరికి పని దొరకక అప్పుల్లో కూరుకుపోవడంతో వారిని తిరిగి రప్పించడానికి కుటుంబ సభ్యులు అనేక రకాలుగా ప్రయత్నాలు చేసి విఫలమౌతున్నారు. గల్ఫ్‌దేశాల్లో జరుగుతున్న అల్లర్లు, ఉద్యమాల కారణంగా రాష్ట్రానికి చెందిన అనేక మంది అమాయకులపై కేసులు బనాయించి జైళ్ళల్లో ఉంచి పోలీసులు రకరకాల ఇబ్బందులకు గురిచేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం సరిగా స్పందించకపోవడం దురదృష్టకరం.

ఎన్నో ఆశలతో గల్ఫ్ దేశాలకు పోయి డబ్బు సంపాదనతో తిరిగి వస్తామనుకున్న వారి ఆశలు అడియాశలుగానే మిగిలి పోతున్నాయి. ఆరోగ్యం క్షీణించడం, వీసా వ్యవధి పూర్తి కావడం, గల్ఫ్ దేశాలలో అనేక కంపెనీలు మూసివేయడంతో అనేక మంది తిరిగి ప్రయాణమవుతున్నారు. అప్పో సప్పో చేసి గల్ఫ్ దేశాలకు వెళ్ళి వట్టి చేతులతో తిరిగి రావడం వల్ల చేసిన అప్పును తీర్చలేక పోవడంతో వడ్డీ వ్యాపారుల వారిని అనేక రకాలుగా మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అప్పులు చెల్లించకుంటే వారికున్న భూములను, ఇండ్లను జప్తు చేసుకుంటున్నారు.

ఉపాధి కోసం మన రాష్ట్రం నుంచి వలస వెళ్ళిన కూలీలు ఏటా వేల సంఖ్యలో దిక్కులేని చావు చస్తున్నారు. వందలాది మంది ఆత్మహత్యలకు పాల్పడుతుంటే... సాధారణ మరణాల పేరిట వందలాది మందిని యాజమాన్యాలు చంపుతున్నాయి. గల్ఫ్‌లోని కేవలం రెండు దేశాల్లో రెండేళ్లలోనే 1955 మంది కూలీలు మృత్యువాత పడ్డారు. ఈ విషయాన్ని అక్కడి భారత రాయబార కార్యాలయాలు రాతపూర్వకంగా ధ్రువీకరించాయి. 60 శాతం మంది సాధారణ మరణాలకు గురవగా, మిగతా వారిలో సగం ఆత్మహత్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. వందలాది మందిని రోడ్డు ప్రమాదాల్లో చనిపోయారు.

ఒమన్‌లో 2009-11 మధ్య కాలంలో చనిపోయిన వారి వివరాలను ఇవ్వాలంటూ ఓ ఎన్జీవో సంస్థ సమాచార హక్కు చట్టం కింద కోరింది. ఇందుకు జవాబుగా 2009-10లో 520 మంది, 2010-11లో 523 మంది కూలీలు చనిపోయినట్లు పేర్లతో సహా అందించారు. ఒమన్‌లో చనిపోయిన 1043 మందిలో 675 మంది సహజ మరణం పొందగా, 90 మంది ఆత్మహత్య చేసుకున్నారు. 124 మంది రోడ్డు ప్రమాదాల్లో, 49 మంది సైట్ ప్రమాదాల్లో చనిపోయారని తేలింది.

ఇక అబుదాబిలో 2009-11 ఏప్రిల్ వరకు 912 మంది మృత్యువాత పడ్డారు. వీరిలో 630 మంది సహజ మరణం, 121 మంది రోడ్డు ప్రమాదంలో, 66 మంది సైట్ ప్రమాదాల్లో చనిపోగా, 53 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని రాయబార కార్యాలయం ధ్రువీకరించింది.

ఏటేటా ప్రవాసీ భారతీయ దివస్‌ను కేంద్రప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోంది. అయితే దానిని పెట్టుబడుల ఆకర్షణ కేంద్రంగా మారుస్తోంది తప్పితే.. విదేశాల్లో మరీ ముఖ్యంగా గల్ఫ్ దేశాల్లో మనవాళ్ళు జీవచ్ఛవాల్లా బతుకుతున్నారని తెలిసినా పాలకులు పట్టించుకోలేదు. వీసా మోసాలకు, ఏజెంట్ల మోసాలకు చెక్ చెప్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. ఏటా వందలాది మంది గల్ఫ్ దేశాల్లో మృత్యువాత పడుతున్నారని తెలిసినా దిద్దుబాటు చర్యలూ తీసుకోవడం లేదు. మోసాలకు అడ్డుకట్ట వేసేందుకూ ప్రయత్నించడం లేదు. ఇటీవల హైకోర్టు జోక్యంతో వెలుగులోకి వచ్చిన ఓ ఘటన ఈ విషయాన్ని స్పష్టం చేసింది. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేసింది. ఒక బ్లాక్‌లిస్టెడ్ కంపెనీకి ఇక్కడి నుంచి 128 మంది కూలీలను పంపించిన విషయం వెలుగులోకి వచ్చింది.

నాన్ కాంట్రాక్టింగ్ కంపెనీతో పాటు దానికి అనుబంధంగా వున్న ఆరు సంస్థలను భారత ప్రభుత్వం 2006లో బ్లాక్ లిస్టులో పెట్టింది. ఈ సమాచారాన్ని దేశంలో ఉన్న ఎనిమిది మంది ప్రొటెక్టర్

ఆఫ్ ఇమిగ్రేషన్స్‌కు పంపించింది. దాని ప్రకారం ఆ కంపెనీకి ఇక్కడి నుంచి కూలీలను పంపించకూడదు. కానీ, దీనిని తుంగలో తొక్కి 128 మందిని నాన్ కాంట్రాక్టింగ్ కంపెనీకి పంపించారు. ముంబై పీవోఎస్ 25 మందిని పంపినట్లు అధికారికంగా వెల్లడించారు. 2008లో వీరంతా బహ్రెయిన్ వెళ్లారు. కానీ, ఆ కంపెనీ యాజమానులు వీరి పాస్‌పోర్టులను తీసుకుని తక్కువ కూలీతో పని చేయించుకున్నారు. మోసాన్ని గుర్తించడంతో కూలీలు యాజమాన్యాన్ని ప్రశ్నించారు. పని చేయడం మానేశారు. దీంతో కంపెనీ యాజమాని అక్కడి కోర్టును ఆశ్రయించాడు. తన దగ్గర అగ్రిమెంట్ చేయించుకుని పని చేయడం లేదని కూలీలపై ఫిర్యాదు చేశాడు. దీంతో కోర్టు ఒక్కొక్కరికి 497 దినార్లు (ఇండియన్ కరెన్సీలో రూ. 70 వేలు) చొప్పున చెల్లించాలని 17-9-2009లో తీర్పు చెప్పింది. వలస కార్మికులపై పోరాడుతున్న నారాయణస్వామి భారత ప్రభుత్వానికి లేఖ రాశారు. హైకోర్టులో పిల్ వేశారు. బ్లాక్ లిస్టెడ్ కంపెనీకి కూలీలను ఎందుకు పంపించారని కోర్టు ప్రశ్నించడంతో రాయబార కార్యాలయ అధికారులు అక్కడి కోర్టుకు వెళ్ళి జరిమానా లేకుండా కూలీలను విడిపించారు. ఈ ఘటన ప్రభుత్వంలో జరుగుతున్న అవకతవకలను బయటపెట్టింది.

1990 నాటి గల్ఫ్ యుద్ధం, 2006లో ఇజ్రాయెల్-పాలస్తీనా సంఘర్షణ, లిబియా సంక్షోభం, సౌదీలో నితాఖత్ పథకం, ఇరాక్ సంక్షోభం తర్వాత అక్కడి భారతీయ కార్మికులు ఎదుర్కొన్న కష్టాలు వారిని స్వదేశానికి సురక్షితంగా తీసుకొచ్చేందుకు ప్రభుత్వం పడిన పాట్లు అన్నీ ఇన్నీ కావు. గల్ఫ్‌కు వలస వెళ్లే భారతీయ కార్మికుల్లో చాలా మంది జీవితకాలం అక్కడే ఉండి, చివరి దశల్లో మాత్రమే తిరిగి వస్తున్నారు. జాతీయ పింఛను పథకం లేదా భవిష్యనిధి తరహాలో వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం ఒక ఫింఛను నిధిని ఏర్పాటు చేయవలసిన అవసర ఉంది. వీసా బ్రోకర్లు, రిక్రూటింగ్ ఏజెంట్లను నియంత్రించి మోసాలను అరికట్టేందుకు కేరళ ప్రభుత్వం తీసుకున్న చర్యలవంటివి అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సత్వరమే చేపట్టి, ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలి. తమను గల్ఫ్‌కు పంపుతున్న వారు దోపిడికి పాల్పడుతున్నారని, ఇతరత్రా వేధిస్తున్నారని వలస కార్మికులు ఫిర్యాదు చేసే వాటి మీద దర్యాప్తు జరిపి దోషుల్ని కఠినంగా దండించడానికి మరో విభాగాన్ని ఏర్పరచాలి. అంతర్జాతీయ పౌర, రాజకీయ హక్కులు, అంతర్జాతీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులు, అంతర్జాతీయ వలస కార్మికులు, వారి కుటుంబ సభ్యుల హక్కుల పరిరక్షణకు ఉద్దేశించిన వివిధ ఒడంబడికల మీద భారత ప్రభుత్వం ఇకనైనా సంతకాలు చేయాలి. మన వలస కార్మికుల రక్షణకు వీలుగా జాతీయ కార్మిక చట్టాలనూ సంస్కరించాలి. ఈ దిశలో కేంద్రప్రభుత్వం ఎంత త్వరగా అడుగులు వేస్తే దేశానికి అంత మంచిది. ■

## బెస్ట్ ప్రాక్టీసెస్ - సదాచారాలు

హైదరాబాద్ మహా నగర పాలక సంస్థ జంట నగరాలలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు ఒక వినూత్న పథకాన్ని ప్రారంభించింది. కేవలం ఒక మిస్డ్‌కాల్‌తో అభ్యర్థులకు తమ అర్హతలకు తగిన ఉపాధిని సూచించడం ఈ పథకం ముఖ్యోద్దేశ్యము. ఇందుకోసం ఒక సంచార వాహనాన్ని ఇటీవల నగర మేయర్ మహమ్మద్ మజీద్ హుస్సైన్ ప్రారంభించారు. ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కార్పొరేషన్ మొత్తం దేశంలో ఇది ఒక్కటే. ఒకసారి 040-71012014




నెంబర్ కు ఫోన్ చేసిన అభ్యర్థులకు వారపు పని దినాల్లో తగిన ఉద్యోగం ఇవ్వటానికి ముందుకు వచ్చిన కంపెనీల నుండి ఫోన్ వస్తుంది. ఇటీవల కాలంలో మున్సిపల్ కార్పొరేషన్ జనన ధృవీకరణ పత్రాలను కూడా ఆన్‌లైన్‌లో అందచేస్తున్నది కనుక, నగరంలోని ఐటి కంపెనీలు, ఇతర ప్రైవేట్ కంపెనీల సహకారంతో లక్ష్య సాధనకు వీలవుతుంది. ఇంతకు ముందు తల్లి తండ్రులు జనన ధ్రువీకరణ పత్రాలకోసం కాళ్ళరిగేటట్లు మున్సిపల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు. అదే విధంగా కార్పొరేషన్ 24/7 కాల్ సెంటర్ ను కూడా 040-21111111 నెంబర్‌తో ఒక దానిని ఏర్పాటు చేసింది. ఈ ఉపాధి వాహనం ద్వారా డిసెంబర్ చివరినాటికి 12,000 ఉద్యోగాలను ఉచితంగా కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ-వ్యాన్ సేవలు నిరుద్యోగులందరికీ ఉచితంగా అందచేస్తారు. చిన్న చిన్న కంపెనీలు కర్మాగారాలనుండి ఐ.టి. కంపనీల వరకు ఉపాధి కల్పనకు తగిన శిక్షణ ఇచ్చి, ఇంటర్వ్యూకు సంసిద్ధం చేస్తారు. జి.హెచ్.ఎం.సి. లోని ఐదు జోన్లలోను ఇలాంటి వ్యాన్లు రంగంలోకి దిగుతాయి. అభ్యర్థుల శిక్షణలో భాగంగా, మాక్ ఇంటర్వ్యూలు, కౌన్సెలింగ్, ఇతర సహాయాలను కూడా అందచేస్తారు. ఈ ప్రయోగం దేశ ప్రధాన సమస్యలలో ఒకటి అయిన నిరుద్యోగాన్ని నిర్మూలించటానికి ఒక మంచి ప్రయత్నం కాగలదు. ■

# ఇంటి పని మహిళా సామ్రాజ్యం - ఇదొక అంతులేని కథ

ఇళ్ళలో పనిచేసే ఆడవారి మీద అందరికీ సానుభూతి ఉంటుంది. నేటి రోజులలో చిన్న చిన్న కుటుంబాలు, భార్య,భర్త ఇద్దరు ఉద్యోగస్తులు కావడం, నూతనంగా వృద్ధి చెందుతున్న మధ్య తరగతి జీవన విధానం, వంటి ఎన్నో అంశాలు ఇళ్ళలో పనిచేసే వారి ప్రాధాన్యతను ఎత్తి చూపుతున్నాయి. అయినప్పటికీ దేశంలోని శ్రామిక వర్గంలో వీరికి గుర్తింపు తక్కువగానే ఉన్నది. పనిచేసే స్థలం ఇంటిలోపల కనుక గుర్తింపు తక్కువ. అదే వేరే ఎక్కడయినా అయితే, నిబంధనలు, విధానాలు వేరేవిధంగా ఉండేవి. ప్రస్తుతం ఇళ్ళలో పనిచేసేవారి స్థితిగతులను విశ్లేషించేందుకే ఈ చిన్న ప్రయత్నం.

**నిర్వచనం**

వీరికి సమగ్రమైన నిర్వచనం ఇవ్వటం అంత తేలిక కాదు. ఒక నిర్వచనం ప్రకారం వాళ్ళు గాని ప్రతిఫలాన్ని ఆశించి చేస్తే, అది ఈ నిర్వచనం క్రిందకు వస్తుంది. చేసే పని లేదా ఉపాధి గురించి ఒక్కొక్కసారి స్పష్టంగా నిర్వచించి వుండవచ్చు లేదా ఒక్కొక్కసారి అంతర్లీనంగా ఉండవచ్చు. ఒక ప్రధాన సవాలు ఏమంటే, దేనిని ఇంటి పని కింద వర్గీకరించవచ్చు అనేది. ముఖ్యంగా అటువంటి పనికి ముందుస్తుగా ఎక్కువ మంది అంగీకరించిన నిర్వచనం అయితే ఏదీ లేదు. అంతర్జాతీయ కార్మిక సంఘం వృత్తుల వర్గీకరణ ప్రకారం, ఇంటి పనిని ప్రధానంగా చేయవలసిన పనులు, వాటికి కావలసిన నైపుణ్యాల ఆధారంగా రెండు విధాలుగా వర్గీకరించింది. వీలయినంత సమగ్రంగా ఉన్నప్పటికీ ఈ నిర్వచనం కాపలా వారు, డ్రైవర్లు, తోటమాలులను వదిలివేసింది. మరో విషయం ఏమంటే, వారి నిర్వచనానికి అందే పనివారు, ప్రపంచ వ్యాప్తంగా ఏ దేశంలోనూ దొరకరు. వివిధ పనులకు వివిధ దేశాలు వేరే వేరే ప్రమాణాలను నిర్ణయించడంతో విషయం మరింత క్లిష్టమైంది. ఇలాంటి వైవిధ్య నేపథ్యంలో అంతర్జాతీయ ప్రామాణిక పారిశ్రామిక వర్గీకరణ ప్రకారం "ప్రైవేటుగా ఇళ్ళలో పార్ట్ టైమ్ లో గాని, ఫుల్ టైమ్ లో గాని" పనిచేసే వారిని ఈ నిర్వచనం క్రింద గుర్తిస్తారు.

ఈ అస్పష్టత కారణంగా, ఇలా ఇళ్ళలో పనిచేసే వారి సంఖ్య పై అంచనాలు కూడా విభిన్నంగా ఉన్నాయి. జాతీయ ప్రతిచయన సంస్థ (ఎన్.ఎస్.ఎస్.ఓ.) వారి 2011-12 సంవత్సరపు సర్వే ప్రకారం మన దేశంలో దాదాపు 41.33 లక్షల మంది ఇళ్ల పనివారు ఉన్నారు. వారిలో పట్టణ ప్రాంతాలలో పనిచేస్తున్న మహిళలు 22.76 లక్షలమంది. ప్రభుత్వేతర సంస్థలు, ప్రసార సాధనాలు ఇవే గణాంకాలను ఉపయోగిస్తున్నాయి.

**ఇంటి పనివారు అసంఘటిత కార్మికులు**

కార్మిక శక్తి దృష్ట్యా చూస్తే భారతీయ లేబర్ మార్కెట్ అత్యంత చంచలమైనది. అత్యధిక శాతం అసంఘటిత రంగంలోనే ఉపాధి పొందుతున్నారనేది కళ్ళకు కనబడుతున్న సత్యం. ఇటీవలి కాలంలో ఈ ప్రతినిధ్యం మరింత తగ్గింది. అయితే ఎంత మేరకు ఈ మహిళా శ్రామికులు తగ్గుతున్నారనేది ఇక్కడ అప్రస్తుతం అయినప్పటికీ ఈ తగ్గుదలకు బాలికలు, మహిళలు ఎక్కువగా విద్యార్జన వైపు మొగ్గ చూపడమనేది తెలిసిందే! ఎన్ని ఆటుపోట్లు, ఎక్కువ తక్కువలు ఉన్నప్పటికీ భారతీయ లేబర్ మార్కెట్ అసంఘటిత రంగం అధిపత్యంతోనే కొనసాగుతున్నది. ఇటీవలి కాలంలో పట్టణ అసంఘటిత కార్మికులలో మహిళల సంఖ్య పెరుగుతున్నది.

**ప్రొ. శ్రీమతి సరస్వతి రాజు,** సెంటర్ ఫర్ స్టడీ రీజనల్ డెవలప్‌మెంట్, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, న్యూఢిల్లీ.
e-mail: saraswati_raju@hotmail.com.

| టేబల్ 1: అసంఘటిత రంగ కార్మికుల వివరాలు (15-59 సంవత్సరాల మధ్య) | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| అసంఘటిత రంగ కార్మికులు. | | | | | | | | | |
| | గ్రామీణ | | | పట్టణ | | | మొత్తం | | |
| | పురుషులు | స్త్రీలు | మొత్తం | పురుషులు | స్త్రీలు | మొత్తం | పురుషులు | స్త్రీలు | మొత్తం |
| 2004-2005 | 89.7 | 94.3 | 91.4 | 67.5 | 73.2 | 68.6 | 83.0 | 90.8 | 85.5 |
| 2004-2005జ | 91.1 | 95.7 | 92.8 | 67.7 | 73.8 | 68.9 | 84.0 | 92.1 | 86.6 |
| 2011-2012 | 87.9 | 89.6 | 88.4 | 63.0 | 67.4 | 63.9 | 79.7 | 84.8 | 81.1 |
| | | | వ్యవసాయేతర అసంఘటిత రంగ కార్మికులు | | | | | | |
| 2004-2005 | 75.2 | 75.2 | 75.2 | 66.0 | 68.2 | 66.4 | 70.3 | 71.8 | 70.6 |
| 2011-2012 | 72.0 | 60.6 | 69.6 | 61.2 | 63.8 | 61.7 | 66.4 | 62.2 | 65.5 |
| | | వ్యవసాయేతర అసంఘటిత రంగ కార్మికులలో పెరుగుదల శాతం. | | | | | | | |
| 2004-2005 & 2011-2012 | 3.1 | -0.1 | 2.5 | 1.6 | 2.4 | 1.8 | 2.4 | 1.1 | 2.1 |

ఆధారం: ఎన్.ఎస్.ఎస్. వారి గణాంకాలు.

**సమకాలీన పరిస్థితి**

ఇళ్ళలో పనిచేసే వారి వివరాల సేకరణ అత్యంత క్లిష్టమైన విషయం. ఏ ఏ రంగాలలో వారు పనిచేస్తున్నారో గుర్తించడం తో పాటు వ్యాసం మరీ దారితప్పుతుందని, నేను ఇక్కడ పట్టణ అసంఘటిత కార్మికుల పైననే కేంద్రీకరిస్తున్నాను. మొత్తమ్మీద అన్నీ రంగాలలోనూ కార్మికుల సంఖ్య తగ్గటంతో 2004-05 మరియు, 2011-12 సంవత్సరాలలో వీరి పెరుగుదల రుణాత్మకంగా ఉన్నది. అయినప్పటికి పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో వారి సంఖ్య ఇంకా 21,13,775, 4,78,748 లు గానే ఉన్నది.

పట్టణాలలో ఇళ్ళలో పనిచేసే వారు అసంఘటిత రంగంలో నాలుగవ అతి పెద్ద వర్గంగా(12.1 శాతం) ఉన్నారు. ఇదే గ్రామీణ ప్రాంతంలో 0.6 శాతంగాను, ఉత్పాదక రంగంలో 33.7 శాతంగాను, వ్యవసాయం, చేపల పెంపకం, అటవీ సంబంధ వృత్తులలో 15.1 శాతం, హోల్ సేల్, చిల్లర వ్యాపారాలలో 13 శాతంగాను ఉన్నారు. మొత్తమ్మీద వ్యవసాయేతర రంగాలలో 14.3 శాతంగా ఉన్నారు. అంచనాలు ఖచ్చితంగా లేక పోవటం వల్ల, అనేక రాష్ట్రాలలో ఇట్టి అసంఘటిత కార్మికుల పై సరైన అంచనాలు, వారికి తగిన కార్యక్రమాలు సక్రమంగా రూపొందడంలేదు. అయితే అంచనాలు సరిగా

| టేబుల్ 2: అసంఘటిత రంగంలో ఇళ్ళలో పనిచేసే వారి వర్గీకరణ (15 - 59 మధ్య వయసు) రంగాల వారీగా, స్త్రీ- పురుషుల వారీగా 2011-12. | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | గ్రామీణ | | | పట్టణ | | | మొత్తం | | |
| | పురుషులు | స్త్రీలు | మొత్తం | పురుషులు | స్త్రీలు | మొత్తం | పురుషులు | స్త్రీలు | మొత్తం |
| ఇంట్లో పనివారు | 24.1 | 78.9 | 53.8 | 27.1 | 84.1 | 68.2 | 26.1 | 83.1 | 64.9 |
| వంట వారు | 1.5 | 4.0 | 2.9 | 1.9 | 9.2 | 7.2 | 1.8 | 8.3 | 6.2 |
| తోటమాలి | 0.2 | 0.0 | 0.1 | 1.1 | 0.1 | 0.4 | 0.8 | 0.0 | 0.3 |
| చౌకీదార్/వాచ్ మన్ | 17.5 | 0.0 | 8.0 | 22.3 | 0.0 | 6.2 | 20.7 | 0.0 | 6.7 |
| గవర్నెస్/చిన్న పిల్లల్ని చూసుకునే వారు | 0.0 | 1.0 | 0.5 | 0.0 | 0.5 | 0.3 | 0.0 | 0.6 | 0.4 |
| ట్యూటర్ | 5.9 | 4.5 | 5.1 | 5.1 | 0.8 | 2.0 | 5.4 | 1.5 | 2.7 |
| డ్రైవరు | 11.8 | 0.0 | 5.4 | 35.0 | 0.5 | 10.1 | 27.3 | 0.4 | 9.0 |
| ఇతరులు | 38.9 | 11.6 | 24.1 | 7.5 | 4.8 | 5.6 | 17.9 | 6.1 | 9.9 |
| మొత్తం | 100.0 | 100.0 | 100.0 | 100.0 | 100.0 | 100.0 | 100.0 | 100.0 | 100.0 |

ఆధారం: ఎన్.ఎస్.ఎస్. వారి గణాంకాలు.

అందుబాటులో ఉన్న ప్రాంతాలలో మాత్రం, పట్టణ, గ్రామీణ కార్మికుల మధ్య అంతరం (మహారాష్ట్ర-27.2 శాతం, పశ్చిమ బెంగాలు-25 శాతం, కర్నాటక-19.5 శాతం, ఢిల్లీ , గోవా-18.6 శాతంగా) స్పష్టంగా ఉన్నది.

ఇళ్ళలో పనిచేసేవారిలోని వివిధ వర్గాలపై తగిన దృష్టి అవసరం. మూసిన తలుపుల వెనుక ఇళ్ళలో పనిచేస్తారు కనుక, వారిపై ప్రజల దృష్టి అంతగా ఉండదు. కనుక వారికి తగిన ప్రణాళికలు కూడా సరిగా ఉండవు. మరో ప్రత్యేకత ఏమంటే, చేసే పనిని బట్టి, స్త్రీ, పురుష కార్మికులకు అవకాశాలు ఉంటున్నాయి. ఇళ్ళలో పనిచేసే మహిళా కార్మికులలో ఎక్కువ శాతం నిరక్షరాస్యులు. అయితే ఏమీ చదువుకొని మహిళలకు అతి సులభంగా దొరికే పని కూడా ఇళ్ళలో చేసే పని మాత్రమే! ఇప్పుడు ఫుల్ టైమ్ లేదా పార్ట్ టైమ్ పనివారలను సులభంగా గుర్తించవచ్చు. విశేషమేమంటే, పార్ట్ టైమ్ అనేది కేవలం మాటలకు మాత్రమే ఎందుకంటే, పార్ట్ టైమ్ గా నియోగించబడిన వారిని ఫుల్ టైమ్ పనికి వినియోగించుకోరని హామీ లేదు. ఒక్కొక్కసారి పార్ట్ టైమ్ పని చేసేవారు విడతలుగా తాము చేసే పని గంటలను లెక్కిస్తే, ఏ కార్మిక చట్టం కింద నిర్వచించిన ఫుల్ టైమ్ పనివారల పని గంటల కన్నా ఎక్కువే వుండవచ్చు. ఒక్కొక్కసారి ఇటువంటి పనివారు దినమంతా యజమాని ఇంటిలోనే పనిచేసి కేవలం రాత్రికి మాత్రమే తమ ఇంటికి చేరుకోవచ్చు. ఇటువంటి పరిస్థితులు వారి సంక్షేమనికి ఏదైనా చట్టాన్ని రూపొందించాలంటే ప్రతికూలంగా ఉంటాయి. అయితే ఇటీవలి కాలంలో నూతనంగా వచ్చిన BPO సేవలు, సమాచార సాంకేతిక రంగాల వంటి వాటిలోని స్త్రీ పురుష పనివారలను మాత్రం అతి సులభంగా document చేయగలుగు తున్నారు. దీనికి తోడుగా, ఇటీవల ఇళ్ళలో పనిచేసే వారి జీతాలు పెరగడంతో ఇంతవరకు ఎవరూ చూడని కోణంలో ఒక వర్గం వారి జాగాను మరొక వర్గం వారు భర్తీ చేయగలుగుతారేమో చూద్దాం. ఇళ్ళలో మామూలుగా పనిచేసే వారు మానేస్తే, వారి స్థానంలో మరొకరిని భర్తీ చేసుకొనే కార్మిక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. అదే పెద్ద స్థాయిలో ఉద్యోగాలు చేసే వారి విషయంలో ఈ సౌకర్యం 1999-2000 సంవత్సరం నాటి 0.92 శాతం నుండి, 2011-12 నాటికి 4.68 శాతానికి మాత్రం పెరిగింది. అదే సంలో పట్టణ ప్రాంతాలలో ఇళ్ళలో పనిచేసే మహిళల సంఖ్య కూడా నాలుగు రెట్లు పెరిగింది. అదే సమయంలో 15-59 సంవత్సరాల మధ్య వయసు గల పిల్లల్లున్న తల్లులు పని చేయడం బాగా తగ్గింది. **మొత్తమ్మీద చెప్పేదేమంటే, ఇళ్ళలో పనిచేయడమనేది ఇంకా మహిళల ఏకస్వామ్యంలోనే ఉన్నది అని. దీనితో పిల్లల పెంపకం, ఇంటి పని ఎవరు చేయాలి అనే విషయం, మహిళలను కేవలం గృహిణి గానే చూడడం వంటి ఆలోచనలలో మార్పు రావడం కష్టమవుతుంది.** మామూలుగానే ఇళ్ళలో పనిచేసేవారు ప్రభుత్వ నియంత్రణలో ఉండరు. అయితే మొత్తమ్మీద వారికేమీ నియమ నిబంధనలు లేవని కాదు, నేరుగా పనిలో చేరే వారి కంటే, నియామకపు సంస్థల ద్వారా పనిలో చేరే వారికి మరికొంత ఎక్కువ రక్షణ ఏర్పాట్లు దొరికే అవకాశం ఉంది. ప్రపంచ వ్యాప్తంగా వీరి స్థితిగతుల్ని, వారి సేవల్ని పరిశీలించి జూన్ 2010 లో ఒక చట్టాన్ని రూపొందించారు. అంతర్జాతీయ కార్మిక సమాఖ్య వారి ప్రమాణాల ప్రకారం ఈ చట్టపరమైన రక్షణాలు అందుబాటులోకి వచ్చాయి. ఇటీవలే, 2011 లో ఇళ్ళలో పనిచేసే వారికోసం ఒక జాతీయ విధానాన్ని ప్రకటించారు. వారికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడం, సామాజిక భద్రత పథకాలను వర్తింప చేయడం, వంటి చర్యలను ప్రయోగాత్మకంగా చేపట్టారు. అన్నీ దక్షిణాది రాష్ట్రాలు, బీహార్, ఛత్తీస్‌ఘర్, మహారాష్ట్ర, ఒడిషా, రాజస్థాన్ వంటి ఇతర రాష్ట్రాలు వీరి పనిగంటల నియంత్రణకు అనేక చర్యలు తీసుకున్నాయి. ఆంధ్రప్రదేశ్, బీహార్, జార్ఖండ్, కర్నాటక, కేరళ, తమిళనాడు వంటి ఏడు రాష్ట్రాలు ఇళ్ళలో పనిచేసే వారికి కనీస వేతనాలను కూడా నిర్దేశిస్తూ చట్టాలను చేశాయి. అదనంగా కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలు వీరి సంక్షేమం కోసం బోర్డులను కూడా ఏర్పాటు చేశాయి. ఇలాంటి ఏర్పాట్లను ప్రశంసించాల్సిందే సందేహం లేదు అయితే, వాటి సక్రమ అమలును కూడా ఎంతో జాగ్రత్తగా గమనించాలి. అప్పుడే అవి విజయవంతం అవుతాయి. ■


**యోజన**

నవంబర్ 2014 సంచిక **"సాంకేతికత, సృజనాత్మకత మరియు విజ్ఞాన ఆర్థిక వ్యవస్థ"** అనే ప్రత్యేకాంశంగా వెలువడనున్నది.

యోజన (తెలుగు) పత్రిక చందా వివరాలు, చిరునామా మార్పు, పత్రిక చేరకపోవడం వంటి విషయాలపై ఫోన్ నెంబర్ 040-23310162 పై నేరుగా సంప్రదించవచ్చు. యోజన పత్రిక చందాకు సంబంధించిన వివరాల కోసం yojana_subscribe@yahoo.in కి మెయిల్ చేయగలరు.

***- సీనియర్ ఎడిటర్***

# దర్పణం

## మహిళా శక్తి



దేశంలో మొదటిసారిగా ముంబై పోలీసు విభాగం పూర్తిగా మహిళలతో కూడిన ఒక పోలీసు పటాలం ఏర్పాటుచేసింది. నగరమంతా తిరుగుతూ శాంతి భద్రతలను పరిరక్షించడంలో తోడ్పడే ఈ 205 మంది మహిళా కమాండోల దళానికి మహిళల పరిరక్షణ, మహిళలపై జరిగే అత్యాచారాల నిరోధం ప్రథమ కర్తవ్యంగా ఉంటుంది. ఇప్పటికే దేశంలోని మహానగరాలలో ముంబైలో మాత్రమే మహిళలపై జరిగే అత్యాచారాలు తక్కువగా రికార్డు అవుతున్నాయి.

## మొదటి సముద్ర విమాన సేవ

సముద్ర విమాన సేవను టూరిస్ట్ ఆకర్షణగా మహారాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది.



లోనవాలాల లోని పవన డమ్ నుండి ఆగస్టు 25 నా మొదలైన ఈ సర్వీసు ను Maritime Energy Heli Air Services Pvt Ltd (Mehair) అనే ఒక ప్రైవేటు పర్యటన సంస్థ రాష్ట్ర పర్యటన విభాగం వారి సహకారంతో నిర్వహిస్తుంది. ఈ సేవ విజయవంతం అయితే (గత అనుభవాల దృష్ట్యా) త్వరలో అండమాన్–నికోబార్ దీవులకు కూడా విస్తరిస్తామని ఆ రాష్ట్ర పర్యటన శాఖ మంత్రి తెలియ చేశారు. ఈ విమానం లో ఒక వైపు చార్జ్‌ని రూ 2,999/– లు గా నిర్ణయించారు.

## ఐస్ బకెట్, రైస్ బకెట్

ఇటీవలి కాలంలో అంతర్జాతీయంగా ఐస్ బకెట్ సవాలు సంచలనం రేపుతున్న సంగతి తెలిసిందే! దీనికి భారతీయ సమాధానంగా హైదరాబాద్ కు చెందిన మంజులత కళానిధి రైస్ బకెట్ సవాలును తెరమీదకు తెచ్చిన సంగతి కూడా మనకందరికీ తెలుసు. రెండూ కూడా మంచి లక్ష్యంతోనే మొదలయ్యాయి. ఐస్ బకెట్ సవాలు Amyotrophic Lateral Sclerosis (ALS) అనే వ్యాధి పీడితుల సహాయార్థం మొదలు పెడితే, మన రైస్ బకెట్ సవాలును ఆకలితో ఉన్న పేదవారి కోసం మొదలుపెట్టారు. ఒక్కసారి అతి చల్లటి మంచు ముక్కలను



కానీ, నీటిని గాని తలమీద పోసుకుంటే ఎలాంటి స్పందన ఉంటుందో, ఈ ALS వ్యాధి పీడితులకు సరిగ్గా అలాంటి స్పందనతో నరాలు చచ్చుబడిపోతాయి. క్రమేణా శరీరంలో చలనం స్తంభించి పోయి, మరణానికి దగ్గరవుతారు. ఇక రైస్ బకెట్ విషయానికి వస్తే, కళానిధి చెప్పిన ప్రకారం, అన్నార్తులకు అంద చేయడానికి ఒక బకెట్ అన్నం వండించి గాని, లేదా బియ్యం తో గాని లేదా ఒక వంద రూపాయలు నగదు రూపంలో గాని ఇచ్చి సహాయం అందించవచ్చు. ప్రత్యామ్నాయంగా వంద రూపాయలను దగ్గరలోని ఆసుపత్రిలోని పేదలకు మందుల సహాయం కోసం కూడా అందచేయ వచ్చు. ఐస్‌బకెట్ కు బదులుగా నీటిని పొదుపు చేస్తూ అన్నార్తుల ఆకలిని తీర్చండి అనే సందేశం బహుదా ప్రశంసనీయము. కొస మెరుపు ఏమిటంటే ఇదే స్ఫూర్తి తో ఉత్తర ఆఫ్రికాలో ఝంఝఝామారుతంలా ఉన్న ఎబోల మహమ్మారిని నియంత్రించడానికి అక్కడి ప్రభుత్వాలు సోప్‌బకెట్ ఉద్యమాన్ని మొదలుపెట్టాయి.

## అతడే ఒక సైన్యం

దశరథ్ మాంఝీ అంటే మనలో చాలా మందికి తెలియకపోవచ్చు. బీహార్ లోని గయా పట్టణానికి సమీపంలోని గెహ్లార్ కొండ పైన అతని కుగ్రామం ఉండేది. చాలా కాలం క్రితం, అంటే 1967 లో



అతని భార్య ఫల్గుణి దేవి జబ్బుపడి తగిన సమయంలో వైద్య సహాయం అందక మరణించింది. వాళ్ళ గ్రామాన్నుండి సమీప పట్టణం 70 కిలోమీటర్ల దూరంలో ఉండేది అయితే కొండ దిగి చుట్టూ తిరిగివెళ్లవలసివచ్చేది. ఈ సమస్య వల్ల తన గ్రామ ప్రజలు ఎంతటి కష్టానికి గురవుతున్నారో మాంఝీకి తెలిసింది. అంతే ఒక శుభముహూర్తాన పలుగు పారా పుచ్చుకుని కొండను తవ్వి తన గ్రామాన్నుంది సమీప పట్టణానికి దారిని ఏర్పరచడం మొదలుపెట్టాడు. నిరక్షరాస్యుడు అయిన మాంఝీ 22 సంవత్సరాలు కష్టపడి గెహ్లార్ కొండను 110 మీటర్ల దూరం 30 అడుగుల వెడల్పు తవ్వి తమ గ్రామంనుంచి సమీపంలోని అత్రి వజీర్ గంజి పట్టణాలకు దగ్గరి దారికి ఏర్పాటు చేశాడు. అతని కృషిలో పాలు పంచుకోక పోగా చాలా మంది అతనిని పిచ్చివాడని హేళన చేశారు. ఇప్పుడు అతని గ్రామం నుండి ఎవరైనా అత్యవసర వైద్యానికి పట్టణానికి వెళ్లాలంటే కేవలం 15 కిలోమీటర్లు వెళితే చాలు. ఇంతకృషి అతను కేవలం ఒక్కడే చేశాడు. చివరకు ఈ మహా మనిషి, ఆగష్టు 17, 2007న కాన్సర్‌తో కన్నుమూశారు. ఏ విషయంలోనైనా నేనొక్కడిని ఏమి చేయగలను అనుకునే ప్రతి వొక్కరికీ, మాంఝీ ఆదర్శం.

## భారత ప్రభుత్వ నూతన డొమైన్ సేవ

భారత ప్రభుత్వం డాట్ భారత్ అనే ఒక నూతన డొమైన్‌ను ప్రారంభించింది. హిందీ, కొంకణి, మరాఠి, తమిళ మరియు గుజరాతి భాషలలో అందుబాటులో ఉండే ఈ సేవను దేశ పౌరులు/ సంస్థలు ఎవరైనా ఉపయోగించుకోవచ్చు. అయితే డొమైన్ పేరు మాత్రం దేవనాగరి లిపిలో ఉంటుంది. ఇంతవరకు ఉన్న డాట్ కామ్, డాట్ నెట్, డాట్ ఇన్ వంటి డొమైన్ పేర్లు ఇక పై కూడా కొనసాగుతాయి. త్వరలోనే ఈ సేవను రాజ్యాంగం గుర్తించిన అన్నీ భాషలలోనూ అందచేస్తారు. ఈ సేవ ను ప్రారంభిస్తూ కేంద్ర కమ్యూనికేషన్లు, సమాచార సాంకేతిక శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ, The National Internet Exchange of India (NIXI) పథకంలో ప్రస్తుత సంవత్సరంలో 60,000 గ్రామాలకు, వచ్చే సంవత్సరం మరో లక్ష గ్రామాలకు ఇలా 2017 నాటికి రూ. 35,000/- కోట్ల అంచనా వ్యయంతో మొత్తం 2.5 లక్షల గ్రామాలకు బ్రాడ్ బాండ్ సౌకర్యం కల్పించనున్నట్లు తెలియ చేశారు.





## భారత నూతన ప్రధాన న్యాయమూర్తి

భారత నూతన ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ హంద్యాల లక్ష్మీ నారాయణస్వామి దత్తు ఎంపిక అయ్యారు. గతంలో కేరళ హై కోర్టు, ఛత్తీస్గఢ్ హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి గా పనిచేసిన జస్టిస్ హెచ్.ఎల్. దత్తు జస్టిస్ ఆర్.ఎం. లోధా నుండి పదవి బాధ్యతలను స్వీకరిస్తారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ ఆదేశాలను జారీ చేసింది. ఈయన డిసెంబర్ 17, 2008 నుండి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్నారు. ఈ 2014 వ సంవత్సరంలో పదవి బాధ్యతలు స్వీకరిస్తున్న భారత ప్రధాన న్యాయ మూర్తులలో జస్టిస్ దత్తు మూడవ వారు. ఏప్రిల్ నెలలో జస్టిస్ సదాశివం నుండి పదవి బాధ్యతలను స్వీకరించిన జస్టిస్ లోధా ఈ నెలాఖరుకు పదవి విరమణ చేయనున్నారు. జస్టిస్ దత్తు ఈ పదవిలో డిసెంబర్ 2015 వరకు కొనసాగుతారు.



## మరణశిక్ష అప్పీల్‌కు బహిరంగ విచారణ

సుప్రీంకోర్టు ఒక చారిత్రాత్మక నిర్దేశంలో మరణశిక్ష కు వ్యతిరేకంగా చేసే ఏ అప్పీల్ నయినా బహిరంగంగా విచారించాలని తీర్మానించింది. సంచలనాత్మక కేసులలో ప్రజలకు వివరాలు పూర్తిగా తెలియాలని ఈమేరకు నిర్ణయం తీసికున్నట్లు వివరించింది. ఒక కేసు విచారణ సందర్భంగా మరణశిక్ష పడిన ఖైదీలు ఎక్కువ కాలం జైల్లో గడిపరనే కారణాన్ని మరణశిక్షను జీవిత ఖైదుగా మార్చడానికి పరిగణించరాదని తేల్చింది.




## తగ్గిన పోటీతత్వం

ప్రపంచ దేశాలలో పోతితత్వాన్ని ప్రతిబింబించడంలో ఈ సంవత్సరం మనదేశం71వ స్థానానికి పడిపోయింది. జెనీవా లోని World Economic Forum ఈ పోటీతత్వాన్ని ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం ఇలాంటి నివేదికలను విడుదలచేస్తుంటుంది. ఈ 2014-15 సంవత్సరపు నివేదిక ప్రకారం స్విజర్లెండ్ దేశం ప్రధమ స్థానంలోను, సింగపూర్ ద్వితీయ స్థానంలోను ఉన్నాయి. చైనా తన స్థానాన్ని మెరుగు పరుచుకుని 29 నుండి 28 వ స్థానానికి చేరింది. BRICS దేశాల గ్రూప్ లో మన దేశం చివరి స్థానంలో ఉన్నది.



## కొత్త ఏటిఎం నిబంధనలు

ఏటిఎం కార్డులను వినియోగించే విధానంపై రిజర్వ్ బంక్ కొన్ని కొత్త నిబంధనలను ప్రకటించింది. నగరాలలో ఉన్న ఏటిఎం లలో ఇక పై నెలకు కార్డు వినియోగాన్ని అదే బాంక్ ఏటిఎంలలో ఐదు సార్లకు, ఇతర బాంకుల ఏటిఎంలలో మూడుసార్లకు పరిమితం చేశారు. నవంబర్ ఒకటవ తేదీ నుండి అమలులోకి వచ్చే ఈ నిబంధనల ప్రకారం, బాలన్స్ చెక్ చేసిన, పిన్ నెంబర్ను మార్చిన ఒక ట్రాన్సాక్షన్‌గా పరిగణిస్తారు. నెలలో అనేక సార్లు చిన్న మొత్తాలను డ్రా చేసేవారికి, స్వాపింగ్లో అస్తమానము డెబిట్ కార్డును ఉపయోగించేవారికి ఇప్పుడు ప్రతి అదనపు లావాదేవికి 20 రూపాయల చొప్పున చార్జ్ చేస్తారు. అయితే ఈ నిబంధన గ్రామీణ ప్రాంత ఏటిఎంలకు వర్తించదు. నగరాలు, పట్టణాలలోని ఏటిఎంలలో ఇటీవల అసాంఘిక శక్తుల దాడులు పెరిగుతున్న సందర్భంగా తగిన రక్షణ ఏర్పాట్లకు, నెట్ బ్యాంకింగ్ విధానాన్ని ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. మొదటి విడతగా ఈ నిబంధనలు ఢిల్లీ, కోల్‌కత్త, చెన్నై, ముంబై, బెంగుళూరు, హైదరాబాద్ నగరాలకు మాత్రమే వర్తిస్తాయి. చిన్న పట్టణాలలో అయితే ఐదు లావాదేవీల తర్వాత ప్రతి సారి నగదు లావాదేవికి 20 రూపాయలు, నగదు రహిత లావాదేవికి 09 రూపాయలు చార్జ్ చేస్తారు. అయితే శూన్య ఖాతాలకు, సంక్షేమ పథకాల కోసం తెరిచిన ఖాతాలకు ఈ నిబంధనలు వర్తించవు. ఇతర బాంకుల లావాదేవీలలో ఇంతవరకు ఉన్న లావాదేవీ రుసుమును 15 రూపాయల నుండి 20 రూపాయలకు పెంచారు, లావాదేవీల సంఖ్యను ఐదు నుండి మూడు కు కుదించారు.

*యోజన సంపాదకవర్గం*




# విజ్ఞాన విపంచి

ప్రాతూరి పోతయ్యశర్మ

1. లిక్విడ్ ఎపోజి మోటార్ (లాం) దేనిలో వాడారు?
(ఎ) చంద్రయాన్–1 & మార్స్ ఆర్బిటర్ (బి) ఆర్యభట్ట
(సి) భాస్కర (డి) క్రయోజెనిక్ ఇంజిన్
2. 2014 యుఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ విజేత ఎవరు?
(ఎ) రోజర్ ఫెదరర్ (బి) మారిన్ సిలిక్
(సి) రాఫెల్ నాదాల్ (డి) నోవాక్ డిజోకోలిక్
3. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) తేజు : అరుణాచల్ ప్రదేశ్
(బి) కిషన్ ఘర్ : రాజస్థాన్
(సి) జర్సుగూడ : ఒడిషా
(డి)పైవన్నీ (విమానాశ్రయాలు : రాష్ట్రాలు)
4. 20 న్యూక్లియర్ రియాక్టర్లున్న భారతదేశం ఉత్పత్తి చేసే 4780 ఎం.డబ్ల్యు.ఇ. విద్యుచ్ఛక్తి, మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో ఎంతశాతం?
(ఎ) 2% (బి) 10% (సి) 15% (డి) 30%
5. 2032నాటికి భారతదేశం ఎంత న్యూక్లియర్ పవర్ ఉత్పత్తి చేయదల్చుకుంది?(ఎండబ్ల్యుఇ)
(ఎ) 20వేలు (బి) 63వేలు
(సి) 10వేలు (డి) 30వేలు
6. 11వ శతాబ్దంలో గుజరాత్‌ను పాలించిన సోలంకి వంశస్తురాలైన రాణి ఉదయమతి తన భర్త అయిన భీమ్‌దేవ్–1 జ్ఞాపకార్థం ఏమి నిర్మించారు?
(ఎ) సోమనాథ దేవాలయం (బి) రాణి–క–వావ్
(సి) బీబికమక్‌బారా (డి) గోల్ గుంబజ్
7. రాణి – క–వావ్ వివరాలేవి?
(ఎ) 65మీ × 20 మీ × 27 మీటర్లుకొలతలు
(బి) 100 అడుగుల లోతు (సి) సరస్వతి నది వరదలలో మునిగి, ఇసుకమేట వేసుకుపోయిన, రాణి కవావ్‌ను 1987లో ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా గుర్తించింది (డి) పైవన్నీ
8. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ (ఇసిబి) ప్రెసిడెంట్ ఎవరు?
(ఎ) మేరియోడ్రాఘి (బి) జేనెట్ అలెన్
(సి) క్రిస్టినాలగార్డే (డి) ఏంజెలామెర్కెల్
9. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) IFTRT : ఇండియన్ ఫైండేషన్ ట్రాన్స్‌పోర్ట్ రీసెర్చ్ & ఫౌండేషన్ (బి) AIMTC : ఆలిండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్
(సి) CCI : కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా
(డి) పైవన్నీ
10. సానియామీర్జా – బ్రెజిలియన్ పార్ట్‌నర్ బ్రూనోసోర్స్ (మిక్స్‌డ్ డబుల్స్) ఎక్కడ గెలిచారు?
(ఎ) యుఎస్ ఓపెన్ 2014 (బి) ఫ్రెంచ్ ఓపెన్
(సి) వింబుల్డన్ (డి) ఆస్ట్రేలియా ఓపెన్
11. భారత సుప్రీంకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తి ఎవరు?
(ఎ) జస్టిస్ హెచ్.ఎల్. దత్తు (బి) పి. సదాశివం
(సి) కె.జి. బాలక్రిష్ణన్ (డి) సుకుమార్‌సేన్
12. లోక్‌పాల్ సెర్చ్ కమిటికి ఎవరు రాజీనామా చేశారు?
(ఎ) జస్టిస్ కె.టి. థామస్ (బి) పి.జె. కురియన్
(సి) సి. రంగరాజన్ (డి) ముకుల్‌ముద్గల్
13. క్రీస్తుపూర్వం 800 సంవత్సరాలలో రాసిన ఐతరేయ బ్రాహ్మణ ప్రకారం అస్సక – జనపద సెటిల్‌మెంట్ ఏ నదుల మధ్య ప్రాంతంలో జరిగింది?
(ఎ) గోదావరి – మంజీర నదులు
(బి) ధరణికోట (అమరావతి)
(సి) విజయపురి (నాగార్జున కొండ)
(డి) కాంచీపురం
14. టోజి టెంపుల్ ఇటీవల ఎవరు సందర్శించారు?
(ఎ) నరేంద్రమోడీ (క్యోటో, జపాన్‌లో ఉన్నప్పుడు)
(బి) ఎ.బి. వాజ్‌పాయ్ (సి) ఎల్.కె. అద్వానీ
(డి) మురళీమనోహర్‌జోషి
15. నోర్బులింగ్‌క ఎవరి సమ్మర్ ప్యాలెస్?
(ఎ) షెరింగ్ టోబ్‌గే (బి) దలైలామా (1956 నుండి 1959 వరకు) (సి) షింజో అబే
(డి) గ్జిజిన్ పింగ్
16. ఇటీవల బీహార్‌లోని రాజ్‌గిర్‌లో ప్రారంభమైన నలంద విశ్వ విద్యాలయం వైస్ – ఛాన్సలర్ ఎవరు?
(ఎ) గోపశబర్‌వాల్ (బి) స్మితగుప్త
(సి) ముకుంద్‌వరదరాజన్ (డి) విక్రం
17. కేరళ కొత్త గవర్నర్ ఎవరు?
(ఎ) మాజీ ప్రధాన న్యాయమూర్తి పి. సదాశివం
(బి) విద్యాసాగర్ రావు
(సి) కళ్యాణ్‌సింగ్ (డి) కమలాబేనీవాల్
18. ఎల్ఐసిలో ఎంతమంది పాలసీదార్లు ఉన్నారు?
(ఎ) 30కోట్లు (బి) 95కోట్లు
(సి) 100 కోట్లు (డి) 40కోట్లు
19. ఇండియా – భారత దేశాలు సివిల్ – న్యూక్లియర్ ఒప్పందం చేసుకున్నాయి. ఈ రంగంలో ఏ సహకారాలకోసం?
(ఎ) యురేనియం సరఫరా (బి) రేడియో ఐసోటోప్‌ల ఉత్పత్తి (సి) న్యూక్లియర్ భద్రత మొదలైనవి (డి) పైవన్నీ
20. జీలంనది & తావినది ఏ రాష్ట్రంలో ప్రవహిస్తున్నాయి?
(ఎ) జమ్ము & కాశ్మీర్ (బి) రాజస్థాన్
(సి) గుజరాత్ (డి) మధ్యప్రదేశ్
21. యాంటి – టిబి డ్రగ్ రెసిస్టెన్స్ సర్వే ఇటీవల ఎవరు ప్రారంభించారు?
(ఎ) హర్షవర్ధన్ (బి) మార్గరెట్ అల్వా
(సి) ముజఫర్ ఆలీ (డి) టి.వి. గోపాలక్రిష్ణన్
22. RAPS యూనిట్ –5 నిరాఘాటంగా ఎన్ని రోజుల నుండి పని చేస్తోంది?
(ఎ) 765 (బి) 1000 (సి) 900 (డి) 800
23. 1620 కి.మీ పొడవుగల గంగ–హల్దియా నదీ జలమార్గం వలన ఏ పరిశ్రమలకు లాభం?
(ఎ) థర్మల్ పవర్ ప్లాంట్‌లు (బి) సిమెంట్
(సి) ఫెర్టిలైజర్స్ & వంటనూనెలు (డి) పైవన్నీ
24. 1.e4Vs డిఫెంచ్, కారో – కాన్ & ఫిలిడార్ అనే చదరంగం పుస్తకాన్ని రాసిందెవరు?
(ఎ) పరిమార్జన్ నేగి (బి) విశ్వనాథన్ ఆనంద్
(సి) కోనేరు హంపి (డి) మాగ్నస్ కార్ల్‌సన్
25. 17వ ఆసియా క్రీడలు ఇంఛియాన్ 2014లో నిర్వహించే క్రీడలేవి?
(ఎ) హాకీ (బి) కబాడీ (సి) టెన్నిస్ (డి) పైవన్నీ
26. రాబోయే 5 ఏళ్లల్లో జపాన్ దేశం, భారతదేశంలో రూ. 2.1 లక్షల కోట్లు (35.5బిలియన్లు డాలర్లు) పెట్టుబడి పెట్టదల్చుకున్న రంగాలేవి?
(ఎ) షింకన్ సెన్ (బుల్లెట్ ట్రైన్) (అహ్మదాబాద్ – ముంబయ్ రూట్)
(బి) ఎల్ఎన్‌జి & అప్ స్ట్రీం డెవలప్‌మెంట్ – ఆయిల్ & గ్యాస్ & క్లీన్ కోల్ టెక్నాలజీ
(సి) ఎనర్జీ కోఆపరేషన్ (డి) పైవన్నీ
27. కోర్‌సెక్టర్‌లో గల ఎనిమిది పరిశ్రమలలో ఏవి అభివృద్ధి చూపించి జులై 2014 వృద్ధిరేటు 2.7% దగ్గర ఉంచాయి?
(ఎ) బొగ్గు (బి) సిమెంట్
(సి) విద్యుచ్ఛక్తి ఉత్పత్తి (డి) పైమూడు
28. ఆర్‌బిఐ ఇటీవల బేసెల్–3 కాపిటల్ నార్మ్స్ ప్రకారం బ్యాంకులు వీటిని జారీచేసుకోవచ్చని తెలిపింది?
(ఎ) టైర్ –2 కాపిటల్, 5 సంవత్సరాల ఒరిజినల్ మెచ్యూరిటీ కాలపరిమితిగల డెట్ కాపిటల్ ఇన్‌స్ట్రుమెంట్స్ (బి) షేర్లు (సి) ప్రామిసరీనోట్లు (డి) పి–నోట్లు
29. 2014–15 ప్రథమ త్రైమాసికంలో, భారతదేశ కరెంట్ అకౌంట్ డెఫిసిట్ (సిఎడి) జిడిపిలో ఎన్ని బిలియన్‌ల అమెరికా డాలర్లుగా ఉంది?
(ఎ) 7.8 (బి) 21.8 (సి) 1.2 (డి) 4.5
30. ఇంటర్నెట్ గవర్నెన్స్ ఫోరం (ఐజిఎఫ్) మీటింగ్ ఇటీవల ఎక్కడ నిర్వహించారు?
(ఎ) ఇస్తాన్‌బుల్, టర్కీ (బి) టెల్ అవివ్
(సి) కె. నట్వర్‌సింగ్ (డి) వీరెవరు కారు

31. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) DNS : డొమైన్ నేమింగ్ సిస్టం (బి) TLD : టాప్‌లెవెల్ డొమైన్స్ (సి) IANA : ఇంటర్నెట్ ఎసైన్డ్ నంబర్స్ అథారిటీ (డి) పైవన్నీ

32. 69వ యుఎన్ జనరల్ అసెంబ్లీ సెషన్‌లో దేన్ని చర్చించదలిచారు?
(ఎ) ఓపెన్ వర్కింగ్ గ్రూప్ (ఓడబ్ల్యుజి) అవుట్‌కమ్ డాక్యుమెంట్ (బి) 17 ఆబ్జెక్ట్‌లు & 169 స్పెసిఫిక్ లక్ష్యాలు (సి) ట్రేడ్ ఫెసిలిటేషన్ ఎగ్రిమెంట్ (డి) ఇవేవీకావు

33. భారతదేశంలో దేన్ని తొలి & అతిపెద్ద న్యూక్లియర్ పార్క్ అంటారు?
(ఎ) రావత్ భట్ట (రాజస్థాన్ – ఆర్‌ఎపిఎస్)
(బి) కాక్రపార్ (సి) కుడంకులం (డి) కైగ

34. ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటి ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యుఎఐ) ఎంత ఖర్చుతో 1620 కి.మీ. హాల్దియా అలహాబాద్ జలమార్గం నిర్మించతలపెట్టింది? (కోట్ల రూపాయలలో)
(ఎ) 4200 (బి) 1800 (సి)2000 (డి) 3000

35. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) పోలీస్ యాక్ట్ : 1861
(బి) ఇండియన్ ట్రజర్ ట్రోల్‌యాక్ట్ : 1878
(సి) బెంగాల్ ఇండిగో కాంట్రాక్ట్స్ యాక్ట్ & బెంగాల్ డిస్ట్రిక్ట్స్ యాక్ట్ : 1836 (డి) పైవన్నీ

36. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) పవన శక్తి : 22,000 మెగావాట్లు
(బి) సౌరశక్తి : 2650 మెగావాట్లు
(సి) పరమాణు విద్యుశ్చక్తి : 4860 మెగావాట్లు
(డి) పైవన్నీ (ప్రస్తుతం భారతదేశంలోగల శక్తివనరుల ఉత్పత్తి సామర్థ్యం)

37. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) యుపి : కల్యాణ్ సింగ్ (బి) మహారాష్ట్ర : విద్యాసాగర్ రావు (సి) గోవా : మృదులాసిన్హా
(డి) పైవన్నీ

38. వాజుభాయ్ రుదాభాయ్ వాలా ఏ రాష్ట్ర నూతన గవర్నర్?
(ఎ) కర్నాటక (బి) యుపి
(సి) బీహార్ (డి) పశ్చిమబెంగాల్

39. ప్రతిపాదిత హైదరాబాద్ – నాగాపూర్ ఇండస్ట్రియల్ కారిడార్ పొడవెంత? (కిమిలలో)
(ఎ) 585 (బి) 600 (సి) 700 (డి) 800

40. నారిమన్ (ఛాబాద్) హౌస్ ఎక్కడుంది?
(ఎ) ముంబయ్ బి) కోల్‌కతా
(సి) అహ్మదాబాద్ (డి) వడోదర

41. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ & డెవలప్‌మెంట్ అథారిటీ (పిఎఫ్ఆర్‌డిఎ) చైర్మన్ ఎవరు?
(ఎ) యుకె సిన్హా (బి) ఆర్.వి. వర్మ
(సి) రఘురాం రాజన్ (డి) టి.ఎస్. విజయన్

42. దక్కన్ ఒడిస్సీలగ్జరీ రైలు ఏ రాష్ట్రాలలో తిరుగుతుంది?
(ఎ) మహారాష్ట్ర (బి) గుజరాత్
(సి) దక్కన్ & ఉత్తర భారతదేశం (డి) పైవన్నీ

43. రిచర్డ్‌అటెన్‌బరో (1923–2014) సినిమాలేవి?
(ఎ) గాంధీ (బి) జురాసిక్ పార్క్
(సి) బైటన్‌రాక్ (డి) పైవన్నీ

44. కాంకుర్స్ – M (ATGM) క్షిపణి ని ఎవరు తయారు చేశారు?
(ఎ) DRDO (బి)NASA (సి) ISRO (డి)BARC

45. యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం – (యుఐపి)లో ఏ వ్యాధి నిరోధక టీకాలు వేస్తారు?
(ఎ) రోటావైరస్ (బి) రూబెల్లా
(సి) పోలియో (ఇంజెక్టబుల్) (డి) పైవన్నీ

46. రూబెల్లా వల్ల కలిగే వ్యాధులు / లోపాలు ఏవి?
(ఎ) పుట్టుకతో వచ్చే లోపాలు (బి) చెవుడు
(సి) అంధత్వం, గుండెలో లోపాలు (డి) పైవన్నీ

47. నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్ లైఫ్ చైర్‌పర్సన్ ఎవరు?
(ఎ) ప్రధానమంత్రి (బి) పర్యావరణ మంత్రి
(సి) ఆర్థిక మంత్రి (డి) రక్షణ శాఖామంత్రి

48. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) డాన్స్ ఆఫ్ ది వీవ్ : బ్రియానో బ్లాస్కో
(బి) 'టాప్లింగ్ కడాఫీ' : క్రిస్టోఫర్ ఎస్.ఛివ్విస్
(సి) 'ది బ్రేవ్' : రఛ్న బిస్త్‌రావత్ (డి) పైవన్నీ

49. ఎప్పటి నుండి కేటాయించిన బొగ్గుబ్లాకులు, ఇల్లీగల్ అని సుప్రీంకోర్టు తీర్మానించింది?
(ఎ) 1993 (బి) 2012
(సి) 2013 (డి) 2014

50. 'నిక్ క్లెగ్' ఎవరు?
(ఎ) బ్రిటీష్‌దేశ ఉప ప్రధానమంత్రి
(బి) ఆస్ట్రేలియా ప్రధాన మంత్రి
(సి) భూటాన్ ప్రధానమంత్రి
(డి) నేపాల్ ప్రధానమంత్రి

51. మంజీర నది మీద నిజాం సాగర్ ఎవరు నిర్మించారు?
(ఎ) ఏడవ నిజాం (బి) తానీషా
(సి) కులికుతుబ్‌షా (డి) ఔరంగజేబ్

52. ఇండియన్ సూపర్‌లీగ్ (ఐఎస్ఎల్) దేన్ని ప్రోత్సహిస్తుంది?
(ఎ) ఫుట్‌బాల్ (బి) క్రికెట్
(సి) కబాడీ (డి) హాకీ

53. ఇపిఎఫ్ వేజ్ సీలింగ్ ఎంతకు పెంచారు?(నెలకి)
(ఎ) రూ. 15,000లు (బి) రూ. 10,000లు
(సి) రూ. 5,000లు (డి) రూ. 6,000లు

54. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) EPFO : ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్‌ఆర్గనైజేషన్ (బి) TEDLI : ఎంప్లాయీస్ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ (సి) EPFS : ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ స్కీం – 1995
(డి) పైవన్నీ

55. 1940లో ఎక్కడ కుమరం భీం అమరుడయ్యాడు?
(ఎ) జోడేఘాట్ గ్రామం (ఆదిలాబాద్ జిల్లా)
(బి) నిర్మల్ (సి) మంచిర్యాల (డి) సిర్‌పూర్ కాగజ్‌నగర్

56. ఉల్లిపాయల మినిమం ఎక్స్‌పోర్టు ప్రైజ్ ఎంత? (టన్నుకి)
(ఎ) 350 డాలర్లు (బి) 250 డాలర్లు
(సి) 200 డాలర్లు (డి) 300 డాలర్లు

57. ఐఎన్ఎస్ కమోర్తాని ఎక్కడ నిర్మించారు?
(ఎ)GRSE, కోల్‌కతా (బి) విశాఖపట్నం
(సి) ముంబయి (డి) కోఛి

58. సిక్కింలో ఉన్నవేవి?
(ఎ) ట్సోంగో (ఛాంగు) సరస్సు (బి) వాలీ ఆఫ్ ఫ్లవర్స్ (సి) గురుడొంగ్‌మార్ సరస్సు : నాథులాపాస్ (డి) పైవన్నీ

59. 'బార్డర్ బుంగా' అగ్ని పర్వతం ఎక్కడుంది?
(ఎ) దక్షిణాఫ్రికా (బి) ఐస్‌లాండ్
(సి) ఆస్ట్రేలియా (డి) న్యూజిలాండ్

60. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) TCM : ట్రాజెక్టరీ కరెక్షన్ మానోవర్ (బి) LAM : లిక్విడ్ ఎపోజీమోటార్ (సి) MDI : మార్స్ ఆర్బిట్ ఇన్‌సర్షన్ (డి) పైవన్నీ (అంగారక గ్రహయాత్ర కి సంబంధించినవి)

61. మార్స్ ఆర్బిటల్ మిషన్ వివరాలేవి?
(ఎ) భూమి నుండి 189 మిలియన్ కి.మి. దూరంలో ఉంది (బి) సూర్యుని చుట్టూ 600 మిలియన్ కిమి తిరిగింది (సి) లక్ష్యానికి 9 మిలియన్ కి.మి. దూరంలో ఉంది (డి) పైవన్నీ (ఆగస్టు 24, 2014 నాటికి)

62. వాటర్ ఎటిఎంలు ఏరాష్ట్రంలో ఏర్పాటుచేశారు?
(ఎ) రాజస్థాన్ (బి) గుజరాత్
(సి) పంజాబ్ (డి) బీహార్

63. నేచురల్ వరల్డ్ హెరిటేజ్ సెంటర్ ఎక్కడ ప్రారంభిస్తున్నారు?
(ఎ) వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా, డెహ్రాడూన్ (బి) హరిద్వార్
(సి) వారణాసి (డి) అలహాబాద్

64. కేవల్ దేవ్ నేషనల్ పార్క్ ఎక్కడుంది?
(ఎ) భరత్‌పూర్, రాజస్థాన్ (బి) అస్సాం
(సి) హిమాచల్ ప్రదేశ్ (డి) కర్ణాటక

65. మౌంట్ తవూర్‌వుర్ ఎక్కడుంది?
(ఎ) రాబెల్, ఈస్టర్న్ పాపువాన్యూగయానా
(బి) రష్యా (సి) బ్రెజిల్ (డి) అర్జెంటీనా

66. బిపిన్ చంద్ర (1928–2014) రచించిన పుస్తకాలు ఏవి?
(ఎ) హిస్టరీ ఆఫ్ మోడ్రన్ ఇండియా
(బి) ఇండియాస్ స్ట్రగుల్ ఫర్ ఇండిపెండెన్స్
(సి) ఇండియా సిన్స్ ఇండిపెండెన్స్ (డి) పైవన్నీ

67. 'శివ క్రేటర్' ఎక్కడుంది? వివరాలేవి?
(ఎ) దీని డయామీటర్ : 500 కిమీ
(బి) ముంబయ్ ఆఫ్ షోర్ బేసిన్‌లో ఉంది
(సి) 2 నుండి 6 కిమీలోతులో ఉంది (డి)పైవన్నీ

68. పంచేశ్వర్ డ్యాం వివరాలేవి?
(ఎ) 1996– ఇండియా , నేపాల్ మహాకాళి ఒప్పందంలో భాగం, ఇది (బి) పంచేశ్వర్ డ్యాంసైట్‌కి 10కి.మీ. రేడియన్‌లో 1992–2006 మధ్యకాలంలో 10 భూకంపాలు వచ్చాయి (సి) 5600 ఎం.డబ్ల్యు పంచేశ్వర్ మల్టిపర్పస్ ప్రాజెక్టు ఇటీవల చర్చలలోకి వచ్చింది. (డి) పైవన్నీ

69. 'లాగింగ్, బిలాగింగ్ : యాన్ అవుట్‌సైడర్ ఎట్ హోం ఇన్ కల్‌కత" రచయిత ఎవరు?
(ఎ) బిశ్వనాథ్‌ఘోష్ (బి) షానాజ్ బషీర్
(సి) అకిల్‌షా (డి) డాన్ వైలెట

70. 'మిషింగ్' ప్రజలు ఎక్కడ నివశిస్తున్నారు?
(ఎ) బ్రహ్మపుత్రనది ఒడ్డున (అస్సాంలో)
(బి) గంగానది ఒడ్డున (సి) యమునానది ఒడ్డున
(డి) చంబల్ నది ఒడ్డున

71. మంజుల్ భార్గవ ఏ అవార్డు అందుకున్నాడు?
(ఎ) ఫీల్డ్స్ మెడల్ (బి) బుకర్ ప్రైజ్
(సి) పులిట్జర్ అవార్డ్ (డి) ఆస్కార్ అవార్డ్

72.ఏ నది మీద మోసుల్ డ్యాం నిర్మించారు?ఎక్కడ?
(ఎ) టైగ్రిస్‌నది, ఇరాక్ (బి) నైలు నది
(సి) థేమ్స్ నది (డి) మాస్కోనది

73. లండన్‌లో బిగ్ బెన్‌గడియారం (పార్లమెంట్ హౌస్‌లది) ఎప్పుడు ప్రారంభించారు?
(ఎ) 1859 (బి) 2010
(సి) 1757 (డి) 1813

74. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) 'పాలిటిక్స్ ట్రంప్స్ ఎకనామిక్స్ : బిమల్ జలన్ & పులాప్రే బాలక్రిష్ణన్ (ఎడిటెడ్‌బై)
(బి) 'రీమాసింగ్ ఇండియా' : లేసీ టెల్లిన్
(సి) 'కొమగా టమారు...' : మాల్విందర్ సింగ్ వారాయిఛ్ (డి) పైవన్నీ

75. ఇటీవల పటౌడిట్రోఫీ ఎవరికిచ్చారు?
(ఎ) అలాస్టైర్‌కుక్ (బి) ఎం.ఎస్. ధోని
(సి) కపిల్ దేవ్ (డి) రవిశాస్త్రి

76. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) ILDO : ఇంటర్నేషనల్ లాంగ్ డిస్టెన్స్ ఆపరేటర్స్
(బి) ISD : ఇంటర్నేషనల్ సబ్ స్క్రైబర్ డైలింగ్
(సి) TSD: టెలికాం సర్వీస్ ప్రొవైడర్ (డి) పైవన్నీ

77. భారతదేశంలో అపోజిషన్ పార్టీ లీడర్ చట్టం, ఎప్పుడు ఆమోదించారు?
(ఎ) 1977 (బి) 1975
(సి) 1947 (డి) 1951

78. భారతదేశంలో ప్రవేశపెట్టదల్చుకున్న బుల్లెట్ ట్రైన్ వేగం ఎంత? (kmph లో )
(ఎ) 350 (బి) 150 (సి) 100 (డి) 120

79. 'అష్టముడిలేక్' ఎక్కడుంది?
(ఎ) కర్నాటక (బి) కేరళ
(సి) మహారాష్ట్ర (డి) గోవా

80. ఇటీవల జమ్ము & కాశ్మీర్‌లో ఏ నదికి వరదలు వచ్చాయి?
(ఎ) జీలం (బి) బ్రహ్మపుత్ర
(సి) గంగ (డి) యమున

81. యుఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ విజేత ఎవరు (2014)?
(ఎ) కరోలినా వోజ్నియాకి
(బి) సెరెనా విలియమ్స్
(సి) పెట్రక్విటోవా (డి) షెరపోవా

82. 'సాగర్ శక్తి' దేనిపేరు?
(ఎ) ఓఎన్‌జిసి ఆయిల్‌రిగ్ (బి) యుద్ధనౌక
(సి) రిసెర్చ్ నౌక (డి) ఇవేవీ కావు

83. 500 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో క్రిష్ణా – గోదావరి (కెజీ) బేసిన్‌లో (కాకినాడకు దగ్గర్లో) ఎంత క్రూడాయిల్ లభ్యం అవుతుందని ఇటీవల ఓఎన్‌జిసి తెల్పింది? (బారెల్స్ ఒక రోజుకి)
(ఎ) 70వేలు నుండి 90వేలు (బి) 40వేలు
(సి) 30వేలు (డి) 20వేలు

84. ఈ క్రింది వాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) 'దిద్యూరబుల్ స్లం ' : లిజావీన్‌స్టీన్
(బి) వెన్‌మీడియాగోస్‌టువార్ : ఆంథోని డిమాజియో
(సి) ఇన్‌సైడ్ దిసోలిడ్ స్టేట్ : ఎస్. క్రిష్ణన్, ఎస్. ప్రభల, వి.కె. కోషి (డి) పైవన్నీ

85. యు.ఎన్. హైకమిషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ ఎవరు?
(ఎ) జోర్డాన్ ప్రిన్స్ జీద్‌రాద్ ఆల్ హుస్సేన్
(బి) జోకోవిడోడో
(సి) డిక్స్మిత్ (డి) ఫాద్ మసుమ్

86. కావేరి నది ఏ రాష్ట్రంలో ఉంది
(ఎ) తమిళనాడు (బి) జమ్ము & కాశ్మీర్
(సి) మహారాష్ట్ర (డి) మధ్యప్రదేశ్

87. ASEAN తో భారతదేశం ఏ అంగాలపై ఇటీవల ఫ్రీట్రేడ్ ఎగ్రిమెంట్ చేసుకుంది?
(ఎ) సర్వీసెస్ & ఇన్వెస్ట్‌మెంట్స్
(బి) రక్షణ (సి) వ్యవసాయం (డి) సినిమా

88. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) 'దిలేడి' : ఆంగ్‌సాన్ సూకీ, మయన్‌మార్
(బి) 'ఇన్‌విక్టస్' : నెల్సన్‌మండేలా, దక్షిణాఫ్రికా
(సి) 'మేరికాం' : మేరికాం, మణిపూర్, ఇండియా
(డి) పైవన్నీ (జీవిత చరిత్రమీద ఆధారపడిన సినిమాలు – బయోపిక్)

89. టిఎస్ఆర్ సుబ్రమణియన్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన హుల్త్‌వెల్ కమిటీ ఏ చట్టాలను పరిశీలిస్తుంది?
(ఎ) ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ 1986
(బి) ఫారెస్ట్ కన్సర్వేషన్ యాక్ట్, 1980
(సి) వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్‌యాక్ట్, 1972
(డి) పైవన్నీ

90. 1980 నుండి ఇప్పటివరకు, ఎన్ని హెక్టార్ల అటవీ భూముల్ని ఎకోటూరిజం వంటి పనులకు అనుమతించింది?
(ఎ) 11,29,294 (బి) 50,000
(సి) 60,000 (డి) 40,000

91. ఎవర్ని లార్డ్ హారిస్‌గా పలిచేవారు?
(ఎ) జార్జ్‌రాబర్ట్ కానింగ్ (1890–1895) మధ్యకాలంలో ముంబయ్ గవర్నర్‌గా పనిచేశారు (బి) వారెన్ హేస్టింగ్స్
(సి) కార్న్‌వాలీస్ (డి) రాబర్ట్ క్లైవ్

92. "మారంక్రేటర్" ఎక్కడుంది?
(ఎ) ఆంబ్రిం వల్కనో, వనౌతుదీవి దేశం, దక్షిణ పసిఫిక్ మహాసముద్రం (బి) మహారాష్ట్ర
(సి) కెనడా (డి) దక్షిణాఫ్రికా

93. 'మన్నంట్రోఫీ' (స్నేక్ బోట్ పోటీలో) ఇటీవల ఎవరు గెల్చుకున్నారు?
(ఎ) చెదుంప్రయార్ & ఎడక్కులం
(బి) జెన్నితలపల్లియోదం (సి) మల్లపుజస్సెరి
(డి) అరట్టపుజ

94. న్యూక్లియర్ పవర్ స్టేషన్ ఏర్పాటు చేయనున్న కొవ్వాడ (శ్రీకాకుళం జిల్లా)ని ఎన్ని జోన్‌లుగా వర్గీకరించారు?
(ఎ) ఎక్స్‌క్లూజన్ జోన్, స్టెరిలైజేషన్ జోన్
(బి) ఎమర్జెన్సీ ప్లానింగ్ జోన్ (సి) ఇంపాక్ట్ ఎసెస్‌మెంట్ జోన్ (డి) పై నాలుగు జోన్‌లుగా

95. స్ట్రాటోస్ఫియర్ (17100 అడుగుల ఎత్తు) వరకు విమానంలో ప్రయాణించిన తొలి భారతీయుడు ఎవరు?
(ఎ) టి.ఎన్. సురేష్ కుమార్ (బి) గీత
(సి) రాకేష్ శర్మ (డి) సునీతవిలియమ్

96. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) 'హౌటుబిబోత్' : అలిస్మిత్
(బి) 'ది లైవ్స్ ఆఫ్ అదర్స్ : నీల్ ముఖర్జీ
(సి) 'టురైజ్ ఇన్ ఏడీసెంట్ అవర్' : జాఘూవాఫెర్రిస్ (డి) పైవన్నీ

97. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అభివృద్ధి చేసిన మాలిక్యులార్ 'స్నిఫ్ఫర్ డాగ్' వేటిని గుర్తిస్తుంది?
(ఎ) టిఎన్‌టి & ఇతర నైట్రోఆరోమాటిక్ కాంపౌండ్ (మిశ్రమాలు) (పేలుడు పదార్థాలు)
(బి) ఆర్‌డిఎక్స్ & అమ్మోనియం నైట్రేట్
(సి) గంధకం (డి) మెగ్నీషియం

98. 2012–13లో ఏ రాష్ట్ర జీఎస్‌డిపి వృద్ధిరేటు 10.73 ఉండి అత్యున్నతస్థానంలో ఉంది, సిఎస్ఓ లెక్కల ప్రకారం?
(ఎ) బీహార్ (బి) మధ్యప్రదేశ్
(సి) కేరళ (డి) ఒడిషా

99. ఈ క్రిందివాటిల్లో ఏది కరెక్ట్?
(ఎ) NGT : నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్
(బి) ESA: ఎకలాజికల్లీ సెన్సిటివ్ ఏరియా
(సి) EIA : ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ ఎసెస్‌మెంట్ రిపోర్టు (డి) పైవన్నీ

100. మారిన్‌సిలిక్ ఏదేశస్థుడు?
(ఎ) క్రోషియా (బి) జపాన్
(సి) దక్షిణాఫ్రికా (డి) ఇంగ్లాండ్

**జవాబులు (అక్టోబరు 2014)**

| | | | |
|---|---|---|---|
| 1 – ఎ | 26 – డి | 51 – ఎ | 76 – డి |
| 2 – బి | 27 – డి | 52 – ఎ | 77 – ఎ |
| 3 – డి | 28 – ఎ | 53 – ఎ | 78 – ఎ |
| 4 – ఎ | 29 – ఎ | 54 – డి | 79 – బి |
| 5 – బి | 30 – ఎ | 55 – ఎ | 80 – ఎ |
| 6 – బి | 31 – డి | 56 – ఎ | 81 – బి |
| 7 – డి | 32 – ఎ | 57 – ఎ | 82 – ఎ |
| 8 – ఎ | 33 – ఎ | 58 – డి | 83 – ఎ |
| 9 – డి | 34 – ఎ | 59 – బి | 84 – డి |
| 10 – ఎ | 35 – డి | 60 – డి | 85 – ఎ |
| 11 – ఎ | 36 – డి | 61 – డి | 86 – ఎ |
| 12 – ఎ | 37 – డి | 62 – ఎ | 87– ఎ |
| 13 – ఎ | 38 – ఎ | 63 – ఎ | 88 – డి |
| 14 – ఎ | 39 – ఎ | 64 – ఎ | 89 – డి |
| 15 – బి | 40 – ఎ | 65 – ఎ | 90 – ఎ |
| 16 – ఎ | 41 – బి | 66 – డి | 91 – ఎ |
| 17 – ఎ | 42 – డి | 67 – డి | 92 – ఎ |
| 18 – ఎ | 43 – డి | 68 – డి | 93 – ఎ |
| 19 – డి | 44 – ఎ | 69 – ఎ | 94 – డి |
| 20 – ఎ | 45 – డి | 70 – ఎ | 95 – ఎ |
| 21 – ఎ | 46 – డి | 71 – ఎ | 96 – డి |
| 22 – ఎ | 47 – ఎ | 72 – ఎ | 97 – ఎ |
| 23 – డి | 48 – డి | 73 – ఎ | 98 – ఎ |
| 24 – ఎ | 49 – ఎ | 74 – డి | 99 – డి |
| 25 – డి | 50 – ఎ | 75 – ఎ | 100–ఎ |

# మీకు తెలుసా ?

## గ్రీన్ బాక్స్

ప్రపంచ వాణిజ్య సంస్థ వారి పదజాలంలో గ్రీన్‌బాక్సు, రెడ్‌బాక్సు అనే ప్రయోగాలున్నాయి. ఉరుగ్వే ప్రపంచ వాణిజ్య చర్చల అనంతరం సభ్యదేశాలు తమ తమ జాతీయ వ్యవసాయంలో రక్షణలు, రాయితీలను తప్పనిసరిగా ఇవ్వవలసిన అంశాలను, ఇవ్వకూడని అంశాలను ట్రాఫిక్ సిగ్నళ్ళ భాషనుపయోగించి గ్రన్ బాక్సు అనీ, రెడ్ బాక్సు అనీ పిలవడం ప్రారంభించాయి. మధ్యమార్గంగా రాయితీలు /రక్షణలు ఇస్తే తప్పులేదు. ఇవ్వకపోయినా ఫర్వాలేదు అనుకున్న అంశాలను 'అంబర్ బాక్స్'లో చేర్చాయి.

వీటిలో గ్రీన్ బాక్సుకు అర్హత పొందే అంశాలు దేశీయ వాణిజ్యానికి ఏవిధంగాను ఆటంకం కారాదు. ప్రభుత్వ నిధులు పొందుతూ వినియోగదారులనుండి అధికస్థాయిలో ధరను వసూలు చేసేది కాకూడదు. రైతులకు నేరుగా ఆదాయన్ని అందించేదిగా ఉండాలి. అదేవిధంగా పర్యావరణానికి హానికలించేదికాకూడదు. ప్రభుత్వం ఇందుకోసం రూపొందించిన నియమ నిబంధనలు తూ.చ. తప్పకుండా అమలు చేస్తే పూర్తిస్థాయి రాయితీలకు రక్షణకు అర్హమవుతాయి. రైతులకు కనీస మొత్తంలో ఆదాయ హామీనిచ్చే అంశాలు ఈ గ్రీన్ బాక్స్‌లో ఉంటాయి. అయితే ఈ గ్రీన్ బాక్సు నిబంధనలను ప్రపంచవాణిజ్య సంస్థ నిర్దేశాలకు అనుగుణంగా ఏ దేశానికి ఆదేశం నిర్ణయించుకోవలసి ఉంటుంది.

ఇక అంబర్ బాక్స్ విషయానికి వస్తే, దేశీయంగా ఉత్పత్తి, వాణిజ్యాలను దెబ్బతీసే కొన్ని మినహాయింపులతో అన్ని అంశాలు ఈ విభాగంలోకి వస్తాయి. వ్యవసాయ ఒప్పందం ఆర్టికల్ 6లో వీటిని సమగ్రంగా పేర్కొన్నారు. అయితే ఈ మినహాయింపు అభివృద్ధి చెందిన దేశాలయితే మొత్తం ఉత్పత్తులలో ఐదుశాతాన్ని మించరాదు. అదే అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో అయితే 10శాతాన్ని మించరాదు.అయితే ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ) లోని 30 సభ్యదేశాలలో కొన్ని ఈ మధ్య మార్గం అసలే వద్దనే వాదిస్తున్నాయి. కొన్ని దేశీయ ఉత్పత్తులు వాటి వాటి మార్కెట్‌ధరలలోని తేడాల వలన ఎగుమతి రాయితీల వంటి ప్రభావాన్నేకలుగచేస్తున్నాయి. దీనికి తోడు వీటి ఉత్పత్తిలో అధిక భాగాన్ని ఎగుమతి చేస్తారు. అందువల్ల వీటికి దేశీయ రక్షణ కల్పించకపోయినా పోయేదేమి లేదని వారి వాదన.

ఈ రకమైన రెండు బాక్సుల ప్రతిపాదనలు, వాటి రక్షణలను ఎత్తివేయాలనే అభివృద్ధి చెందిన దేశాల వాదనల (వాటి ఉత్పత్తులు మార్కెట్‌కోసం) ఫలితంగా ఉరుగ్వే చర్చలలో ప్రతిష్టంబన ఏర్పడింది.

## ఫోరెన్సిక్ ఆడిటింగ్

ఫోరెన్సిక్ ఆడిటింగ్ లేదా ఫోరెన్సిక్ అకౌంటింగ్ అంటే వ్యక్తుల లేదా కంపెనీల ఆర్థిక కార్యకలాపాలలో ఏవైనా అనుమానాస్పద లావాదేవీలు ఉంటే, వాటి అనుపానులు కనుగొనటానికి చేసే విచారణ. ఈ విచారణలో ముందు అసలు ఏదైనా మోసం లేదా,అవినీతి కార్యకలాపం జరిగిందా లేదా అని విచరిస్తారు. ఒక వేళ ఆధారాలు దొరికితే, దానిని గూర్చి కూలంకషంగా విచారించి పూర్తిగా నిర్ధారణ చేసుకుని తర్వాతనే తుది నివేదికను బాధితుడైన వ్యక్తికీ లేదా కంపెనీకి అందచేస్తారు. అతను ఏ మేరకు నష్టపోయాడో అంచనా వేస్తారు. తదనుగుణంగా ఫిర్యాదును న్యాయస్థానానికి నివేదిస్తారు. అవినీతి వాసనలు తగులుతూనే, ఫోరెన్సిక్ ఆడిటింగ్ నిపుణులు రంగంలోకి దూకుతారు. ఇందుకోసం నిపుణులకు తగిన శిక్షణ కూడా ఇస్తారు. మనదేశంలో కంపెనీల చట్టం సెక్షన్ 177 ప్రకారం ఆడిట్ కమిటీ కి సమగ్ర విచారణ చేసి, అవసరమైతే బయటి వ్యక్తులు, సంస్థలను కూడా విచారించి సమాచారాన్ని పొందే హక్కు ఉన్నది. ఈ చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ ద్వారా సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసును ఒకదానిని ప్రారంభించి, దాని నిర్వహణకు ఒక డైరెక్టర్ స్థాయి అధికారిని, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, టాక్సేషన్, ఆడిటింగ్ మొదలైన రంగాలలో నిష్ణాతులైన వ్యక్తులను సభ్యులుగానూ నియమించవచ్చు.

మనదేశంలో KPMG అనే సంస్థ ఇలాంటి విచారణలలో ముందున్నది. తన 691 మంది సిబ్బందితో 2010–11 సంవత్సరంలో కేవలం 77 కేసులను మాత్రమే విచారిస్తే, ఈ సంవత్సరం 1220 కేసులను విచారించింది.

*యోజన సంపాదకవర్గం*

ప్రత్యేక వ్యాసం

# ఆర్థిక సమ్మిళతకు రాజమార్గం ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన

ఏ ప్రమాణాల ప్రకారం చూసినా మన దేశంలో ఆర్థిక సమ్మిళత అనేది చాలా కనిష్ట స్థాయిలో ఉన్నది. ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధిచెందిన దేశాలతో పోలిస్తే 2012 నాటికి మనదేశంలో 15 సంవత్సరాల పైబడి వయసు గల వారిలో బ్యాంక్ ఖాతాలున్న వారు కేవలం 35 శాతం మాత్రమే! మిగిలిన అభివృద్ధి చెందిన దేశాలలో కనీసం 41 శాతం మంది బ్యాంక్ ఖాతాలు కలిగి ఉన్నారు. తరువాతి కాలంలో రిజర్వ్ బ్యాంక్ వారి ప్రత్యేక చర్యల కారణంగా 2011-13 సంవత్సరాలలో మరో 100 మిలియన్ల మంది బ్యాంక్ ఖాతాలను తెరిచారు. నేడు స్థూలంగా 229 మిలియన్లమందికి బ్యాంక్ ఖాతాలు ఉన్నాయి. అయినప్పటికి ఇంకా బ్యాంక్ శాఖలు లేని గ్రామాలు ఎన్నో! వాణిజ్య బ్యాంక్ లు అందచేస్తున్న మొత్తం ఋణ సదుపాయంలో కేవలం 10 శాతం మాత్రమే 70 శాతం ప్రజలు నివశిస్తున్న గ్రామాలకు చేరుతున్నది. కనుక ఇలాంటి ఆర్థిక సమ్మిళత కార్యక్రమాలు మనకు అవసరం అనటంలో ఎంతమాత్రము సందేహంలేదు.

ప్రధానమంత్రి జన్ ధన్ యోజన 28 ఆగస్ట్, 2014న ప్రారంభమైంది. ఈ కార్యక్రమం క్రింద మొదట్లో సంవత్సరానికి 7.5 కోట్ల కుటుంబాలచేత బ్యాంక్ ఖాతాలు ప్రారంభింపచేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. అంటే ఆగష్టు 15, 2015 నాటికి అన్నమాట! అయితే పథకం ప్రారంభించిన మొదటి రోజునే రెండు కోట్లకు పైగా ఖాతాలను తెరిపించారు. అర్హులైన ప్రతి భారతీయునికీ ఒక బ్యాంక్ ఖాతా ఉండేలా చూడాలనదే అంతిమ లక్ష్యం. మొదటి దశలో ప్రతి కుటుంబానికీ ఒక బ్యాంక్ ఖాతా కనీసం ఉండాలి. ఆర్థిక అక్షరాస్యతను అట్టడుగు స్థాయికి చేరేలా చూస్తారు. దీనితో నగదు బదిలీ పథకాన్ని విజయవంతంగా అమలు చేయడం వీలవుతుంది.

రెండవ దశలో అందరికీ బీమా సౌకర్యము పెన్షన్ వంటి ఆర్థిక సేవలను అందేలా చూస్తారు. ఇప్పటివరకు బ్యాంక్ శాఖలు లేని ప్రాంతాలలో వెంటనే వాటిని ప్రారంభించడం వీలు కాదు కనుక, బ్యాంక్ కరస్పోండెంట్ లను ఎక్కువగా వియోగి స్తారు. మిగిలిన అభివృది చెందుతున్న దేశాలతో పోలిస్తే మనదేశంలో ప్రజలకు బ్యాంక్‌ల సేవల అందుబాటు తక్కువగానే ఉన్నది.

**ఈ ఆర్థిక సమ్మిళతకు ఉన్న ప్రాధాన్యత ఎంత?**

ఉపాధి అవకాశాల పెంపుకు, ఆర్థికాభివృద్ధికి ఈ ఆర్థిక సమ్మిళత ఎంతో అవసరం. దీనివల్ల సేవలను అందచేసే ఖర్చు తగ్గడమే కాక, పంపిణీ సక్రమంగా జరుగుతుంది. పేదరికాన్ని తగ్గించడానికి అవకాశముంటుంది. అందరికీ ఋణ సౌకర్యాలు, ఇతర అభివృద్ధి అవకాశాలు సమంగా అందటంవల్ల సామాజిక సమానత్వం కూడా సాధ్యమవుతుంది. రుణాలకు హామీలను ఇవ్వలేని పేదలకు, ఇలాంటి మిగతా వారికీ ఇది మహదావకాశం.

భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలోని అసంఘటిత ఆర్థిక వ్యవస్థలో ఉండే పేద కుటుంబాలు తమ ఆర్థిక కార్యకలాపాలను కూడా అసంఘటిత మార్గాలలోనే, అంటే మిత్రుల నుండి, వడ్డీ వ్యాపారుల నుండి చేస్తూ వుంటారు. దీనివల్ల ఆర్థిక అక్రమాలకు, దోపిడీకి అవకాశం ఎక్కువ. అయితే బ్యాంకుల ద్వారా మాత్రమే ఆర్థిక లావాదేవీలను నిర్వహిస్తుంటే దేశీయ పొదుపు రేటు కూడా పెరుగుతుంది. మనదేశంలో ఆర్థిక సంస్కరణలు అంటే ద్రవ్య సంబంధ సంస్కరణలే అధికం. దీనికోసం బ్యాంకులవంటి ఆర్థిక సంస్థలను ఎక్కువగా ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రజలకు అందుబాటులోనికి తేవాలి. పొదుపు అవకాశాలు అందుబాటులో

**ప్రవాకర్ సాహూ,** అసోసియేట్ ప్రొఫెసర్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్, ఢిల్లీ

లేకపోతే, పేదాలు తమ ఆర్జన మొత్తాన్ని ఖర్చు చేయడానికి ప్రలోభపడుతుంటారు. ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన (PMJDY ) క్రింద లబ్దిదారులకు ఋణసదుపాయం అందచేస్తారు కనుక పేదలకు ప్రయోజనంకలుగుతుంది. దీనితో వారు కొంత స్థిరపడిన తరువాత తాము స్వయంగా ఆర్థిక లావాదేవీలలో నిర్ణయాధికారం పొందగలుగుతారు. లక్ష రూపాయల వరకు బీమా సౌకర్యం ఉండటంవల్ల కొంత రిస్క్ తీసుకోవడానికి కూడా వెనుకాడరు. ఇలాంటి చర్యలవల్ల ప్రజలకు తమ ఆర్థిక కార్యకలాపాల ద్వారా సంఘటిత రంగంలోకి వస్తారు.

**PMJDY పరిధి – బ్యాంకింగ్ సేవలు**

ఈ పథకం ప్రధాన ఉద్దేశం బ్యాంక్ ఖాతాలను తెరిపించడం. దీనితోపాటు ఆగస్టు 15, 2015 ముందు ఖాతాలను ప్రారంభించినవారికి రూపే డెబిట్ కార్డ్, ప్రమాద బీమాలతో పాటు జీవిత బీమా సౌకర్యాలను అందచేస్తారు. ఖాతాలను సక్రమంగా నిర్వహించిన వారికి ఋణ సౌకర్యం కూడా అందచేస్తారు. సగటున ఒక బ్యాంక్ ఖాతాను ప్రారంభించడానికి సిబ్బందికి కనీసం 20 నిముషాలు పడుతుంది. దానితో 100 మిలియన్ల ఖాతాలను తెరవడానికి మూడు సంవత్సరాల కాలం పడుతోంది. ఇది లక్ష్య సాధనకు ప్రతిబంధకమే! మరో విషయంకూడా ఉంది. ఖాతాల సంఖ్య పెరిగిన కొద్దీ బ్యాంక్ సిబ్బందిపై పని వొత్తిడి తీవ్రంగా పెరుగుతుంది. నేటికీ రష్యా, బ్రెజిల్, మెక్సికో లతో పోలిస్తే మనదేశంలో ప్రతి లక్షమంది జనాభాకు అందుబాటులో ఉన్న బ్యాంక్ శాఖల సంఖ్య బాగా తక్కువగా ఉన్నది. ఇప్పటికే మనదేశంలో బ్యాంకింగ్ సేవల అందుబాటు లేని ప్రజలు 42 శాతం కన్నా ఎక్కువే!

వీరందరూ వడ్డీ వ్యాపారులవంటి జలగల పాలు పడ్డారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1,15,082 జాతీయ బ్యాంక్ ల శాఖలు, 1,60,055 ATMలు ఉన్నాయి. వీటిలో 43,962 బ్యాంక్ లు (అంటే 38.2 శాతం) 23,334 ATMలు అంటే 14.58 శాతం గ్రామీణ ప్రాంతాలలో ఉన్నాయి. వాణిజ్య బ్యాంకులు కనీసం నిర్ణీత సంఖ్యలో తమ శాఖలను గ్రామీణ ప్రాంతాలలో ప్రారంభించాలని రిజర్వ్ బ్యాంక్ ఆదేశించడంతో కనీసం ఇదన్నా వీలయింది. అయితే సమాంతర ఆర్థిక సేవల వెసులుబాటు ఉన్న పోస్ట్ ఆఫీసులు మరింత ఎక్కువగా గ్రామాలలో ఉండటం వల్ల వాటి సేవలను కూడా ఈ పథకం క్రింద పొందవచ్చు. కానీ డెబిట్ కార్డుల ప్రస్తావన ఉండటంతో ATMలకే ఎక్కువ ప్రాధాన్యం.

మనదేశంలో సగటున ప్రతి లక్షమంది ప్రజలకు ఒక ATM అందుబాటులో ఉన్నది. అదే ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఉదాహరణకు రష్యాలో 182 ATMలు, బ్రెజిల్‌లో 118 ATMలు, మెక్సికోలో 47 ATMలు, చైనాలో 37 ATMలు అందుబాటులో ఉన్నాయి. రష్యాలో 2007 నాటి 45 నుండి 2012కు 182 కు పెరిగితే, మనదేశంలో కేవలం మూడు నుండి 11 కు పెరిగాయి. నేడు ఈ PMJDY వల్ల ఇవి మరింతగా వృద్ధిచెందుతాయని ఆశించవచ్చు.

బీమా సేవల నియంత్రణ (IRDA) చట్టం అమలులోకి వచ్చిన తర్వాత దేశంలోని బీమా వ్యాపార విస్తృతి ఆరు కంపెనీల నుండి 51 జీవిత, జీవితేతర బీమా కంపెనీలకు పెరిగింది. దానితో సహజంగానే బీమా సౌకర్య విస్తృతి కూడా పెరిగింది. 2011–12 వ సంవత్సరంలో బీమా పరిశ్రమలో ఈక్విటీ పెట్టుబడి 32,328 కోట్ల రూపాయలు గా ఉండేది. దీనిలో జీవిత బీమా వాటా 77 శాతంగా ఉండేది. ఇది 2012 నాటికి జీవిత బీమా వాటా 8.5 శాతానికి (ఇదే మిగిలిన ప్రపంచంలో 2.5 శాతం మాత్రమే) జీవితేతర బీమా 13.5 శాతానికి చేరింది. నేడు సమ్మిళిత వృద్ధి లక్ష్యాలను చేరాలంటే బీమా కంపెనీలకు ఇంకా 61,200 కోట్ల రూపాయల పెట్టుబడి అవసరమని IRDA అంచనా వేసింది. ప్రైవేటు, విదేశీ కంపెనీలను (26 శాతం గరిష్ట పరిమితితో) అనుమతించినప్పటికీ ఇంకా గమ్యం దూరంలోనే ఉన్నది. జీవితేతర బీమా సౌకర్యం కల్పించడంలో మనదేశం ప్రపంచంలో 52వ స్థానంలో ఉన్నది. మరో సూచిక ఏమంటే, మనదేశంలో బీమా సాంద్రత (తలసరి ప్రీమియం లెక్కలో) కూడా తక్కువగానే ఉన్నది.

మన దేశంలో తలసరి ప్రీమియం జీవిత బీమా కు 49 డాలర్లు, జీవితేతర బీమాకు 10 డాలర్లు ఉంటే, చైనాలో 99, 64 డాలర్ల చొప్పున ఉన్నది. లక్ష్యాలు ఎలావున్నా, వాటి అమలు, బ్యాంకింగ్ సేవల విస్తృతి మీదనే ఈ పథకం విజయం అధికంగా ఆధారపడి ఉన్నది.

**ఇతర ప్రాంతాలలో ఆర్థిక సమ్మిళత**

ఆర్థిక సమ్మిళతానికి బాంకుల ద్వారా లావాదేవీలను నియంత్రించడం రాజమార్గమే! అయితే అన్నిచోట్లా బ్యాంక్ శాఖలను ప్రారంభించడమెంటే ఎంతో శ్రమ వ్యయభారమూనూ. అందుకే అనేక అభివృద్ధిచెందుతున్న ఆర్థిక వ్యవస్థలు, బ్రెజిల్ వంటివి బ్యాంక్ కరస్పాండెంట్ వ్యవస్థను మొదలు పెట్టాయి. దీనినే మన దేశం కూడా అనుసరిస్తున్నది. అక్కడ మూడు సంవత్సరాల్లో 95,000 ల మంది కరస్పాండెంట్లు దేశం నలుమూలల తమ సేవలతో 12 మిలియన్ల ఖాతాలను తెరిపించి అక్కడి ఆర్థిక సమ్మిళతకు కృషి చేశారు. దీనితో స్ఫూర్తి పొందిన ఇతర ఉత్తర అమెరికా దేశాలు, కొలంబియా, మెక్సికో, చిలీ వంటివి కూడా ఈ పద్ధతిని అమలు చేశాయి. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం మరో ఆర్థిక సమ్మిళత మార్గము. భౌతిక సౌకర్యాలు తక్కువగా ఉన్న ఆఫ్రికా దేశాలలో ఈ పద్ధతిని అమలు చేశారు. అక్కడ టెలికమ్యునికేషన్లు బాగా ప్రజలకు చేరువ అయ్యాయి. ఉదాహరణకు కెన్యాలో సఫారికమ్ అనే మొబైల్ కంపెనీ M-PESA అనే నగదు బదిలీ సౌకర్యాన్ని మిలియన్ల మంది ప్రజలకు అంద చేస్తున్నది. నేడు 75 శాతం కెన్యా ప్రజలకు ఈ విధంగా నగదు బదిలీ పథకం అందుబాటులోకి వచ్చింది. సబ్ సహారన్ ప్రాంతంలో అత్యధిక ప్రాపకం గల ఈ M-PESA మెక్సికో దేశంలో

*తరువాయి 64వ పేజీలో...*

# అసంఘటిత రంగం-ఆలోచన, స్వభావం : సార్వజనీన పరిశీలన

గత 1950, 60 దశాబ్దాల్లో చేపట్టిన అధ్యయనాల్లో "అసంఘటిత రంగం" అనే ఆలోచనకున్న సైద్ధాంతిక ప్రాతిపదిక ద్వైదీభావన ఉనికిని నొక్కి చెప్పింది. వర్ధమాన దేశాల్లో విశిష్టంగా కనబడిన ఈ భావనకు మరో రూపం- ద్వంద అంటే రెండు రకాల ఆర్థిక వ్యవస్థ. దీన్ని అప్పుడు ప్రస్తావించన వారిలో ప్రముఖులు- లూయిస్, ఫీ-రానీస్, హారీస్ తొడారో. వీరు వర్ధమాన ఆర్థిక వ్యవస్థలో దీనిని గ్రామీణ, పట్టణ రంగాలుగా వర్గీకరించగా, హారిస్ తొడారో మాత్రం ఈ ద్వంద వ్యవస్థ పట్టణ రంగంలోనే ఉన్నట్లు అభిప్రాయపడ్డాడు. ఈ ద్వంద సిద్ధాంతం మళ్ళీ 70వ దశకంలో ఆసక్తి రేకెత్తించింది. జనాభా పెరుగుదల, గ్రామీణ పట్టణ వలసలు ఎక్కువగా ఉండే వర్ధమాన దేశాల్లో ఆధునిక పట్టణ ఆర్థిక వ్యవస్థకు ఈ సిద్ధాంతాన్ని ఆపాదించవచ్చని భావించారు. కెన్యా, కొలంబియా, శ్రీలంక, ఫిలిప్పీన్స్ వంటి వర్ధమాన దేశాల్లో ఆర్థిక కార్యకలాపాల్లో ఎక్కువ భాగం వ్యవస్థీకృతరంగంలో కాకుండా బయట జరుగుతున్నాయని అంతర్జాతీయ కార్మిక సంఘానికి (ILO) చెందిన 'ఉపాధి అధ్యయనాల్లో' తేలింది.

కెన్యా అధ్యయనం మొదటసారిగా ఒక కొత్త విషయాన్ని బయటపెట్టింది. 'సంప్రదాయ వర్గం'గా పిలువబడే ఈ అవ్యవస్థీకృత రంగం ఏదో నామమాత్రంగా ఉన్నట్లుకాక, లాభసాటి కార్యకలాపాలకు కూడా విస్తరించిందని వెల్లడించింది. చిన్న స్థాయిలో లేదా అధికారికంగా నమోదు(రిజిస్టర్)కాకుండా జరిగే కార్యకలాపాలను అప్పటిదాకా 'సంప్రదాయ వర్గం'గా పేర్కొంటుండగా, ఈ అధ్యయనం దీనిని 'అసంఘటిత రంగం' (Informal sector) అనే పదజాలంతో అభివర్ణించింది. వ్యవసాయం, ఇతర గ్రామీణ వ్యాపకాలు ఒకవైపు, మరోవైపు ఆధునిక పరిశ్రమలు, సేవలవంటి ఆర్థిక వ్యవస్థకు చెందిన ఇతర రంగాలు....ఇవి ఎప్పటికప్పుడు సంఖ్యాపరంగా పెరిగిపోతున్న కార్మికులకు ఆదాయ, ఉపాధి అవకాశాలు కల్పించలేకపోవడమే అసంఘటిత రంగం వర్ధిల్లడానికి ప్రధానకారణమని ఇది తెలిపింది. హార్ట్ అనే ఆర్థిక నిపుణుడు ఈ అసంఘటిత రంగం అనే పదాన్ని తొలిసారిగా వాడారు. అక్రా, ఘనాల్లోని పట్టణ కార్మికుల ఆర్థిక కార్యకలాపాలను అధ్యయనం చేసిన ఆయన పట్టణాల్లోని ఆధునిక రంగానికి "సంఘటిత రంగం" అనీ, పట్టణ సంప్రదాయ రంగ విస్తరణకు "అసంఘటిత రంగం" అనే పదాలు వాడాడు. మునుపటికంటే స్పష్టమైన హద్దులతో చేసిన ఈ వర్గీకరణ ఇచ్చిన వివరణ ఏమిటంటే- 'ఈ రెండు రంగాలూ ఆంతరంగికంగా ఆధునికమైనవే కాక, వర్ధమాన దేశాల్లో పట్టణీకరణ ఫలితంగా ఆవిర్భవించి నవి..ఇది సాంప్రదాయ గ్రామీణ ఆర్థికవ్యవస్థనుండీ ఆధునిక పారిశ్రామిక రంగంవైపు మారడానికి ఇది సూచిక' అని. అందువల్ల అవ్యవస్థీకృతరంగానికి సంబంధించిన సంస్థాగత చరిత్రను నాలుగు దశలుగా విభజించవచ్చు. 1970వ దశకం-ఆవిర్భావదశ- అవ్యవస్థీకృతరంగం అప్పుడే వేళ్ళూనుకుంటున్న దశ : 1980వ దశకం-విస్తరణ దశ-వ్యాప్తిని పసిగట్టి చాలామంది దీనిని వారి కార్యక్రమాల్లో చేర్చుకోవడం మొదలుపెట్టారు. 1990వ దశకం- అధీకృత దశ-ఇది అంతర్జాతీయంగా గుర్తింపుపొంది-అధికారిక పథకాల్లో చోటు కల్పించిన దశ : 2000వ దశకం-భవిష్యత్ విస్తరణ దశ-దీని అధ్యయనం మరింతగా విస్తరించిన కాలం.

వర్ధమానదేశాల్లో అసంఘటిత రంగం విపరీతంగా విస్తరించినా, ఇది ఒక ఆదాయ వనరుగా కానీ, పేదలకు ఉపాధి

**అశీమా మజుందార్,** అసిస్టెంట్ ప్రొఫెసర్, నార్త్ గౌహతి కాలేజీ, అసోం.
e-mail : ashimamajumdaro11@gmail.com

కల్పించేరంగంగా కానీ  పెద్దగా చర్చనీయాంశం కాలేదు. దీని ఆవశ్యకతను అంతర్జాతీయ కార్మిక సభ దాని నివేదికలో ఇలా తెలియచేసింది ఈ మధ్యకాలంలో వర్ధమానదేశాల్లో పట్టణీకరణ చెందుతున్న దేశాల్లో కొత్త ఉపాధి అవకాశాలు ఎక్కువగా అసంఘటిత ఆర్థికవ్యవస్థలోనే ఉంటున్నాయి. కారణం–వీరిలో ఎక్కువమంది సంఘటిత ఆర్థిక వ్యవస్థలో ఉద్యోగాలు సంపాదించలేకపోయారు, వ్యాపారాలు కూడా ప్రారంభించలేక పోయారు.

ఈ దేశాల అభివృద్ధి పరివర్తన దశలోనే అసంఘటిత రంగం ఊపిరిపోసుకుంది. అభివృద్ధి వేగంతోపాటే ఇదికూడా బలం పుంజుకుంది. వర్ధమాన దేశాల్లో అవసరానికిమించి ఎక్కువయిపోతున్న కార్మికశక్తి సమస్యకు క్రమేణా ఇది ఒక పరిష్కారమయిపోయింది. శాప్ ప్రవేశపెట్టిన తరువాత వర్ధమానదేశాల్లో ఉపాధిలేని వృద్ధి మొదలయింది. ఎలా అంటే – పోటీని తట్టుకోవడానికి, ఖర్చులను తగ్గించుకోవడానికి ప్రభుత్వ ప్రైవేట్‌రంగాల్లో శ్రమ దోపిడీ జరిగింది కనుక. దీనితో అసంఘటిత  రంగం నామమాత్రపు ఉనికి దశనుండి, విస్తరించే దశకు వెళ్ళి, చివరకు శాశ్వత స్థానం సంపాదించే వరకూ వెళ్ళింది.

అందుకే మొదట దీనిని వర్ధమాన దేశాల్లో అధ్యయనం చేసినా, తరువాత దీనిని అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా చేపట్టారు. అయితే ఈ రెండు చోట్ల దీనిలో తేడా ఉంది. వర్ధమాన దేశాల్లోని అసంఘటిత రంగంలో ప్రత్యామ్నాయ ఉపాధి ఎక్కడా దొరక్క బతుకుదెరువు మార్గంగా ఇది నిలదొక్కుకుంటే – అభివృద్ధి చెందిన దేశాల్లో సంఘటిత రంగంలోని ఉద్యోగాలతో సమానంగా అసంఘటిత  రంగంలోని శ్రామికులుకూడా స్వేచ్ఛ, స్వయంప్రతిపత్తి, పనిలో వెసులుబాటువంటివి పొందగలిగారు. వర్ధమానదేశాల్లోని అసంఘటిత రంగంలోని సంస్థలు ఎక్కువమంది శ్రామికులతో తక్కువ ఆదాయాన్ని, తక్కువ పెట్టుబడులతో నిర్వహిం చేవిగా ఉంటున్నాయి. అయితే దీనిలో నిజమెంత అన్నది చర్చనీయాంశం–ఎందుకంటే వీటిలో కొన్ని బాగా లాభాలు ఆర్జిస్తున్నాయని ఇటీవలి అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

వ్యవసాయేతర స్థూలదేశీయోత్పత్తిలో అసంఘటిత సంస్థల వాటాను ఉదాహరణగా తీసుకుంటే–కనిష్టంగా ఉత్తర ఆఫ్రికాలో 27శాతం ఉండగా, గరిష్టంగా సబ్ సహారన్ ఆఫ్రికా లో 41శాతంగా ఉంది. లాటిన్ అమెరికాలో 29శాతం, ఆసియాలో 41శాతం, కంబోడియాలో ఏకంగా 80శాతంగా ఉంది. నిజానికి ఈ వర్ధమాన దేశాల్లో నైపుణ్యం లేని కార్మిక శక్తి, స్థానికంగా దొరికే వనరులతోనే ఇంత వృద్ధి సాధ్యపడింది. ఇది విధాన నిర్ణేతలు, పరిశోధకుల్లో బాగా ఆసక్తిని రేకెత్తిస్తున్నది. ఉపాధికల్పనలోగానీ, ఉత్పాదనలోగానీ ఆదాయ వనరులు పెంచడంలోగానీ అసంఘటిత రంగం కీలక పాత్ర పోషిస్తుండడంతో ఈ దేశాల ఆర్థిక వ్యవస్థలో ఇది చాలా ముఖ్యమైన భాగమయిపోయింది.

సంప్రదాయరంగాలలో బతుకుదెరువు మార్గంగా మొదలయి లాభసాటి వ్యవస్థదిశగా సాగుతున్న ఈ 'అసంఘటితరంగ' ప్రస్థానం, దాని నిర్వచనంలోగానీ, స్వభావంలోగానీ వైవిధ్యాన్ని నింపుకుంది. దేశాలనుబట్టి, ఆర్థికవ్యవస్థలను బట్టి, సాంస్కృతిక నేపథ్యాన్ని బట్టి ఒకే నగరంలోని వివిధ ప్రాంతాలనుబట్టికూడా ఈ రంగం రూపురేఖలు ఉంటాయి. ఐక్యరాజ్య సమితి ఆర్థిక, సాంఘిక సాంఘీక మండలి (యునెస్కో) ఆమోదించిన అంతర్జాతీయ నిర్వచనం ప్రకారం – 'అసంఘటిత రంగం అంటే 1. సరుకుల ఉత్పత్తి, అమ్మకం, సేవలను నిర్వహించే కుటుంబాలు, రిజిస్టరు కాని ప్రైవేటు సంస్థలన్నీ 2. NCEUS 2006 నిర్ణయించిన పరిధికంటే తక్కువ ఉద్యోగులుండే సంస్థలు.

అసంఘటిత రంగంలో–గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని వ్యవసాయకూలీలు, చిన్న, సన్నకారు రైతులు, కౌలుదార్లు, పశుసంవర్ధక వ్యాపకాల్లో ఉండేవారు, కోళ్ల పరిశ్రమ, మత్స్య పరిశ్రమ కార్యకలాపాలు నిర్వహించేవాళ్ళు, చేతివృత్తులవాళ్ళు, అటవీ కార్యకలాపాలు చూసే శ్రామికులు, గీత కార్మికులు, పట్టణ ప్రాంతాల్లో అయితే నిర్మాణ పనికూలీలు, వడ్రంగులు, వ్యాపార, రవాణా, కమ్యూనికేషన్ రంగాలలో పనిచేసేవారు, ఫుట్‌పాత్ వ్యాపారులు, తోపుడుబండ్లవాళ్ళు, హమాలీలు, రెడీమేడ్ దుస్తుల తయారీ కార్మికులు తదితరులున్నారు. ప్రభుత్వ అధికారుల నియంత్రణలో లేని, గుర్తింపు పొందని, నమోదుకాని, రక్షింపబడని కాయకష్టం చేసుకునే పేదల కార్యకలాపాలే అసంఘటిత రంగం అని ఐఎల్ఓ నిర్వచించింది. ఇక ఈరంగం స్వభావం ఎలాంటిదో కూడా అది వివరించింది. దీనిలో చేరడం తేలిక, స్థానిక వనరులపైనే ఆధారం, కుటుంబయాజమాన్యం, చిన్న స్థాయిలో లావాదేవీలు, ఎక్కువమందికి ఉపాధి, నియత విద్యద్వారా కానీ ఇతరత్రా కానీ సమకూర్చుకోని నైపుణ్యాలు, సాంకేతికత, క్రమబద్ధంకాని పోటీ మార్కెట్లు....ఇవీ దీని లక్షణాలు, అవ్యవస్థీకృత రంగ కార్మికుడు అంటే–కార్మికుల చట్ట పరిధిలోకి రాని, సామాజిక రక్షణలేని, కొద్దిపాటి ఉపాధి ప్రయోజనాలు పొందే  వ్యక్తులని ఇది నిర్వచించింది. అలాగే అసంఘటిత ఆర్థిక వ్యవస్థ అంటే– అసంఘటిత  కార్మికుడు, అసంఘటిత రంగం అని తెలిపింది.

"ప్రభుత్వ జోక్యం, క్రమబద్ధీకరణలు కొత్త సంస్థల పురోగతిని మందగింపచేస్తాయి. అందువల్ల "అమల్లో ఉన్న చట్టాలను పాటిస్తే, ఖర్చులు లాభాలను దాటిపోతాయని భావించే వ్యక్తుల పునరావాసమే అసంఘటితరంగం" అని The Other Path గ్రంథంలో డిసోటో(1989) నిర్వచించాడు. మార్కెట్‌కు అవసరమయ్యే చట్టబద్ధ సరుకులు, సేవలను ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ అధికారుల దృష్టిపడకుండా దాచే వ్యవస్థ అని ష్నీడర్(2004) అభిప్రాయపడ్డాడు. అంటే  ఈనిర్వచనం పరోక్షంగా వివరించేదేమిటంటే "అసంఘటిత రంగంలో చేపట్టే

కార్యకలాపాలకు చట్ట బద్ధత ఉంటుంది కానీ నిర్దిష్ట కార్మిక, మార్కెట్ ప్రమాణాలు మాత్రం పాటించరు" అని. ఈసంస్థలు వ్యాపార లావాదేవీలకోసం అంటే పేరు, ఆపరేషన్ పర్మిట్, కార్యాలయ నమోదువంటివి అధికారికంగా నమోదు చేసుకుంటారు కానీ ఉత్పత్తి వివరాలుకానీ, లావాదేవీలు అధికారిక వివరాలు కానీ నిబంధనల ప్రకారం సమర్పించరు.

అసంఘటిత రంగం అంటే తమకు ఆదాయాన్ని, ఉపాధిని కల్పించుకునే ప్రాథమిక లక్ష్యంతో సరుకుల ఉత్పత్తి, సేవలను నిర్వహించే సంస్థలుగా 15వ అంతర్జాతీయ కార్మిక గణాంకాల మహాసభ తీర్మానించింది. ఇవి ఒప్పందాలు, హామీల ప్రాతిపదికగా కాక, బంధువులు, కుటుంబ సభ్యుల, సామాజిక సంబంధాలతో అతి తక్కువ పెట్టుబడితో నడిచే సంస్థలు. ఈరంగంలో నిర్వహించే కార్యకలాపాల మధ్య, ఏకరూపత సాధించే ఉద్దేశంతో వాటి విశ్లేషణకు అవసరమయిన సమాచారం సేకరించడానికి ఈ కింది నియమాలను ప్రకటించింది. 1. మార్కెట్‌కు అవసరమయిన ఏదయినా ఉత్పత్తి చేస్తున్న సంస్థ అయి ఉండాలి. (దీనివల్ల తమ సొంత వినియోగానికి కార్మికులు లేకుండా కుటుంబ సభ్యులతో నిర్వహించే సంస్థలను వేరుచేసినట్లవుతుంది.) 2. నిర్దిష్ట పరిమితి కంటే తక్కువ స్థాయిలో ఉద్యోగులను నియమించుకునే, కొనసాగించే సంస్థలు, నిర్దిష్ట ప్రభుత్వ దరఖాస్తులు నింపడం ద్వారా రిజిష్టరు చేసుకోని సంస్థలు 3. ఉద్యోగుల వివరాలు నమోదు చేయని సంస్థలు.

అసంఘటిత రంగంలోని ఉత్పాదక సంస్థలకు కుటుంబాల ఆధ్వర్యంలో నడిచే వ్యాపారాల లక్షణాలుంటాయి. జమాఖర్చుల వివరాలు సక్రమంగా ఉండవు. స్థిరాస్తులు, ఇతర ఆస్తులు వ్యాపారుల పేరిట ఉండవు, యజమానుల పేరిట ఉంటాయి. అందువల్ల ఇవి వేరే ఇతర సంస్థలతో లావాదేవీలు జరపడంలోకానీ, ఒప్పందాలు చేసుకోవడంలోకానీ, రుణాలు తీసుకోవడంలో కానీ ఇబ్బందులు ఎదుర్కొంటుంటాయి. ఉత్పాదనకు సంబంధించి యజమానే సొంత బాధ్యత మీద రుణాలు తీసుకురావాల్సిఉంటుంది. ఖర్చువిషయంలో కూడా సంస్థ ఖాతాకు,కుటంబ ఖర్చులకు మధ్య గీత ఉండదు. పెట్టుబడి ఆస్తులయిన భవనాలు, వాహనాలు కూడా ఇంటికీ, సంస్థకూ కలిపివాడడం జరుగుతుంటుంది. వ్యవసాయ కార్యక్రమాలయితే చాలామటుకు సొంత వినిమయానికే సరిపోతుంటాయి. మిగిలినవే మార్కెట్లకు పంపుతారు. అసంఘటిత రంగంలో చాలా దేశాల్లో వ్యవసాయం వాటా పెద్దదే అయినా, అసంఘటిత రంగ అధీకృత జాబితాలో చేర్చవద్దని (International Conference on Labour Statistics) కూడా సిఫార్సు చేసింది. అసంఘటిత రంగం నిర్వచనం దేశాన్నిబట్టి, జాతీయ చట్టాలను బట్టి, ఉద్యోగుల సంఖ్యను బట్టి మారిపోతున్నది.

అసంఘటిత రంగం కిందకు ఏవి వస్తాయో నిర్ణయించి దీన్ని నిర్వచించడానికి 15వ కార్మిక మహాసభ తీర్మానం తగిన వెసులుబాటు కల్పించింది. ఈ వెసులుబాటువల్ల అంతర్జాతీయంగా పోల్చిచూస్తే బెడద తగ్గింది. అయితే ప్రతి దేశంలోనూ దానికున్న నిర్వచనాల దృష్ట్యా, ఉమ్మడి అంశాలతో అంతర్జాతీయంగా ఒక నిర్వచనం తప్పనిసరయింది. దీన్ని పరిష్కరించడానికి అసంఘటిత రంగ గణాంకాలపైఒక అంతర్జాతీయ నిపుణుల బృందాన్ని 1997లో ఏర్పాటుచేయడం జరిగింది. దీన్ని ఢిల్లీ బృందం అని వ్యవహరిస్తున్నారు. గణాంకాలు, కార్యక్రమాల అమలుకు సంబంధించిన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ బృందం పనిచేస్తుంది. చాలా "సిటీ గ్రూప్"లలో ఇది ఒక గ్రూప్‌గా ఐక్యరాజ్యసమితి గణాంక విభాగం (United Nations Statistical Division UNSD) పర్యవేక్షణలో పనిచేస్తుంది. అంతర్జాతీయ నిర్వచనానికి నిర్ణయించిన సూత్రాల ఆధారంగా అసంఘటిత రంగాన్ని నిర్వచించడానికి జాతీయ నిర్వచనాలన్నింటినీ సమన్వయపరచడానికి ఢిల్లీ బృందం ప్రయత్నిస్తున్నది. దీని మూడోసమావేశంలో ఈ అంశంపై చర్చించి కింది సిఫార్సులను ఆమోదించారు.

అసంఘటిత రంగం వివిధ దేశాల్లో వివిధ రకాలుగా ఉండడంతో అవ్యవస్థీకృత ఆర్థిక వ్యవస్థకు సంబంధించి జాతీయ నిర్వచనాలు ప్రస్తుతం రూపొందించలేకపోతున్నాం. ఈ నిర్వచనాలను అనుసరించి అంతర్జాతీయ సంస్థలు తమ సమాచారాన్ని పంపిణీ చేయాలి. ఇప్పటివరకు ఈ బృందం చేసిన సిఫార్సులు అసంఘటిత రంగంలోని కొద్దిభాగానికే సరిపోతాయి. దీనిని మరింత విస్తృతం చేయడానికి మరిన్ని చర్యలు అవసరమని బృందం గుర్తించి మూడు నియమాలను సూచించింది. వేతన ఉద్యోగుల సంఖ్య ఐదుకంటే తక్కువగా ఉండే ఉత్పాదక సంస్థలను చేర్చాలి. ఇంటిపనిమనుషులతో నిర్వహించే కుటుంబ యాజమాన్యంలోని సంస్థలను చేర్చరాదు.

అసంఘటిత రంగంలో గణాంకాల సేకరణ, అభివృద్ధికి మిగిలిన దేశాలకు, మార్గదర్శకంగా ఉండేవిధంగా ఢిల్లీ బృందం ఒక "సాంకేతిక నియమావళి"ని రూపొందిస్తున్నది. 2005లో అంతర్జాతీయ కార్మిక సంస్థ తోఈ మేరకు ఒప్పందం కూడా కుదిరింది.మన దేశంలో జాతీయ గణాంకాల సంఘం (National Statistical Commission NSC)) 2010లో ఈ మేరకు ఒక కమిటీని నియమించింది. అయితే లభ్యమవుతున్న గణాంకాల మధ్య చాలా వ్యత్యాసాలున్నట్టు ఈ కమిటీ గుర్తించింది. అందువల్ల ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్న ఈ అవ్యవస్థీకృతరంగానికి సంబంధించి తగినంతమేర విశ్వసనీయ సమాచారాన్ని సేకరించడం తక్షణావసరం. దీనివల్ల ఈ రంగంలో తగిన విధానాలు రూపకల్పనకు, అమలుకు అవకాశం కలుగుతుంది. ■

# అసంఘటిత రంగం - సంక్షేమం నుండి సంక్షోభానికి.

సంపదకు సృష్టికర్తలు కార్మికులు. ఆధునిక ప్రపంచంలో భారతీయ కార్మిక రంగం ఆసరా కోసం ఎదురు చూస్తోంది. ప్రపంచీకరణ, యాంత్రీకరణలతో సంఘటిత రంగం క్రమంగా క్షీణించిపోతోంది. అదే సమయంలో అసంఘటిత రంగం శాఖోపశాఖలుగా విస్తరిస్తోంది. 127 కోట్ల భారతదేశ జనాభాలో 45.746 కోట్ల మంది (92.38శాతం) అసంఘటిత లేదా అనిశ్చిత రంగంలో పని చేస్తున్నారు. కేవలం 6.38శాతం మంది సంఘటిత రంగంలో ఉన్నారు. కార్మిక వర్గానికి విశ్రాంతి లేదు...రిటైర్‌మెంట్ అంతకన్నా లేదు... తుది శ్వాస విడిచే వరకు శ్రమిస్తూనే ఉండాలి. అలాంటి కార్మిక వర్గం అసంఘటిత రంగంలో దయనీయ స్థితిలో ఉంది.

**చట్టం సరే...అమలు సంగతేంటీ..?**

దేశంలోని 114 వృత్తులు అసంఘటిత రంగంలో ఉన్నాయి. కార్మిక రంగంలో కార్మిక చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ, అసంఘటిత రంగ కార్మికులకు ఎలాంటి చట్టాల వర్తింపూ లేదు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు – నేషనల్ కమిషన్ ఫర్ ఎంటర్‌ప్రైజెస్ ఇన్ అన్ ఆర్గనైజ్డ్ సెక్టార్ పేరుతో అర్జున్ సేన్ గుప్తా అధ్యక్షతన 2004లో కేంద్ర ప్రభుత్వం ఒక కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ అసంఘటిత కార్మికుల సమస్యలను నిశితంగా పరిశీలించి, 2005 ఆగస్టులో ఒక నివేదిక, 2006 మే నెలలో మరో నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై ఇది కేంద్ర ప్రభుత్వం వేసిన రెండవ జాతీయ కమిషన్. 1999లోఅప్పటి కార్మిక మంత్రి రవీంద్రవర్మ ఆధ్వర్యంలో వేసిన కమిషన్ 2002లోతన నివేదికను సమర్పించి, అసంఘటిత కార్మికుల రక్షణ, సంక్షేమాలకు ఒక చట్టం ఉండాలని చెప్పింది. ఆ కమిషన్ నివేదికను ప్రభుత్వం ఆమోదించలేదు. కార్మిక, ప్రజాసంఘాల ఒత్తిడితోనే అర్జున్‌సేన్ కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ నివేదికలో అసంఘటిత కార్మికుల స్థితిగతులపై ఇచ్చిన సమాచారం ప్రపంచ వ్యాప్తంగా మేధావులు, ప్రజాతంత్రవాదుల దృష్టిని బలంగా ఆకర్షించింది. భారతీయ కార్మికుల స్థితిగతులపై జరిగే చర్చలోఈ నివేదిక ఒక ప్రధాన ప్రస్తావనగా వస్తుంటుంది. దేశంలోని 114 రకాల వృత్తులలో పనిచేసే వారిని సేన్ కమిటీ అసంఘటిత కార్మికులుగా గుర్తించింది. యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ అధ్యక్షతన పనిచేసే 'జాతీయ సలహా మండలి' ఒక ముసాయిదా చట్టాన్ని రూపొందించి ప్రభుత్వం ముందు ఉంచింది. దానితో కేంద్ర ప్రభుత్వానికిఈ విషయమై ఏదోఒక నిర్ణయం తీసుకోక తప్పలేదు. 2007 సెప్టెంబరులో అసంఘటిత కార్మికుల సంక్షేమ బిల్లును కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలోప్రవేశపెట్టగా, 2008లోఅదిచట్టంగా అమలులోకివచ్చింది.

**కార్మికుల్లో అసంఘటితమే అధికం**

దేశంలోనికార్మికులలో 92 శాతం అంటే 45.7 కోట్ల మంది అసంఘటిత రంగంలోఉన్నారు. వీరి కోసం ఉద్దేశించిన సంక్షేమ చట్టం అసంఘటిత కార్మికులను మూడు రకాలుగా విభజించింది. కుటీర పరిశ్రమలలోఉన్నవారు మొదటిరకం, స్వయం ఉపాధి రెండవ కేటగిరీ, కూలీలు మూడవ వర్గంగా కేటాయించడం జరిగింది. వీరిలో భవన నిర్మాణ కార్మికులకు ఇప్పటికే ఒక చట్టం, సంక్షేమ బోర్డు ఉంది.

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరాగాంధీజాతీయ వృద్ధాప్య ఫించను పథకం నుండి జాతీయ ఆరోగ్య బీమాపథకం వరకు మొత్తం పది రకాల సంక్షేమ పథకాలను ఈ చట్టం పరిధిలోకి తెచ్చారు. ఇప్పటికే అమలులోఉన్న పథకాలను చట్టంలోచేర్చడం వలన అసంఘటిత కార్మికుడు/ కార్మికురాలు ఒక హక్కుదారుగా లబ్ధిపొందేఅవకాశం కలిగింది.

---

**ఎన్.నాగేశ్వరరావు,** సీనియర్ జర్నలిస్ట్, విశాఖపట్నం.

కేంద్ర చట్టాన్నిఅనుసరించి ఆయా రాష్ట్రాలు అసంఘటిత కార్మికుల సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయాలి. 2008లోకేంద్ర చట్టం అమలులోకి వస్తేమన రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సంవత్సరాల తరువాత తన నిబంధనలను ప్రకటించింది. ఆరు నెలల అనంతరం రాష్ట్రం సంక్షేమబోర్డును ఏర్పాటు చేసింది. రూ. 30 చెల్లించి, 14 నుండి 60 సంవత్సరాల మధ్య వయస్సు గల అసంఘటిత కార్మికులు లింగ బేధం లేకుండా ఈ సంక్షేమ బోర్డులోసభ్యులుగా చేరవచ్చు. సభ్యత్వ పునరుద్ధరణకు రూ.20, గుర్తింపుకార్డు పోతే నకలు పొందడానికి, నామిని మార్పునకు రూ.10 రుసుముగా నిర్ణయించారు. సభ్యత్వం పొందిన వారికిఒక కోడ్ నెంబరు గల స్మార్టు కార్డు అందజేస్తారు.

**నిధులు ఉన్నా...అమలు సున్నా**

ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు వద్ద కోట్లాది రూపాయులు నిధులు ఉన్నప్పటికీ ఆ మొత్తాన్ని సంక్షేమం కోసం ఖర్చు చేయడంలో ప్రభుత్వం దారుణం విఫలమయ్యింది. ఈ విషయాన్ని నాటి కేంద్ర కార్మిక మంత్రి మల్లిఖార్జున్ ఖార్గే వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు వద్ద రూ. 625 కోట్లు ఉండగా అది కార్మికుల సంక్షేమం కోసం కేవలం రూ. 34.73 కోట్లు మాత్రమే (0.5 శాతం) ఖర్చు పెట్టిందని ఆయన చెప్పారు. మరో దక్షిణాదిరాష్ట్రమైన కేరళ రూ. 546 కోట్ల నిధి నుండిరూ. 453 కోట్లు (83 శాతం) కార్మికులకు చెల్లించిందనితెలిపారు.

దేశంలో 4.46 కోట్ల మంది అసంఘటిత కార్మికులు ఉండగా ఆయా రాష్ట్రాలలోనమోదైన కార్మికులు 88.10 లక్షల మంది (వీరు మొత్తం కార్మికులలో 14 శాతం) మాత్రమే. ఇక అన్ని రాష్ట్రాల సంక్షేమ బోర్డుల వద్ద పేరుకుపోయిన నిధి రూ. 7057 కోట్లు కాగా, కార్మికులకు చెల్లించిందికేవలం రూ.1000 కోట్లు మాత్రమే. భవన నిర్మాణ వ్యయంలోఒక శాతం సెస్‌గా నిర్మాణ సంక్షేమ బోర్డుకు చేరుతుంది.

కార్మికుల సంక్షేమం అంటే ఏమిటో 1952లోనేఅంతర్జాతీయ కార్మిక సంస్థ 102వ సదస్సు తీర్మానంలోస్పష్టం చేసింది. ఈ తీర్మానం ప్రకారం సభ్య దేశాలు తొమ్మిది రకాలైన సౌకర్యాలను కార్మికులందరికీ కల్పించాలి. అవి 1. వైద్య సదుపాయం, 2. పని సమయంలో జరిగే ప్రమాదాలకు నష్ట పరిహారం, 3. గర్భవతులకు ప్రత్యేక ప్రయోజనాలు, 4. అనారోగ్య భృతి, 5. రిటైర్మెంట్ ప్రయోజనాలు, 6. నిరుద్యోగ భృతి, 7. కుటుంబ యజమాని మరణిస్తే ప్రత్యేక సదుపాయాలు, 8. జీవనోపాధిమెరుగుదలకు ఏర్పాట్లు. వీటినిప్రాథమిక కార్మిక సంక్షేమ చర్యలుగా అంతర్జాతీయ కార్మిక సంస్థ 60 ఏళ్ల కిందటే నిర్ధారించింది. ఈ తీర్మానంపై భారత ప్రభుత్వం అప్పుడేసంతకం కూడా చేసింది. కానీ అది ఏ మేరకు అమలు అవుతుందో పాలకులకే తెలియాలి.

**తుది శ్వాస వరకు శ్రమించాలా?**

అర్జున్ సేన్ గుప్తా కమిటీ వీటన్నింటిని సిఫార్సులుగా తన నివేదికలోపొందుపరిచింది. అయితేఇందులోముఖ్యమైన వాటికి చట్టంలో స్థానం కల్పించలేదు. **35 సంవత్సరాలు పాటు నెలజీతం తీసుకొనిపనిచేసిన ప్రభుత్వ ఉద్యోగి దేశానికిసేవచేసిన వాడిగా గుర్తింపు పొందుతున్నాడు. 5 సంవత్సరాల పదవికోసం ఒక్కసారిఎమ్మెల్యేలేదా ఎంపీఅయితేచాలు, జీవితాంతం పెన్షన్ సౌకర్యాన్ని మన ప్రజా ప్రతినిధులు పొందగలుగుతున్నారు. అసంఘటిత కార్మికుడు చావడానికిముందు రోజు కూడా శ్రమ చేయాలి.** జాతీయ స్థూల ఆదాయంలో 70 శాతాన్ని సమకూరుస్తున్న ఈ శ్రమజీవులు 70 సంవత్సరాల వయసులోకూడా పనిచేయాలా? అనేదే ప్రశ్న.

**మరో 32 వృత్తులు**

అసంఘటిత రంగం కార్మికుల చట్టం పరిధిలోనికి కొత్తగా 32 రకాల వృత్తులను చేర్చారు. అందులో వ్యవసాయం, జీడీ పప్పు తయారీ, బాణసంచా, చేనేత, పవర్ లూమ్, దోబీ, బార్బర్, కూరగాయల విక్రయదారులు, కిరోసిన్ వెండర్స్, రిక్షా కార్మికులు, ఆటో, లారీ, ప్రైవేటు డ్రైవర్లు, కల్లుగీత కార్మికులు, ఆటో గ్యారేజీ వర్కర్స్, రాళ్లు కొట్టేవారు, పేపర్ వెండర్స్, స్వర్ణకారులు, మత్స్యకారులు, చెప్పులు తయారీదారులు, వలస కూలీలు అసంఘటిత రంగంలోకి పరిధిలోకి వస్తారు. ఈ కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రత అంశానికి సంబంధించి పార్లమెంటు 2008లోనే ఒక చట్టం చేసింది. అసంఘటిత రంగంలో పని చేసేవారికి భవిష్యనిధి, ప్రమాద బీమా, గృహ సదుపాయం, పిల్లలకు విద్యా పథకాల వర్తింపు, వృత్తి నైపుణ్యత పెంపు, వృద్ధాశ్రమ సౌకర్యం, దహన సంస్కారాలకు ఆర్థిక సహాయం వంటి సదుపాయలను కల్పించాలని కేంద్ర చట్టం సూచిస్తోంది. దేశ జనాభా 127 కోట్లయితే, శ్రమ జీవుల సంఖ్య 50 కోట్ల పైమాటే. వీళ్లలో 97 శాతం, అసంఘటిత కార్మికులుగా ఉన్నారంటే ఆశ్చర్యం కలగకమానదు. ఈ కార్మికులకు ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు కావడం లేదు. యజమాని పొమ్మంటే పని వదిలి పోవలసిందే. ఒక వైపు వ్యవసాయం తగ్గిపోతోంది. అంటే ఉత్పత్తి తగ్గిపోతుందని అర్థం. ఉత్పత్తి విలువ తగ్గిపోతుందీ అంటే దాని అర్థం కూలీ రేటు ఉపాధి లేక వలసలు పోతున్నారు. రాష్ట్రంలో వలసలకు కేంద్ర బిందువు ఉత్తరాంధ్ర. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలతో కూడిన ఉత్తరాంధ్రలో వలసలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఈ ప్రాంతం నుంచి లక్షలాది మంది ప్రజలు బ్రతుకు తెరువు కోసం పొట్ట చేత పట్టుకొని దేశాలు పట్టిపోతున్నారు. కాశ్మీర్ నుంచి అండమాన్ వరకు ఎక్కడ చూసిన ఉత్తరాంధ్ర ప్రజలే. సన్న, చిన్నకారు రైతులు పూలు అమ్మిన చోట కట్టెలు అమ్మలేక సుదూర ప్రాంతాలకు కుటుంబాలతో సహా తరలి పోతున్నారు. వీనికి సమర్థవంతమైన పరిష్కారం కావాలి. ■

# ప్రగతి పథానికి మొదటి మెట్లు.

ఏ దేశానికైనా అభివృద్ధి పథంలో ముందుగా కావలసింది ఆరోగ్యము/ పారిశుధ్యము, చైతన్యంతో ప్రజలు ప్రగతి కార్యక్రమాలలో పాలుపంచుకోవటం. అందుకనే జాతిపిత మహాత్మా గాంధీ అనేకసార్లు తనకు దేశ స్వాతంత్ర్యం కంటే పారిశుధ్యమే అధిక ప్రాధాన్యమని నొక్కి చెప్పారు. ఇటీవలి కాలంలో కూడా ఒక నాయకుడు దేవాలయాల కన్నా మరుగుదొడ్లకే ప్రాధాన్యమని అంటే చాలామంది ఆవేశంగా స్పందించారు. కానీ, ఇది సత్యం. ఈ రెండు అంశాల ప్రాధాన్యతను గుర్తించిన మన ప్రధాన మంత్రి నరేంద్ర మోడి కూడా తన స్వతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో స్వచ్ఛ్ భారత్ అభియాన్ పేరుతో బహిరంగ మలవిసర్జనను నిర్మూలించాలని, గ్రామ ప్రజల ఉమ్మడి సహకారంతో ఆదర్శ గ్రామాలను నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. ముందుగా స్వచ్ఛ్ భారత్ అభియాన్ విషయానికి వస్తే, నేడు మన దేశంలో ఏ గ్రామానికి వెళ్ళినా, దాదాపు కిలోమీటర్ దూరం నుండి ముక్కు మూసుకుని నడవాల్సిన పరిస్థితి. ఒకప్పుడు గ్రామాలంటే స్వచ్ఛతకూ, పచ్చదనానికీ, కపటం లేని ప్రేమకు నిలయంగా ఉండేవి. కానీ నేడు పరిస్థితి ఎలావుందనేది మనం గమనిస్తూనే ఉన్నాం.

2019కల్లా దేశాన్ని బహిరంగ మలవిసర్జన శాపం నుండి విముక్తం చేయాలనీ అందుకోసం ప్రతి కుటుంబానికీ, ప్రతి ఇంటికీ కనీసం ఒక మరుగుదొడ్డిని ఏర్పాటు చేయాలని, చాలా గ్రామాలలో ప్రజలకు ఇళ్ళలో మరుగుదొడ్లు కట్టుకునే స్థలం కూడా లేనందున సామాజిక/ సామూహిక మరుగు దొడ్లను ఏర్పాటు చేయాలని, వాటి నిర్వహణకు గ్రామ పంచాయతీలను బాధ్యులను చేయాలని నిర్ణయించారు. అయితే ఇది ఏ ఒక్క ప్రభుత్వం లేదా సంస్థ వల్ల కాదు. దీనికోసం కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు, కార్పొరేట్ సంస్థలు, వ్యక్తుల ఉమ్మడి భాగస్వామ్యంలో లక్ష్యాలను చేరాలని నిర్ణయించారు. కోరిన ప్రతి ఇంటికీ నీటి సౌకర్యం కలిగించాలంటే ముందుగా అన్నీ గ్రామాలకూ పైప్ లైన్లను ఏర్పాటు చేయాలి. ప్రపంచములో ఆరవ వంతు జనాభా అనగా 1.21 బిలియన్ల మంది మనదేశంలో నివసిస్తున్నారు. వీరిలో 72.2శాతం మంది మన 6.38 లక్షల గ్రామాలలో 16.78కోట్ల కుటుంబాలుగా నివసిస్తున్నారు. వీరిలో కేవలం 5.48 కోట్ల కుటుంబాలకే ఇళ్ళలో మరుగుదొడ్డి సౌకర్యం ఉన్నది. అంటే ఇంకా 67.3 శాతం గ్రామీణులు బహిరంగ మల విసర్జన చేస్తూనే ఉన్నారు. ఎంతోమందికి ఇళ్ళలో మరుగుదొడ్డి ఉన్నాకూడా దానిని స్టోర్ గది గా ఉపయోగిస్తూ, మల విసర్జనకు యథావిధిగా బయటకు వెళ్తున్నారు. దీనితో ప్రజలకు మరుగు దొడ్డి వాడకాన్ని అలవాటు చేయడం మొదటి సవాలుగా మారింది. మన నిర్మల్ భారత్ అభియాన్లో మొదటి అడుగు అదే! మరుగుదొడ్డి సౌకర్యం కల్పించడానికి అందుబాటులో ఉన్న ఉపాధి హామీ పథకం వంటి అన్నీ పథకాలనూ సంలీనం చేసి వనరులను, సిబ్బందిని వినియోగించుకోవాల్సి ఉంటుంది.

ముందుగా దీనికోసం ప్రజల ఆలోచన విధానంలో మార్పు తేవాల్సి ఉంటుంది. దీనికోసం (Information, Education, Communication, (IEC) వ్యూహాన్ని అనుసరించాలి. గ్రామ స్థాయిలో ఉండే విద్యార్థులు, ఆషా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు మొదలైన వారందరి సహకారం దీనికి అవసరం. జిల్లా స్థాయిలోను, రాష్ట్ర స్థాయిలోను దీనికి తగిన నిధుల విడుదలకు, పర్యవేక్షణకు ప్రత్యేక యంత్రాంగం ఉండాలి. సంబంధిత అన్నీ విభాగాలనూ కలుపుకు పోతే ఒకే పనికి వివిధ స్థాయిలలో నిధుల విడుదల–దుర్వినియోగం, ఒకే పనిని రెండు విభాగాలు పని చేయడం వంటి అస్పష్టతలను నివారించవచ్చు. ఇటీవలి కాలంలో మరుగుదొడ్లకోసం ఒక సామాజిక విప్లవం మొదలయిందని చెప్పవచ్చు. సినిమా తారల వంటి (విద్యా బాలన్) సెలెబ్రిటీలతో ప్రచారం,

ఐ.వి. సుబ్రమణ్యం, ఫ్రీలాన్సర్

గ్రామాలలో కొత్తగా పెళ్లి అయి వచ్చిన వధువులు ఇంట్లో మరుగుదొడ్డి లేకపోతే, కాపురానికి నిరాకరించటం వంటి వాటిని దీనికి ఉదాహరణగా ప్రస్తావించవచ్చు. అయితే ఇటీవల దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన ఉత్తరప్రదేశ్ లోని బదౌన్ జిల్లాలో జరిగిన ఇద్దరు బాలికల (వారు బహిరంగ మలవిసర్జనకు వెళ్ళినపుడు) అత్యాచారం, హత్య వంటి ప్రమాదాల గురించి మనం తరచుగా వింటున్నాము. చీకటి పడేవరకు మల, మూత్ర విసర్జన అవసరాన్ని బలవంతంగా నిగ్రహించుకోవడం వల్ల మహిళలు అనేక వ్యాధులకు గురవుతున్నారు. అలాగే నెలసరి సమయాలలో ఏకాంత మరుగు సౌకర్యం లేకపోవటం వల్ల అనేక పునరుత్పాదక ఇన్ఫెక్షన్లు, మూత్ర సంబంధ ఇన్ఫెక్షన్లకు( RTI & UTI) మహిళలు గురవుతున్నారు. ఈ లక్ష్య సాధనలో క్షేత్ర ప్రచార విభాగం వంటి ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు చేసే కృషి అనన్యమ్. మన జాతి పిత మహాత్మా గాంధీ 150 వ జయంతి సందర్భంగా 2019 నాటికి లక్ష్యాన్ని పూర్తిచేయాలని గమ్యంగా నిర్దేశించారు. గత సంవత్సరం అనగా 2013 లో కేంద్రం జరిపిన ఒక సర్వే ప్రకారం దేశ వ్యాప్తంగా 17.13 కోట్ల కుటుంబాలు ఉన్నాయి. వీరిలో 11.11 కోట్ల కుటుంబాలకు మరుగుదొడ్డి సౌకర్యం కల్పించాల్సి ఉన్నది. వీరిలో 8,84,39,786 మంది పేదరికపు రేఖకు దిగువన అర్హులై ఉన్నారు. 56,928 పాఠశాలలో మరుగుదొడ్డి సౌకర్యం కల్పించాల్సిఉన్నది.

ఇంకా 1,07,695 అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా మరుగుదొడ్లు అవసరం. ఇవికాక మరో 1,14,315 సామూహిక/ సామాజిక మరుగుదొడ్లను నిర్మించాల్సిన అవసరం ఉన్నదని రాష్ట్రాలు కేంద్రానికి నివేదించాయి. అంటే స్థూలంగా స్వచ్ఛ భారత్ అభియాన్ క్రింద 8.84 కోట్ల కుటుంబాలకు 2019 నాటికి మరుగుదొడ్లను కల్పించడానికి, సగటున సంవత్సరానికి 177 లక్షల మరుగుదొడ్ల నిర్మాణానికి అంచనాలు సిద్ధమయ్యాయి. ప్రస్తుతం కడుతున్న రోజుకు 14,000 మరుగుదొడ్ల అంచనాలను సవరించి 48,000 ల స్థాయికి పెంచాలి. అలాగే పేదరికపు రేఖకు ఎగువన ఉన్న కుటుంబాలలో మరో 2.27 కోట్ల మరుగుదొడ్ల నిర్మాణానికి వారిని ఒప్పించాల్సి ఉన్నది. ప్రస్తుతం అమలులో ఉన్న పథకాల ప్రకారం పేదరికపు రేఖకు దిగువన ఉన్న ప్రతి కుటుంబానికీ మరుగుదొడ్డి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 900/–లు అందిస్తున్నది. ప్రజలలో అవగాహనను పెంచడానికి ఉత్సాహంగా పనిచేసే వారి నుండి ప్రతి గ్రామపంచాయతీ లోను ఒకరిని ఎంపిక చేసి స్వచ్ఛతా దూత పేరిట తగిన శిక్షణను, ప్రోత్సాహకాలను అందచేస్తారు. అదే విధంగా పూర్తిగా ప్రతి కుటుంబానికీ మరుగుదొడ్లను ఏర్పాటు చేసి గ్రామాన్ని బహిరంగ మలవిసర్జన భూతం నుండి విముక్తం చేసిన గ్రామపంచాయతీకి కూడా ప్రోత్సాహకాలు ఉంటాయి. ఈ బహిరంగ మలవిసర్జన అంశాన్ని ప్రస్తావించగానే మనకు మరుగుదొడ్డికీ, మొబైల్ ఫోనుకూ పోలిక చెపుతూ ప్రచార మాధ్యమాలలో వచ్చిన ఉదాహరణ గుర్తుకు వస్తుంది. ఇంట్లో మరుగుదొడ్డి కట్టించుకోవడానికి డబ్బు లేదనే చాలామంది వ్యక్తులు ఒక్కొక్కరూ రెండు, మూడు మొబైల్ ఫోన్లను కొనడం చూస్తూనే ఉన్నాము. ఇక్కడ సంధర్భోచిత విషయమేమంటే, మన ఇళ్ళలో ఉండే సగటు మరుగుదొడ్లలో కన్నా, రోజూ మనం వాడే కంప్యూటర్ కీబోర్డ్ పైన, మనం వాడు మొబైల్ ఫోన్ పైన పది రెట్లు హానికారక సూక్ష్మ క్రిములు ఉంటాయిట. ఎందుకంటే మనం మరుగుదొడ్లను శుభ్రం చేస్తాము కానీ, కంప్యూటర్ కీబోర్డును, మొబైల్ ఫోన్లను అలా క్లీన్ చేయం కదా! ఇక వ్యక్తిగత స్థాయి నుండి గ్రామ స్థాయికి వస్తే, మన గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దటానికి కూడా మోడి గారు ఒక ప్రణాళికను ప్రస్తావించారు. అదే సంసద్ ఆదర్శ్ గ్రామ్ యోజన. భారతదేశపు ఆత్మ గ్రామాలలోనే ఉన్నదని గాంధీజీ అన్నారు. ఆయన కలను నిజం చేస్తూ, అక్టోబర్ 11 న లోకినాయక్ జయప్రకాష్ నారాయణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రకటించే ఈ పథకంలో మొదటి సంవత్సరంలో ప్రతి పార్లమెంట్ సభ్యుడూ తన నియోజకవర్గంలో ఒక గ్రామాన్ని అన్నివిధాలా ఆదర్శంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా ప్రకటించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జన్మించిన మన ప్రధాని ఈ గ్రామాభివృద్ధి అవశ్యకతను సరిగా గుర్తించి 2016 నాటికి ప్రతి పార్లమెంట్ సభ్యుడూ ఒక గ్రామాన్నీ, 2019 నాటికి ప్రతి పార్లమెంట్ సభ్యుడూ, ప్రతి అసెంబ్లీ సభ్యుడూ రెండేసి గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. సాధారణంగా నేతలు ఎన్నికలు పూర్తిగావడంతో ప్రజలకు దూరం కావడం మొదలవుంది. కానీ ఈ ఆదర్శ గ్రామ యోజన కార్యక్రమంలో నేతలు ప్రజలకు దగ్గరగా వారితో కలిసిమెలిసి పనిచేస్తూ వారిలో ఉత్సాహాన్ని నింపుతారు. దీనివల్ల రాజకీయ వ్యవస్థ కూడా బలపడుతుంది.

ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న జపాన్లో ఒక్కొక్క గ్రామం నుండి ఒక్కొక్క వస్తూత్పత్తి ఉంటుంది. జపాన్ ఈ పథకాన్ని 1979లోనే విజయంతం చేసింది. ఆ దేశంలో 1970లలోనే 'ఓయిట' రాష్ట్రంలోని 'ఒయామ' గ్రామంలో ఈ పథకాన్ని ప్రారంభించారు. దీనితో 1980–2003 ల మధ్య ఆ గ్రామ తలసరి ఆదాయం 330 అమెరికన్ డాలర్ల స్థాయి నుండి ఏకబీకిన 1300 డాలర్లకు పెరిగింది. ఇక థాయ్లెండ్ ఒక గ్రామం–ఒక ఉత్పత్తి పథకం క్రింద తన వృద్ధి గమనంతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. ప్రస్తుతం గ్రామంలో నివసించాలంటే ఎవరైనా, కూరగాయలనుండి, పాలు, సమస్తం దగ్గరిలోని పట్టణాలనుడే తెచ్చుకోవాలి. ఈ సమస్యకు ఈ రెండు పథకాలు చరమగీతం పడతాయని ఆశిద్దాం. ■

**అక్టోబరు 16 ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా...**

# ప్రపంచ ఆహార దినోత్సవం మన బాధ్యత

అహం వైశ్వానరో భూత్వా, ప్రాణినాం దేహ మాశ్రితః।
ప్రాణాపాన సమాయుక్త, పచామ్యన్నం చతుర్విధమ్ ॥"

అని గీతలో భగవంతుడు పేర్కొన్నట్లు వివిధములైన ఆహార పదార్థాల రూపంలో మనం తీసుకునే ఆహారమే 'మన శరీరం'. మనం తీసుకునే ఆహారం శక్తిరూపంలో ఉపయోగపడుతుంది.

ఆహారం సమతుల్యంగా ఉండాలి అని ఆహార వేత్తలు నీటితో సహా పిండి పదార్థాలు, మాంసకృత్తులు, క్రొవ్వు పదార్థాలు, విటమిన్స్, ఖనిజలవణాలు మొదలైన 5 పోషకాలు మన పంచ ప్రాణాలను కాపాడుకోవడానికి నిత్యం తగిన మోతాదులో కావాలి అన్నారు. ఆహారం పొందటంలో ఏ ఒక్క పోషకం తగ్గినా ఆ స్థాయిలో శారీరక రుగ్మత ఏదోవిధంగా ఏర్పడుతుంది. అందువలన ఆహారం తీసుకోవడంలో పద్ధతులను పాటించాలి. అలాగే పరిశుభ్రతను పాటించాలి.

అన్నం పరబ్రహ్మస్వరూపం అంటారు. కోట్ల జీవరాసులు మనుగడసాగించేది ఆహారంతోనే అలాంటి ఆహారాన్ని కొంచెం కూడా వృథా చేయకూడదు. ఆహారం, ఆహారపదార్థాలు జీవులకు ఉపయోగపడాలి కాని డస్ట్‌బిన్‌లోకి పోరాదు.

**ఆహారం - వృథా**

ప్రపంచంలో ఆహార వృథా మొత్తం ఉత్పత్తిలో 1/3వ వంతుగా ఉన్నదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) ఆహారము మరియు వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఓ) ప్రపంచ ఆహార సంస్థ (డబ్ల్యుఎఫ్ఓ) లు సంయుక్తంగా పేర్కొన్నాయి. 1.3 బిలియన్ టన్నుల ఆహారం ప్రపంచం మొత్తంలో వృథా అవుతుంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలలో 670 టన్నుల ఆహారం ప్రతి సంవత్సరం వృథా అవుతోందని ఎఫ్ఎఓ పేర్కొంది. ప్రత్యేకించి అమెరికాలో 15శాతం ఆహార వృథా జరుగుతున్నది. యునైటెడ్ కింగ్‌డమ్ లో 6.7మిలియన్ టన్నులు ప్రతి సంవత్సరం వృథా అవుతోందని పేర్కొన్నారు. 2014 లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్ ఆఫ్ బ్రిటీష్ వారి పరిశోధన ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా మూడవ వంతు భాగం కాకుండా సగ భాగము వరకు ఆహారం వృథా జరుగుతున్నదని తెలుస్తున్నది. నార్త్ అమెరికా దేశాలలో ఒక సంవత్సరంలో ఒక వినియోగదారుడు 95 కేజీల నుండి 115 కేజీలవరకు ఆహారం, ఆహారపదార్థాలు వృథా చేస్తాడని పేర్కొన్నారు.

గొప్పవారి వృథా 2011 లెక్కల ప్రకారం 220 మిలియన్ టన్నులు ఇది సబ్‌సహారన్ ఆఫ్రికా ఆహార ఉత్పత్తికి సమానం.

**ప్రపంచ ఆహార దినోత్సవం - వివరణ**

ఐక్యరాజ్యసమితి (యుఎన్ఓ) ప్రపంచ వ్యాప్తంగా వ్యక్తులు తీసుకునే ఆహారం గురించి, వ్యాధుల బారి నుండి ప్రజలను రక్షించుటకు, ప్రజలు, పౌష్టికాహారం తీసుకొనుటకు **1945 అక్టోబరు 16న ఆహారం మరియు వ్యవసాయక సంస్థ"ను స్థాపించారు. ఈ సంస్థ గౌరవార్థం అక్టోబర్ 16వ తేదీని ప్రపంచ ఆహార దినోత్సవంగా నిర్ణయించారు.** ఈ దినోత్సవాన్ని ప్రపంచ ఆహార కార్యక్రమంతో సహా ఆహార భద్రతకు సంబంధించిన అనేక సంస్థలు విస్తృతంగా జరుపుకుంటున్నాయి. ప్రపంచ **ఆహార దినోత్సవ కార్యక్రమాన్ని మొదటిసారిగా 1981లో జరుపుకున్నారు.**

కుటుంబ వ్యవసాయం జాతీయ భూగోళ ఆహార భద్రతకు విలువచేకూర్చింది. వ్యవసాయం, ఆహార ఉత్పత్తి రంగం, వ్యవసాయ కార్యకలాపాలు మొదలైనవెన్నో గ్రామీణ స్థాయిలో అభివృద్ధికి మార్గదర్శకం అయ్యేలా ఎఫ్ఎఓ ప్రయత్నిస్తోంది.

**ప్రపంచ స్థాయిలో ఆకలి బాధ**

**ఆకలితో బాధపడుతున్నవారు ప్రపంచ వ్యాప్తంగా 850మిలియన్‌ల మంది.** 50 మిలియన్‌ల మంది అమెరికన్‌లు కూడా ఆకలితో బాధపడుతున్నారట! 40 మిలియన్‌ల మంది ఆకలి బాధతోనూ, ఆకలితో వచ్చిన వ్యాధులతోను, అన్నీ ఉండి కూడా పోషకాహారం అవగాహనలేక కుపోషణతో బాధపడుతున్నారు. తిండిలేమితో ఎంతో మంది చిన్నారులు బలి అవుతున్నారు. ప్రజలకు సరిపోయినంత ఆహారం అందించి తిండిలేమిని తగ్గించి, అందరినీ పోషించే ప్రపంచం ఉండాలని ప్రపంచస్థాయి అధికారులు ఒప్పందము చేసుకున్నారు. ఏనిర్ణయం తీసుకున్నా ఉన్నవారు పారవేసే ఆహారం లేనివాడి ఆకలితీర్చే స్థితిలో ప్రపంచం ఉంది. పార్టీలలో ఎంతో ఆహారం వృథా చేస్తారు. స్కూలు, కాలేజీ హాస్టల్స్‌లో ఎంతో ఆహారం మురికికాలువల పాలవుతున్నది. ముఖ్యంగా ధరలు ఎక్కువ పలికే మార్కెట్‌లో ఆహార పదార్థాలు అమ్ముడవక చెత్తకుప్పలలోకి పోతున్నాయి. మార్కెట్‌లోని వృథాను సూప్‌లుగా, సాస్‌లుగా పొడులుగా మార్చాలి లేదా గోడౌన్‌లు పెంచి ఆహార పదార్థ నిల్వలకు ప్రయత్నించాలి. పార్టీలలో ఆహార వృథాపై కఠిన చర్యలు తీసుకోవాలి. స్కూలు, కాలేజి విద్యార్థులకు అవగాహన పెంచాలి. ఉన్నవాడికి ఆకలిబాధ తెలియదు. ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థలు చేసే ప్రయత్నం కన్నా సాటి జీవి ఆకలిని అర్థంచేసుకుని వృథాను తగ్గిస్తే ప్రపంచ ఆకలి సమస్య ఖచ్చితంగా తగ్గుతుంది. ఎఫ్ఎఓ ప్రత్యేక చర్యలతో ఆహార వృథాను తగ్గిస్తూ ఆహార పొదుపును నిల్వను పెంచి ప్రపంచ ఆకలి తీర్చాలి. ■

**సుసర్ల మాధవి,** ఫ్రీలాన్సర్

# శిలీంధ్రాలు - వర్షాలు

ఈ ప్రకృతిలో పనికిరానిదంటూ ఏమీలేదు. భూగోళంపైగల నిర్జీవ, సజీవ పదార్థాల ఉపయోగం తెలియక మనం అలా వర్గీకరిస్తుంటాం. అయితే నేడు పనికిరానిదిగా కనిపించినది, భవిష్యత్తులో ఎంతో ఉపయుక్తమైనదిగా పరిణమించవచ్చు. జీవవైవిధ్యం ప్రాముఖ్యత, దానిని కాపాడాల్సిన అవసరం గూర్చి ఎంత చెప్పినా తక్కువే.

నీరే ప్రాణాధారం. వర్షాల ద్వారా ప్రతి సంవత్సరం నీరు భూగోళంపై చేరుతుంది. మేఘాలు ఏర్పడటం, అనుకూలించినచోట వర్షించడం మనం చూస్తూనే ఉన్నాం. 'జలవలయ' చర్యల ద్వారా ఇది పునరావృతమౌతూ ఉంటుంది. అయితే మేఘాలు ఏర్పడటం, వర్షించడం ఎంతో సంక్లిష్టమైన ప్రక్రియ. అవి ఏర్పడటానికి అనుకూలించే పరిస్థితులను గూర్చి వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతూనే ఉంటారు. మేఘాలు ఏర్పడటానికి తోడ్పడే ఒక సరికొత్త అంశం ఈ మధ్యే వెలుగులోకి వచ్చింది. అదేమిటో పరిశీలిద్దాం.

**వర్షపు బిందువులు ఏర్పడడానికి ఒక కేంద్రస్థానం అవసరం. సాధారణంగా గాలిలో తేలుతూ ఉండే దుమ్ము, పొగరేణువులు లేదా గాలిలో తేలే ఏ ఘనపదార్థమైనా ఇలా కేంద్రక స్థానాలుగా పనిచేస్తాయి.** వాటి చుట్టూ నీరు ఘనీభవిస్తుంది. కొన్ని క్షారాలనుచల్లి కృత్రిమంగా మేఘాలు సృష్టించడం, తద్వారా కృత్రిమ వర్షాలకై ప్రయత్నించడం మనకు తెలుసు. అమెజాన్ వర్షాధార అరణ్యాల్లో జరిగిన ఒక అధ్యయనం, మేఘాలు ఏర్పడడానికి తోడ్పడే ఒక సరికొత్త అంశాన్ని వెలుగులోకి తెచ్చింది. **కొన్ని శిలీంధ్రాలు వెదజల్లే ఉప్పురేణువులు మేఘాలేర్పడటానికి, తద్వారా వర్షపాతానికి తోడ్పడుతున్నాయని తెలుస్తోంది.** ఆమెజాన్ నదీ పరీవాహక ప్రాంతంలోని, ఏడు దేశాల్లో, సుమారు 6.9 మి. చ. కిలోమీటర్ల విస్తీర్ణంలో వ్యాపించిన, భూగోళంపై గల అతిపెద్ద వర్షాధార అరణ్యం. పర్యావరణ ప్రాముఖ్యత గలది. ఎంతో విశిష్టమైన జీవవైవిధ్య నిలయం. మేఘాలు ఎలా ఏర్పడతాయో, అవి వర్షపాతాన్ని ఎలా అందిస్తాయో తెలుసుకోవాలన్న ఉద్దేశ్యంతో ఒక అంతర్జాతీయ పరిశోధకుల బృందం ఈ అడవులలో అధ్యయనం చేసింది. ఈ అధ్యయనంలో శిలీంధ్రాలు – వర్షాలకుగల సంబంధం తెలియవచ్చింది. ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఆమెజాన్ ప్రాంతం కాలుష్యరహితం, సహజసిద్ధ వాతావరణం కలిగి ఉంటుంది. అయితే స్వచ్ఛమైన గాలి సైతం మొక్కలు వదిలిన వాయువులు, రేణువులు కలిగి ఉంటుంది. అమెజాన్ వర్షాధార అరణ్యం ఒక విశిష్ఠ ప్రాంతం. ఇక్కడి గాలిలోకి రోజుకు వేల రకాల అణువులు వచ్చి చేరుతుంటాయి. ఈ ప్రాంతం విశిష్టమైన వాసనకు అవే కారణం. భాష్పీభావనగుణంగల టెర్పీన్ వంటి వాయువులు ఈ గాలికి ఆహ్లాదకరమైన వాసన నిస్తాయి. వాతావరణంలోకి విడుదలైన వాయువుల, తరువాత ఓజోన్ వంటి రసాయనాలతో ఆక్సీకరణం చెందుతాయి. ఇలా రూపాంతరం చెందిన వాయువులు రేణువులుగా మారతాయి.

ఇక్కడి వాతావరణంలోని రేణు పదార్థం ఎలాంటిదో తెలుసుకోవడానికి పరిశోధకులు 80మీటర్ల ఎత్తైన ఒక టవర్‌ను ఏర్పాటు చేసి, గాలి యొక్క నమూనాలను సేకరించారు. పరీక్షించిన తరువాత వాటిలో మూడు రకాలైన స్థూల నానో పరిమాణంలో గల రేణువులు కన్పించాయి. వాటిల్లో పోటాషియం ఎక్కువ పాళ్లలో ఉండి, సేంద్రియ జెల్‌పొరతో చుట్టబడి ఉన్నాయి. సముద్రం నుండి లవణం వచ్చే అవకాశాన్ని త్రోసిపుచ్చారు. పోటాషియం, ఆ వాతావరణ:లో ఎక్కువగా చేరడానికి, అడవుల నుండి వస్తున్న శిలీంధ్ర సిద్ధ బీజాలే అని తేల్చారు. అడవులు వల్ల ఎన్ని ఉపయోగాలో కదా!

పరిశోధకుల ప్రకారంగా నిజంగా ఇదొక ఆసక్తికరమైన అధ్యయనం. బయోస్ఫియర్ – అట్మాస్ఫియర్ చర్యలకు సరికొత్త రూపాన్ని స్తుందని చెబుతున్నారు. అలాగే వర్షపాతానికి అనువైన పరిస్థితులను సృష్టించడంలో అడవుల ప్రాముఖ్యత తెలియచేస్తోంది. అమెజాన్ వర్షాధార అరణ్యాలు మేఘాలు ఏర్పడం, వర్షపాతం పెంచడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని అవగతమవుతుంది. ఇలా మేఘాలు ఏర్పడడం, వర్షాలు కురవడంలో శిలీంధ్రాలు కీలకపాత్ర వహిస్తున్నాయి. ■

**సమ్మెట గోవర్ధన్,** హన్మకొండ, వరంగల్. సెల్ : 9949038471

# భారతదేశంలో మానవ హక్కులు

**భా**రతదేశంలో మానవ హక్కుల పరిస్థితిని వివరించే ముందు మానవ హక్కుల పుట్టుపూర్వోత్తరాల గురించి తెలుసుకోవడం మంచిది. క్రీ.శ. 1215లో ఇంగ్లాండ్ రాజు జాన్ సంతకం చేసిన 'మాగ్నాకార్టా'లో మానవ హక్కుల భావన బీజరూపంలో ఉంది. అదే మాగ్నాకార్టా ప్రపంచంలో తొలిసారి చట్టబద్ధ పాలనకు శ్రీకారం చుట్టింది. మానవ హక్కులు అనే భావనకు అంకురార్పణ చేసింది అదే! 'న్యాయబద్ధమైనతీర్పు ద్వారా తప్ప మరే విధంగాను పౌరుని స్వేచ్ఛను బందీ చేయడం, బహిష్కరించడం నిషిద్ధం" అని మాగ్నాకార్టా స్పష్టం చేసింది. మాగ్నాకార్టాలోని మానవ హక్కుల భావన 1776లో అమెరికా స్వాతంత్ర్య ప్రకటనను, 1789లో ఫ్రెంచ్ విప్లవాన్ని మరింత పటిష్టపరిచింది. అస్తిపంజరం లాంటి మానవ హక్కుల భావనకు ఇవి రెండు రక్తమాంసాలు ఇచ్చాయి. మన దేశంలోని మెజారిటీ ప్రజలు ఇప్పటికీ తమ హక్కులను అనుభవించలేని స్థితిలో ఉన్నారు. విభిన్నమైన మన సామాజిక నిర్మాణమే అందుకు ప్రధాన కారణంగా పేర్కొనవచ్చు. అందువల్ల దేశంలోని మానవ హక్కులను అంతర్జాతీయ ఒడంబడికలు, రాజ్యాంగంలోని ప్రొవిజన్లకు మాత్రమే పరిమితం చేయలేని పరిస్థితి నెలకొన్నది. దేశంలోని మానవ హక్కుల గురించి చర్చించేటప్పుడు, సామాజిక న్యాయం ప్రస్తావనకు వస్తే వివిధ దశల్లో సాగిన సామాజిక సంస్కరణల చరిత్రను పరిగణనలోకి తీసుకోకతప్పదు. రాజారామ్మోహన్‌రాయ్ నుండి అంబేద్కర్, పెరియార్ వరకు జరిగిన సంస్కరణోద్యమాలను, ఇటీవలి పరిణామాలను పరిగణనలోకి తీసుకోకతప్పదు.

రాజ్యాంగ సభలో ప్రసంగిస్తూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 'జనవరి 26న మనం పరస్పరం విరుద్ధమైన జీవితాల్లోకి అడుగుపెట్టబోతున్నాం. రాజకీయాల్లో సమానత్వం ఉంటుంది. అదే సామాజిక, ఆర్థిక జీవితాల్లో సమానత్వం ఉండదు. అదే విధంగా 'ఒకరికి ఒకే ఓటు, ఒక ఓటుకు ఒకే విలువ' వంటి సిద్ధాంతాలను రాజకీయాలలో ఆమోదిస్తాం. కానీ, సామాజిక, ఆర్థిక జీవితాల్లో ప్రతి మనిషికీ ఒకే విలువ ఇవ్వడానికి నిరాకరిస్తాం. ఇలాంటి వైరుధ్యాలతో ఎంత కాలం జీవిస్తాం? సామాజిక, ఆర్థిక జీవితాలలో సమానత్వాన్ని ఎంతకాలం నిరాకరించగలం? దీర్ఘకాలం ఈ దుస్సాంప్రదాయం కొనసాగితే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడవచ్చు! సాధ్యమైనంత తొందరగా ఈ వైరుధ్యాలను తొలగించడానికి మనం ప్రయత్నించాలి. లేకపోతే, రాజ్యాంగ సభ ఎంతో కష్టపడి నిర్మించిన రాజకీయ వ్యవస్థను అసమానతల బాధితులు కూలదోస్తారు" అని హెచ్చరించారు.

రాజారామ్మోన్‌రాయ్ కూడా ఈ వైరుధ్యాలను గమనించారు. ఏ సామాజిక ఉద్యమమైనా, మతపరమైన ఉద్యమమైనా విజయం సాధించాలంటే, దానికి ప్రజల మద్దతు తప్పనిసరి అని ఆయన ఆనాడే స్పష్టం చేశారు. సతీసహగమన దురాచారాన్ని నిషేదించడానికి ఆయన సాగించిన ఉద్యమమే బ్రిటీషు పాలనలో ప్రారంభమైన మొదటి మానవ హక్కుల ఉద్యమంగా అభివర్ణిస్తుంటారు. ఆయన తన పరిశోధనలను, ఆందోళనలను ఆలంబనంగా చేసుకోకపోతే, 'సతి' నిషేద ఉద్యమం విజయం సాధించి ఉండేది కాదు. సతీ దురాచారంపై ఆయన ప్రజల్లో అవగాహన కల్పించారు. ప్రజల్లో చైతన్యం రగిలించారు. **ప్రజలకు అవగాహన కలిగించకుండా చట్టాలు చేయడం వలన ఫలితం ఉండదని ఆయన అప్పుడే గ్రహించి అమలులో పెట్టారు.** మహిళలు, అంటరాని వారి విముక్తి కోసం హేతుబద్ధంగా, వైజ్ఞానికంగా ఉద్యమించాలని ఆయన నిర్ణయించారు. మహిళల పట్ల, తక్కువ కులాల వారి పట్ల అనుసరిస్తున్న అమానుష విధానాలను ఆయన వర్ణించిన తీరు, హిందువులు ఉన్నతమైన నైతిక ప్రమాణాలు పాటించాలంటూ ఆయన చేసిన విజ్ఞప్తులు దేశంలోని ఆధునిక సంస్కరణోద్యమాలకు కూడా మౌలిక సిద్ధాంతాలను అందించాయి. సామాజిక సంస్కరణలు,

**గడ్డం ఆదాము**, పరిశోధక విద్యార్థి, రాజనీతిశాస్త్ర విభాగము, ఉస్మానియ యూనివర్సిటీ, హైద్రాబాద్
e-mail : gaddamadhamu1221@gmail.com

సామాజిక న్యాయాలకు సంబందించిన ఉద్యమాలు ప్రజా చైతన్యంతోనే ముందుకు సాగగలుగుతాయని, మానవ హక్కుల విషయంలో కూడా ఇలాంటి చైతన్యం తీసుకురావలసి ఉంటుందని భావిస్తున్నారు.

మానవ హక్కులను విధాన పరమైన అంశాలలో భాగంగా గుర్తించాలన్న భావన స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే ఉద్భవించింది. 22 డిసెంబర్ 1927న మద్రాసులో జరిగిన భారత జాతీయ కాంగ్రెసు 42వ సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. మతపరమైన, భాషాపరమైన మైనారిటీల భవిష్యత్తుకు సంబంధించిన ఓ తీర్మానాన్ని ఇందులో ఆమోదించారు. రాజకీయ హక్కులకు సంబందించిన తీర్మానంలోని నాల్గవ భాగంలో స్వేచ్ఛా భారతంలో ఆమోదించే కొత్త రాజ్యాంగంలో సర్వసమ్మతి స్వేచ్ఛకు హామి కల్పించడం జరుగుతుందని, కేంద్రం లేదా రాష్ట్రం చేసే చట్టాలు ఈ స్వేచ్ఛను హరించజాలవని స్పష్టంగా నిర్దేశించడం జరిగింది. ఈ తీర్మానాన్ని 1931 ఆగష్టులో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సవరించింది.

**జాతీయ మానవ హక్కుల కమిషన్ వివరణ**

పౌరుల మానవ హక్కుల పరిరక్షణ పట్ల భారత ప్రభుత్వం ఎంతో ఆసక్తి చూపిస్తున్నది. ఇందులో భాగంగానే జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 1993 అక్టోబరులో ఎన్.హెచ్.ఆర్.సి. ఏర్పడింది. ఇందుకోసం ఒక నెల ముందు మానవ హక్కుల ఆర్డినెన్సును జారీ చేయడం జరిగింది. ఆ తరువాత అది మానవ హక్కుల పరిరక్షణ చట్టం 1993గా మారింది.

ఇది పూర్తిగా స్వయం ప్రతిపత్తిగల సంస్థ. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన వారిని ఎన్.హెచ్.ఆర్.సి.కి చైర్మన్‌గా నియమిస్తారు. మరో నలుగురు సభ్యులు కూడా ఇందులో ఉంటారు. మానవ హక్కుల చట్టం 1993 సెక్షన్ 2(డీ) మానవ హక్కులను ఇలా నిర్వచించింది. 'రాజ్యాంగం, అంతర్జాతీయ ఒడంబడికలు హామీ ఇస్తున్న వ్యక్తి జీవితం, స్వేచ్ఛా సమానత్వం. పరువు మర్యాదలకు సంబంధించిన హక్కులను మానవ హక్కులుగా పరిగణించాలి. ఇండియాలో వీటిని కోర్టులుఅమలు పరుస్తాయి. ఇక్కడ అంతర్జాతీయ ఒడంబడికలంటే అంతర్జాతీయ పౌర, రాజకీయ హక్కుల ఒడంబడిక "1996 డిసెంబర్ 16న ఐక్యరాజ్యసమితి ఆమోదించిన 'అంతర్జాతీయ ఆర్థిక, సాంస్కృతిక సామాజిక హక్కుల ఒప్పందం' వంటివి.

ఎన్.హెచ్.ఆర్.సితో పాటు రాష్ట్రస్థాయిలో మానవ హక్కుల కమిషన్‌ను ఏర్పాటు చేయడానికి చట్టంలో తగు ఆదేశాలు ఉన్నాయి. అంతే కాదు, జిల్లా స్థాయిలో మానవ హక్కుల న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయాలని మానవ హక్కుల చట్టం 1993 నిర్దేశిస్తున్నది. దేశ జనాభాలో సగం మంది మహిళలే ఉన్నారు. ఈ వాస్తవాన్ని గుర్తించి మహిళ కమిషన్ చట్టం 1990 క్రింద జాతీయ మహిళా కమిషను ఏర్పాటు చేయడం జరిగింది. అదే విధంగా మైనారిటీ కమిషను, షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల కమిషన్ ఏర్పడ్డాయి. ఈ కమిషన్లన్నీ సహకార స్ఫూర్తితో పనిచేస్తాయి. ఈ మూడు కమీషన్ల చైర్మన్‌లను, ఎన్.హెచ్.ఆర్.సి. చైర్మన్‌ను రాష్ట్రపతి నియమిస్తారు. ప్రధాని నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ సిఫారసు మేరకు ఈ నియామకం జరుగుతుంది. ఈ కమిటీలో లోక్‌సభ స్పీకరు, హోమ్ మంత్రి, లోకసభలో ప్రతిపక్ష నాయకుడు రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ సభ్యులుగా ఉంటారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన వారు ఎన్.హెచ్.ఆర్.సి. చైర్మన్ పదవికి అర్హులు. మానవ హక్కుల అంశంలో నిపుణులైన వారు. అనుభవజ్ఞులైన వారిని ఇద్దరిని కమిషన్ సభ్యులుగా నియమిస్తారు. మిగిలిన ఇద్దరు సభ్యులలో ఒకరు తప్పనిసరిగా హైకోర్టు న్యాయమూర్తి అయిఉండాలి. సుప్రీంకోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన లేదా పని చేస్తున్న వ్యక్తిని నాల్గవ సభ్యునిగా నియమించాలి. సిఆర్‌పిసి 1908 క్రింద సివిల్ కోర్టుకు ఉండే అధికారాలన్నీ ఈ కమిషన్‌కు ఉంటాయి. మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన కేసులను ఈ కమీషను తనకు తానే విచారణకు స్వీకరించవచ్చు లేదా మానవ హక్కుల ఉల్లంఘన జరిగినట్లు కమిషన్ భావిస్తే కోర్టు అనుమతితో ఆ కేసు విచారణలో కమిషను జోక్యం చేసుకోవచ్చు. ఏ జైలునైనా సందర్శించి, తనిఖీలు జరిపే అధికారం కమిషన్‌కు ఉంది. అంతేకాదు, పరిస్థితిని అంచనా వేయడానికి ఎవరినైనా తన ప్రతినిధిగా పంపించే అధికారంకూడా ఉంది. మానవ హక్కుల పరిరక్షణ కోసం రాజ్యాంగం సమకూర్చిన లేదా అప్పటికే అమలులో వున్న చట్టంలోని రక్షణలను సమీక్షించి, వాటి సమర్థవంతమైన అమలుకు తగిన సిఫార్సు చేయగల అధికారం కూడా కమిషన్‌కు ఉంది. మానవ హక్కులకు సంబంధించిన అంతర్జాతీయ ఒప్పందాలను అధ్యయనం చేసి, వాటి అమలుకు తగు సిఫారసులు చేస్తుంది. మానవ హక్కుల రంగంలో పనిచేస్తున్న ప్రభుత్వేతర సంస్థలకు సంబందించిన దాదాపు అన్ని రకాల కేసులను ఎన్‌హెచ్‌ఆర్‌సి విచారణకు స్వీకరిస్తుంది.

**రాష్ట్ర మానవ హక్కుల కమీషన్**

మానవ హక్కుల పరిరక్షణ చట్టం 1993లోని సెక్షన్ 21 రాష్ట్రస్థాయి మానవ హక్కుల కమీషన్లను ఏర్పాటు చేయాలని సూచిస్తున్నది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన వ్యక్తిని ఈ కమిషన్‌కు చైర్మన్‌గా నియమించాలని, హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన లేదా పనిచేస్తున్న వ్యక్తిని మరో సభ్యుడిగా నియమించాలని స్పష్టం చేస్తున్నది. మానవ హక్కుల రంగంలో నిపుణులైన మరో ఇద్దరిని కూడా కమీషను సభ్యులుగా నియమించాలని స్పష్టం చేస్తున్నది. కమిషనుకు ఒక సెక్రటరీ కూడా ఉండాలి. కమీషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా అతను వ్యవహరిస్తారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో, హోమ్ మంత్రి, స్పీకర్, ప్రతిపక్ష నాయకుడు సభ్యులుగా గల ఉన్నతస్థాయి

కమిటీ సిఫారసుల మేరకు రాష్ట్ర గవర్నర్ ఈ కమిషన్ అధ్యక్షుడిని సభ్యులను నియమిస్తారు. శాసనమండలి ఉన్న రాష్ట్రాలలో శాసన మండలి చైర్మన్, ప్రతిపక్ష నాయకుడు కూడా ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు.

రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్‌లో గల 2, 3వ జాబితాలలో పొందుపరచిన అంశాలకు సంబంధించిన మానవ హక్కుల ఉల్లంఘన కేసులను మాత్రమే రాష్ట్రస్థాయి కమీషన్ విచారణకు స్వీకరిస్తుంది. ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, అస్సాం, తమిళనాడు, పంజాబ్, జమ్ముకాశ్మీర్, మణిపూర్, కేరళ, ఒరిస్సా రాష్ట్రాలు మాత్రమే రాష్ట్రస్థాయి మానవ హక్కుల కమీషన్‌లు ఏర్పాటు చేశాయి. ఉత్తరప్రదేశ్‌లో మానవ హక్కుల కమిషన్ ఏర్పాటుకు సంబంధించిన ఓ కేసు అలహాబాద్ హైకోర్టులో విచారణలో ఉన్నది.

**జాతీయ మానవ హక్కుల కమిషన్ పనితీరు**

మానవ హక్కుల ఉల్లంఘనకు సంబందించిన ఆరోపణలపై ఎన్‌హెచ్‌ఆర్‌సి దర్యాప్తు జరిపి, అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగుసిఫారసులు చేస్తున్నది. అయితే, ఇది సిఫారసులు చేయడానికి పరిమితమైంది. దీనికి క్వాసీ – జ్యుడీషియల్ అధికారాలు లేవు. ఈ పరిమితి దృష్ట్యా, ఎన్‌హెచ్‌ఆర్‌సి ప్రభుత్వాలపై నైతిక ఒత్తిడిని మాత్రమే తీసుకురాగలదు. అయితే మావన హక్కుల పరిరక్షణకు ఉద్యమం అంటూ లేకపోతే, అవి ఎందుకూ కొరగాకుండా పోతాయి. మానవ హక్కుల కోసం పోరాడుతున్న విదేశీ స్వచ్ఛంద సంస్థలతో, అనుబంధం పెంచుకోవడం వల్ల భారత మానవ హక్కుల కార్యకర్తల్లో అవగాహన పెరుగుతున్నది. ఇప్పుడు మన దేశంలోని మానవ హక్కుల సంఘాలు కేవలం రాజకీయ హక్కుల పరిరక్షణకు మాత్రమే పరిమితం కావడం లేదు. సామాజిక, ఆర్థిక వివక్షలకు వ్యతిరేకంగా, నిరుపేదల, మహిళల, బాలల మైనారిటీల హక్కుల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడుతున్నాయి. వ్యక్తిగత హక్కులతో సమానంగా సామాజిక హక్కులకూ ప్రాధాన్యం పెరిగింది.

వివిధ రాష్ట్రాలలోని పోలీసు దళాలకు మానవ హక్కుల గురించి అవగాహన కలిగించడానికి ఎన్‌హెచ్‌ఆర్‌సి తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. మానవ హక్కుల ఉల్లంఘన కేసులపై దర్యాప్తు జరిపి, వాటి కారణాలు వెలికి తీసి, తన వార్షిక నివేదికలలో వాటి వివరాలను ప్రచురిస్తున్నది. మానవ హక్కులపై వీరికి అవగాహన పెంచడానికి అనేక సెమినార్లు నిర్వహిస్తుంది. విధి నిర్వహణ సమయంలో ఉత్పన్నమయ్యే మానవ హక్కులకు సంబందించిన సమస్యలపై చర్చించడం కోసం కమిషన్ చైర్మన్, సభ్యులు, డైరెక్టర్ జనరల్ తదితర ఉన్నత అధికారులు పోలీసు రక్షణ కేంద్రాలకు వెళ్లి నేరుగ ముఖాముఖి చర్చలు జరుపుతుంటారు. అదే విధంగా పారా మిలటరీ దళాల్లో మానవ హక్కులపై అవగాహన పెంచడానికి కూడా కృషి చేస్తున్నది. పారామిలటరీ దళాలకు శిక్షణకాలంలోనే మానవ హక్కుల గురించి బోధించడానికి ఒక ఉమ్మడి పాఠ్యప్రణాళికను రూపొందించింది. ఎన్‌హెచ్‌ఆర్‌సి సహకారంతో సైనిక జవాన్‌ల కోసం ఎప్పటికప్పుడు వర్క్‌షాపులు నిర్వహిస్తూ, వారికి మానవ హక్కుల ప్రాముఖ్యతను వివరించడానికి ప్రయత్నాలు జరిగాయి.

లాకప్ మరణాలకు సంబంధించిన పత్రికల్లో పుంఖాను పుంఖాలుగా వచ్చిన వార్తలకు స్పందించిన ఎన్‌హెచ్‌ఆర్‌సి లాకప్ మరణాల నిరోధానికి అనేక మార్గదర్శక సూత్రాలు జారీ చేసింది.

లాకప్ మరణాలు లేదా పోలీసు కస్టడీలో జరిగే అత్యాచారాలకు సంబందించిన సమాచారాన్ని సంఘటన జరిగిన 24 గంటల్లో మానవ హక్కుల కమిషన్‌కు సంబంధిత ఎస్.పి. నివేదించాలని, లేని పక్షంలో ఆ సంఘటనను కప్పిపుచ్చడానికి జరిగిన ప్రయత్నంగా పరిగణించాల్సి వస్తుందని స్పష్టం చేస్తూ దేశీయ వ్యవహారాల శాఖ 1993, డిసెంబర్ 14న అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు లేఖలు రాసింది. జ్యుడిషియల్ కస్టడీలోనే ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయి. బీహార్, కేరళ,, ఒరిస్సా, మధ్యప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఢిల్లీలలో పోలీసు కస్టడీ మరణాల సంఖ్య తగ్గుముఖం పట్టినట్లు ఎన్‌హెచ్‌ఆర్‌సి నివేదికలను బట్టి అర్థమవుతున్నది. అస్సాం, కర్నాటక, పాండిచ్చేరీలలో ఈ సంఖ్య పెరుగుతున్నది. ఎన్‌హెచ్‌ఆర్‌సికి నివేదించాలన్న ఆదేశాలను ఖచ్చితంగా పాటించడం వల్ల ఈ సంఖ్యలో పెరుగుదల నమోదు అయి ఉండవచ్చునని అంటున్నారు. ఏమైనా జైళ్ళలో నెలకొన్న అనారోగ్యకర పరిస్థితుల వల్లనే జ్యుడీషియల్ కస్టడీలో జరుగుతున్న మరణాల సంఖ్య పెరుగుతున్నదని విశ్లేషిస్తున్నారు.

జైళ్లలోని స్థితిగతులు మెరుగుపరచాలనీ, పోలీసు యంత్రాంగాన్ని ఒక పద్ధతి ప్రకారం సంస్కరించాలని మానవ హక్కుల కమిషన్ గత ఏడేళ్ళుగా ప్రయత్నిస్తున్నది. మానవ హక్కులను ఉల్లంఘించకుడా చట్టాన్ని అమలు చేసే అధికారాన్ని కట్టడి చేయాల్సిన అవసరాన్ని గుర్తించిన మానవ హక్కుల కమిషన్ ఆ దిశగా చర్యలు చేపట్టింది. పోలీసుల పనితీరు,వారి వ్యక్తిత్వంలో మార్పులు తీసుకురావాలని అభిప్రాయపడిన కమీషను, అందుకోసం నిర్దిష్టమైన ప్రతిపాదనలు చేసింది. అధికారంలో ఉన్న పార్టీకి 'అంగబలం'గా తాము వ్యవహరించకూడదని, భిన్నత్వంతో కూడిన మన సమాజంలో అన్ని వర్గాలపట్ల నిష్పాక్షికంగా, చిత్తశుద్ధితో వ్యవహరించాలని, కమిషను పోలీసులకు పదే పదే హితబోధ చేస్తున్నది. పోలీసు వ్యవస్థలో ఒక క్రమపద్ధతి ప్రకారం చేపట్టాల్సిన సంస్కరణలను ఎన్‌హెచ్‌ఆర్‌సి సిఫారసు చేసింది. ■

# నల్లధనం : దేశ భవిష్య(సొ)త్తు

"మీకు ఆ వ్యక్తులెవరో తెలుసు, ఎక్కడ దాచుకున్నారో తెలుసు. అయినా ఏమీ ఎరగనట్టు నటిస్తున్నారు. ఏవో ఒప్పందాల పేరు చెప్పి తప్పించుకొనే ప్రయత్నం చేస్తున్నారు. అలాంటి వారి మీద మీరు తీసుకొస్తున్న చర్యలేమిటో చెప్పండి" అని గత 60 సం॥ల చరిత్రలో నల్లధనం వెలికితీతపై కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యాన్ని, సోమరితనాన్ని సుప్రీంకోర్టు ధర్మాసనం 2009 సం॥లో ప్రశ్నించడంతో "నల్లధనం" అంశం దేశవ్యాప్తంగా ప్రధాన చర్చనీయాంశంగా మారింది. నల్లధనం దేశ ఆర్థిక వ్యవస్థను ఏవిధంగా ప్రభావితం చేస్తుందో ఈ వ్యాసం ద్వారా తెలుసుకుందాం.

భారత దేశం ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలు ఒకవైపు. మరోవైపు పైకి కన్పించకుండా దేశ ఆర్థిక వ్యవస్థను, పురోభివృద్ధికి అడుగడుగునా కుంగదీస్తున్న అవినీతికి పుట్టిన గారాల బిడ్డనే నల్లధనంగా చెప్పవచ్చు.

**ద్రవ్యం (కరెన్సీ/డబ్బు) – నల్లధనం అర్థ నిర్వచనాలు**

మానవుడు కనిపెట్టి ఆవిష్కరించిన అనేక అద్భుతాలలో ద్రవ్యం/డబ్బు ఒకటి.

ద్రవ్యం/మనీ అంటే కరెన్సీ నోట్లు, నాణేలు మాత్రమే కాదు, వాణిజ్య బ్యాంకుల దగ్గర డిపాజిట్లు, కేంద్ర బ్యాంక్ దగ్గర గల ఇతర డిపాజిట్లు, వజ్రాలు, ప్లాటినమ్, బంగారం, వెండి విలువైన వస్తువులు, ఆస్తులు, ద్రవ్యం/మనీ (ధనం)లో భాగమే.

"క్రౌథర్ నిర్వచనంలో" వినిమయ మాధ్యమంగా సర్వామోదం కలిగినది, విలువ కొలమానంగా, విలువ నిధిగా పనిచేసేది ఏదైనా ద్రవ్యం/మనీగా పేర్కొన్నారు.

ఆదాయపు పన్ను సహా ఏ ఇతర పన్నులు చెల్లించకుండా, ప్రభుత్వానికి లెక్క చూపకుండా దాచుకొన్న సొమ్మును "నల్లధనం"గా చెప్పవచ్చు. అలాగే బంగారం, వజ్రాలు, ప్లాటినమ్, వెండి, విలువైన లోహాలు, వస్తువులు, ఆస్తులకు సంబంధించి ప్రభుత్వం దగ్గర లెక్క చూపకుండా, పన్నులు చెల్లించనివి కూడా "నల్లధనంగా" గుర్తించవచ్చు.

నల్లధనాన్ని మూడు(3) రకాలుగా విభజించవచ్చు. 1) చట్టబద్ధంగా సంపాదించినా ప్రభుత్వానికి లెక్కలు చూపని, పన్నుకట్టనివి 2) అవినీతి, నేరపూరితంగా, అక్రమ కార్యకలాపాల ద్వారా సంపాదించింది. 3) ప్రభుత్వాన్ని, భాగస్వామ్య దారులను మోసం చేసి కార్పొరేషన్లనుంచి దోచుకొంటున్న ధనం.

**నల్లధనంపై అంచనాలు**

విదేశీ, స్వదేశాల్లో నల్లధనం పోగుపై వివిధ సంస్థలు, వ్యక్తులు వెలువరించిన అంచనాలు :

అసోచామ్ అంచనా ప్రకారం మన దేశంలో నల్లధనం రూ.120 లక్షల కోట్లు ప్రముఖ న్యాయవాది రాంజెఠ్మలాని అంచనా ప్రకారం 70 లక్షల కోట్లు. వికీలీక్స్ సంస్థ యజమాని జూలియస్ అసాంజే భారతీయుల నల్లధనం స్విస్ బ్యాంకుల్లో 70 లక్షల కోట్లు ఉంటుందన్నారు.

2012 సం॥లో సి.బి.ఐ. సంచాలకులు చెప్పిన వివరాల ప్రకారం 30 లక్షల కోట్లు, బి.జె.పి. పార్టీ అంచనా ప్రకారం 60 లక్షల కోట్లు, గ్లోబల్ ఫైనాన్షియల్ ఇంటెగ్రిటీ సంస్థ లెక్కల ప్రకారం 1948–2008 వరకు 60 సం॥లో 20 లక్షల కోట్లు విదేశాలకు తరలితే, దేశంలో 25 లక్షల కోట్ల నల్లధనం చలామణిలో ఉందని లెక్క కట్టారు.

వాషింగ్టన్‌లోని ఒక పరిశోధన సంస్థవారు 2002–2013 సం॥లో భారత్‌నుండి 21 లక్షల కోట్లు నల్లధనం తరలిందని, 1991 ఆర్థిక సంస్కరణల తర్వాత 68లక్షల కోట్లు నల్లధనం విదేశాలకు మరలించారన్నారు.

రాందేవ్ బాబా "భారత్ స్వాభిమాన్" ట్రస్టు వారి అంచనా ప్రకారం విదేశాల్లో 260 లక్షల కోట్లు, స్వదేశంలో 60 లక్షల కోట్లు మొత్తం 320 లక్షల కోట్లు. 1994–95 నాటికి 11 లక్షల కోట్ల నల్లధనం పేరుకుపోయిందని పార్లమెంట్ ఆర్థిక వ్యవహారాల స్థాయి సంఘం తెలిపింది. విదేశీ బ్యాంకుల్లో 2013 సం॥రానికి 6,92,328 లక్షల కోట్ల నల్లధనం ఉండొచ్చని ఒక అంచనా.

స్విట్జర్లాండ్‌లోని దాదాపు 283 స్విస్ బ్యాంకుల్లో విదేశాలకు

**పి. సరిత,** ఎం.ఎ, (రాజనీతిశాస్త్రం), టీచర్, కుల్సుంపుర, హైదరాబాద్

చెందిన 1.6 లక్షల కోట్ల డాలర్ల సొమ్ము ఉంటే, భారతీయుల నల్లధనం 2013 సం. వరకు 14,000 వేల కోట్లని తెలిపింది. స్విస్ బ్యాంక్‌లో 2006సం.లో 41,400 కోట్లని తెలిపింది. 2009 సం.లో 12,600 కోట్లు, 2010 సం.లో 12,450 కోట్లు, 2011 సం.లో 14,000 కోట్లు, 2012 సం.లో 9,000 కోట్లు, 2013 సం.లో 14,000 కోట్లు అని మరో అంచనా.

ఈవిధంగా రాజకీయ నాయకులు, వ్యాపార, వాణిజ్య, బడా పారిశ్రామిక వేత్తలు, స్మగ్లర్లు, మాఫియా, ఉగ్రవాదులు, వివిధ సంస్థలు లెక్కకు మించి ఏడాది ఏడాదికీ నల్లధనం పోగుచేసి పొరుగు దేశాల్లో నిద్రపుచ్చుతున్నారు.

**నల్లధనం ఏర్పడడానికి అవకాశాలు, కారణాలు**

గతంలో నల్లధనాన్ని స్విస్ బ్యాంక్, ఇతర కొన్ని దేశాల్లో మాత్రమే దాచేవారు. కాని మధ్య ప్రాచ్య దేశాలు (టర్కీ, సిరియా, ఇరాన్, ఇరాక్, ఖతార్, సౌదీ అరేబియా, యెమెన్, ఒమన్, ఆర్మేనియా). ఫ్రీట్రేడ్ జోన్స్ ఏర్పాటు చేయడంతో బ్లాక్‌మని చలామణి మార్గం మరింత సుగమం అయ్యింది. ఐటి సేవాసంస్థల పేరుతో, పరిశ్రమల పేరుతో ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక రాయితీలు, అమ్మకం పన్ను, ఎక్సైజ్, సర్వీస్, వ్యాట్, ఆదాయ పన్నుతో పాటు, తమ ఆదాయ వ్యవహారాల వివరాలు రిటర్న్‌ల రూపంలో ప్రభుత్వానికి సమర్పిస్తే సరిపోతుందని నిర్ణయించడంతో "నల్లధనం" తెల్లధనంగా మార్చుకోవడానికి పుట్టగొడుగుల్లా కంపెనీలు పుట్టుకొచ్చాయి.

**నల్లధనాన్ని ప్రోత్సహిస్తున్న టాక్స్‌హెవెన్ దేశాలు - స్విస్ బ్యాంక్ పుట్టుక చరిత్ర**

పన్నులు ఎగ్గొట్టి అక్రమ మార్గంలో సంపాదించిన డబ్బును సురక్షితంగా దాచి, వివరాలు గోప్యంగా ఉంచడంతోపాటు, విదేశీ పెట్టుబడిదార్లని లేదా నిధుల్ని ఎక్కువ మొత్తంలో ఆకర్షించేందుకుగాను స్విట్జర్లాండ్, లగ్జెంబర్గ్, లీటస్‌స్టీక్, బహమాస్, బెర్ముడా, దుబాయ్, సైప్రస్, జిబ్రాల్టర్, హాంగ్‌కాంగ్, ఐర్లాండ్, కెమారూన్‌దీవులు, బాలిదీవులు, బోస్నియా, హెర్జి గోవినా దేశాలు తమ అవసరాలను తీర్చుకోవడానికి గాను సంపద, ఆదాయం, వాణిజ్యం మీద ఇతరదేశాలతో పోల్చితే అతి తక్కువ పన్నులు వసూలు చేస్తూ "టాక్స్ హెవెన్" దేశాలుగా పేరు పడ్డాయి.

ఎంతడబ్బైనా దోచుకోండి, ఎవరైనా దాచుకోండి, మీ పేపర్లు, డబ్బువివరాలు ప్రపంచం తలకిందులైనా రహస్యంగా ఉంచుతామనే నిబంధనతో ఏర్పడిన బ్యాంక్ స్విస్‌బ్యాంక్ హెచ్ఎస్ఎన్‌బి.

**నల్లధనం అరికట్టుటకు - నివారణ చర్యలు**

భారత రాజ్యాంగంలో 21వ అధికరణంలో జీవించే హక్కును, ఆదేశిక సూత్రాలలో 47వ నిబంధనల్లో 1. దేశ ప్రజల జీవనప్రమాణాలు మెరుగుపర్చడం 2. ప్రజల పౌష్ఠికాహార స్థాయి పెంచడం. 3. ప్రజలకు ఆరోగ్యం, వైద్య సదుపాయాలు కల్పించడం ఉన్నాయి. కాబట్టి దేశ ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలంటే నల్లధనం అరికట్టి దాని వెలికితీతకు ప్రయత్నించాలి.

**దేశద్రవ్య విధానం / కోశవిధానంతో పాటు పన్నుల సరళీకరణ**

ప్రభుత్వం పన్నుల రాబడిని, పన్నేతర రాబడిని పెంచుతూ మూలధన కల్పన చేస్తుంది. పన్ను ఎగవేత అరికట్టడానికీ, రాబడి వసూలు, నల్లధనం ప్రభావం తగ్గించే అవకాశం ఈ పన్నుల సరళీకరణ ద్వారా ఉంది. ఉదా॥ కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సర్వేల ద్వారా పన్నుల రాబడి ప్రత్యక్ష పన్నుల ద్వారా 1950-51లో 230 కోట్ల (27 రకాల పన్నులు) పరోక్ష పన్నుల ద్వారా 430 కోట్లు (65 రకాల పన్నులు) 2014-15 సం॥ ప్రత్యక్ష పన్ను 9,77,758 కోట్లు పరోక్ష పన్నుల ద్వారా 2,12,505 కోట్లుగా ఉంది. ప్రభుత్వాలు విచ్చలవిడిగా పన్నులు వసూలు చేయడంతో మధ్యతరగతి, ఉన్నత మధ్యతరగతి వారు పన్నుపోటు నుండి తప్పించుకునే మార్గాలు ఎంచుకొని పన్నులు సకాలంలో చెల్లించక ఎగ్గొట్టుతున్నారు. వీరి ఆదాయంలో 30శాతం లెక్కలు చూపడం లేదు. ఇదే ప్రాథమికంగా నల్లధనం సృష్టికి కారణం. దేశంలో ఇప్పటి వరకు పన్నుల వ్యవస్థ, నల్లధనం నివారణ చర్యలపై 15 వరకు కమిటీలు వేసి ఉన్నారు. అందులో 1970 సం॥లో కెఎస్ వాంఛూకమిటీ అలాగే 1981 లో ఎల్‌కె ఝా కమిటీ అనేక సంస్కరణాలను సూచించాయి.

**చట్టసభల్లో నేరప్రవృత్తికల నాయకుల కట్టడి**

స్వాతంత్ర్యం వచ్చిన మొదట్లో నేరచరిత్ర ఉన్నవారు చాలా తక్కువ. 1980-90 సం॥ల తర్వాత నేరప్రవృత్తి, అవినీతిపరులు, నల్లధనం కుబేరులు, అధికశాతంలో - చట్టసభల్లో ప్రవేశిస్తున్నారు. దేశంలోని 4,807 మంది ఎంపి, ఎమ్ఎల్ఎ లలో 30శాతం నేరచరిత్ర కలవారు, ఇందులో 14శాతం దాకా హత్య, అత్యాచర నేరారోపణలున్న వారు ఉన్నారు. 545 మంది ఎంపీలల్లో 400కు పైగా కోటీశ్వరులే చట్టసభల్లో ఉన్నారు. నేరారోపణలు, నేరచరిత్ర ఉన్న నాయకులను ఎన్నికలలో పోటీ చేసే హక్కును రద్దు చేసేవిధంగా ఎన్నికల చట్టాన్ని సవరించి, వారి ప్రవేశాన్ని నిరోధించాలి. **ఎన్నికల్లో పోటీ చేసే ఎం.పి, ఎం.ఎల్.ఏ. అభ్యర్థుల పూర్తి వివరాలను ఆయా పార్టీలు ఒక సంవత్సరం ముందుగానే ఎన్నికల సంఘానికి సమర్పించాలనే నిబంధన చట్టం తీసుకురావాలి.**

**బ్యాంకుల ద్వారా ఆర్థిక లావాదేవీలు, కరెన్సీనోట్ల కట్టడి**

దేశంలోని అన్ని బ్యాంకులను కంప్యూటీకరణ ద్వారా అనుసంధానం చేసి ప్రజల రోజువారి ఆర్థిక కార్యకలాపాలు రికార్డు అయ్యేవిధంగా చూడడం. అలాగే ప్రతి 2000 వేల వరకు జనాభా ఉన్న గ్రామాలకు బ్యాంక్ వసతి లేదా పోస్టాఫీస్ ద్వారా వ్యక్తిగత ఖాతాలు తెరచి లావాదేవీలు తప్పనిసరి చేయాలి.

పెద్ద నోట్లు అనగా 500,1000 రూ.ల నోట్లను రికాల్ చేయడం లాంటి నిర్ణయాలతో నల్లధనం బయటికి రావడానికి అవకాశం ఉంది. ఉదా॥ దేశంలో నోట్ల చలామణిని తీసుకుంటే 500 రూ.ల నోట్లను

49శాతం, 1000 రూ.ల నోట్లు 33శాతం, 100 రూ.ల నోట్లు 13శాతం 1-50 రూ.లు 5శాతం రోజువారి వినియోగంలో ఉన్నాయి. దేశంలో 20శాతం నకిలీ కరెన్సీ చలామణిలో ఉంది అంటే 1-5 లక్షల కోట్లవరకు ఉండవచ్చు.

**6. ప్రభుత్వ నిఘా సంస్థలకు స్వయంప్రతిపత్తి - సిట్ ఏర్పాటు**

భారత ప్రభుత్వ సంస్థలైన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్. ఇంటిలిజెన్స్ బ్యూరో, రా, సిబిఐలదగ్గర, డబ్బు అనే వివరాలపై ఎక్కడికక్కడ చేతులు మారుతున్నది, బినామీ ఆస్తులు, నల్లధనం, వ్యాపారాల పేరుతో ఏఏ దేశాలకు డబ్బు తరులుతుంది అనే వివరాలపై ఖచ్చితమైన లెక్కలు, ప్రాథమిక ఆధారాలున్నాయి. నల్లధనం గుర్తించి వెలికితీయడానికి, అరికట్టడానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఫైనాన్స్ ఇంటెలిజెన్స్, కొత్తగా లోక్‌పాల్, లోకాయుక్త చట్టం, మనీ లాండరింగ్ నివారణ చట్టం, బినామీ ఆస్తుల స్వాధీన చట్టం, మరియు అంతర్జాతీయ ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ లాంటి వాటితో భాగస్వామ్యంతో పటిష్టం కావాలి. ఈ సంస్థలకు నిజాయితీపరులైన, పనే దైవంగా భావించే అధికారులను నియమించి దోపిడీదారుల, నల్లధన కుబేరుల రహస్యభాగోతం బయటికి తీయడానికి అవకాశం కల్పించాలి.

సుప్రీంకోర్టు ప్రముఖ న్యాయవాది రాంజెఠ్మలాని, సుభాష్ కాశ్యప్‌లు దేశం నుండి విదేశాలకు తరలిపోతున్న నల్లధనం వివరాలు తెలుసుకోవడానికి ప్రజాప్రయోజనం ద్వారా సుప్రీంకోర్టులో 2009 సం॥లో కేసు వేశారు. ప్రతివాదిగా భారతప్రభుత్వాన్ని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ధర్మాసనం కేసు పూర్వపరాలు పరిశీలించి 2011 జూలై 11న భారతప్రభుత్వం యుపిఎ ను దేశప్రజలు సంస్థలు ప్రపంచ దేశాలల్లో దాచుకున్న ఖాతాల వివరాలు, నల్లధనం స్వదేశానికి రప్పించేందుకు. స్పెషల్ ఇన్‌వెస్టిగేషన్ టీమ్ (సిట్) ను ఏర్పాటు చేయాలని కోరింది. కాని, యుపిఎ ప్రభుత్వం హామీలో ఇచ్చినట్లుగా ఈ విషయంపై పెద్దగా శ్రద్ధ చూపలేదు కాని దేశ ప్రధానిగా నరేంద్రమోది అధికారం చేపట్టి, ఎన్‌డిఎ ఎన్నికల హామీలో పేర్కొన్నట్లు నల్లధనం వెలికితీతపై 29.05.2014న మంత్రివర్గ సమావేశంలో సిట్‌కు ఎమ్‌బి షా చైర్మన్‌గా, జస్టిస్ అరిజిత్‌పసాయత్ వైస్‌ఛైర్మన్‌గా 11 ప్రభుత్వ సంస్థల కార్యదర్శులను సభ్యులుగా నియమించారు.. ఈ బృందం 7 సం॥లలో లక్షన్నర కోట్లు నల్లధనం కూడబెట్టిన హసన్‌అలిఖాన్, తపూరియా పై విచారణతో పాటు, నల్లధనంపై సమగ్రమైన కార్యచరణ ప్రణాళికలు, పనితీరు, పురోగతి అంశాలపై నివేదికలు సుప్రీంకోర్టుకు సమర్పిస్తుంది. అలాగే ఇప్పటికే విచారణ మొదలైన పెండింగ్‌లో ఉన్న మొదలుకావల్సిన, పూర్తి అయిన అన్ని కేసులూ ఈ సిట్ పరిధిలోకి వస్తాయి.

**7. ఎన్నికల్లో పార్టీల - వ్యయం, సంస్కరణలు**

ప్రపంచ దేశాల్లో అతిపెద్ద ప్రజాస్వామ్యదేశంగా భారత్ విరాజిల్లుతున్నది. దేశంలో 81.45 కోట్ల మంది ఓటర్లు , 6 జాతీయ పార్టీలు, 47 రాష్ట్ర, ప్రాంతీయ పార్టీలు 1563 రిజిస్టర్డ్ పార్టీలున్నాయి.

2004-2011 సం॥ల కాలంలో కాంగ్రెస్, భాజపా, ఎన్‌సిపి, సిపిఐ, సిపిఎమ్, బిఎస్‌పి ఈ ఆరు పార్టీల మొత్తం ఆదాయం 4,895,96 కోట్లు. ఇందులో 91శాతం విరాళాల ద్వారా సమకూరినవి 4.662 కోట్లు. కాంగ్రెస్ పార్టీకి 2011 నాటికి 2008 కోట్ల విరాళం, బిజేపికి 2011 నాటికి 994 కోట్ల విరాళాలు అందాయి. 2014 సం॥లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఎన్నివేల కోట్ల విరాళాలు వాచ్చాయో లెక్కలు తేలాల్సి ఉంది. విరాళాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా వచ్చినా అవి 20వేలకు మించితే పార్టీలు ఆ వివరాలు ఎన్నిక సంఘానికి "24-ఎ" పత్రం రూపంలో తెలియ పర్చాలి కాని వాస్తవంగా ఏం జరుగుతుందో మనం గమనిస్తున్నాం.

**8. అర్థక్రాంతి ఆర్థిక విధాన ప్రతిపాదన**

పెద్దనోట్లు, సంక్లిష్ట పన్నుల వ్యవస్థను తొలగిస్తే దేశంలో అవినీతి, నల్లధనం, రాజకీయ ముసుగులో సాగుతున్న ఆరాచాకాలను కట్టడి చెయ్యచ్చని "అర్థక్రాంతి" సిద్ధాంతకర్త అనిల్ బోకిల్ చెప్తుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై 71 రకాల పన్నులు విధిస్తున్నాయి. ఎలక్ట్రానిక్ పద్ధతిలో నిధుల బదిలి ద్వారా రోజుకు దేశంలో 1.80 లక్షల కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయి. దీనిపై 2% పన్ను అంటే రోజుకు 3,600 వేలకోట్లు వస్తుంది. సం॥లో 300 రోజులు పనిచేసినా 10,80,000 లక్షల కోట్ల పన్ను వసూలవుతుంది. ఇంకా నెఫ్ట్, ఇసిఎస్, మొబైల్, మాన్యువల్ పద్ధతుల్లో జరిగే ఆర్థిక కార్యకలాపాలపై పన్ను కలిపితే 30-40 లక్షల కోట్ల సమకూరుతుంది. దీంతో పన్నుభారం తక్కువగా ఉండి ఎగవేత, నల్లధనం పోగుకు అంతగా అవకాశం ఉండదంటారు.

**నల్లధనం వెలికి తీస్తే కలిగే ప్రయోజనాలు**

దేశాల్లో, విదేశాల్లో లక్షలకోట్ల నల్లధనం పోగుబడి ఉంది. దీన్ని వెలికితీస్తే కలిగే ప్రయోజనాలు అనేకం.

1. దేశ సర్వతోముఖాభివృద్ధికి విదేశాల నుండి, ప్రపంచబ్యాంక్ నుండి తీసుకున్న అప్పును పూర్తిగా తీర్చవచ్చు. ఉదా. విదేశీ రుణభారం 2004 సం.లో 11,260 కోట్లు అది 2013 నాటికి 4,26,000 వేలకోట్ల డాలర్ల అప్పుగా ఉంది. ఈ అప్పును, వడ్డీని ఏకమొత్తంలో చెల్లించవచ్చు.
2. 2014 సం॥లో బడ్జెట్ మొత్తం 17,94,892 కోట్ల రూ. ఇలా ప్రతి సం. 20 లక్షల కోట్ల బడ్జెట్‌ను నల్లధనంపై వచ్చే వడ్డీతోనే ప్రవేశపెట్టవచ్చు.

దేశంలో ఉన్న 45 కోట్ల మంది పేదప్రజలకు తలా లక్ష రూపాయలు అప్పుగా ఇచ్చినా వారిబతుకులు బాగుపడుతాయి. అలాగే మనకు కావాల్సిన మౌలిక సదుపాయామైన విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వచ్చు. (2014 బడ్జెట్‌లో 34,345 కోట్లు), దేశంలో ప్రతి

మండలానికి రైల్వే మార్గం, ప్రతిగృహానికి రక్షిత మినరల్ వాటర్ 50–100 లీటర్ల వరకు ఉచితంగా అందించవచ్చు. డబుల్‌బెడ్‌రూమ్‌తో కూడిన ఇళ్ళు 50కోట్ల మందికి ఉచితంగా నిర్మించి ఇవ్వవచ్చు. ప్రభుత్వ పాఠశాలలకు, విశ్వవిద్యాలయాలకు సకల సదుపాయాలతోపాటు ఉచితంగా విద్యను శాశ్వతంగా అందించవచ్చు.

3. దేశంలో ప్రభుత్వాలు కొత్త పథకాలు, భారీ మధ్యతరహా ప్రాజెక్టులకు ఖర్చు చేయవచ్చు. ఉదా॥ నిర్మల్ భారత్ అభియాన్ కు 12వ ప్రణాళికలో 34,377 వేలకోట్లు, వైద్యం కోసం 39, 237 కోట్ల కేటాయింపు (బడ్జెట్). ఉపాధిహామీకి 33,364 కోట్లు రూ. ఆహార భద్రతకు 1,30,000 వేలకోట్ల మధ్యాహ్న భోజనానికి 13,250 కోట్లు విద్యకు, 68, 728 కోట్లు ఖర్చు. వ్యవసాయానికి 31,062, 94 కోట్లు, గ్రామీణాభివృద్ధికి 50,093,33 వేలకోట్లు. భారీ, మధ్యతరహా ప్రాజెక్టులతోపాటు లక్షల కోట్లు కేటాయించి నదుల అనుసంధానం చేపట్టవచ్చు. ప్రతిమండలంలో సూపర్‌స్పెషాలిటి హాస్పిటల్‌ని 24 గంటలపాటు సకల సౌకర్యాలతో ఉచితంగా అందుబాటులో తేవచ్చు.

4. దేశంలో రోజురోజుకు నిరుద్యోగుల శాతం పెరుగుతుంది. దేశంలో 30కోట్ల మంది ఉపాధి, ఉద్యోగాలకోసం ఎదురుచూస్తున్నారు. 2019 సం॥ నాటికి 49శాతం మంది యువజనులు కల్గిన దేశంగా ఉండి 85శాతం అక్షరాస్యత కల్గి ఉంటుంది. కావున భవిష్యత్తును అంచనావేసి నిరుద్యోగం తగ్గింపుకు చర్యలు తీసుకోవచ్చు. ఇప్పటికే ప్రతి సం. 1కోటి 20లక్షల మంది ఉపాధి, ఉద్యోగులకోసం ఎదురు చూసే పరిస్థితి ఉంది. కావున నల్లధనం బయటికి వస్తే 49శాతం ఎఫ్‌డిఐల అవసరం లేకుండా స్వంతంగా దేశంలో వాణిజ్య, పారిశ్రామిక, వ్యాపార రంగాలలో స్వంత పెట్టుబడులు పెట్టి ఉద్యోగ, ఉపాధి కల్పించవచ్చు.

5. దేశంలో విధిస్తున్న అన్ని రకాల పన్నులు, 20 సం. వరకు కట్టే అవసరం ఉండదు. కల్తీ, నకిలీ, అక్రమనిల్వలను పూర్తిగా నియంత్రించవచ్చు. వ్యవసాయదారులకు ఉచితంగా ఆధునిక యంత్రసామాగ్రి, విత్తనాలు, ఎరువులు అందించవచ్చు. దేశంలో 5 సం॥లోపు పిల్లలు, తల్లులు 45శాతం మంది పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. 70శాతం మంది ప్రజలు మలేరియా బాధపడుతున్నారు. 3 సం॥ లోపు పిల్లల్లో 46శాతం మహిళల్లో 33శాతం, పురుషుల్లో 28శాతం వుండాల్సిన బరువుకన్న, తక్కువగా ఉంటున్నారు. 3సం. పిల్లల్లో 19శాతం మంది, మహిళల్లో 56శాతం, గర్భిణాల్లో 58శాతం, పురుషుల్లో 24శాతం రక్తహీనతతో బాధపడుతున్నారు. ఇలాంటి సమస్యలు అన్ని సమూలంగా నియంత్రించవచ్చు.

6. ప్రపంచంలో అభివృద్ధి చెందిన సంపన్న దేశంగా మారడానికి ప్రతి గ్రామానికి రూ. 4 కోట్లు కేటాయిస్తే చాలని . "హుఓన్స్ ద సిబిఐ" రచయిత బిఆర్‌లాల్ చెప్పారు. దేశంలో రోజుకు కనీసం 20రూ. కూడా ఖర్చుపెట్టలేని నిరుపేదలు 77శాతం వరకు ఉన్నారని అర్జున్‌సెన్‌గుప్తా కమిటీ తెలిపింది. ప్రపంచ జనాభాలోసుమారు 120 కోట్ల మంది ఆహారభద్రత లేక అల్లాడుతుంటే వీరిలో 30శాతం వరకు భారత్‌లోనే ఉన్నారు. మరియు ఆహారం దొరకక రోజుకు 24 మంది మరణిస్తున్నారు. వీటికి పరిష్కారం దొరుకుతుంది.

7. దేశంలో మురికి వాడల జనాభా 6.54 కోట్లు, పట్టణాల్లో 2,613 మురికి వాడలుండి వీరికి మౌలిక వసతులు కూడా లేవు. గ్రామీణ ప్రాంతాలలో పేదవారు రోజుకు కేవలం 17 రూ. జీవనఖర్చుగా ఉంది. పట్టణాల్లో 23రూ.లుగా ఉందని ఎన్.ఎస్.ఎస్.ఓ. వారు 2011–12 సం॥ నివేదికను 2013 జూన్ 19న వెల్లడించారు. మరియు పేదవారి నెలసరి తలసరి వ్యయం 521.44రూ., పట్టణాల్లో 700.03 రూ.గా ఉంది. అలాగే 1995–2013 సం.రాల్లో 2,96,466 మంది రైతులు ఆత్మహత్యలు, మరియు 2013 సం.లో 11,772 ఆత్మహత్యలు జరిగాయని జాతీయ నేరాల నమోదు సంస్థ తెలిపింది. కావున పేదరికం, ఆత్మహత్యలను కూడా నివారించవచ్చు.

**ముగింపు**

మన దేశం అభివృద్ధి చెందుతున్న దేశమైనా నిధుల కొరత ప్రధాన సమస్యగా ఉంది. ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేయాలన్నా ధనం చాలా అవసరం. అందుకే పార్టీలు ఎన్నికలో ఇచ్చిన హామీలా కాకుండా నిజాయితీతో నల్లధనాన్ని ప్రభుత్వం వెలికితీస్తే దేశ భవిష్యత్తుకు, నల్లధనం మనసొత్తుగా మారుతుంది. ఇంకా అవినీతి సూచిలో 2013 సం॥లో 94వ ర్యాంక్, గ్లోబల్ పీస్ ఇండెక్స్ – 2013లో 141వ స్థానం, గ్లోబల్ ప్రాపర్టీ ఇండెక్స్ – 2013లో 106వ స్థానం, స్లీవరీ ఇండెక్స్ – 2013 నివేదికలో 4వ స్థానం (13.3–14 మిలియన్ల మంది మన దేశంలో బానిసలుగా ఉన్నారు). మానవాభివృద్ధి నివేదిక – 2014లో 187 దేశాల్లో మన స్థానం 135. ఈ స్థానాల్లో మార్పు రావాలంటే అవినీతితో సంపాదించిన నల్లధనాన్ని బయటికి తీస్తేగాని ప్రపంచంలో అన్ని రంగాలలో మన స్థానం మెరుగుపడి, ముందుకు సాగుతుంది. వాంఛూ కమిటి ఆర్థిక వ్యవస్థపై నల్లధనం ప్రభావాన్ని క్యాన్సర్‌తో పోల్చారు. గాంధీ గ్రామ స్వరాజ్యం, ఎస్.కె. డే గ్రామీణాభివృద్ధి, అమార్త్యసేన్ మానవాభివృద్ధి, స్వామినాధన్ హరిత విప్లవం, అన్నాహజారే అవినీతి వ్యతిరేక పోరాటం, జయప్రకాశ్ నారాయణ సర్వోదయ సిద్ధాంతంలాంటి ఫలాలు భారతదేశ ప్రజలందరికి దక్కాలంటే దేశ ప్రజలుగా మనం పన్నులు సకాలంలో చెల్లించడంతో పాటు, అవినీతికి అవకాశం కల్పించకుండా అధికారులు, రాజకీయ నాయకులు సన్మార్గంలో నడిచేవిధంగా మేల్కొనాలి, మేల్కొలపాలి. ■

# నూతన సాంకేతిక నీటిపారుదల పద్ధతులు

దిన దినం పెరుగుతున్న భారతదేశంలో జల వనరులు, భూగర్భ జలవనరులను కాపాడడం మానవతా లక్షణం, ప్రపంచ జలవనరులలో ఐదు శాతం కంటే తక్కువుండి, జనాభాలో 18 శాతం కంటే ఎక్కువ ఉన్నాము. పంటలు పండించుకోవడం కోసం, మొక్కల పెరుగుదలకు నీటి పారుదల అనేది అతి ముఖ్యమైనది. భారత ప్రభుత్వం నీటిపారుదల విధానాన్ని అనుసంధానం చేస్తూ కొత్త వ్యవసాయ నీటిపారుదల పద్ధతులను ప్రతిపాదించి ప్రజలకు అందిస్తున్నది.

జలవనరులను అనుసంధానం చేస్తూ నీటి పారుదల విధానాన్ని రెండు రకాలుగా విభజించింది. వీటిలో మొదటిది భారీ నీటిపారుదల మరియు రెండవది చిన్న నీటిపారుదల పథకాలు వాతావరణంలో శీతోష్ణస్థితి మరియు సమ శీతోష్ణస్థితి ప్రభావం వలన వర్షపాతం ఆశించిన విధంగా లేదు. అందువలన ప్రత్యామ్నాయ నీటిపారుదల విధానం అనేది పంటల పెరుగుదలను మరియు అధిక రాబడి కోసం పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని ఆహారం మరియు ఇతర అవసరాల కోసం నూతన నీటిపారుదల సాంకేతిక పద్ధతులు ఎంతో అవసరం, వర్షపాతం యొక్క మార్పులను సాంకేతిక నీటిపారుదల పద్ధతి వలన మనము ప్రజలకు వ్యవసాయంలో నష్టపోకుండా భరోసా ఇవ్వగలము. రాబోయే తరం కోసం నీటిని ఒక క్రమబద్ధమైన పద్ధతిలో ఉపయోగించుకుంటే మంచి ఫలితాలను పొందవచ్చును.

**భూ ఉపరితల మరియు భూగర్భ నీటి ప్రవాహం పూర్తి సమాచారము.**

"భారతదేశంలో పంటలు మరియు ఆహార ధాన్యాలు ఉత్పత్తి ఎల్లప్పుడు వర్షపాతంపైనే ఆధారపడుతాయి. 75శాతం వర్షాలు నైరుతి రుతుపవనాల వల్లనే వస్తాయి. మొత్తం భారతదేశంలో 1 శాతం మాత్రమే వర్షపాతం లాంగ్ పీరియడ్ యావరేజ్ (ఎల్‌పిఎ) ప్రకారం ఎక్కువగా నమోదైనది. మధ్య భారతదేశము మరియు వాయువ్య భారతదేశములో వర్షపాతము (ఎల్‌పిఎ) ప్రకారం 10 శాతము మరియు 1 శాతం ఎక్కువగా నమోదైంది. దక్షిణ ఉప ఖండములో సాధారణ వర్షపాతం ఉంది. ఈశాన్య భారతదేశంలో (ఎల్‌పిఎ) పోల్చుకుంటే నాలుగు శాతం తక్కువగా వర్షపాతం నమోదైనది.

**జిల్లాల వారిగా నమోదైన వర్షపాతము**

భారతదేశంలో 24 శాతం జిల్లాల్లో అతి సాధారణ నుండి అధిక వర్షపాతం నమోదైంది. 23శాతం అధిక వర్షపాతము మరియు ఒక శాతం అవసరం కంటే అతి తక్కువగాను, 36 సబ్ డివిజన్‌లో మాత్రమే అధిక వర్షపాతముగా నైరుతి రుతుపవనాల ద్వారా వచ్చాయని 2011లో గుర్తించారు. మిగిలిన 33 సబ్ డివిజన్‌లలో కేవలం ఐదు శాతం మాత్రమే అధిక వర్షపాతం ఉందని మరియు 26శాతం సాధారణ వర్షపాతముగా గుర్తించారు. భారతదేశంలో గల రిజర్వాయర్‌ల యొక్క మొత్తము నీటి నిల్వ సామర్థ్యము (ఫుల్ రిజర్వాయర్ లెవెల్ (ఎఫ్ఆర్ఎల్) 81శాతం భారీ రిజర్వాయర్, రిజర్వాయర్‌లో 151.77 బిలియన్ క్యూబిక్ మీటర్స్ నీటి నిల్వ ఉందని సెంట్రల్ వాటర్ కమీషన్ (సిడబ్ల్యుసి) గుర్తించింది.

**నీటిపారుదల అభివృద్ధి**

దేశంలో మొత్తము నీటిపారుదల సామర్థ్యం ప్రస్తుతము 140 మిలియన్ హెక్టారు చేరింది. భారీ మరియు చిన్న నీటి పారుదల పథకాల ద్వారా భూ ఉపరితంలో 58.5 మిలియన్ హెక్టార్లు చిన్న నీటిపారుదల పథకాల వల్ల 17.4 మిలియన్ హెక్టార్లుగా ఉంది. భూగర్భ జలవనరుల ప్రకారము నీటిపారుదల పథకాల వలన 64 మిలియన్‌హెక్టార్లకు నీటి పారుదల అందిస్తున్నాము. అది గత

**డా. కె. కమల్‌దాస్,** అసిస్టెంట్ ప్రొఫెసర్, జియాలజి విభాగము, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్

సంవత్సరంలో 40 మిలియన్ హెక్టార్లుగా ఉండేది. దేశంలో సంవత్సరం మొత్తం ఉపరితల నీటి ప్రవాహం సుమారు 1869 ఘన కి.మీ. అందులో 37 శాతం (690కె.ఎం.-3) మాత్రము మన వ్యవసాయానికి ఉపయోగించుకుంటున్నాము. మేఘన-బ్రహ్మపుత్ర నదుల బేసిన్లో అతి తక్కువగా నీటిని ఉపయోగించుకుంటున్నాము. బ్రహ్మపుత్ర నదిలో 7.6 శాతం (ఉపరితల ప్రాంతం)ను ఆక్రమించి ఉంది. అందులో 31 శాతం మాత్రమే నీటిని ఉపయోగించుకుంటున్నాము. (సి.డబ్లు.సి) సెంట్రల్ వాటర్ కమీషన్ లెక్కల ప్రకారం భారతదేశము 690 సఎ3 ఉపరితల నీటిని మరియు 432 కి.మీ-3 భూగర్భజలము (మొత్తం 1122 కి.మీ-33 ఆర్ బి.ఎం.సి. బిలియన్ క్యూబిక్ మీటర్) ఉపయోగంలో ఉన్నది.

**నీటి పారుదల డిమాండ్**

వివిధ రకాల పంటలను బట్టి వాటి నీటి ఆవశ్యకతను బట్టి ఇరిగేషన్ డిమాండ్ ఉంటుంది మరియు ఆయా ప్రాంతము యొక్క భూగర్భ ఉపరితల జలస్థితిని బట్టి నేల యొక్క రకాలను బట్టి ఇరిగేషన్ డిమాండ్ ఉంటుంది. పెరుగుతున్న జనాభాకు ఆహారం ధాన్యాల అవసరాలను తీర్చుటకు ఇరిగేషన్ అవసరం. వ్యవసాయ రంగంలో పురోగతిని సాధించుటకు వర్షపాతం ఉన్నతమైన పాత్రను పోషిస్తూన్నది. ఆహారం తీసుకునే విధానంలో మార్పులను చూస్తుంటే భవిష్యత్తులో ఎంత ఆహార ధాన్యాల అవసరమవుతుందో అంచనా వేయలేని స్థితిలో మనమున్నాము.

**నీటిపారుదల (ఇరిగేషన్ )**

పంటలకు కావలసిన నీటి ఆవశ్యతకను ఒక క్రమబద్ధమైన పద్ధతిలో పంట పొలాలకు నీటిని సరఫరా చేయు విధానమే నీటిపారుదల (ఇరిగేషన్). దేశంలో వర్షపాతము అన్ని ప్రాంతాలలో సమానంగా ఉండక పోవచ్చును. అందుకని వర్షము ద్వారా వచ్చిన నీటిని అనుసంధానం చేస్తూ నీటి నిల్వ చేసి ఆహార ధాన్యాల ఉత్పత్తి చేయవచ్చును. కొత్త వంగడాలను సృష్టించవచ్చును. ఇరిగేషన్ విధానమనేది కొంత ఖర్చుతో కూడుకున్నప్పటికీ కొత్త పద్ధతుల వలన మానవ జాతికి ఆహార కొరతను మరియు కలప కొరతను సులువుగా తీర్చవచ్చును. నీటి ఆవశ్యకత పట్టణాభివృద్ధికి మరియు పారిశ్రామికీకరణ అభివృద్ధికి కూడా చాలా అవసరం అందుకని వర్షపు నీటిని చుక్క కూడా వృథా చేయకుండా కాలువల ద్వారా అనుసంధానం చేస్తూ రిజర్వాయర్లలో నీటిని నిల్వ ఉంచుకోవాలి. కొత్త టెక్నాలజీలను ఉపయోగించి భూగర్భంలో నీటిమట్టాలను పెంచవలెను.

కొన్ని ముఖ్యమైన పంటలకు నీటి పారుదల ఆవశ్యకత - మొక్కలు (నీటి ఆవిరి, ఇవాపో టాన్స్పిరేషన్, ప్రిసిపిటేషన్ వల్ల కోల్పోయిన నీటిని ఇరిగేషన్ కొత్త పద్ధతుల ద్వారా సరిచేయాలి.

**కొన్ని ముఖ్యమైన పంటలు - కావాల్సిన నీటి సౌకర్యం**

| క్ర.స. | పంటలు (కరీఫ్) | పంట సమయం రోజులలో | | నీటి ఆవశ్యకత (మి.మి.) |
|---|---|---|---|---|
| 1. | వరి | 130-140 | | 700-800 |
| 2. | సరుగు | 110 | | 150 |
| 3. | మొక్కజొన్న | 110 | | 150 |
| 4. | చెరుకు | 330 | | 700 |
| 5. | సమ్మర్ పల్సెస్ | 70 | | 210 |
| 6. | పల్స్ మిల్లెట్ | 90 | | 150 |
| 7. | సన్ఫ్లవర్ | 110 | | 210 |
| 8. | ప్రత్తి | 180 | | 280 |
| క్ర.స. | పంటలు (రబి) | పంట సమయం రోజులలో | | నీటి ఆవశ్యకత (మి.మి.) |
| 9 | గోదుమ | 135 | | 350 |
| 10. | బెర్సీం | 200 | | 800 |
| 11. | పొటాటొ | 110 | | 450 |
| 12 | లెంటిల్ | 135 | | 150 |
| 13 | మస్టర్డ్ | 150 | | 150 |
| 14 | బార్లీ | 125 | | 210 |
| 15 | సోయాబీన్ | 90 | | 350 |
| 16 | చికపీ | 150 | 1 | 50 |

**ఇరిగేషన్ రకాలు**

వ్యవసాయ భూములకు నీటిని అందించడానికి కొన్ని రకాల ఇరిగేషన్ పద్ధతులను అవలంభించవచ్చును. సరిపడ నీటని బీడు భూములను తడుపుటకు మెరుగైన పంటలు పండించుటకు మన లక్ష్యాన్ని చేరుటకు కొన్ని రకాల ఇరిగేషన్ పద్ధతులను అవలంభించవచ్చు, అవి

1. భూ ఉపరితల (సర్ఫేస్ ఇరిగేషన్) నీటి పారుదల
2. స్థానిక నీటిపారుదల (స్ప్రింక్లర్ ఇరిగేషన్)
3. సెంటర్ పివోట్ ఇరిగేషన్
4. లేటరల్ మూవ్ (సైడ్ రోల్, వీల్ లైన్) ఇరిగేషన్
5. సబ్ ఇరిగేషన్
6. మాన్యువల్ ఇరిగేషన్ యూజింగ్ బకిట్ లేక వాటర్ క్యాన్స్

7. అటోమెటిక్, నాన్ ఎలక్ట్రిక్ ఇరిగేషన్ యూజింగ్ బకెట్ మరియు రోప్స్
8. ఇరిగేషన్ యూజింగ్ స్టోన్స్ టు క్యాచ్ వాటర్ ఫ్రమ్ హమిడ్ ఎయిర్.
9. డ్రై టెర్రస్ ఫర్ ఇరిగేషన్ ఎండ్ వాటర్ డిస్ట్రిబ్యూషన్
10. సోర్స్ ఆఫ్ ఇరిగేషన్ వాటర్

**1. భూ ఉపరితల నీటి పారుదల**

భూ ఉపరితల నీటిపారుదల పద్ధతిలో నీటి ప్రవాహం అనేది భూమి యొక్క గురుత్వాకర్షణ శక్తికి లోనై వ్యవసాయ భూమిలోనికి ప్రవహించి నేలలో ఇంకిపోవును.

సర్‌ఫేస్ ఇరిగేషన్ పద్ధతిలో రెండు ఉప పద్ధతులు కలవు

1. ఫర్రో
2. బార్డర్ స్ట్రిప్ ఆర్ బేసిన్ నీటిపారుదల పద్ధతి.

1. ఫర్రో పద్ధతిలో నీటి ప్రవాహం వరద పారినట్లుగా వ్యవసాయ భూమిలో నీరు పారుతుంది. నీరు వదిలే ప్రాంతము ఎత్తుగా ఉండి వ్యవసాయ పల్లపు ప్రాంతముగా ఉంటుంది. ఈ పద్ధతి గ్రామీణ ప్రాంతాల్లో సహజంగా మనం చూడవచ్చును.
2. బార్డర్ స్ట్రిప్ (బేసిన్) గేట్లు లేక మడులుతో కూడుకున్న నీటిపారుదల పద్ధతి. ఈ పద్ధతిలో వ్యవసాయ భూమిని మడులుగా తీర్చిదిద్దుతారు. గట్టులను అదే పొలంలోని మట్టితో తయారు చేస్తారు. గట్టు వలన మనము వదరనీటి ప్రవాహాన్ని అరికట్టవచ్చు. నీటి సరితుల్యతను పాటించవచ్చు. మడులలో నీటిని (మనమే) (మానవుడు మరియు జంతువుల) సహాయంతో మడిలోని నీటి వదలడం గాని తీసివేయడం గాని చేయవచ్చును

**స్థానిక నీటిపారుదల**

ఈ పద్ధతిలో నీటి ప్రవాహం అతి తక్కువ పీడనంతో పైపుల ద్వారా ప్రవహించును. దీని వలన కొంత నీటిని మాత్రమే వదలడం జరుగుతుంది. వదిలిన నీరు మొత్తము మొక్కకి పూర్తి స్థాయిలో చేరుతాయి. నీరు వృధా కాదు, దీనినే బిందు సేద్యం అని కూడా అంటారు. ఉదా: డ్రిప్ ఇరిగేషన్ స్ప్రే ఆర్ మైక్రో – స్ప్రింక్లర్ ఇరిగేషన్ మరియు బబ్లర్ ఇరిగేషన్ కూడా ఈ కోవ కిందికే వస్తాయి.

**బిందు సేద్యం**

ఈ పద్ధతిని ట్రికిల్ ఇరిగేషన్ అని కూడా అనవచ్చును. ఇందులో నీరు నేరుగా మొక్కల వేర్ల దగ్గరకు చేరును. అది కూడా చుక్కలు చుక్కలుగా నీరు వదలబడుతుంది. ఈ పద్ధతి చాలా ముఖ్యమైన పద్ధతి, ఈ పద్ధతిలో నీరు వృధా కాదు. ఆవిరికాదు. నీటి ప్రవాహం నష్టం (రన్ ఆఫ్) ఉండదు. నల్లని ప్లాస్టిక్ పైపులను ఉపయోగించడం వల్ల నీటి ఆవిరిని అరికట్టవచ్చును. ఎరువులు ప్రవాహంలో కొట్టుకుపోయే ప్రసక్తిలేదు. దీనిని ఫెర్టిగేషన్ అని కూడా అంటారు. నీటిని ఎక్కువ కాలం చుక్కలుగా వదలడం వల్ల నీరు ఎక్కువ లోతుకు పోతుంది. దీని వలన మొక్క బాగా పెరిగే అవకాశం ఉంది. ఈ పద్ధతి నూతన సాంకేతిక పద్ధతి. అన్ని పద్ధతుల కంటే తక్కువ ప్రవాహ ఒత్తిడితో కూడుకుంది. ఈ పద్ధతిలో నల్లని పాలథీన్ పైప్స్ ఉపయోగిస్తారు. ఎందుకనగా అది అతినీలలోహిత అల్ట్రావైలెట్ కిరణాలను నిరోధిస్తుంది. మరియు ఆల్గే పెరుగుదలను నిరోధిస్తుంది. కొన్నిసార్లు పైపులను భూమిలో పాతిపెట్టవచ్చును. దీన్ని ఉపయోగించడం చాలా తేలిక కాని స్ప్రింక్లర్ పద్ధతి కంటే అధిక ఖర్చుతో కూడుకున్నది. సబ్ సర్ఫేస్ డ్రిప్ ఇరిగేషన్ (ఎస్.డి.ఐ.) పద్ధతిలో (టూర్ఫ్ గ్రాస్) అనే గడ్డిజాతి మొక్క వలన పైపులు చెడిపోయే ప్రమాదం ఉంది. ఉదాహరణకు న్యూ మెక్సికోయూనివర్సిటి హెడ్ సెంటర్స్‌లో సబ్‌సర్ఫేస్ డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిని భూమి లోపల అమర్చినారు. మంచి ఫలితాలను అనుభవిస్తున్నారు.

**స్ప్రింక్లర్ ఇరిగేషన్**

వ్యవసాయ భూమి బోర్ వెల్‌లో ఉన్న మోటారుకు నల్లని పైపులను స్ప్రింక్లర్స్‌లను అనుసంధానం చేస్తారు. పైపులను 30 మీటర్ల దూరంలో కొన్ని స్ప్రింక్లర్స్‌ను పై భాగంలో అమరుస్తారు. ఈ స్ప్రింక్లర్స్ అధిక పీడనంతో వచ్చే నీటిని పైకి ఏటవాలుగా వెదజల్లుతుంది. నీటి పీడనం వల్ల స్ప్రింక్లర్ (రౌండ్)గా రొటేట్ అవుతుంది. దీనిని సాలిడ్ సెట్ ఇరిగేషన్ అని అంటారు. అధిక నీటి పీడనం వల్ల స్ప్రింక్లర్స్ రొటేట్ అవడాన్ని రోటర్స్ అంటారు. ఈ రోటర్స్ వల్ల గుండ్రంగా స్ప్రింక్లర్‌కి 10 మీటర్ల దూరంలో పొలము పారుతుంది. స్ప్రింక్లర్స్ రొటేట్ కావడానికి ఎక్కువ ప్రెజర్ అవసరం అవుతుంది. ఈ పద్ధతి వలన పొలములో ప్రతి మొక్కకు నీరు అందుతుంది. నీరు నేల లోపల ఇంకిపోయి మొక్కలు బాగా పెరిగే అవకాశం ఉంది. స్ప్రింక్లర్స్‌ను పారిశ్రామిక పద్ధతిలో ఉపయోగిస్తారు. ఉదాహరణకి వీటిని ఫామ్ హౌజ్, స్పోర్ట్స్ ఫీల్డ్ మరియు పార్క్‌లలో ఉపయోగిస్తారు.

**సెంటర్ పివోట్ ఇరిగేషన్**

దీనిని సర్కిల్ ఇరిగేషన్ పద్ధతి అని కూడా అంటారు. పద్ధతిలో ఒక నాభి స్థలము నుండి నల్లని పైపులకు కొన్ని చక్రాలు అమర్చి ఉంటాయి. ఈ చక్రాల సహాయంతో పంటపొలమును గుండ్రంగా నీరుపారించ వచ్చును. ప్రతి ఒక చక్రమును వదిలి ఒక స్ప్రింక్లర్ అమర్చి ఉంటుంది. ఈ స్ప్రింక్లర్ వలన కొంత స్థలము

నీరు పారిన తర్వాత వేరొక స్థలములో అమర్చుటకు సహాయపడుతాయి. ఈ విధంగా మొత్తము పొలంలో మనకు కావల్సిన విధంగా నీరు పొలంలో పారించవచ్చును, పంటను సర్కిల్ ఆకారంలో నాటవలెను. మధ్య భాగంలో బోర్‌వెల్ లేక మోటర్ ఉండే విధంగా ఉండాలి.

ఈ పద్ధతిలో ముఖ్యంగా ఎలక్ట్రిక్ మోటర్ లేక హైడ్రాలిక్ రిడక్షన్ గేర్ బాక్స్ ఉంటుంది. దీని వలన మనకు కావలసిన విధంగా నీరు వెదజల్లేటట్లు చేసుకోవచ్చు. ఈ పరికరాన్ని మానవుడు కావాల్సిన విధంగా సరిచేసుకునే అవకాశం ఉంటుంది. ఇది చక్రాల సహాయంతో పొలములో నాభి నుండి చుట్టూరా నీటిని వ్యవసాయ దారునికి కావల్సిన విధంగా సేద్యం చెయ్యవచ్చు.

**లాటరల్ మూవ్ ఇరిగేషన్**

ఈ పద్ధతిలో కొన్ని పైపులను అనుసంధానం చేసి 1.5 మీటర్ల ఎత్తు ఉండే విధంగా అమరుస్తారు. ఈ పైప్‌లను సమానంగా రెండు వైపులా చక్రాల సహాయంతో ట్రాలీ నడిచే విధంగా వీలు ఉంటుంది. ఈ ట్రాలీపైన ఎలక్ట్రికల్ మోటార్ సహాయంతో పైపులు బిగించబడి, బోర్‌వెల్‌కు అనుసంధానమై ఉంటాయి. ఈ చక్రాల ట్రాలీని కొన్నిసార్లు చేతుల సహాయంతో గాని మిషన్‌ల సహాయంతో గాని ముందుకు నడిపించుటకు వీలుగా ఉంటుంది. దీని వలన స్ప్రింక్లర్స్ 10 మీటర్ల దూరం వరకు పంటపొలాలను అడ్డంగా ట్రాలి ముందుకు కదిలిస్తూ నీటిపారుదల చేయవచ్చును.

ఈ పద్ధతిలో సెంటర్ పివోట్ కంటే తక్కువ ఖర్చు అవుతుంది. కాని లేబర్ ఖర్చు ఎక్కువ ఉంటుంది. ఇందులో 130 ఎం.ఎం. వ్యాసంగల అల్యూమీనియం పైపులు అవసరమవుతాయి. ఈ పద్ధతి చిన్నచిన్న పంటపొలాల్లో మాత్రమే ఉపయోగిస్తారు. కొండ ప్రాంతంగాని, పల్లపు ప్రాంతంలో ఈ పద్ధతి ఉపయోగించి ఖర్చులు తగ్గించవచ్చు.

**సబ్ ఇరిగేషన్ పద్ధతి**

సబ్ ఇరిగేషన్ పద్ధతి సీఫెజ్ ఇరిగేషన్ పద్ధతి అని కూడా అంటారు. ఈ పద్ధతి చాలా కాలంగా మానవుడు ఉపయోగిస్తూనే ఉన్నాడు. ఇది భూతలానికి దగ్గరగా వాటర్ టేబుల్ ఉన్న ప్రాంతంలో సేద్యం చేయుట సులువుగా ఉంటుంది. దీని వలన మొక్కల వేళ్లకు దగ్గరగా గ్రౌండ్ వాటర్ టేబుల్ వచ్చే అవకాశం ఉటుంది. ఈ పద్ధతిలో మానవుడు స్వయంగా నీటి సేద్యం చేసుకోవచ్చును. కొండ ప్రాంతాల నుండి వచ్చే జలపాతాలను పంటపొలంలో మళ్ళించుకొని పంటలు పండించు విధానమే సబ్-ఇరిగేషన్. దీని వలన భూగర్భ జలం పెరిగే అవకాశం ఉంటుంది. సబ్ ఇరిగేషన్ పద్ధతి వల్ల పారిశ్రామిక మొక్కలను పెంచవచ్చును. ఈ పద్ధతిలో కొండ ప్రాంతంలో నీటి ప్రవాహ వేగం ఎక్కువగా ఉంటుంది. కావున వరద నీటిలో కొన్ని పోషక కణాలు కొట్టుకు పోయే అవకాశం ఉంది. కాబట్టి కొన్ని కుంటలు తవ్వి నీటిని నిల్వ ఉంచుకొని మళ్ళీ సేద్యానికి వాడుకోవచ్చును. ఈ పద్ధతి తక్కువ ఖర్చుతో కూడుకున్నది.

**మాన్యువల్ ఇరిగేషన్ యూజింగ్ బకెట్స్ మరియు వాటరింగ్ క్యాన్స్**

ఈ పద్ధతితో శాస్త్ర సాంకేతిక పనిముట్లు తక్కువగా ఉపయోగిస్తారు. కాని ఎక్కువ శ్రమ అవసరమవుతుంది. ఇందులో బకెట్స్ గాని వాటరింగ్ క్యాన్స్‌ని నీటిని తోడటానికి ఉపయోగిస్తారు. ఉదా.. ఆఫ్రికాలో పట్టణాల చుట్టూ పెరిఅర్బన్ వ్యవసాయము.

**ఆటోమెటిక్, విద్యుత్ రహిత నీటిపారుదల**

మానవుడు రోజువారి నీటి అవసరాల కోసం ఉపయోగించే పద్ధతి. ఈ పద్ధతిలో బావి నుండి బొక్కెనకు ఒక పాలిస్టర్‌తాడును కట్టి దాని సహాయంతో నీటిని తోడి కొంత స్థలములో మొక్కలు, ఆకు కూరలు, తోటకూరలు, మెంతి కూరలు మొదలగునవి సాగు చేయవచ్చును. ఈ పద్ధతి వల్ల కరెంటు అవసరం లేదు. ఖర్చు తక్కువ.

**నీటి లభ్యతకు ఆధారం**

వర్షపాతం అతిముఖ్యమైన ఇరిగేషన్ వాటర్‌కు ఆధారము అని చెప్పవచ్చును. భూగర్భ జలము జలపాతాల పంటల సేద్యానికి ముఖ్య ఆధారం. బావులు, నదులు, చెరువులు, రిజర్వాయర్‌లు మరియు నాన్-కన్వెన్షన్ సోర్స్ అనేది వేస్ట్ వాటర్, డిసాలినేటెడ్ వాటర్ మరియు డ్రైనేజ్ వాటర్ ముఖ్యమైనవి. వరద వల్ల వచ్చేనీటిని నిల్వ చేసి ఇరిగేషన్ చేయడాన్ని ఫ్లూడ్ వాటర్ హార్వెస్టింగ్ అంటారు. వరదనీరు నదులు, డెల్టా ప్రాంతాలకు చేరి ప్రవహిస్తాయి. వరద నీటి అనుసంధానం చేసి డ్యామ్‌లు, రిజర్వాయర్‌లునిర్మించి నీటి నిల్వ చేసి సేద్యం చేయాలి. వర్షం వల్ల ప్రవహించు నీటిని, మరియు ఇంటి పైకప్పు ద్వారా వచ్చు నీటిని నిల్వ చేసి వ్యవసాయం చేయవచ్చును.

పై నూతన ఇరిగేషన్ పద్ధతులను వ్యవసాయ రంగంలో ఉపయోగించినట్లయితే మంచిపురోగతి సాధిస్తూ భారత ఖండం ఒక ఆహార భాండారంగా వెలిగే అవకాశం ఉంది. చుట్టూ ఉన్న ఏడు దేశాలకు సరిపడ ఆహారం మనమే ఎగుమతి చేయవచ్చును. బీడు భూములు లేని దేశంగా బంగారు భారత దేశాన్ని రాబోయే తరాలకు వరంగా ఇవ్వవచ్చు. ■

# ఇంధన పొదుపు - ఆవశ్యకత

**భా**రతదేశంలో వినియోగమయ్యే వివిధ రకాల ఇంధనాలలో పెట్రోలు వాటా 12శాతం కాగా, డీజిల్ వాటా 40శాతం వరకు ఉంది. మిగిలినవి విద్యుత్, కట్టెలు, కిరోసిన్, గ్యాస్, బొగ్గు మొదలైవి.

**అధిక ధరలు, అధిక వినియోగం మరియు ప్రభుత్వంపై అధికభారం**

మనదేశ అవసరాలకు కావాల్సిన పెట్రో ఉత్పత్తులలో 74శాతం దిగుమతి చేసుకుంటూ, కేవలం 26శాతం మాత్రమే దేశీయంగా ఉత్పత్తి చేసుకోవలుగుతున్నాము. ప్రపంచ పెట్రో ఉత్పత్తులలో మన దేశంలో ఉత్పత్తి అయ్యేది కేవలం 0.6శాతం మాత్రమే. కానీ మనం ప్రపంచ పెట్రో ఉత్పత్తులలో రెండు శాతం వినియోగిస్తున్నాము. మనం ఇంట్లో వంటకు ఉపయోగించే 14.2కిలోల ఎల్‌పిజి సిలిండర్ ఉత్పత్తి వ్యయంపై దాదాపు రూ. 400 సబ్సిడీ రూపంలో ప్రభుత్వం భరించి మనకు గృహ అవసరాలకు సప్లయి చేస్తున్నది. అలాగే ఒక లీటర్ కిరోసిన్ ప్రజా పంపిణీ విధానం ద్వారా అందించడానికి ప్రభుత్వం వారు రూ. 30పైగా నష్టాన్ని భరిస్తోంది. అలాగే లీటర్ డీజిల్‌పై రూ. 17 మరియు లీటర్ పెట్రోలుపై రూ. 6 నష్టాన్ని చమురు కంపెనీలు భరిస్తున్నాయి. కనుక మనమందరమూ వంటగ్యాస్, కిరోసిన్, డీజిల్ మరియు పెట్రోలును పొదపుగా వాడుకోవాలి. పెట్రో డీజిల్ మొదలగు ఉత్పత్తుల రేట్లు మారుతూ ఉంటాయి కావున ఈ సబ్సిడీ అనేది సుమారుగా ఇస్తున్నారు.



**తరుగుతున్న వనరులు**

మనకు నిత్యమూ చాలా అవసరమైన ఈ పెట్రోలు ఉత్పత్తులు భూమి నుండి త్రవ్వి తీస్తారు. వీటిని శిలాజ ఇంధనాలు (ఫాసిల్ ఫ్యూయల్స్) అంటారు. ఇవి ఇంకా 40 సంవత్స రాలు మాత్రమే ఈ విధంగా లభ్యమవు తాయి. అటు తరువాత మనము భూమిపై ఉత్పత్తి చేసుకొనే ఇంధ నాలపై ఆధారపడవలసి ఉంటుంది. అనగా డీజిల్ కొరకు బయోడీజిల్ మొక్కలు (జాట్రోపా , కానుగ) పెంచటం, పెట్రోలు కొరకు, పంచదార ఫ్యాక్టరీల నుండి వచ్చే ఇథనాల్, గ్యాస్ కొరకు గోబర్ గ్యాస్ (పేడ నుండిలభిస్తుంది) మొదలైన వాటిపై ఆధారపడాల్సి వస్తుంది.

**గ్లోబల్ వార్మింగ్‌ను అదుపు చేయుటకు**

శిలాజ ఇంధనాలు వాడటంవలన అధిక మొత్తంలో గ్రీన్‌హౌస్

**కారంపూడి రామకృష్ణ,** అధ్యక్షుడు, పెట్రోలియం కంజర్వేషన్ రీసెర్చ్ అసోసియేషన్,
మంగళగిరి, గుంటూరు జిల్లా. సెల్ : 9441504427. e-mail: krk_agmsc@yahoo.com

గ్యాసెస్ విడుదలై దానివలన గ్లోబల్ వార్మింగ్ (భూమి వేడెక్కుట) ప్రక్రియ మొదలవుతుంది. భూమి వేడెక్కటం వలన అనేక ప్రకృతి వైపరీత్యాలు (సముద్రం పొంగటం, తుఫానులు మొదలైనవి) కలుగుతాయి. పంటలు కూడా దెబ్బతింటాయి. కావున ఇంధన వినియోగం వలన కలిగే కాలుష్యాన్ని తగ్గించటం చాలా అవసరం. దీనికొరకు ఇంధన పొదుపు అందరూ పాటించి కాలుష్యాన్ని తగ్గించటానికి తమ వంతు బాధ్యత నిర్వర్తించాలి. కేవలం మొక్కలను నాటుతూ పోవటం వలన ఈ సమస్య పరిష్కారం కాదు. "Prevention is better than Cure" అన్న సామెతను అనుసరించి కాలుష్యాన్ని జనియించకుండా చేయటానికి ఇంధన పొదుపు తప్పనిసరి అని గమనించవలెను.

**పర్యావరణ కాలుష్యము వలన వచ్చే వ్యాధులు తగ్గించటానికి**

ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం మనుష్యులకు వచ్చే 102 వ్యాధులలో 85 వ్యాధులు పర్యావరణ కాలుష్యం వలన వస్తున్నాయని తేలింది. పర్యావరణ కాలుష్యానికి ఇంధన కాలుష్యము ఒక ప్రధాన కారణము. ఇంధన పొదుపు పాటించటం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించుకొని వ్యాధులు బారినపడకుండా జాగ్రత్త పడవచ్చును.

**విద్యుశ్చక్తి పొదుపు ఆవశ్యకత**

మనము వినియోగించే విద్యుత్తులో 60శాతం వరకు థర్మల్ స్టేషన్లలో ఉత్పత్తి అవుతోంది. ఈ ప్రక్రియలో బొగ్గును మండించుట వలన థర్మల్ స్టేషన్ల నుండి వెలువడే వాయువుల వలన వాయు కాలుష్యము ఏర్పడుతుంది. దీనివలన థర్మల్ స్టేషన్ పరిసర ప్రాంతాలలో నివసించే వారికి అనారోగ్యములు కలుగుతున్నట్లు సర్వేలో తేలింది. కావున విద్యుత్ ఉత్పత్తి వినియోగాన్ని తగ్గించుకోవాలి. పొదుపుగా విద్యుత్తు వాడుకోవాలి. థర్మల్ విద్యుత్ కొరకు ఉపయోగించే రాక్షసి బొగ్గు ఇంకా 90 సంవత్సరాలు మాత్రమే లభ్యమవుతుంది. అటు తరువాత ఈ పద్ధతిలో విద్యుత్ ఉత్పత్తి ఆగిపోతుంది. కావున తరుగుతున్న వనరులను దృష్టిలో ఉంచుకొని విద్యుత్‌ను అందరూ పొదుపుగా ఉపయోగించాలి.

**ఇంధన పొదుపు కొరకు మనం ఏమి చేయాలి**

భారత ప్రభుత్వం (పెట్రోలియం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో) పెట్రోలియం కన్సర్వేషన్ రీసెర్చ్ అసోసియేషన్ అనే ఒక సంస్థను స్థాపించి దాని ద్వారా ప్రజలకు వివిధ రకాలైన పద్ధతుల ద్వారా ఏ విధంగా ఇంధనం ఆదా చేయవచ్చునో అనే అంశంపై శిక్షణా తరగతులను దేశమంతటా నిర్వహిస్తున్నారు. ■

*41వ పేజీ తరువాయి...*

## ఆర్థిక సమ్మిళితకు రాజమార్గం ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన.

కూడా తన సేవలను అందిస్తున్నది. దీని ఆధారంగా మన దేశంలో ప్రారంభించిన నగదు బదిలీ పథకం అవినీతిని నిర్మూలించడంలో ఇతోధిక సహాయం అందచేస్తుందని ఆశించవచ్చు. ఇలా మొబైల్ పరిజ్ఞానాన్ని కూడా మన దేశం అంది పుచ్చుకోవచ్చు.

**PMJDY భవిష్యత్తు:** కేవలం బ్యాంక్ ఖాతాను మాత్రమే తెరిచి వూరుకొంటే, అది ఆర్థిక సమ్మిళతకు కొంతమేరకు మాత్రమే ప్రయోజనకారి కావచ్చు. PMJDY పథకం అందించే ప్రయోజనాలు బహుముఖమైనవి. కాలక్రమేణ సంక్షేమ పథకాల ప్రయోజనాలను కూడా ఈ బ్యాంక్ ఖాతాల ద్వారా అందచేయడం చేయకపోతే, ఇవి కొంతకాలానికి నిర్వీర్యం అయిపోతాయి. ఒక్క సారి ప్రభుత్వ పథకాల లావాదేవీలు మొదలైతే ప్రజలు తమ వ్యక్తిగత లాదేవీలను కూడా ఈ ఖాతాలనుండే చేస్తారు. తద్వారా బ్యాంకేతర ఆర్థిక లావాదేవీలు నియంత్రించబడతాయి. ఫలితంగా మధ్యవర్తుల పాత్ర తగ్గి, పారదర్శకత పెరుగుతుంది. కుటుంబాలకు ఒనగూడే ఆర్థిక స్వాతంత్ర్యము కూడా ప్రధానమే! అయితే ఈ విధానం అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఇంకా చర్చల స్థాయిలోనే ఉన్నది గానీ ఆచరణలో అట్టడుగు స్థాయికి చేరలేదు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాలలో ఆర్థిక వ్యవహారాలకు పోస్ట్ ఆఫీసులను కూడా ఉపయోగించుకోవచ్చు. చేయవలసిందల్లా లావాదేవీలను సులభతరం చేయడమే! PMJDY సాంకేతికత క్రమేణా "*99#" సర్వీస్ కోడ్ తో మొబైల్ బ్యాంకింగ్‌ను మరింత సులభతరం చేయనున్నది.

బ్యాంకింగ్ కరస్పాండెంట్లు ఖాతాలను తెరిపించి, వివిధ పథకాల నగదును బదిలీ చేయడంవంటి విధులను నిర్వహిస్తుంటారు. అయితే ఒక్కొక్కసారి వారి సేవలు సకాలంలో అందక పోవచ్చు. ప్రభుత్వం వారికి నెలకు ప్రస్తుతం 1500-2000 రూపాయల వరకు అందచేస్తున్నది. త్వరలోదీనిని 5000 ల రూపాయలకు పెంచుతామని వాగ్దానం చేసింది. ఇలాంటి నిర్వహణ విధులను ప్రభుత్వం జాగరూకతతో నిర్వహించాలి. సేవలను అందించేవారు ఎక్కువమంది ఉండటం మంచిదే! ఇలా ఆర్థిక కార్యకలాపాలను విస్తృత పరచడానికి అధికంగా సిబ్బందిని నియమించుకోవాలి. లేకపోతే ఇది మరొక ఊకదంపుడు కార్యక్రమం అవుతుంది. ప్రభుత్వం PMJDY అధికారులను రోజుకు 200ల ఖాతాలను తెరిపించాలని ఆదేశించింది కానీ, బ్యాంకులకు సిబ్బంది తక్కువగా ఉండటంతో ఇది దుస్సాధ్య మవుతున్నది. అంటే ముందుగా బ్యాంకుల శాఖలను పటిష్ట పరచాలి, విస్తృత పరచాలి.

**ముగింపు:** మొత్తమ్మీద PMJDY ఆర్థిక సమ్మిళిత లక్ష్యం దిశగా ఒక మంచి ముందడుగు. బీమా సదుపాయం, ఋణ సదుపాయం, డెబిట్ కార్డుతో ఒక బ్యాంక్ ఖాతా ఖచ్చితంగా గ్రామీణ ప్రజలను, వారి అవసరాల దృష్ట్యా ఆకర్షిస్తుంది. ■

# పంచశీలకు అరవై ఏళ్ళు

భారత్ – చైనా మైత్రికి ప్రాతిపదిక అయిన పంచశీలకు అరవై ఏళ్ళు పూర్తి అయ్యాయి. ఈ సందర్భంగా చైనా నిర్వహించిన కార్యక్రమాలకు భారత ఉపరాష్ట్రపతి హమిద్ అన్సారీ నేతృత్వంలో ఒక ప్రతినిధి బృదం చైనాలో పర్యటించింది. ఆయనతో పాటు భారత వానిజ్య పరిశ్రమల మంత్రి శీతారామన్ కూడా వెళ్ళారు. ద్వైపాక్షిక సంబంధాల మెరుగు సరిహద్దు సమస్య, ఇరుదేశాల మధ్యగల వానిజ్యలోటును అధికమించటం తదితర అంశాలపై చర్చలు జరపాలన్న ప్రధాన లక్ష్యంతో వీరి పర్యాటన జరిగింది. సుమారుగా రెండు వేల సంవత్సరాల పైగా మనుగడ సాగిస్తున్న భారత్ – చైనా మధ్య మైత్రి కొనసాగితే అది ప్రపంచశాంతికి దోహదం చేస్తుంది. అయితే పంచశీల వంచన నేపథ్యంలో వాస్తవంగా భారత్ – చైనా మిత్రదేశమా ? శత్రుదేశమా స్పష్టంకావల్సి ఉంది.

2014 జూన్ 27న చైనా నిర్వహించిన కార్యక్రమంలో ఆదేశ అధ్యక్షుడు జి. జిన్‌పింగ్ ఇరుగుపొరుగు దేశాల మధ్య సత్సంబంధాలు, శాంతి సహకారాలు, వెల్లివిరియాలంటూ పిలుపు ఇచ్చారు. 60 ఏళ్ళ క్రిందట భారత్ –చైనా మయన్మార్ నాయకులు ప్రాంతీయ శాంతికోసం రూపొందించిన పంచశీల సూత్రాలను అనుసరించడానికి చైనా ఇప్పటికి సిద్ధంగాఉందన్నారు. యుద్ధాల ద్వారా స్నేహాన్ని సాధించగలమను కోవడం పొరపాటన్న రవింద్రనాథ్ ఠాగూర్ వాక్యాలను గుర్తుచేశారు. అలాగే ప్రపంచ శాంతి అభివృద్ధికోసం ప్రాశ్చాత్యదేశాలతో కలసి పనిచేస్తామని కూడా ప్రకటించారు. ఈసందర్భంగా ఒక్కసారి పంచశీల ఒప్పందం గురించి విశ్లేషిస్తే.

1947 ఆగస్టు భారత్ స్వాతంత్ర్య దేశంగా ఆవిర్భవించింది. సోషలిస్టు భావజాలంగల జవహర్‌లాల్ నెహ్రూ దేశతొలి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. నెహ్రూ హయాంలో విదేశాంగ విదానానికి రూపకల్పన జరిగింది. సుదీర్ఘ కార్మిక పోరాటం (లాంగ్‌మార్చ్) తర్వాత 1948లో చైనా రాజుల పాలన నుంచి విముక్తి పొంది పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాగా అవతరించింది. మావో సేటుంగ్ నేతృత్వంలో చైనాలో కమ్యునిష్టు ప్రభుత్వం ఏర్పడినది. 1950 ఏప్రిల్ 1వ తేది నుంచి చైనాతో తత్సంబంధాలు కోరుకున్న భారత్ ఆదేశానికి పలు అంతర్జాతీయ వేదికలపై మద్దతు ఇచ్చింది.

**చైనాకు మద్దతుగా భారత్**

- స్వాతంత్ర్య దేశంగా అవతరించిన చైనాను మొదటగా గుర్తించిన దేశాలు మయన్మార్, భారత్‌లే
- తైవాన్ వివాదం అంశంలో భారత్ చైనాను సమర్థించగా అందుకు ప్రతిగా గోవా అంశంపై చైనా భారత్‌ను బలపర్చింది.
- కొరియాతో చైనాకు జరిగిన యుద్ధంలో చైనానే దురాక్రమణదారు అని ఐక్యరాజ్య సమితి చేసిన తీర్మానాన్ని భారత్ వ్యతిరేకించింది.
- అమెరికా చైనాల మధ్య యుద్ధఖైదీల మార్పిడిలో భారత్ మధ్యవర్తిగాను పోషించింది.
- భద్రతామండలిలో చైనాకు అధికారం పొందుటకు భారత్ చైనాకు మద్దతుగా నిల్చింది.

**పంచశీలకు నాంది**

భారత్ అలీన విధానం, సామ్రాజ్యవాద వ్యతిరేకత, వలస పాలన, జాతివివక్ష వ్యతిరేకత ఐరాసకు మద్దతు వంటి లక్ష్యాలతో కొత్త సిద్ధాంతానికి రూపకల్పన చేయాలని భారత్ ఆశించింది. రెండు ప్రపంచ యుద్ధాలు అణుబాంబు దాడులు అనంతరం పొరుగుదేశాల మధ్య శాంతియుత వాతావరణం అత్యవసరమని గ్రహించి వాటితో సత్సంబందాలని నెలకొల్పాని ఆశించింది. ఆమేరకు చైనాతో ద్వైపాక్షిక సంబంధాల్లో ఐదు ముఖ్యమైన సూత్రాలను పాటించాలని నిర్ణయించింది.

**కె. ప్రతాప్ రెడ్డి,** పరిశోధక విద్యార్థి, ఉస్మానియా యూనివర్సిటీ

1954 ఏప్రిల్ 29వ తేదిన భారత్, చైనా ప్రధాన మంత్రులు నెహ్రు, చౌఎన్‌లైలు ఆ ఐదు సూత్రాల ఒప్పందంపై చైనా రాజధాని పెకింగ్ (ప్రస్తుతం బీజింగ్) లో సంతకాలు చేశారు. ఇదే పంచశీల ఒప్పందంగా ప్రపంచ ప్రసిద్దిగడించింది. ఆ 5 సూత్రాలు :

1. ప్రాదేశిక (సరిహద్దులు) సమగ్రతను సార్వభౌమత్వాన్ని పరస్పరం గౌరవించుకోవడం.
2. ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యంచేసుకోకుండా ఉండటం.
3. ఇరుదేశాలు సమానత్వాన్ని, పరస్పర ప్రయోజనాల్ని కాపాడుకోవడం.
4. పరస్పర దాడులకు దూరంగా ఉండటం.
5. శాంతియుత సహజీవనం.

ఈ పంచశీల సిద్ధాంతం మొదట్లో భారత విదేశాంగ విధానంలో కీలకాంశం. ఇది కేవలం భారత్ చైనాలకే కాకుండా ఇరుగుపొరుగు దేశాల మధ్య సంఘర్షణల నివారణకు మొత్తం ప్రపంచానికే మార్గదర్శకమంటూ అప్పట్లో పలుదేశాలు ప్రశంసించాయి.

**హిందీ.. చీనీ భాయ్ భాయ్...**

1950 దశకం పర్వంలో హిందీ.. చీనీ భాయ్, భాయ్ అనే నినాదం మనదేశమంతటా మారుమ్రోగింది. చైనా ప్రధాని చౌ–ఎన్–లై 1954 జూన్ చివరి వారంలో భారత్‌లో పర్యటించారు. జవహార్‌లాల్ నెహ్రు చైనా ప్రధానికి ఘనస్వాగతం పలికారు. చైనా మనకు మిత్రదేశమని, ఆసియాలోని రెండు అతి పెద్దదేశాలు ప్రపంచ శాంతికి ద్రోహదం చేస్తాయని నెహ్రు సగర్వంగా ప్రకటించారు. కానీ చైనా వీటన్నింటిని ఉల్లంఘించింది.

**చైనా దురాక్రమణలు**

1951 నుంచి చైనా టిబెట్‌లోని ప్రాంతాలను మెల్లమెల్లగా ఆక్రమిస్తూ వచ్చింది. 1959 నాటికి పూర్తిగా ఆక్రమించి చైనాలోని భాగంగా ప్రకటించింది. టిబెట్ వేలాది సంవత్సరాలుగా భారతీయ సంస్కృతిలో అంతర్భాగంగా ఉండేది. హిందువులు పవిత్రంగా భావించే కైలాస పర్వతం, మానస సరోవరం ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. కైలాస మానస సరోవరయాత్రకు వెళ్ళాలంటే ఇప్పుడు భారతీయులకు పాసుపోర్టు ఉండాలి. చైనా ప్రభుత్వం అనుమతి ఇవ్వాలి.

- చైనా 1955లో భారత్‌లోని ఉత్తర సరిహద్దులోని కొంత భాగాన్ని 1958లో అస్సాంను, ఇతర ఈశాన్య రాష్ట్రాలలో కొన్ని భాగాలను తమ దేశ పటాల్లో (మ్యాప్‌లో) చూపించింది.
- 1914 బ్రిటీష్ పాలకులు సిమ్లాలో ఒక సమావేశం జరిపి భారత్ చైనా టిబెట్‌ల మధ్య సరిహద్దు రేఖను గుర్తించారు. ఇందులో కీలక పాత్రను పోషించిన అప్పటి బ్రిటీష్ విదేశాంగ కార్యదర్శి సర్. హెన్రీ మెక్‌మోహన్ పేరిట ఈ రేఖను మెక్‌మోహన్‌రేఖగా పిలుస్తారు. కానీ చైనా దీన్నికూడ సరిహద్దుగా గుర్తించబోమని అప్పుడే ప్రకటించింది.
- టిబెట్‌ను పూర్తిగా చైనా ఆక్రమించగా 1959లో భారత్ దలైలామకు ఆశ్రయం ఇచ్చినప్పటి నుంచి భారత్ సరిహద్దులో చొరబాట్లు, ఘర్షణలు మొదలుపెట్టింది. 1959లోనే మెక్‌మోహన్ రేఖకు దక్షిణంగా లాంగ్జులో భారత్ సైనిక స్థావరాన్ని ఆక్రమించింది.
- 1962 జూలైలో ఘర్షణ ప్రారంభించిన చైనా సెప్టెంబర్ 8న మెక్‌మోహన్ రేఖకు ఉత్తర ప్రాంతంలోభారత సైనిక స్థావరంపై దాడి జరిపి యుద్ధానికి తెరతీసింది. ఆక్సాయ్‌చిన్‌ను ఆక్రమించుకుంది. భారత్ పలుప్రాంతాల మీద పట్టు కోల్పోయింది.

పంచశీల వంటి సిద్ధాంతల నేపథ్యం గల ద్వైపాక్షిక సంబంధాలతో చర్చలు సామరస్య పరిష్కారాల వంటి వాటి ప్రసక్తే లేకుండా చైనా యుద్ధానికి దిగటంతో ఇరుదేశాల మధ్య దౌత్యసంబంధాలు మాత్రం పూర్తిగా తెగిపోయాయి. దాంతో పంచశీలకు హిందీ... చీని... భాయ్, భాయ్ నినాదానికి అర్థం లేకుండా పోయింది.

**సంబంధాల పునరుద్ధరణ**

సరిహద్దు వివాదం కొనసాగుతూనే ఉన్నా పొరుగు దేశాల మధ్య సత్సంబంధాలు అవసరమనే కీలకపంచశీల సూత్రం స్ఫూర్తితో భారత్ చైనాలు తర్వాత ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించాయి. 14 ఏళ్ళ తర్వాత 1976 లో ఇరుదేశాలు దౌత్యసంబధాలు పునరుద్ధరించుకున్నాయి. మొదట అధికారుల స్థాయిలోనూ 1980 లో పూర్తి స్థాయిలోనూ వీటిని తిరిగి నెలకొల్పుకున్నారు.

1976లో చైనాలో తొలి భారత రాయబారిగా కె.ఆర్. నారాయణ నియమితులయ్యారు. 1981 లో సరిహద్దు వివాదపరిష్కారానికి ఎనిమిది విడతల చర్చలు జరిగాయి. 1986లో చైనా మళ్లీ అరుణాచల్ ప్రదేశ్‌లోని సుమడోరొంగ్ లోయలో సైన్యాన్ని దింపడంతో ఉద్రిక్తతలు చెలరేగినా మళ్లీ చైనా వెనక్కి తగ్గింది. అదే ఏడాదిలో అరుణాచల్‌ను కేంద్ర పాలిత ప్రాంతం నుంచి రాష్ట్రంగా మార్చారు.

1988లో అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ చైనాను సందర్శించారు. తర్వాత కూడా సరిహద్దు వివాద పరిష్కారానికి అనేక విడతల చర్చలు, క్రొత్త యంత్రాంగాలు, వ్యవస్థలు, బృందాలు ఏర్పాటైన దేనివల్ల ప్రయోజనం చేకూరలేదు. తర్వాత కాలంలో భారత ప్రధానులు పి.వి నర్సింహరావు, వాజ్‌పాయ్, మన్మోహన్ సింగ్‌లు చైనాలో పర్యాటనలు జరిపారు. 2006లో ఇరు దేశాల మధ్య ప్రాచీన వాణిజ్య

మార్గమైన నాథులా మార్గాన్ని తెరిచారు. 2009లో భారత్ ప్రధాని మన్మోహన్ సింగ్ అరుణాచల్ ప్రదేశ్‌లో పర్యటించినప్పుడు చైనా దీనిపై పెద్ద దుమారం లేవనెత్తింది. ఆ ప్రాంతం తమదని దానిపై భారత్‌కు హక్కులేదని వాదించింది. తర్వాత దలైలామ అరుణాచలంలోని తవాంగ్ పర్యటనను కూడా దుమ్మెత్తి పోసింది.

ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు మెరుగుపడిన ఇటీవల ఆర్థిక సంబందాలు పెరుగుతున్నా సరిహద్దు వివాదం మాత్రం కొనసాగుతూనే ఉంది. రెండు దేశాల మధ్య నాలుగు వేల కి.మీ పైగా సరిహదు ఉన్నా ఖచ్చితమైన సరిహద్దురేఖ లేకపోవడమే ఇందుకు కారణం. మెక్‌మోహన్ రేఖను చైనా తిరస్కరించింది. 1962 యుద్ధంలో కాల్పులు విరమించినప్పటి వాస్తవాధీన రేఖనే సరిహద్దు రేఖగా గుర్తించాలని వాదిస్తోంది. అందుకే తరుచుగా చొరబాట్లు చరుపుతుంది. 2010 నుండి ఇప్పటి దాక చైనా దాదాపు 500 చొరబాట్లు జరిపినట్లు లెక్కకట్టినారు. గిల్గిత్ – బాల్టిస్తాన్‌ల ఆక్రమణ, అరుణాచల్ ప్రదేశ్‌ల పై వీసా వ్యవహారాలు, పాకిస్తాన్‌కి ప్రత్యక్షంగాను, పరోక్షంగా మద్దతు ఇవ్వటం. శ్రీలంకలో నౌకా స్థావరం ఏర్పాటు, నేపాల్‌లోని మావోయిష్టులకు ఈశాన్య భారత్ ప్రాంతాల్లో చొరబాటు మూరాలకు దన్నుగా నిల్వటం మొదలైనన్ని చైనీయులు మనదేశాన్ని చుట్టుముట్టే విధానపు పోకడలే.

**బలపడుతున్న ఆర్థిక వాణిజ్య సంబంధాలు**

ఒక పక్క సరిహద్దు వివాదం జరుగుతూనే ఉన్నా ఇటీవలె కాలంలో భారత్ చైనాల మధ్య ఆర్థిక, వాణిజ్య సంబంధాలు బలపడుతూ వస్తున్నాయి. ఇరుదేశాల మధ్య వాణిజ్యం ఏటా పెరుగుతుంది. 2013, 14 నాటికి 65.47 బిలియన్ డాలర్లకు చేరుకుంది. 2015 నాటికి 100 బిలియన్ డాలర్లకు పెంచాలని కూడా రెండు దేశాలు పెట్టుకున్నాయి. అయితే ద్వైపాక్షిక వాణిజ్యంలో భారత్‌కు దిగుమతులు ఎక్కువ. ఎగుమతులు తక్కువ కావడంతో మనదేశానికి 35 బిలియన్ డాలర్ల వాణిజ్యలోటు ఏర్పడిరది. దీన్ని పూర్చడానికి ప్రస్తుతం కృషి జరుగుతుంది. అందులో భాగంగానే తాజాగా హమిద్ అన్సారీ పర్యాటనలో భారత్‌లో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు గాను చైనాతో ఒప్పందం కుదిరింది.

2013 మార్చిలో చైనాలో క్రొత్త నాయకత్వం పగ్గాలు చేపట్టింది. కొత్త అధ్యక్షుడు జి.జిన్‌పింగ్ ఇరుదేశాలు కలిసి పనిచేసేందుకు ఐదు కొత్త సూత్రాలు ప్రతిపాదించారు. కానీ ఈ ఐదు సూత్రాలు వాణిజ్య ఆర్థిక బంధాలకు సంబంధించినవి. సరిహద్దు సమస్య సంక్లిష్టమైనదని దాన్ని పరిష్కరించాలని అంటూనే జిన్.పింగ్ దాన్ని ప్రక్కన పెట్టి ఆర్థిక వాణిజ్యబలోపేతానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఇరుదేశాలు వ్యూహాత్మక ద్వైపాక్షిక బందాలు కొనసాగించాలని వాణిజ్య పెట్టబడుల రంగాల్లో సహకారాన్ని విస్తరించాలని స్నేహ, సాంస్కృతిక సంబంధాలను మెరుగు పరుచుకోవాలని, అభివృద్ధి చెందుతున్న దేశాలు అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కోనేందుకు కలిసి పనిచేయాలనీ ఇరుదేశాలు తమ ప్రాధాన్యాలకునుగుణంగా పనిచేయాలని జిన్‌పింగ్ ప్రతిపాదించారు.

**కుదిరిన నూతన ఒప్పందాలు**

1. భారత్‌లో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు చైనా సహకారం అందించే అంశంపై అవగాహనొప్పందం. దీనిపై భారత విదేశాంగ కార్యదర్శి సుజాత సింగ్, చైనా వాణిజ్య ఉపమంత్రి గౌయన్‌లు సంతకాలు చేశారు.
2. బ్రహ్మపుత్ర నదికి వరదలు వచ్చేసమయాల్లో ముందస్తు సమాచారాన్ని నదీజలాలకు సంబంధించి ఇతర సమాచారాన్ని భారత్‌కు చైనా అందించేందుకుగాను ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ సమాచారాన్ని భారత్ అందుకొని వరదల నివారణకు నియంత్రణకు ఏరకంగా కృషి చేసిందో చైనాకు తెలియజేస్తుంది. దీనిపై చైనాలో భారత రాయబారి అశోక్ కాంత చైనా జలవనరుల మంత్రి సంతకాలు చేశారు.
3. ప్రభుత్వాధికారుల శిక్షణ సామర్థ్యాల పెంపు వంటి కార్యక్రమాల్లో పరస్పర సహకారం సమాచారం అందించుకునేందుకుగాను ఒక అవగాహణ ఒప్పందం కుదిరింది.


మారినపరిస్థితులకు అనుగుణంగా జింన్‌పింగ్ ప్రతిపాదించిన ఐదు సూత్రాలను అనుసరించడం తప్పు కాదు. కానీ దీనితో పాటు 60 ఏళ్ళ క్రిందట కుదిరిన పంచశీల ఒప్పందం ఈ నాటికి కూడా వర్తిస్తుంది కనుక దాని స్ఫూర్తిని కొనసాగించి గౌరవించాల్సిన అవసరం ఇరుదేశాలకు కూడా ఉందనే సంగతి కూడా గుర్తించాల్సి ఉంది. ఇలాంటి పంచశీల సిద్ధాంతాల రూపకర్తలుగా భారత్, చైనా దేశాలు తమ మైత్రి సంబంధాలకు తిరిగి ప్రాణం పోసి ఉమ్మడి లక్ష్యాలను ప్రగతిని, సుసంపన్నతను సాధించి ప్రపంచానికి మార్గం చూపాలి. ఇంతవరకు రెండు దేశాల మధ్య గుర్తించని సరిహద్దు ఒక పెద్ద సమస్యగా మారింది. ఇప్పుడు తన పర్యటనలో చైనా అధ్యక్షుడు జింపింగ్ ఈ సరిహద్దు సమస్య పరిష్కారానికి సత్వర చర్యలను తీసుకోవాలని గుర్తించడం ద్వీపాక్షిక సంబంధాలలో ఒక మేలు మలుపు కాగలదు. వికాసవాదాన్ని పాటించాలంటే విస్తార వాదాన్ని పక్కన పెట్టి, ఇటీవలి తన పర్యటనలో చైనా అధ్యక్షుడు Xi Jinping చెప్పినట్లు భారత చైనాలు రెండు చేతులు కలిపితే యావత్ ప్రపంచమూ మనవంకే చూస్తుందనడంలో ఏమాత్రమూ సందేహం లేదు. ఏ తరహా ప్రభుత్వామైనా, అధికార పార్టీకి, దేశంలోని ఇతర పార్టీలకు లేదా ఇతర రాజ్యాంగ సంస్థలకు కొన్ని విషయాలలో అభిప్రాయబేధాలు ఉండటం సహజం. వాటిని పక్కనపెట్టి, జింపింగ్–మోడిలు ఇద్దరూ చేయిచేయి కలిపి ప్రపంచానికే మార్గదర్శకత్వం పంచశీల స్ఫూర్తితో సుస్థిర శాంతి నెలకొల్పడానికి కృషి చేస్తారని ఆశిద్దాం. ■

# వాతావరణానికి మరమ్మత్తులు.

వాతావరణానికి మరమ్మత్తులు అంటే (ఒక విధంగా దీనిని మనం జియో ఇంజనీరింగ్ అని పిలుచుకోవచ్చు) మన చుట్టూ వున్న వాతావరణాన్ని కావాలని మార్చడమే! రోజు రోజుకూ పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్ కు దీనిని మనం సమాధానం గా ఉపయోగించుకోవచ్చు. దీనిని సౌర శక్తి వినియోగము మరియు బొగ్గుపులుసు వాయువు తొలగింపు అనే రెండు దశలలో చూడాల్సి వుంటుంది. దీనికి ఎన్నో పద్ధతులు ఉన్నప్పటికీ, 2014 లో నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం ఎక్కువ విపరిణామాలు లేకుండా సులభంగా అమలుచేయగలిగిన క్రింది పద్ధతులను సూచించింది.

**సౌర తాప నిర్వహణ**

సిద్ధాంత పరంగానూ, ఆచరణ పరంగానూ సూర్య కాంతిని ప్రతిఫలింపచేయడం ద్వారా సౌర తాపాన్ని నియంత్రించడం ఈ విధానం లో ప్రధానాంశం. ఉదాహరణకు స్ట్రాటోస్ఫియర్ లో గంధకపు గాలి తుంపరలను సృష్టించడం. ఇవి గ్రీన్ హౌస్ వాయువులనైతే తగ్గించలేవు తద్వారా వచ్చే సముద్ర ఆమ్లీ కరణను కూడా నియంత్రించలేదు. అయితే దీనివలన ప్రయోజనమేమంటే వాటిని వేగంగానూ తక్కువ ఖర్చుతోనూ ఉపయోగించగలగటం. ఇతర గ్రీన్ హౌస్ వాయువులను తగ్గించే విధానాలతో పోల్చితే అధికంగా ఉన్న బొగ్గుపులుసు వాయువును వేగంగా నియంత్రించగలగాలి. కనుకనే సౌర తాప నిర్వహణ విధానాలను వాతావరణాన్ని మరమ్మత్తు చేయడానికి ఒక క్విక్ ఫిక్స్ గా చెప్పవచ్చు. లెంటన్ మరియు వాన్ (Lenton and Vaughan) అనే శాస్త్రజ్ఞుల పరిశోధన ప్రకారం స్ట్రాటోస్ఫియర్ లో గంధకపు గాలి తుంపరల ద్వారాను, సూర్యకాంతిని ప్రతిఫలింపచేయడం ద్వారాను బొగ్గుపులుసు వాయువు విస్తరణను నియంత్రించవచ్చు.




**స్ట్రాటోస్ఫియర్ లో గంధకపు గాలి తుంపరలు**

కాంతి పరావర్తనం ద్వారా ఈ గంధకపు గాలి తుంపర్లను విస్తరింపచేయవచ్చు. దీనికి హైడ్రోజెన్ సల్ఫైడు, సల్ఫర్ డైయాక్సైడ్ లను ఉపయోగించాలి. ఫిరంగి (ఆర్టిలరీ) గొట్టాలద్వారా గాని, విమానాల ద్వారా గాని వీటిని పిచ్చికారీ చేయించాలి. బేలూన్ల ద్వారా కూడా చేయవచ్చు కానీ, మోతాదు మించితే ఓజోన్ పొర బలహీనపడుతుంది. ప్రమాదకరమైన క్లోరో ఫ్లూరో కార్బన్లు స్ట్రటోస్ఫెరిక్ మేఘాలలో ఉండిపోతాయి. కనుక ఈ విధానాన్ని చాలా జాగ్రత్తగా ప్రయోగించాలి లేకపోతే ప్రతికూల ఫలితాలు ఉంటాయి. అగ్ని పర్వతాల విస్ఫోటనం ద్వారా అధికంగా లభించే గంధకపు ఈ విధానాన్ని సులభతరం చేస్తుంది. అయితే టైటానియం డై ఆక్సైడ్ ను దీనికి సమర్థవంతమైన ప్రత్యామ్నాయంగా చెప్పవచ్చు.

**ఐరన్ ఫెర్టిలైజేషన్**

ఇంకా పరిశోధన స్థాయిలోనే ఉన్న ఈ విధానంలో సముద్ర ఉపరితలం మీద ఐరన్ కణాలను ప్రయోగించి అధిక జీవ ఉత్పత్తిని ప్రోత్సహిస్తారు. పత్రహరితాన్ని తయారుచేయడానికి ఐరన్ ఒక ప్రధాన

**విజయకుమార్ వేదగిరి,** సీనియర్ ఎడిటర్, యోజన (తెలుగు), హైదరాబాద్

మూలకం కనుక, సముద్ర జలాల్లో ఇది త్వరగా కరిగి పోతుంది. ఇనుము తక్కువగా ఉన్న సముద్ర జలాలకు ఇనుమును కలపటం ద్వారా, సంద్రంలో నాచును ఎక్కువగా ఉత్పత్తి చేయవచ్చు. ఇలాంటి ఫలదీకరణం ద్వారా వాతావరణంలోకి ఎక్కువగా బొగ్గుపులుసు వాయువు చేరకుండా నిరోధించే ప్రక్రియలను శాస్త్రజ్ఞులు పరిశోధిస్తున్నారు. దీనివల్ల సముద్ర ఆహార ఉత్పత్తి అధికమయ్యి, వాతావరణంలో ఎక్కువ మార్పులు రాకుండా చూడటం వీలవుతుంది.

**మేఘాల పరావర్తతను మార్చడంద్వారా**

మేఘాల ప్రతిక్రియను తగ్గించే విధంగా వాటి పరావర్తనాన్ని మార్చితే వాతావరణంలో మార్పు వస్తుంది. దీనిని మేఘాలను మరింత బలవత్తరం చేయడం ద్వారాను, పైనుండే బలహీన పొరలను తొలగించడం ద్వారాను రెండు విధాలుగా చేయవచ్చు. మేఘాల ద్వారా కాంతి పరావర్తనం చెందేటట్లయితే వాతావరణంలోని చల్లదనాన్ని తగ్గకుండా చేయవచ్చు. నల్లటి మేఘాలు పలచగా ఉండేటట్లైతే కాంతి పరావర్తనం సులభతరమౌతుంది. ఈ పద్ధతిని Marine Cloud Brightening అంటారు. ఈ పద్ధతిని గీన్ హౌస్ వాయువుల తగ్గింపు కార్యక్రమానికి జతగా ప్రయోగిస్తే, భూ తాపాన్ని నియంత్రించడం సులభమే! అయితే మిగతా అన్నీ వాతావరణ స్థంభందా ప్రయోగాలలో మాదిరి గానే ఈ పద్ధతిలోను ఊహించని విపరిణామాలు వెలువడే ప్రమాదముంది.

**వ్యవసాయం, అటవీకరణ,భూ నిర్వహణ**

ధృవ ప్రాంతాలలో అడవుల పెంపకం వలన వాతావరణంలో చల్లదనం పెరుగుతుంది. ప్రధానంగా అక్షాంశ, రేఖాంశాలపై ఉండే అడవులను నరికెస్తే, భూ తాపం అంతరిక్షంలోకి అధికంగా పరావర్తనం చెందుతుంది. తెల్లటి మంచుపై సూర్యకిరణాలు నేరుగా పడితే, కాంతి వేగంగా పరావర్తనం చెందుతుంది. నీరు అయితే ఎక్కువ పీల్చుకుంటుంది కానీ, తక్కువగా పరావర్తనం చెందుతుంది. కనుక నీరు అధికంగా వుంటే, సౌర తాపాన్ని ధృవ ప్రాంతాలకన్నా అధికంగా గ్రహిస్తుంది.

**పచ్చిక బయళ్ళ పెంపకం**

సౌర పరావర్తనాన్ని ప్రోత్సహించేందుకు పచ్చిక బయళ్లను అధికంగా పెంచాలి. వాణిజ్య జి.ఏం. పంటలను ప్రోత్సహించడం ద్వారా కూడా ఈ సౌర పరావర్తనాన్ని మరింత ప్రోత్సహించవచ్చు. దీనికి రైతులను ఒప్పించడమే కష్టం. అంతరిక్షంలో అద్దాలను ఏర్పాటు చేయడం ద్వారా: రోజర్ ఏంజెల్ ప్రతిపాదించినట్లు, సౌర తాపాన్ని అంతరిక్షంలోకే మరింతగా పరావర్తనం చేయించడానికి అంతరిక్షంలో అద్దాలను ఏర్పరచడం మరొక విధానం. ఇటువంటి అద్దాలు భూమి చుట్టూ తిరుగుతుండే విధానంలో ఉండాలి. ఐయోవా స్టేట్ యునివర్సిటి కి చెందిన కర్టిస్ స్టుక్క్ అనే ఆయన చంద్రుని మీద ధూళి మేఘాన్ని సృష్టించగలిగితే, సూర్యకాంతి భూమి మీదకు అధికంగా పరావర్తనం చెందదని ప్రతిపాదించాడు. దీనికోసం చందమామ పై అణు బాంబును పేల్చితే దట్టమైన ధూళి మేఘాన్ని సృష్టించవచ్చన్నది ఆయన ప్రతిపాదన. దీనివలన సౌర తాపం అధికంగా భూమికి చేరదని ఆయన వాదన. అయితే ఇతర వాతావరణ మరమ్మత్తు విధానాలతో పోల్చితే ఈ పద్ధతి చౌక అయినది. అంటే కాదు ఇతర పర్యావరణ విధానాలను కూడా మార్చే అవసరం ఉండదు. అయితే ప్రమాదమేమంటే, ఇలా అణు బాంబు విచ్ఛిన్నముతో ఏర్పడే పరిణామాలను ముందుగా సరిగ్గా అంచనా వేయలేము. ఫలితం మరీ తీవ్రంగా ఉంటే, భూతాపం భరించలే నంతగా పెరగవచ్చు. అంటే కాదు, దీనివల్ల సముద్రపు అలల పై చంద్రుని ప్రభావం పూర్తిగా పోవచ్చు. అయితే ఇది పరిగణించదగ్గ కారణం కాదు.

**భౌగోళిక పరావర్తన మార్పులు**

సులభంగా పరావర్తనం చెందే ఉపరితలాలు ఈ రకమైన మరమ్మత్తుకు అధిక ప్రయోజనకారిగా ఉంటాయి. కంటికి కనిపించే, అతి తాప, అతి నీలలోహిత కిరణాలను సమానంగా గ్రహించగలిగితే, ఉష్ణం తక్కువ జనిస్తుంది. ఉపరితలం లేదా మంచు తెల్లగా ఉంటే అధికంగా చల్లదనాన్ని నిలుపుతుంది. అయితే వాణిజ్య/నివాస గృహ నిర్మాణాలకు ఇతర రంగులలో సీలింగ్ కూడా ఉపయోగకరమే! మార్కెట్‌లో లభ్యమయ్యే మెటల్ రూఫ్ లలో స్టార్ గ్రేడ్‌కు చెందిన రూఫ్ లు కూడా ఉపయోగపడతాయి. కార్లలో అయితే, నల్ల రంగు అయినా, కారు లోపలికి వెళ్ళే వేడిని అంటే పరిమాణంలో బయటకు పరావర్తనం చెంద చేయగలిగితే ఫలితముంటుంది. దానివల్ల ఎయిర్ కండిషనింగ్ కు తక్కువ అవసరపడుతుంది. తద్వారా తక్కువ చమురు వినియోగము, తక్కువ గ్రీన్ హౌస్ వాయువుల ఉత్పత్తిని, పట్టణాలలో దీనివల్ల కాలుష్యాలు తగ్గుతాయి. అలాగే పార్కింగ్ లాట్ లలో వేసే రంగులు కూడా అనుకూలంగా ఉండాలి. అమెరికా లో ఈ ప్రయోగాన్ని అప్పుడే బర్కిలీ లాబరేటరీవారు ప్రారంభించారు. అయితే అందుబాటులో ఉండే ఉపరితలం తక్కువ కనుక ఈ ప్రయోగం అంతా ఉపయోగకరం కాదు. దీనికన్నా, పరావర్తనాన్ని ప్రోత్సహించే షీటింగ్ ను అమలుచేయడం మంచిది. ఈ పథకం క్రింద 2010 నుండి 2070 వ సంవత్సరం వరకు ప్రతి సంవత్సరమూ 1,70,000 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని ప్లాస్టిక్ షీట్లతో కప్పలని నిర్ణయించారు. దీనివల్ల వాతావరణంలో బొగ్గుపులుసు వాయువును మూడు వాంతులు తగ్గించవచ్చునని అంచనా! అయితే ఈ విధానంలో ఆర్కిటిక్ ప్రాంతంలోని క్రమంగా సముద్రంలో కాలుస్తున్న భూభాగాన్ని కాపాడలేము. అసలు ఇలా భూమి సముద్రపు కోతకు గురుకావడమే భూ తాపం పెరగటం వల్ల వచ్చే ప్రధాన చెడు ఫలితము. ఇన్నిరకాలుగా ఆహారహార్యం భూ పరిరక్షణకు కృషి చేస్తున్న శాస్త్రజ్ఞులకు మనకు చేతనయినంత సహాయం చేద్దాం. ■

# ఎరువుల వినియోగం - ఆహార ధాన్యాల ఉత్పత్తి

భారతదేశం వ్యవసాయాదారిత దేశంగా మనగలగడానికి సేంద్రీయ జీవ సంబంధ ఎరువులు ప్రధాన భూమికను పోషించాయి. ఇవి పంటల పెరుగుదలకు మరియు తెగుళ్ళ నివారణకు ఉత్పాదకాలుగా ఉపయోగపడేవి. కాని ఇటీవల కాలంలో అధికోత్పత్తులను సాధించాలనే తాపాత్రయంతో, వ్యాపార దృక్పథంతో అవసరానికి మించి వినియోగిస్తున్న రసాయన ఎరువులు జీవ వైవిధ్యాన్ని అతలాకుతలం చేసేవిగా మారాయి.

హరిత విప్లవం ద్వారా ఒనగూరిన లాభనష్టాలను బేరీజువేసి, దేశ మానవ వనరుల అభ్యున్నతికి దోహదపడేవిధంగా ఎరువుల ఉత్పత్తి వినియోగాలు ఉండేవిధంగా పటిష్ఠమైన చర్యలు తీసుకునే సమయం ఆసన్నమైనది. ఇందుకుగల సామాజిక, సంస్థాగతమైన కారణాలైన సేద్యదారుల వ్యాపారాత్మక లాభదృక్కోణం, మధ్య దళారుల లాభ మరియు అమ్మకం గరిష్టీకరణ విధానాలు ప్రత్యక్షంగా ప్రజారోగ్యంపైనే కాకుండా పరోక్షంగా ప్రజల ఆయుష్షుప్రమాణంపై ప్రభావాన్ని సూచిస్తున్నాయి.

అరవై దశకంలో హరిత విప్లవం ద్వారా సాధించిన ప్రగతిలోఎరువుల వినియోగం పాత్ర ప్రముఖమైనది. గత ఐదు సంవత్సరాలలోని గణాంకాలను పరిశీలిస్తే ఎరువుల వినియోగ పరిమాణానికి, ఆహార ధాన్యాల ఉత్పత్తి పరిమాణానికి అనులోమానుపాత సంబంధం గోచరిస్తుంది. భారతీయ వ్యవసాయ మరియు సహకార విభాగం అంచనాల ప్రకారం 2007-08 ఆర్థిక సంవత్సరం నుండి 2011 -12 ఆర్థిక సంవత్సరం వరకు గల గణాంకాలను క్రింది పట్టికద్వారా విశ్లేషించవచ్చు.



| | 2007-08 | 2008-09 | 2009-10 | 2010-11 | 2011-12 |
|---|---|---|---|---|---|
| ఎరువుల వినియోగం | 22.5.7 | 249.09 | 264.86 | 281.22 | 277.40 |
| ఆహారధాన్యాల ఉత్పత్తి | 230.78 | 234.47 | 218.11 | 244.78 | 257.44 |

ఆధారం : డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ ఆఫ్ కో- ఆపరేషన్

గత అర్ధ దశాబ్ద గణాంకాలను పరిశీలించినట్లయితే ఎరువుల వినియోగం పెరిగేకొలది ఆహార ధాన్యాల ఉత్పత్తికూడా పెరుగుతుంది. అయినప్పటికి రెండింటి పెరుగుదలలో స్వల్ప వ్యత్యాసం ఉంది. 2007-08లో ఎరువుల వినియోగం కంటే ఆహారధాన్యాల ఉత్పత్తి ఎక్కువగా ఉంది. కానీ మిగిలిన నాలుగు సంవత్సరాల కాలంలో

**డా. జె. సనత్ కుమార్,** ప్రిన్సిపల్
**ఎం. కోటయ్య,** లెక్చరర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బిచ్కుంద

ఎరువుల వినియోగం ఎక్కువగాను ఆహార ధాన్యాల ఉత్పత్తి తక్కువగాను ఉంది. 2008-09 ఆర్థిక సంవత్సరంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి 234.47 మిలియన్ మెట్రిక్ టన్నుల నుండి 2009-10 ఆర్థిక సంవత్సరానికి 218.11మి. మెట్రిక్ టన్నులకు పడిపోయింది. కాని ఎరువుల వినియోగం మాత్రం 249.09 మి.మె.టన్నుల నుండి 264.86 మి. మెట్రిక్ టన్నులకు పెరిగింది. పై రెండు ఉత్పాదక ఉత్పత్తుల విశ్లేషణ ప్రకారం ఆహార ధాన్యాల ఉత్పత్తికంటే ఎరువుల వినియోగం ఎక్కువగా ఉంది. ఈ విశ్లేషణం ఆధారంగా ఆహారధాన్యాల ఉత్పత్తిలో క్షీణప్రతిఫలాలు లభిస్తున్నాయని పేర్కొనవచ్చు. పెరుగుతున్న ప్రతిఫలాల కొరకు, ప్రజారోగ్యం కొరకు ప్రభుత్వం సేంద్రీయ వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉన్నదని తెలుస్తుంది.

**ఎరువుల వినియోగంలో దేశాల మధ్య అంతరాలు**

| దేశాలు | 2008 | 2009 |
|---|---|---|
| చైనా | 48421.7 | 48900 |
| భారత్ | 24909.3 | 26486.4 |
| అమెరికా | 16509.4 | 18908.2 |
| పాకిస్తాన్ | 3689.9 | 4360.6 |
| ఫ్రాన్స్ | 2784.9 | 2890.7 |

**ఆధారం : ఫర్టిలైజర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా.**

పై పట్టిక గణాంకాల ప్రకారం 2008-09 సం.రాలలో చైనా దాదాపు 49వేల టన్నుల ఎరువులను వినియోగించిందని తెలుస్తుంది. అదే రెండు సంవత్సరాల కాలంలో మన దేశం వినియోగించే మొత్తం ఎరువుల పరిమాణం (ఎన్‌పిఆర్) చైనా వినియోగించే మొత్తం ఎరువుల పరిమాణంలో సగం ఉంది. అమెరికాలో దాదాపు 19వేల టన్నుల ఎరువులను, ఫ్రాన్స్‌లో 3వేల టన్నుల ఎరువులను 2009లో వినియోగించడం జరిగింది. జనాభాలో మాదిరిగానే భారత్ చైనా తర్వాత రెండవ స్థానాన్ని ఆక్రమించింది.

ప్రజా శ్రేయస్సును మరియు ఆరోగ్యాన్ని విస్మరించి కేవలం వ్యాపార దృక్కోణంలో నిర్వహిస్తున్న సేద్యం విధానం అధిక నష్టదాయకంగా మారడమే కాకుండా ద్రవ్యోల్బణం, విదేశీమారక ద్రవ్యం, వ్యాధుల విజృంభన, జీవ వైవిధ్యం క్షీణించడం, కల్తీమందుల ఉత్పత్తి పంపిణీ వంటి అంశాలపై ప్రభావం చూపుతుంది.

**రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయం**

ఆహార ధాన్యాల సాగులో సమగ్రపోషక యాజమాన్యపద్ధతులను, అధిక దిగుబడి మెళుకువలను పాటించడం వల్ల దిగుబడి పెరగడమే కాకుండా రాబడి కూడా పెరిగి ఆరోగ్యకరమైన వ్యవసాయ విధానం కొనసాగుతుంది. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల ద్వారా పంటల పెరుగుదలకు 16 రకాల పోషక పదార్థాలు అవసరమవుతాయని వ్యవసాయదారులు అవగతం చేసుకోవాల్సిన అవసరం ఉంది. వీటిలో ప్రకృతిలో లభించే గాలి, నీరు, సూర్యరశ్మి ద్వారా కార్బన్, హైడ్రోజన్, ఆక్సిజన్‌లు అందుతాయి. మిగిలిన నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి ప్రాథమిక పోషకాలు, గంధకం, కాల్షియం, మెగ్నీషియం వంటి ఉప పోషకాలు, ఇనుము, మాంగనీస్, కోబాల్ట్, జింక్, బోరాన్ మొదలగునవి సూక్ష్మ పోషకాల నేలల ద్వారా లభిస్తాయి.

ఆరోగ్యకరమైన ఆహారధాన్యాల ఉత్పత్తికి అవసరమైన ప్రకృతి సహజ సేంద్రీయ ఎరువుల వినియోగాన్ని, ఉత్పత్తిని పెంపొందించాల్సిన సమయం ఆసన్నమైనదని చెప్పవచ్చు.

**సేంద్రీయ ఎరువులు**

పచ్చిరొట్ట, వానపాముల ఎరువు, పశువుల ఎరువులు వాడకం వల్ల భూమి సారవంతమై సహజ స్థితిని పొందుతుంది. వీటివల్ల పంటలకు అవసరమైన సూక్ష్మపోషకాలు సమృద్ధిగా లభించి విషరహిత, ఆరోగ్యవంతమైన, నాణ్యమైన పంట దిగుబడి లభిస్తుంది. వృక్ష సంబంధమైన వేరుశనగపిండి, ఆముదం, వేప, పొద్దుతిరుగుడు చెక్కలను వాడటం వల్ల ముఖ్యమైన పోషకాలు పంటలకు అంది సేంద్రీయ ఆహార దిగుబడులు పెరిగే అవకాశం ఉంది.

**పచ్చిరొట్ట ఎరువులు**

రైతులు తొలకరి చినుకులు కురిసిన తర్వాత జనుము, జీలుగ, పిల్లిపెసర, అలసంద, మినుము మొదలైన విత్తనాలు చల్లి తగినంత పెరగగానే భూముల్లో కలియదున్ని పచ్చిరొట్ట ఎరువులను తయారు చేసుకోవచ్చు. దీనివల్ల భూమిలో తగినంత సేంద్రీయ పదార్థాలు నేలకు ఇంకి పంటలకు అందుతాయి. దీనికి ప్రత్యామ్నాయంగా పొలం గట్లపై బంజరు భూముల్లో పెరిగే గ్లయిరీసిడియా, వెంపల్లి, జిల్లేడు, గానుగ, నేలతంగేడు, తూడికాడచెట్లు ఆకులను, కొమ్మలను పొలంలో వేసి కలియదున్నడం ద్వారా కూడా ఎరువులను తయారు చేయవచ్చు.

జీవన ఎరువుల

పంటలకు నేరుగా నేల నుండి పోషకాలను అందించే సూక్ష్మజీవుల సముదాయాన్ని జీవన ఎరువులుగా పేర్కొంటారు. వీటిలో రైజోబియం, నీలిఆకుపచ్చనారు, అజటోబాక్టర్, అజొష్పయిరిల్లం, అజొల్లా మొదలగునవి నత్రజనిని స్వీకరించి మొక్కలకు అందిస్తాయి. ఇవేకాకుండా ఫాస్ఫోబాక్టీరియా, మైకోరైజా వంటి జీవన ఎరువులు భూమిలోని భాస్వరాన్ని కరిగించి మొక్కలకు అందిస్తాయి. ■

# అభివృద్ధికి ఆలంబన

స్వతంత్ర దినోత్సవ సందర్భంగా జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడి రెండు ప్రధాన పథకాలను ప్రస్తావించారు. అవి సంసద్ ఆదర్శ గ్రామ పథకరీ, స్వచ్ఛ భారత్ అభియాన్ . దేశానికి స్వతంత్రం వచ్చిన తర్వాత జన్మించిన మన ప్రధాన మంత్రి ఆధునిక భారతానికి రెండు ప్రధాన అంశాలను ఈ పథకాలతో నొక్కి చెప్పారు. భారత దేశపు ఆత్మ గ్రామాలలోనే ఉన్నదని, గ్రామాభివృద్ధి జరిగితే దేశాభివృద్ధి జరిగినట్లేనని భావించి ఈ రెండు అంశాలను ప్రతిపాదించారు. తనని తాను దేశానికి ప్రధాన సేవకునిగా సవినయంగా ప్రకటించుకుని మోడీ ప్రజల ప్రతినిధ్యంతోనే పథకాల లక్ష్య సాధనను ఆశించారు. జపాన్ లోని ఒక కార్యక్రమ అమలును స్ఫూర్తిగా తీసుకుని రూపొందించి, అక్టోబర్ 11న లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణ జన్మ దినాన్న ఈ ఆదర్శ గ్రామ పథక వివరాలను ప్రకటిస్తారు. దీనిలో ప్రతి పార్లమెంట్ సభ్యుడు ఒక గ్రామాన్ని దత్తత తీసుకుని 2016 నాటికి సమగ్రంగా అభివృద్ధి చేయాలి. అలాగే, 2019 నాటికి ప్రతి సభ్యుడు మరో రెండు గ్రామాల చొప్పున అభివృద్ధి చేయాలి. గాంధీ జయంతి నాడు అక్టోబర్ 02న స్వచ్ఛ భారత్ అభియాన్‌ను ప్రకటిస్తారు. వచ్చే సంవత్సరం గాంధీ జయంతి నాటికి దేశంలోని ప్రతి పాఠశాలలో బాలురకు, బాలికలకు విడివిడిగా మరుగుదొడ్లను నిర్మించాలని నిర్ణయం. దేశ పునాదులను పటిష్ట పరచడంతో పాటుగా ప్రజలతో నేరుగా సంబంధాలను ఈ గ్రామాభివృద్ధి కార్యక్రమం ఏర్పరుస్తుందని ఆయన తలపోశారు. సాధారణంగా నేతలు ఎన్నిక కావడంతోనే ప్రజలకు దూరంగా ఉండటం ప్రారంభిస్తారు. ప్రజలలో చైతన్యం కూడా ఇనుమడిస్తుంది. అయితే ఇందుకోసం ఇంత కాలం కేవలం ఒక రాజకీయ వ్యవస్థగా నిలచిన పంచాయతీ వ్యవస్థను నిజంగా సమర్థవంతంగా తీర్చిదిద్దాలి. ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న జపాన్ ఒక్కొక్కగ్రామం నుండి ఒక్కొక్క ఉత్పత్తిని గరిష్టంగా చేసి 1979 లోనే ఈ పథకాన్ని విజయవంతం చేసింది. తర్వాత థాయిలాండ్ దేశం 2001 లో "వన్ విలేజ్ – వన్




బడ్జెట్" పేరుతో ఈ పథకాన్ని ప్రారంభించింది. యావత్ ప్రపంచాన్ని, తన అద్భుత వృద్ధి గమనంతో ఆశ్చర్య పరిచిన జపాన్ 1970 లలో గ్రామాలకు, పట్టణాలకు మధ్య ప్రగతిలో అంతరాన్ని తొలగించేందుకు ఈ కార్యక్రమాన్ని ఓయిట రాష్ట్రంలోని ఒయామ గ్రామంలో ప్రారంభించింది. దీనితో ఆ రాష్ట్ర తలసరి ఆదాయం 1980–2003 ల మధ్య 330 అమెరికన్ డాలర్ల స్థాయి నుండి 1300 అమెరికన్ డాలర్ల స్థాయికి పెరిగింది. గ్రామం మొత్తం ప్రగతి కార్యక్రమాలలో పాలుపంచుకోవడం వలన నిధుల వృధా తగ్గింది, గరిష్ట ప్రయోజనం చేకూరింది. ప్రభుత్వ సహాయం ఏమి లేకుండా జపాన్ గ్రామాలలోని ప్రజలు సాధించిన ఈ విజయం మనకుకూడా ఇక రెండవ కార్యక్రమం స్వచ్ఛ భారత్ అభియాన్ ను ప్రస్తావిస్తే, వినిపిస్తున్న లక్ష్యాలని పరికిస్తే లక్ష్య సాధన అంతా సులభంగా కనిపించదు. దేశవ్యాప్తంగా 2019 నాటికి 800 మిలియన్ల మరుగుదొడ్లను డ్రైనేజీ సౌకర్యంతోబాటుగా నిర్మించడం దాదాపు అసాధ్యమే! జాతి పితా 150 వ జయంతి సంధర్భంగా 2019 నాటికి ఈ లక్ష్యాన్ని పూర్తి చేయాలని కేంద్ర త్రాగు నీరు మరియు పరిశుధ్య మంత్రిత్వ శాఖకు నిర్దేశించారు. కార్య సాధనలో భాగంగా మొదటి సంవత్సరం 20 మిలియన్ మరుగుదొడ్లను ఈ సంవత్సరాంతానికి నిర్మించాలని మంత్రిత్వశాఖ నిర్ణయించింది. దీనికోసం ప్రస్తుతం వివిధ ప్రాంతాలలో అమలులో ఉన్న 20 కార్యక్రమాలను కలిపివేయాలి. నేటికీ దేశంలో 626 మిలియన్లకు

పైగా ప్రజలు బహిరంగ మలవిసర్జన చేస్తున్నారు. వీరిలో చాలమందికి మరుగు దొడ్లు లేకపోవడం ఒక లోపమయితే, ఉన్న మరుగుదొడ్లను సక్రమంగా వినియోగించు కోకపోవడం రెండవది. అసలు ఈ పథకానికి ఉత్తర ప్రదేశ్ లోని బదౌన్ జిల్లాలో జరిగి, ప్రపంచ వ్యాప్తంగా సంచలనం రేపిన ఇద్దరు బాలికల సామూహిక మాన భంగం, మరణాలు ప్రేరకమని చెప్పవచ్చు. క్రమంగా చైతన్యవంతులవుతున్న గ్రామీణ మహిళలు, అత్తవారింట్లో మరుగుదొడ్లు లేకపోతే, కాపురానికి వెళ్లడానికి కూడా నిరాకరిస్తున్నారు. ప్రధాని మోడీ ఒకసారి ప్రజలు నన్ను ఒక హిందూ మతవాదిగా చూస్తారు గాని, నాకు మాత్రం ముందు మరుగు దొడ్డి కట్టించుకున్న తరువత మాత్రమే ప్రార్థన స్థలాలు, దేవాలయాలు ప్రాధాన్యం అని చెప్పారు. కార్యక్రమ ప్రాధాన్యతను గమించిన వ్యాపార వాణిజ్య సంస్థలు కూడా తమవంతు సామాజిక బాధ్యతగా మరుగు దొడ్ల నిర్మాణానికి విరాళాలతో ముందుకు వస్తున్నాయి. సంస్థ అయిదు వేల మరుగుదొడ్లను కట్టించి ఇస్తామని ముందుకు వచ్చింది. వారి అనుబంధ సంస్థ అయిన ఎల్ & టి చారిటబుల్ ట్రస్ట్ మరుగుదొడ్లను నిర్మించడమే కాక, వాటి నిర్వహణ, నీటి సరఫరా, ఆరోగ్య పరిరక్షణ, సిబ్బందికి శిక్షణ కూడా ఇస్తామని ముందుకు వచ్చింది. మరొక సంస్థ టాటా కన్సల్టెన్సీ తనవంతుగా 200 కోట్ల రూపాయలను ఈ కార్యక్రమానికి విరాళంగా అందచేసింది. మనలో చాలా మంది బహిరంగ మలవిసర్జన అనగానే ఒక అపరిశుభ్రమైన కార్యక్రమంగానే చూస్తారు తప్ప, దీనితో ముడివడి ఉన్న ఆరోగ్య, మానసిక సమస్యలను తలచుకోరు. మహిళల్లో అనేక రకాల మూత్రకోశ వ్యాధులకు రాత్రి చీకటి పడేవరకు మూత్ర విసర్జన అవసరాన్ని నియంత్రించుకోవడమే కారణమవుతున్నది. ముఖ్యంగా నెలసరి దినాల్లో ఏకాంతమైన మరుగుదొడ్డి లేకపోవడం అనేక శారీరక, మానసిక సమస్యలకు కారణమౌతున్నది. గ్రామాలలో అయితే రాత్రి చీకటిలో మలవిసర్జనకు ఊరి బయటకు వెళ్లవలసి రావడం వల్ల అనేకమంది పాముకాటు వంటి ప్రమాదలకు లోనవుతున్నారు. అనేకమంది బాలికలు ప్రత్యేక మూత్రశాలలు లేకపోవడము లేదా వున్నా, వాటిని సరిగా పరిశుభ్రంగా నిర్వహించలేక పోవడం వంటి కారణాల వల్ల చిన్న తరగతులలోనే బడి మానేస్తున్నారు. ఒకప్పుడు గ్రామాలకు వెళ్తుంటే పచ్చటి పొలాలు, కల్తీ లేని ఆహార వస్తువులు, కల్తీ లేని మనసులు ఆహ్లాద పరిచేవి కానీ, నేడు పల్లెటూరు వెళ్తుంటే గ్రామానికి రెండు కిలోమీటర్ల ముందే ముక్కు మూసుకోవాలి. ప్రతి వస్తువు, పాలు, కూరలతో సహా పట్టణం నుండి తెచ్చుకోవాలి. ఇలాంటి అనేక సమస్యలకు పైన చెప్పుకున్న రెండు పథకాలు చరమగీతం పాడతాయని ఆశిద్దాం.

*యోజన సంపాదకవర్గం*

## భారతెందు హరిశ్చంద్ర అవార్డులు



భారతేందు హరిశ్చంద్ర అవార్డ్ క్రింది ఇచ్చే నగదు పురస్కారాన్ని పెంచుతున్నట్లు కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ తెలియచేసారు. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన ప్రచురణల విభాగం వారి ఒక కార్యక్రమంలో పాల్గొంటూ ఆయన ఈ అవార్డును ఇకపై కౌమార బాలికల అభివృద్ధి కి సంబందించిన ఒరిజినల్ రచనలకు కూడా ఇవ్వనున్నట్లు తెలియచేసారు. అలహాబాద్ కు చెందిన ప్రముఖ హింది కవి భారతేందు హరిశ్చంద్ర (09.9.1850 నుండి 06.01.1885 వరకు) హిందీ సాహిత్యానికి చేసిన సేవలకు గుర్తింపుగా ఆయన పేరుమీదుగా ఈ పురస్కారాన్ని భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఇస్తున్నది. ఈ అవార్డుకు హిందీ భాషా సారస్వతంలో నోబెల్ ప్రైజ్ కు ఉన్నంత ప్రాచుర్యం ఉన్నది. కేంద్ర ప్రచురణల విభాగం 1983 వ సంవత్సరం నుండి అందచేస్తున్న ఈ అవార్డులను జాతీయ సమైక్యత, మహిళా విభాగం, పిల్లల సాహిత్యం అనే మూడు అంశాలలో అందచేస్తున్నది. ఆ మహా రచయిత స్మృత్యార్థం ఈ అవార్డులను ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 09వ తేదీన అందచేస్తారు.

*యోజన సంపాదకవర్గం*

# చరిత్రకందని వీరనారి దుర్గావతి

మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ ప్రాంతంలోని మదన్ మహల్ కొండల మీద మొగల్ రాజ్య స్థాపకుడు అక్బర్ పాదుషా సామ్రాజ్య కాంక్షని ఎదిరించి ఒక భారత వీరనారి రాణి దుర్గావతి అమరత్వం పొందారు. దుర్గావతి మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ సమీప గ్రామంలో వనవాసి గోండు తెగకు చెందిన బుందేల్‌ఖండ్ సంస్థానాధీశుడైన చందవేల్‌కు 1524, అక్టోబర్ 5న జన్మించారు. దుర్గావతి భర్త దలపత్‌సింహ్ జబల్‌పూర్, బుందేల్‌ఖండ్‌లను గోండుల (గిరిజనుల) స్వతంత్ర్య రాజ్యంగా ఏర్పాటు చేసి పాలించాడు. దుర్గావతి తన తండ్రి చందవేల్, భర్త దలపత్‌సింహ్‌ల వారసత్వమును పుణికి పుచ్చుకొని రాజ్య పరిపాలన కొనసాగించారు. ఆమె యుద్ధ విద్యలోనూ మంచి నేర్పరి. గోండులు స్వతంత్ర్య రాజ్యాంగంలో ఐక్యంగా మెలగడం సహించలేని మొగల్ చక్రవర్తి అక్బర్ తన సేనాధిపతి అసఫ్‌ఖాన్ చేత కుట్రపన్ని దలపత్‌సింహ్‌ను చంపించడంతో రాణి దుర్గావతి మదన్ మహల్ కొండలనే స్థావరంగా యుద్ధరంగంలో ప్రవేశించి ప్రత్యక్ష పోరాటానికి పూనుకున్నారు.

చిన్నతనం నుండే వీరరస ప్రధానమైన పౌరాణిక, చారిత్రక గాథల్ని వింటూ తన్మయత్వం పొందిన దుర్గావతి అస్త్ర శస్త్ర విద్యలలోనూ ఆరితేరారు. బుందేల్‌ఖండ్‌ను గోండుల స్వతంత్ర్య రాజ్యంగా ప్రకటించుకున్న భర్త దలపత్‌సింహ్ వారసత్వాన్ని స్వీకరించిన దుర్గావతి ప్రజల్ని సుఖశాంతులతో వర్ధిల్లేలా పాలించారు. ఢిల్లీ పాదుషా అయిన అక్బర్ చక్రవర్తి గోండులు స్వతంత్ర్య రాజ్యంగా వర్ధిల్లడం సహించలేక రాణి దుర్గావతిని తనకు సామంతురాలుగా చేయమని ఆసఫ్‌ఖాన్ అనే మహా వీరుణ్ణి ఆజ్ఞాపిస్తాడు. ఆసఫ్‌ఖాన్ భారీ సైన్యంతో గోండు రాజ్యం మీదకు దండెత్తే ప్రయత్నం చేసాడు. ఆది నుండి స్వతంత్ర్య రాజ్యంగా బ్రతికిన ఆదివాసీ గోండు రాజ్యం సామంత రాజ్యంగా మారడం అవమానకరమని, వనవాసుల ఉనికికి భంగకరమని భావించిన దుర్గావతి తన తండ్రి శైలిలో రాజ్యపాలన కొనసాగించారు. 'దుర్గావతి అబల కాదు సబల' అని నిరూపిస్తానని మొఘల్ సైన్యానికి సవాల్ విసిరారు.



దుర్గావతి తన గోండు సైన్యంతో కోటను బలపరిచారు. మద్ధావేషంలో యుద్ధానికి సమాయత్తమయ్యింది. గోండు సైనికులు, మంత్రులు, ప్రజలు మహారాణి యుద్ధంలో ప్రదర్శించిన మహాశౌర్యాన్ని, సాహసాన్ని చూసి హర్షధ్వానాలు ప్రకటించారు. ఆమె పరాక్రమ శక్తికి అక్బర్ ఆశ్చర్యచకితులై, ఆ భారత వీరనారీమణిని సంహరించ వలసిందేనని సైన్యాన్ని పంపించాడు. గోండుల కోటను ముట్టడించే వ్యూహ ప్రతివ్యూహాలు ఆసఫ్‌ఖాన్‌కు ఫలించలేదు. మొగలాయి సైనికుల చేతిలో వీరమరణం పొందారు.

గోండు వంశాంకురం నేల వాలినా - యుద్ధాన్ని కొనసాగించమని ఆజ్ఞాపించిన దుర్గావతిని అభినందించాడు ఆసఫ్‌ఖాన్. ఒక స్త్రీ శక్తిని మొఘల్ సైనికులు ఎదుర్కోలేకపోవడం భరించలేక పోయాడు. మహారాణి దుర్గావతి ద్విగుణీకృతోత్సాహంతోనూ, చండ ప్రచండ పరాక్రమంతోనూ యుద్ధం చేసినప్పటికీ మొగల్ సైన్యం చేతుల్లో పరాభవం చూడలేక ఖడ్గంతో తనని తాను పొడుచుకొని, యుద్ధ భూమిలోనే ప్రాణాల్ని విడిచారు. అది 1564, జూన్ 24 రోజున. గోండు సైనికులు ఆ వీరనారీమణి దుర్గావతి శరీరాన్ని ఆమె పుత్రునికి అంత్యక్రియలు నిర్వహించారు.

మధ్యప్రదేశ్‌ను సందర్శించే యాత్రికులు జబల్‌పూర్‌లో వీరవనిత సమాధిని దర్శించి అక్కడ ఉండే గాజుముక్కల్ని భక్తితో సమర్పించడం అనవాయితీ! గోండు రాజ్య సుపరిపాలన కోసం, మొగల్ సామ్రాజ్య కాంక్షా పరుడైన అక్బర్‌ను ఎదుర్కొని వీరమరణం పొందిన భారతీయ ధీర వనిత రాణి దుర్గావతి. భారతదేశ చారిత్రక పోరాటాలలో దుర్గావతి "ఆదిమ" జాతి సమర యోధురాలు. భారతీయ వీరవనితల్లో రాణి దుర్గావతిని చరిత్రకారులు, నేటి రాజ్య పాలకులు ప్రజలు స్మరించుకోవడం అనివార్యం. ■

**గుమ్మడి లక్ష్మీనారాయణ**, ఉపాధ్యాయుడు, నర్సంపేట, వరంగల్ జిల్లా, సెల్: 9951430476
E-mail: gummadil63@gmail.com

# మనకు సింగపూరు ఎందుకు ఆదర్శం?

ఇటీవల కాలంలో ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలు రెండూ తమ తమ రాష్ట్రాలను సింగపూరు స్థాయిలో అభివృద్ధి చేయాలని కలలు కంటున్నాయి. సాధారణ పౌరులకు ప్రసార మాధ్యమాల పుణ్యమా అని సింగపూరు అంటే భూలోక స్వర్గమనే అభిప్రాయం ఏర్పడింది. అయితే అసలు సింగపూరు యదార్ధ స్థితిని ప్రజల ముందుంచడానికే ఈ వ్యాసం:

మన దేశంతో పోలిస్తే సింగపూర్ సముద్రంలో నీటిబొట్టు వంటిది. జనాభా పరంగా 1960 లోనే సింగపూర్ కన్నా మన దేశం 271 రెట్లు పెద్దది. అయితే 2010 నాటికి తన జనాభాను 240 రేట్ల స్థాయికి అంటే అయిదు మిలియన్ల స్థాయికి నియంత్రించింది. తన అవిరళ కృషితో ఆ దేశం ప్రగతిలో మనదేశాన్ని అధిగమించింది. నిజానికి ఇంతకు మించి జనాభా పెరిగితే ఆ దేశంలో నివాసానికి స్థలం లేదు. జనసాంద్రతలో అంటే ఒక చదరపు కిలోమీటరుకు నివసించే జనసంఖ్యలో వాళ్ళు మనకంటే 15 రెట్లు ఎక్కువ. అయినప్పటికీ 'పేదరికంలో మనమే హీరోలము'. కొనుగోలు శక్తి ప్రమాణంగా పోలిస్తే, 2010 సంవత్సరానికి వాళ్ళు మనకంటే 15 రెట్లు ధనవంతులు. మంది తక్కువయినా పనితనంలో వాళ్ళ కృషి గరిష్టంగాను, ఆదర్శవంతంగానూ ఉంటున్నది. 276 చదరపుమైళ్ళ విస్తీర్ణంతో ఉన్న ఈ దేశం లో 1960 లలో చెప్పుకోడానికి ఒక్క రేవుపట్టణం కూడా లేదు. కానీ, నేడు 2010 వ సంవత్సరంలో మనదేశంలోని అన్నీ రేవు పట్టణాలు కలిపి 560 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేస్తే, ఆదేశం 531 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేసింది. మనదేశంలోని అన్నీ విమానాశ్రయాలు కలిపి 2013 లో 75 మిలియన్ల మంది ప్రయాణీకులను రవాణా చేస్తే, సింగపూరులోని ఒక్క చంగి విమానాశ్రయం నుండే 30 మిలియన్ల మందిని రవాణా చేసింది. తమ దేశానికి వచ్చే అతిథులందరినీ లెక్కిస్తే, ఆ దేశంలోని ప్రతి పౌరుడూ సంవత్సరానికి 15 మందిని ఆదరిస్తున్నట్లు అంచనా! పశ్చిమాసియాకు వెళ్లడానికి అందరూ దుబాయి మీదుగా వెళ్ళితే, తూర్పు ఆసియా దేశాలకు వెళ్ళేవారు సింగపూరు మీదుగా వెళ్ళటం రివాజు. సేవల నాణ్యతా విషయానికి వస్తే మనదేశంలోని ఒక్క విమానాశ్రయం కూడా వారి స్థాయిలో లేదు. చాలమందికి సింగపూర్ లో స్థిరపడటానికి కారణం అక్కడి ప్రజలలోని నిజాయితీ, దైనందిన జీవితంలోని సౌకర్యాలు. 'అక్కడ మనుషులు పెవ్మెంట్లపైనే నడుస్తారు వాహనాలు రోడ్లపైనే వెళ్తాయి'. రోడ్ మీద నడుస్తున్నపుడు ఎవరూ తమ హ్యాండ్ బాగ్ లేదా పర్స్ ను అతి జాగ్రత్తగా చూసుకోనక్కరలేదు. జేబుదొంగలంటే అక్కడ అంతరించిపోయిన జాతి. చిన్న చిన్న నేరాలే కాదు, పెద్ద స్థాయిలోని వ్యాపార పరమైన నేరాలు, మోసాలు, అప్పులు ఎగగొట్టడం, నకిలీ వస్తువులు అమ్మడం, ఏదైనా సరే, చాలా త్వరగా శిక్ష పడుతుంది. వారి న్యాయ వ్యవస్థ చాలా వేగంగా పనిచేస్తుంది. చైనా, ఇండియా లాంటి పెద్ద దేశాలనుండి మందలుగా పర్యటకులు రావడాన్ని ఆదేశం ఇష్టపడదు. అయితే అక్కడ పనిచేద్దామని వచ్చేవారు ఎవరైనా సరే, అక్కడ ఏదైనా వ్యాపారం/పరిశ్రమ పెడదామని వచ్చేవారు ఎవరైనా సరే వారికి ఆహ్వానం. చాలా దేశాలవారు కేవలం పాస్ పోర్ట్ తోనే ఆ దేశానికి వెళ్లవచ్చు. వీసా అవసరం ఉండదు. కేవలం 33 దేశాలవారికి, అదీ నేర చరిత్ర ఉన్నవారికే వీసా అవసరం. అట్టివారు రెండూ దశలలో సెక్యూరిటీ నిబంధనలను అధిగమించాల్సి వస్తుంది. వారి విదేశీ వాణిజ్యం స్థూల దేశీయోత్పత్తిలో దాదాపు మూడు వంతులు ఉంటుంది. అదే మనదేశంలో జిడిపి లో సగంకన్న తక్కువ. దాదాపు 200 ల సంవత్సరాల క్రితం రోకార్డో ప్రతిపాదించిన ఆర్ధిక సిద్ధాంతాలనే వారు ఇప్పటికీ అనుసరిస్తున్నారు. సాధారణంగా ప్రతివారు ఎగుమతులను ప్రోత్సహించి, దిగుమతులను నిరుత్సాహపరుస్తారు. కానీ సింగపూర్ వాసులకు అన్నీ రకాల వాణిజ్యం అభిలషణీయమే. ఎగుమతుల ద్వారా అదాయమే కాదు, దిగుమతులపై సుంకాలు కూడా వారికి గణనీయమైన అదాయమే. అసమర్ధమైన ఉత్పత్తి కంటే సమర్ధమైన వాణిజ్యమే మేలు వాళ్ళకు. విదేశీ వాణిజ్య అనుమతులకు కానీ, దేశంలో ఏదైనా ఒక కంపెనీని మొదలు పెట్టాలనుకున్న వాళ్ళకు ప్రభుత్వపరమైన అనుమతులన్నీ కేవలం ఒక్క రోజులోనే మంజూరు అవుతాయి. అన్నిటికన్నా చెప్పుకోవలసింది వాళ్ళపన్నుల విధానాన్ని. పన్నులన్నీ కలిపి గరిష్టంగా 20 శాతాన్ని మించవు. విదేశీ వాణిజ్యంపైన అయితే అది 17 శాతమే! ప్రభుత్వంతో లావాదేవీలంటే అక్కడ అతి సులభం. సిసలైన బురోక్రసీకి అర్థాన్ని మనం అక్కడే చూడవచ్చు. ఆ దేశ ఆదాయంలో మూడు వంతులు కేవలం ప్రత్యక్ష పన్నుల ద్వారానే వస్తుంది. దీన్నిబట్టి చూస్తే మనదేశంలో కొంత ప్రాంతాన్ని సింగపూర్ ఐఏఎస్ అధికార్లకు అవుట్‌సోర్స్ చేస్తే బాగుంటుంది అనిపించటం లేదూ? వాళ్ళకి హిట్లర్లు, చర్చిల్ లు అవసరంలేదు. భారత దేశపు సినిమా రంగం ప్రపంచంలోనే పెద్దది. మన దేశంలో సినిమా పిచ్చోళ్ళు ఎక్కువగా ఉన్నప్పటికీ, ఆ రంగంకూడా సమతౌల్యస్థితికి వచ్చేసింది. మనం మరే భాషలోనైనా సినిమాలు తీస్తే ఇక్కడ మార్కెట్ బాగుంటుంది. కానీ మన భారతీయులకు ఇతర భాషలలో ప్రవేశం తక్కువ. అక్కడి మెజారిటీ ప్రజల భాష మండరిన్. అభాషలో మన షారూఖ్ ఖాన్ గారిని జంగ్ జీయి తోనో, లేదా అక్కడి హుయాంగ్ క్షియఓమింగ్ ను మన దీపికా పదుకొనే తోనో చూడాలంటే అందరికీ సరదానే!

**వెంగళ నారాయణరావు,** ఫ్రీలాన్స్ రచయిత



# తెలుగుతనానికి మూర్తిమత్వం బాపు

ఆయన తెలుగుదనానికి తెలుగుచిత్రాలకు ప్రాణం పోసిన అపరబ్రహ్మ. తెలుగు సోయగాలను, సంస్కృతిని మనకు దోసిళ్లతో అమృతంలా అందించిన నిజమైన చిత్ర కారుడు. ఆయన బొమ్మలతో చలనచిత్రాలలో తెలుగుదనపు వాకిళ్లు, వాలుజడలు, బుడుగులు, పంచెకట్లూ, బోసి నవ్వులూ, పెంకుటిళ్లు, కొబ్బరిచెట్లు, గోదారిగట్లూ అన్నీ దర్శనమిస్తాయి. దక్షిణ భారతదేశపు ప్రాచ్య ప్రాచీనచిత్రకళకు చక్కని కొనసాగింపు బాపు.

బాపు అసలు పేరు సత్తిరాజు లక్ష్మీనారాయణ. 1933 డిసెంబర్ 15న పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం సమీపంలోని కంతేరులో సత్తిరాజు వేణుగోపాలరావు,సూర్యకాంతం దంపతులకు జన్మించారు. ఆయనకు చిత్రలేఖనం అంటే ఎంతో ఇష్టం. 1942లో అప్పటి మద్రాసులోని పీఎస్ హైస్కూల్లో ఐదు,ఆరు తరగతులు కలిసి చదువుకున్నప్పటి నుంచి బాపు,రమణల మధ్య స్నేహం పరిమళించింది. అది చివరి వరకూ కొనసాగింది. పాఠశాల రోజుల్లోనే "బాల" అనే మాసపత్రికకు బొమ్మలు వేసారు. అలా ఆయన చిత్రకళా ప్రయాణం మొదలయింది. తండ్రి వృత్తిరీత్యా మద్రాసుకి వచ్చిన బాపు మద్రాసు విశ్వవిద్యాలయంలో 1955లో బీఎల్ పూర్తిచేసారు. విద్యార్థి దశలోనే చిత్రకారుడిగా ప్రావీణ్యం సాధించిన బాపు 1955 లో ఆంధ్రపత్రిక లో పొలిటికల్ కార్టూనిస్టుగా పనిచేసారు. గాలిబ్‌గీతాలకు, గలివర్ ట్రావెల్స్‌కు ఆయన వేసిన చిత్రాలు దేనికవే విభిన్నమైనవి.పత్రికలలో కొన్ని వేల ఇలస్ట్రేషన్లు, వివిధ రచయితల పుస్తకాలకు కొన్ని వేల ముఖచిత్రాలు చిత్రించారు. ఆయన చిత్రాలలో హిందూ దేవతారూపాలను ఎక్కువగా చిత్రించారు. బాపూ సినిమాలలో కూడా ఎక్కువశాతం హిందూ ఇతిహాసాలకు సంబంధించినవే ఉంటాయి. రామాయణాన్ని తన సినిమాలు,బొమ్మల ద్వారా సామాన్యులకు చేరవేసిన ఆయన ఘనత నభూతో నభవిష్యతి.

## అచ్చ తెలుగు కార్టూనిస్టు

కార్టూన్లంటే ఆయనకు చాలా ఇష్టం. యూరప్‌నుంచి మనకు దిగుమతి అయిన కార్టూన్ కళని తెలుగుదనం మేళవించి, చక్కటి హాస్యంలో ముంచి తెలుగువారికి అందించి, వారి సాంస్కృతిక వికాసానికి తోడ్పడ్డారంటే అతిశయోక్తి కాబోదు. నిరంతర సాధనతో నిత్యనూతనమైన కార్టూన్లను సృజించవచ్చని తాను మనసా వాచా నమ్మినట్లుగా ఓ ఇంటర్వ్యూలో అన్నారాయన. అంతేకాక భారతీయ శిల్పకళ తనను చాలా ప్రభావితం చేసిందనీ, నటరాజ శిల్పం గ్రేటెస్ట్ పీస్ ఆఫ్ ఆర్ట్ అని అన్నారు. అందుకే ఆయన సృజించిన కార్టూన్లలో, ఇలస్ట్రేషన్‌లలో,ముఖ పత్రరచనలలో,చేతిరాతలో భారతీయ ఆత్మ కనిపిస్తుంది.

## చలన చిత్ర ప్రయాణం

1967 లో సాక్షి సినిమాతో దర్శకుడిగా అవతారమెత్తిన బాపు తెలుగు, హిందీ, తమిళ భాషలతో కలిపి మొత్తం 51 సినిమాలకు దర్శకత్వం వహించారు. బంగారుపిచ్చిక (1978) ముత్యాలముగ్గు (1975) సీతాకళ్యాణం ( 1976) భక్తకన్నప్ప(1976) మనవూరి పాండవులు (1978) తూర్పు వెళ్లే రైలు (1979) రాధాకళ్యాణం (1981) సీతమ్మపెళ్లి (1981) రాంబంటు (1996) రాధాగోపాలం (2005) సుందరాకాండ (2008) శ్రీరామరాజ్యం (2011) బాపూ తెరకెక్కించిన దృశ్యకావ్యాలలో కొన్ని మరపురాని చిత్రాలు. ఇంకా హిందీలో హమ్‌పాంచ్ ( 1980) వో సాత్ దిన్ (1983) మొహబ్బత్ (1984) ప్యారీబెహ్నా (1985) చిత్రాలు తీశారు.

## బాపూ పేరుతో తెలుగు లిపి

బాపూ చేతివ్రాతనే ఒక లిపిగా అనేక పుస్తకాలలో,పత్రికలలో గుర్తించడం చాలా గొప్ప విషయం. ఆయన రాత ఒక ప్రత్యేక శైలిలో ఉంటుంది. అనూ ఫాంట్స్ సంస్థవారు బాపు రాతని "బాపూ ఫాంట్"గా ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తీసుకువచ్చారు. తెలుగువారి శుభలేఖలలో,శుభకార్యాలలో బాపూ చేతిరాత ఉన్న అక్షరాలను వాడుతున్నారు. చిత్రకారునిగా, కార్టూనిస్టుగా, చలనచిత్రకారునిగా తెలుగు సంస్కృతీ సాంప్రదాయాలను తన దోసిళ్లతో మనకు అందించిన బాపు భవిష్యత్ తరాలకు మార్గదర్శి. నిరాడంబరమైన తన జీవితంతో నిత్యకృషీవలుడిగా నిలిచిన బాపు చిత్రకళా మార్గదర్శి.

***ఆ మహామూర్తికి యోజన వినమ్రంగా అంజలి ఘటిస్తోంది.***



**బి.హరివెంకట రమణ (హరి),** కార్టూనిస్ట్

Publishing date 6th October 2014, posted on 7-8 October, 2014

Yojana (Telugu) October, 2014 RNI Regd. No. 37729/80 Regd. No. H/HD-663/2012-14

# The story of a Man
# who became a Mahatma
## Read Our Books




ప్రచురణల విభాగం

సమాచార - ప్రసార మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం

e-mail : dpd@sb.nic.in, businesswing@gmail.com
website : publicationsdivision.nic.in
Now on Facebook at www.facebook.com/publicationsdivision

Printed and Published by Ms. Ira Joshi, Additional Director General & Head on behalf of Publications Division, Ministry of I & B, Government of India and Printed at Micro Offset Printers, 11-6-868, Red Hills, Lak di ka pool, Hyderabad - 500 004. Ph. 040 - 66750291 and Published at Yojana (Telugu) 10-2-1, F.D.C. Complex, A.C. Guards, Hyderabad - 500 028. Senior Editor : **Vijayakumar Vedagiri,** Tel : 23315288